సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00

సంపుటి: 17 సంచిక: 8

ఆదివారం 31-3-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
ఆదివారం ॥ 31-3-2024

వైరల్



ఆడపిల్లే అదృష్టదేవత

పైలట్ టీనా గోస్వామి ఆసక్తికరమైన వీడియోలను 'పైలట్ మమ్మీ' శీర్షికతో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేస్తుంటుంది. తాజాగా పోస్ట్ చేసిన ఒక బామ్మ వీడియో వైరల్‌గా మారింది. గ్రామీణత ఉట్టిపడే ఆహార్యంతో కనిపిస్తున్న ఒక బామ్మ అయోధ్య ధామ్‌కు వెళ్లే విమానంలోకి మెట్లకు నమస్కరిస్తూ ఎక్కింది. విమానంలో కనిపించిన పైలట్ టీనా గోస్వామిని ఆప్యాయంగా పలకరించింది. 'మన భారతీయ సనాతన సంస్కృతిలో ఆడపిల్ల.. మన లక్ష్మి' అంటూ టీనాను ఆశీర్వదించింది. బామ్మ కాళ్లకు గౌరవంగా నమస్కరించింది టీనా. రెండు మూడు రోజుల వ్యవధిలోనే ఈ వీడియో ముప్పై లక్షల వ్యూస్ దక్కించుకుంది. హృదయాన్ని హత్తుకునే ఈ వీడియో గురించి కామెంట్ సెక్షన్‌లో ప్రశంసలు వెల్లువెత్తాయి.

సంతకాన్ని జంతర్‌మంతర్ చేసినచో...

శూన్యంలో నుంచి కూడా కళను సృష్టించే నైపుణ్యం ఆర్టిస్ట్‌ల సొంతం. తాజా విషయానికి వస్తే... ఇండిగో ఫ్లైట్ అటెండెంట్ తెల్లకాగితంపై చేసిన సంతకాన్ని క్షణాల్లో అందమైన చిత్రంగా మార్చాడు రాబిన్ బార్. సంతకం నుంచి అప్పటికప్పుడు ప్రేయసీప్రియులను సృష్టించిన రాబిన్ బార్ ఇలాంటి అలాంటి ఆర్టిస్ట్ కాదు...రికార్డ్ హోల్డర్ స్పీడ్ పెయింటర్. జస్ట్...కొన్ని రోజుల వ్యవధిలోనే ఈ వీడియో క్లిప్ 21 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. రాబిన్ బార్‌పై నెటిజనుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తాయి.





వీల్‌చైర్‌లో వచ్చాడు... విల్‌పవర్ చూపాడు

వీల్‌చైర్‌కు పరిమితమైన ఈ యువకుడు విల్ పవర్ మాత్రం ఎప్పుడూ కోల్పో లేదు. స్నేహితుల సహాయంతో వీల్‌చైర్‌లో నుంచి రిషికేష్‌లో బంగీ జంప్ చేశాడు. ఈ వీడియోతో ప్రపంచవ్యాప్తంగా నెటిజనుల మనసు దోచుకున్నాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో 24 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. 'ఎవ్రీథింగ్ ఈజ్ పాసిబుల్ ఇఫ్ యూ డేర్' 'మోర్ పవర్ టు యూ, బాయ్'లాంటి కామెంట్స్ కనిపించాయి. చాలామంది హార్ట్ ఇమోజీలతో రియాక్ట్ అయ్యారు. గతంలో లెఫ్టినెంట్ కల్నల్ అవనీష్ బాజ్‌పాయ్ ఆర్టిఫిషియల్ లింబ్‌తో భటిండాలో 14,000 అడుగుల ఎత్తు నుంచి స్కైడైవింగ్ చేసిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది.

సెల్ఫ్-లవ్



వెనకటికి ఒక ఈగ ఇల్లలుకుతూ ఇంటి పనుల్లో పడి పేరు మరచిపోయిందట. చాలామంది మహిళలు ఇంటిపనుల్లో తలమునకలై పోయి తమ ఇష్టాలను మరచిపోతుంటారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రొఫెసర్ ఫల్గుణి గృహిణుల కోసం ఒక వీడియో చేసింది.

'మహిళలు తమ భర్త, పిల్లల కోసం ఇష్టమైన వంటకాలను తయారుచేసే వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేయడం చూశాను. మరి మీ కోసం ఎప్పుడు తయారు చేస్తారు? మీ కుటుంబ సభ్యులకు నచ్చిన వంటకాల గురించి మాత్రమే కాదు మీకు నచ్చిన వాటి గురించి కూడా దృష్టి పెట్టండి' అంటూ తనకు బాగా నచ్చిన వంటకాన్ని తయారుచేస్తున్న వీడియోను ఫల్గుణి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ఈ వైరల్ క్లిప్ 1.4 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. ఈ వీడియో క్లిప్ చూసి ఒక మహిళ ఇలా స్పందించింది... 'నీకు ఇష్టమైనది చేసి పెడతాను. ఏంచేయమంటావు అని అడిగింది అమ్మ. వెంటనే సమాధానం చెప్పలేకపోయాను. పెళ్లయిన తరువాత ఇంటిపనుల్లో పడి నాకు ఇష్టమైన వంటకం ఏమిటో కూడా మరిచిపోయాను. ఈ వీడియో చూసిన తరువాత సెల్ఫ్-లవ్ ప్రాముఖ్యత గురించి రియలైజ్ అయ్యాను'

ధోనీ... ఈసారి ఇలా కానియ్!



ఎం.ఎస్. ధోనీ కెప్టెన్‌షిప్ క్వాలిటీస్ మాత్రమే కాదు సరికొత్త హెయిర్ స్టైల్, సరికొత్త బైక్ కూడా నెటిజనులకు ఆసక్తికరమే. తాజాగా ధోని 'డూడుల్ వీ3 ' ఇ-బైక్ రైడింగ్ వీడియో వైరల్ అయింది. రోజుల వ్యవధిలోనే 1.3 మిలియన్‌ల వ్యూస్‌తో దూసుకుపోతుంది. ధోని రైడింగ్ వీడియోలు వైరల్ కావడం కొత్త కానప్పటికీ ఎకో-ఫ్రెండ్లీ మోడ్ ఆఫ్ ట్రాన్స్‌పోర్టేషన్‌ను ప్రమోట్ చేసే ఈ మేడ్-ఇన్-ఇండియా ఎలక్ట్రికల్ సైకిల్ వీడియో నెటిజనులలో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తించింది.

హాయి హాయిగా... కూల్ కూల్‌గా!

ఎలాంటి క్యాప్షన్ లేకుండా రమీజ్ అనే యూజర్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన చెన్నై ఆటోడ్రైవర్ వీడియో 3 కోట్ల ఎనభై ఎనిమిది లక్షలకు పైగా వ్యూస్‌తో దూసుకుపోతోంది. 'ఏమిటీ ఆటోడ్రైవర్ స్పెషాలిటీ?' అనే విషయానికి వస్తే... ఎండాకాలంలో చెన్నైలో వేడి అంతా ఇంతా కాదు. ఈ వేడిని తట్టుకోవడానికి సదరు ఆటోడ్రైవర్ ఎకో ఫ్రెండ్లీ ఏసీ ఫ్యాన్‌ను తయారుచేసి తన ఆటోలో బిగించాడు. ఆటోడ్రైవరే కాదు ప్రయాణికులు కూడా హాయి హాయిగా కూల్ కూల్‌గా ప్రయాణిస్తున్నారు.



వద్దమ్మా.. తప్పూ!

ఈ మధ్య 'గైడింగ్ హ్యాండ్స్' అంటూ ఒక వీడియో వచ్చింది. అది వెక్కిరింత వీడియో. ఫోన్ చూసుకుంటూ తల ఎల్లవేళలా కిందకు దించి ఉండేవారిని చేయి పట్టి చేరవలసిన చోటుకు చేర్చే 'సహాయక చేతులను' భవిష్యత్తులో ఉపాధిగా చేసుకోవచ్చని అందులో చూపుతారు. అంటే అంధులను చేయి పట్టి నడిపించే వారికి మల్లే ఈ ఫోన్ బానిసలను చేయి పట్టి నడిపించి చార్జ్ తీసుకునే వ్యక్తులు భవిష్యత్తులో వస్తారన్న మాట. మనం ఫోన్‌కు శ్రుతి మించి ఎడిక్ట్ అయ్యామని చెప్పేందుకు ఈ వీడియో చేశారు. బండి మీద వెళుతూ ఫోన్ మాట్లాడితే ప్రమాదం అని ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ వినడం లేదు. కొందరు హెల్మెట్‌లో దూర్చి మరీ ఫోన్ మాట్లాడుతూ ప్రమాదం బారిన పడతారు. మరికొందరు హెడ్‌ఫోన్స్‌తో మాట్లాడుతూ వెనకొచ్చే వాహనాల హారన్ వినక ప్రమాదంలో పడుతున్నారు. మొన్నటి మార్చి 26న బెంగళూరు విద్యారణ్యపురలో ఒక మహిళ ఇలా ఫోన్ బిగించి కట్టి మాట్లాడుతూ ఒక వ్యక్తి కెమెరాకు చిక్కింది. అతను షూట్ చేసి ఇన్‌స్టాలో పోస్ట్ చేయడంతో వైరల్ అయ్యింది. అందరూ ఇలా చేయడం ప్రమాదం అన్నారు. ఈ ఎండల్లో ఫోన్ వేడెక్కి పేలినా ప్రమాదమే అని మరికొందరు హెచ్చరించారు. పోలీసులు ఏం చేస్తున్నారని కొందరు ప్రశ్నించారు. చివరకు వీడియో పోలీసుల వరకూ వెళ్లింది. బండి నంబర్ ఆధారంగా ఆ మహిళను గుర్తించి యలహంక ట్రాఫిక్ స్టేషన్ వారు 5 వేల రూపాయల ఫైన్ వేశారు. అవసరమా ఇదంతా?





హెల్త్



కుటుంబ సభ్యుల ఆరోగ్యం మీద పెట్టినంత శ్రద్ధ తమ విషయానికి వచ్చేసరికి మహిళలు గాలికి వదిలేస్తారు. కుటుంబ సభ్యులు కూడా అంతగా పట్టించుకోరు. దాంతో ఏదైనా ఆరోగ్య సమస్య వచ్చి, అది తీవ్రరూపం దాల్చేవరకు ఎవరూ సీరియస్‌గా తీసుకోరు. అలాంటి సమస్యల్లో 'డీప్ వీన్ థ్రాంబోసిస్' ఒకటి. ఇది స్త్రీ, పురుషులిద్దరికీ వచ్చే సమస్య అయినప్పటికీ... మహిళల్లో రిస్క్ ఫ్యాక్టర్స్ ఎక్కువ. గర్భధారణ నుంచి హార్మోన్ల సంక్లిష్టతల వరకు అనేక అంశాలు డీప్ వీన్ థ్రాంబోసిస్‌కు దారితీస్తాయి. రక్తనాళాల్లో... ప్రధానంగా చెడు రక్తాన్ని తీసుకెళ్లే సిరల్లో రక్తం గడ్డకట్టడాన్ని 'డీప్ వీన్ థ్రాంబోసిస్' (డీవీటీ)గా చెబుతారు. ఈ సమస్యపై అవగాహన కోసం ఈ కథనం.

మహిళకు డీప్ వీన్ థ్రాంబోసిస్ చేసే చేటు!

డీప్ వీన్ థ్రాంబోసిస్ అనేది చాలా ప్రమాదకరమైన పరిస్థితి. కాలి సిరల్లో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. ఇంచుమించు ప్రతి 20 మందిలో ఒకరికి... వారి జీవితకాలంలో డీప్ వీన్ థ్రాంబోసిస్ బాధపెడుతుంది.

మహిళల్లోనే ప్రభావం చూపడానికి కారణాలు...

1. ప్రెగ్నెన్సీ : స్త్రీలలో ఈ సమస్య మరింత ఎక్కువగా కనిపించడానికి గల కారణాలలో గర్భధారణ ఒకటి. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం తర్వాత ఆరు వారాల వరకు ఈ ముప్పు ఉంటుంది. గర్భధారణ తర్వాత రక్తనాళాల్లో రక్తప్రవాహం కాస్త నెమ్మదించడం మామూలే. దాంతో రక్తం గడ్డ కట్టే అవకాశాలు పెరగడం.

2. గర్భసంచి బాగా సాగడం: దీంతో రక్తనాళాలపై ఒత్తిడి పడి రక్తం సాఫీగా ప్రవహించడానికి ఆటంకం కలుగుతుంది.

3. నోటి ద్వారా తీసుకునే గర్భనిరోధక మాత్రలు: వీటిల్లోని హార్మోన్లతో డీప్ వీన్ థ్రాంబోసిస్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి. దాదాపు ప్రతి గర్భనిరోధక మాత్రలో ఈస్ట్రోజెన్, ప్రోజెస్టిన్ ఉండటంతో అవి రక్తనాళాల్లో రక్తం గడ్డ కట్టేలా చేసే అవకాశాలు పెరుగుతాయి. పైగా ఈస్ట్రోజెన్... కాలేయాన్ని ప్రేరేపించి... రక్తంలో ఉండే బ్లడ్ క్లాటింగ్ ఫ్యాక్టర్ రక్తం గడ్డకట్టేలా చేసే ఫైబ్రినోజెన్‌ను ఎక్కువగా స్రవింపజేస్తుంది. దీనికితోడు గర్భనిరోధక మాత్రల్లో వాడే కొన్ని రకాల కాంబినేషన్స్ పిల్స్ వల్ల ఈ ముప్పు మరింత పెరుగుతుంది. అందువల్ల గర్భనిరోధక మాత్రలు వాడేవారు డాక్టర్ సలహా మేరకే వాడాలి.

4. హార్మోనల్ రీప్లేస్‌మెంట్ థెరపీ: మెనోపాజ్ తర్వాత తీసుకునే హార్మోనల్ రీప్లేస్‌మెంట్ థెరపీలోని మందుల్లో ఈస్ట్రోజెన్, ప్రోజెస్టిన్ కాంబినేషన్ ఉంటుంది. ఈ ఈస్ట్రోజెన్ పైన పేర్కొన్న ప్రభావాన్నే చూపడంతో డీప్ వీన్ థ్రాంబోసిస్ ముప్పు పెరుగుతుంది. అందువల్ల ఈస్ట్రోజెన్ మందుల్ని చర్మానికి అంటించే ప్యాచ్‌ల రూపంలో ఇస్తే ఈ ముప్పు తగ్గుతుంది.

5. జీవనశైలి అంశాలు: శారీరక శ్రమ లేకుండా ఒకేచోట ఎక్కువసేపు కూర్చుని ఉండటం, స్థూలకాయం, పొగతాగడం వంటివి రక్తప్రవాహానికి ఆటంకం కలిగిస్తాయి. స్మోకింగ్ ద్వారా దేహంలోకి చేరే నికోటిన్ రక్తాన్ని గడ్డకట్టేలా చేస్తుంది.



వేర్వేరుగా లక్షణాల తీవ్రత...

డీప్ వీన్ థ్రాంబోసిస్‌లో రకరకాల లక్షణాలు కనిపిస్తాయి. అయితే ఆ లక్షణాలన్నీ అందరిలోనూ కనిపించకపోవచ్చు. దానికితోడు లక్షణాల తీవ్రతలో కూడా మార్పులుండవచ్చు. కొందరిలో రక్తపు గడ్డ చిన్నదిగా ఉంటే కొందరిలో అసలు ఎలాంటి లక్షణాలూ కనిపించకపోవచ్చు. సమస్య దానంతట అదే సమసిపోవచ్చు కూడా.

కొన్ని సాధారణ లక్షణాలు...

- రక్తం గడ్డ కట్టినచోట చర్మం వాపు (ముఖ్యంగా కాలు, పాదం వంటివి)
- చర్మం ఎర్రబారడం, అక్కడ వేడిగా ఉన్నట్లు అనిపించడం
- ఒక్కోసారి చర్మంలోంచి రక్తనాళాలు కనిపించడం
- కాలిలో డీవీటీ ఏర్పడినప్పుడు కాలు బలహీనంగా ఉన్నట్లు అనిపించడం
- రక్తనాళాలు గట్టి పడడం

ఈ లక్షణాలు అకస్మాత్తుగా కనిపించినా లేదా కాలం గడుస్తున్న కొద్దీ తీవ్రత పెరుగుతూ పోతున్నా వెంటనే డాక్టర్‌కు చూపించాలి. కొన్ని సార్లు రక్తనాళంలో ఏర్పడ్డ ఈ గడ్డ (క్లాట్) రక్తప్రవాహంలో కొట్టుకుపోతూ, గుండె రక్తనాళల్లోకి చేరి, గుండెస్పందనలను ఆపివేసే 'పల్మునరీ ఎంబాలిజమ్' అనే కండిషన్‌కు దారితీసే ప్రమాదం ఉంటుంది.



నివారణ...

- మంచి సమతులాహారం తీసుకోవడం అంటే పొట్టు తీయని కాయధాన్యాలు, ఆకుకూరలు, కాయగూరలు, తాజా పండ్లు తీసుకుంటూ బరువు పెరగకుండా చూసుకోవడం వంటి ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం
- క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. ముఖ్యంగా మహిళలు రోజుకు కనీసం 30 నిమిషాల వ్యాయామం చేయడం వల్ల రక్తప్రవాహం సాఫీగా మారి రక్తపు గడ్డలు ఏర్పడకుండా ఉంటుంది.
- తగినన్ని నీళ్లు, ద్రవాహారాలు తీసుకుంటూ ఎప్పుడూ హైడ్రేటెడ్‌గా ఉండటం.
- ఒకే చోట స్థిరంగా కూర్చుని ఉండకుండా కాసేపు నడక, స్ట్రెచ్చింగ్ వంటివి చేస్తూ ఉండటం.
- దూర ప్రయాణాలు చేస్తున్నప్పుడు అదేపనిగా వాహనంలో కూర్చుని ఉండకుండా తరచూ బ్రేక్ తీసుకోవటం.
- రక్తనాళాల్లో రక్తప్రవాహం సాఫీగా సాగేందుకు కంప్రెషన్ స్టాకింగ్ వంటివి వాడటం.
- గర్భం దాల్చిన మహిళల కుటుంబ సభ్యుల్లో డీప్ వీన్ థ్రాంబోసిస్ వచ్చిన ఆరోగ్య చరిత్ర ఉంటే ముందే డాక్టర్‌కు ఈ విషయాన్ని చెప్పడం మంచిది.

చికిత్స...

డీవీటీ వచ్చే అవకాశాలున్న వారు సపోర్ట్ స్టాకింగ్స్ / కంప్రెషన్ స్టాకింగ్స్ వాడటం.

రక్తాన్ని పలచబార్చే మందులైన యాంటీ కోయాగ్యులెంట్స్ వాడటం..

- **క్లాట్ బస్టర్స్ / థ్రాంబోలైటిక్స్ చికిత్స :** చిన్న పైప్ (క్యాథెటర్) ద్వారా రక్తం గడ్డకట్టిన చోటికి థ్రాంబోలైటిక్స్ అని పిలిచే మందును పంపి, రక్తపుగడ్డను చెదరగొట్టే ఔషధాల్ని వాడటం.



డాక్టర్ నరేంద్రనాథ్ మేడ,
కన్సల్టెంట్ వాస్క్యులార్ & ఎండో వాస్క్యులార్ సర్జన్

మెడి టిప్
చెవుల సంరక్షణ కోసం...!

చెవులను రక్షించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలివి...


- పల్లెటూళ్లలో వేసవి సెలవులు రాగానే ఈత నేర్చుకోవడం కోసం పిల్లలు నీటి కుంటలు, చెరువులకు వెళ్తుంటారు. చెరువుల్లోని మురికి నీరు చెవుల్లోకి చేరి ఇన్ఫెక్షన్లు రావచ్చు. అందువల్ల ఈత నేర్చుకోవాలనుకునే పిల్లలు పరిశుభ్రమైన నీళ్లలోనే దిగాలి.
- చెవులను శుభ్రం చేయడానికి కొందరు గోరువెచ్చగా కాచిన కొబ్బరి నూనె, ఆముదం చెవుల్లో పోస్తారు. ఇలా ఎట్టిపరిస్థితుల్లోనూ చేయకూడదు.
- అపరిశుభ్రమైన నీటితో తయారు చేసే ఐస్‌క్రీముల వంటివాటితో గొంతుకు సంబంధించిన ఇన్ఫెక్షన్లు వస్తాయి. అవే ఇన్ఫెక్షన్లు చెవులకూ సోకే ప్రమాదం ఉంది. కాబట్టి చెవి, గొంతు, ముక్కు... భాగాల్లో ఎక్కడ ఇన్ఫెక్షన్ కనిపించినా నిర్లక్ష్యం చేయకూడదు. ముఖ్యంగా పిల్లల విషయంలో ఈ జాగ్రత్తను మరింతగా పాటించాలి.

పై జాగ్రత్తలు పాటించాక కూడా... గులివి, చీము వంటి సమమస్యలతో పాటు... చెవిపోటు ఎక్కువగా వస్తున్నా, సరిగా వినిపించకపోయినా... వీలైనంత త్వరగా ఈఎన్‌టీ వైద్యనిపుణులను సంప్రదించాలి.

గుండె పెరగడం అంటే..?

గుండె పెరిగే సమస్యను ఇంగ్లిష్‌లో హార్ట్ ఎన్‌లార్జ్‌మెంట్ అనీ, వైద్య పరిభాషలో కార్డియో మెగాలీ అని అంటారు. నిజానికి ఇదేమీ వ్యాధి కాదు. కొన్ని ఇతర ఆరోగ్య సమస్యలు (మెడికల్ కండిషన్ల) కారణంగా కనిపించే ఒక లక్షణం. గుండె ఎందుకు విస్తరిస్తుందో, అందుకు కారణమయ్యే ఆరోగ్య సమస్యలేమిటో, దీని నివారణ, చికిత్స ప్రక్రియలను తెలుసుకుందాం.

రక్తాన్ని సరఫరా చేసే ఓ పంప్ లాంటిది గుండె. ఈ పంపు బలహీనమైనప్పుడు శరీరానికి అవసరమైన రక్తాన్ని సరఫరా చేయలేదు. ఈ పరిస్థితినే హార్ట్ ఫెయిల్యూర్ అంటారు. గుండెపై ఒత్తిడి పెరిగినప్పుడు గుండె విస్తరిస్తుంది. కొందరిలో ఈ పరిస్థితి తాత్కాలికం కాగా... మరికొందరిలో ఎప్పటికీ మందులు వాడటం, చికిత్స కొనసాగించడం అవసరం కావచ్చు. ఈ సమస్య తీవ్రమైనదా కాదా అన్నది గుండె పెరగడానికి కారణమైన అంశాన్ని బట్టి ఉంటుంది.



గుండె పెరగడం... రకాలు...

గుండె కాస్త పెరిగినప్పటికీ... ఒక దశ వరకూ అది మామూలుగానే పనిచేస్తుంది. ఒక దశకు చేరాకే అనర్థాలు కనిపిస్తాయి. గుండె పెరిగిన కారణాలూ, తీరును బట్టి ఇందులో కొన్ని రకాలు ఉంటాయి. అవి...

- డయలేటెడ్ కార్డియోమయోపతి కారణంగా గుండె పెరిగితే ఇందులో గుండె కింది గదులు (వెంట్రికిల్స్) రెండూ పెరుగుతాయి.
- అధిక రక్తపోటు కారణంగా గుండె ఎడమవైపు కింది గది మందంగా మారవచ్చు. ఇలా కండరం మందంగా మారి గుండె పెరగడాన్ని 'హైపర్‌ట్రోఫిక్ కార్డియోమయోపతి' అంటారు.
- ఒక్కోసారి ఏ కారణమూ లేకుండానే గుండెపెరగవచ్చు లేదా ఇతమిత్థంగా కారణం తెలియకపోవచ్చు. ఈ పరిస్థితిని ఇడియోపథిక్ డయలేటెడ్ కార్డియో మయోపతి అంటారు.

కారణాలు...


- గుండె కండరానికి ఇన్ఫెక్షన్ (మయోకార్డైటిస్) వచ్చేలా చేసే వైరల్ ఇన్ఫెక్షన్లు.
- గుండెకు ఉండే నాలుగు కవాటాల్లో ఏదైనా దెబ్బ తినడం వల్ల కొన్ని గదుల్లోకి రక్తం ఎక్కువగా వెళ్తూ ఉండటం.
- గుండె చుట్టూరా ఉండే ఒక పొరలోకి ద్రవాలు చేరడం వల్ల ఇలా జరగడాన్ని పెరికార్డియల్ ఎఫ్యూజన్ అంటారు. దీన్ని ఎక్స్-రే ద్వారా కనుగొంటారు.
- రక్తహీనత వల్ల అన్ని అవయవాలకూ ఆక్సిజన్ తగినంతగా అందదు. అలా అందించే ప్రయత్నంలో గుండె మరింత ఎక్కువగా పని చేయాల్సి రావడంతో.
- మహిళల్లో గర్భధారణ సమయంలో గుండె పెరిగే కండిషన్ అయిన పెరిపార్టమ్ కార్డియోమయోపతి వల్ల.
- కార్డియాక్ అమైలాయిడోసిస్ అనే కండిషన్‌లో రక్తంలో అమైలాయిడ్ ప్రొటీన్ మోతాదులు పెరగడంతో (ఇందులో గుండె గోడలు మందంగా మారతాయి).
- దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధితో బాధపడేవారిలో
- థైరాయిడ్ గ్రంథి స్రావంలో అసమతుల్యతల వల్ల
- పల్మునరీ హైపర్‌టెన్షన్ అనే హైబీపీ ఉన్నవారిలో రక్తపోటు వల్ల గుండె మరింత ఎక్కువగా పనిచేయాల్సి రావడంతో గుండె కుడివైపు గదులు పెరగవచ్చు.
- మద్యం తాగేవారిలో లేదా మాదకద్రవ్యాలు తీసుకునేవారిలో దీర్ఘకాలంలో గుండె పెరిగే ప్రమాదం ఉంది.
- కొందరిలో జన్యు సమస్యల కారణంగా పుట్టుకతోనే గుండె, దాని విధుల్లో తేడాలు రావడంతో పాటు గుండె పెరగవచ్చు.

లక్షణాలు... ● శ్వాస సరిగా అందకపోవడం ● కాళ్ల / పాదాల వాపు ● బరువు పెరగడం (ముఖ్యంగా దేహం మధ్యభాగంలో... సెంట్రల్ ఒబేసిటీ) ● తీవ్రమైన అలసట ● కొందరిలో గుండెదడ లేదా గుండె లయ తప్పడం.

నిర్ధారణ పరీక్షలు: కొన్ని రక్తపరీక్షలు, ఛాతీ ఎక్స్-రే, సీటీ లేదా ఎమ్మారై స్కాన్, ట్రెడ్‌మిల్‌పై చేయించే స్ట్రెస్ పరీక్ష, అరుదుగా గుండె కండరాన్ని సేకరించి చేసే బయాప్సీ.

చికిత్స... గుండె పెరగడానికి కారణమైన అంశం ఆధారంగా చికిత్స చేస్తారు. ఉదాహరణకు... ● గుండెకు రక్తాన్ని చేరవేసే రక్తనాళాల్లో అడ్డంకి ఏర్పడటం వల్ల వచ్చే కరోనరీ ఆర్టరీ డిసీజ్‌లో ఆ అడ్డంకి తొలగింపు ద్వారా. ● రక్తపోటును నియంత్రించే మందుల్ని వాడటం ద్వారా. ● గుండె కవాటాలలో లోపాల వల్ల గుండె పెరిగితే వాల్వ్‌లకు తగిన రిపేరు చేయడం లేదా శస్త్రచికిత్స ద్వారా. ● మద్యపానం లేదా మాదక ద్రవ్యాల వల్ల గుండె పెరిగితే ఆ అలవాటును మాన్పించడం ద్వారా.

ఇతర మందుల వాడకంతోనూ... కాళ్లవాపులు అధికంగా ఉన్నప్పుడు అధికంగా మూత్రం వచ్చేలా చేసే డై-యూరెటిక్స్‌తో ● రక్తపోటు పెరిగినప్పుడు యాంజియోటెన్సిన్ - కన్వర్టింగ్ ఎంజైమ్ ఇన్హిబిటార్స్, బీటా బ్లాకర్స్ వంటి మందులతో. ● రక్తాన్ని పలచబార్చే యాంటీ కోయాగ్యులెంట్స్‌తో. ● గుండె లయ తప్పినప్పుడు యాంటీ అరిథ్మియా డ్రగ్ అనే మందును వాడతారు. ● గుండె కొట్టుకోవడం ఆగితే ఇంప్లాంటబుల్ కార్డియోవెర్టర్ డీ ఫిబ్రిలేటర్‌తో తిరిగి గుండె కొట్టుకునేలా చేస్తారు. ● గుండె స్పందనల వేగం పెరిగినా లేదా తగ్గినా క్రమబద్ధం చేసే 'పేస్‌మేకర్' అమర్చడం ద్వారా. ● లెఫ్ట్ వెంట్రిక్యులార్ అసిస్ట్ డివైస్ (ఎల్‌వీఏడీ) అనే ఉపకరణాన్ని.. గుండెమార్పిడి శస్త్రచికిత్స అవసరమైన వారు తమకు సరిపడే గుండెకోసం వేచి చూస్తున్నప్పుడు... ● గుండెకు రక్తాన్ని చేరవేసే రక్తనాళాల్లో అడ్డంకులు (బ్లాక్స్) చాలా ఎక్కువగా ఉన్నప్పుడు బైపాస్ శస్త్రచికిత్సతో... ● చివరి ప్రత్యామ్నాయంగా గుండె మార్పిడి (హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్) చికిత్సతో పరిస్థితిని చక్కదిద్దుతారు.



డా. కరుణాకర్ రాపోలు
ఇంటర్‌వెన్షనల్ కార్డియాలజిస్ట్



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 సంచిక: 8

SUNDAY Special

ఆదివారం 31-3-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



లక్నో సూపర్‌గా...

పంజాబ్ కింగ్స్‌తో జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ జట్టు 21 పరుగుల తేడాతో గెలిచింది. బౌలర్ మయాంక్ యాదవ్ (3/27) హడలెత్తించాడు.

- వివరాలు 12లో



బోపన్న జోడీకి టైటిల్

మయామి ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ విజేతగా నిలిచింది.

- వివరాలు 12లో



కైలాశ్ గహ్లోత్‌ను ప్రశ్నించిన ఈడీ

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఈడీ వేగం పెంచింది. ఢిల్లీ మంత్రి, ఆప్ నేత కైలాశ్ గహ్లోత్‌ను 5 గంటలపాటు ప్రశ్నించింది.

- వివరాలు 6లో



విపక్షాల ర్యాలీ నేడే

'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' నినాదంతో విపక్ష ఇండియా కూటమి నేడు ఢిల్లీలో భారీ ర్యాలీ నిర్వహించనుందని జైరాం రమేశ్ తెలిపారు.

- వివరాలు 6లో



భార్యను భూతం అనడం క్రూరత్వం కాదు

వైవాహిక జీవితం విఫలమైనపుడు భర్త తన భార్యను భూతం, పిశాచి అని దూషించడం క్రూరత్వం కాదని పట్నా హైకోర్టు తేల్చిచెప్పింది.

- వివరాలు 6లో



ద్రవిడ నేలపై కమలం వికసించేనా?

దక్షిణాదిని పాదాక్రాంతం చేసుకోవాలని ఉవ్విళ్లూరుతున్న బీజేపీ ఈ లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాడుపై స్పెషల్ ఫోకస్ పెట్టింది.

- వివరాలు 6లో

'కూల్చివేత'పై కుతకుత!

రాష్ట్ర ప్రభుత్వం కూలిపోతుందనే వ్యాఖ్యలపై బీజేపీ, కాంగ్రెస్ మధ్య రగడ

ఆరుగురు మంత్రులు బీజేపీతో టచ్‌లో ఉన్నారన్న బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

ఏక్‌నాథ్ షిండే పాత్ర పోషించేందుకు మంత్రి కోమటిరెడ్డి సిద్ధమని వ్యాఖ్య

- దీనిపై కాంగ్రెస్‌లో కలకలం.. ఘాటుగా ప్రతిస్పందించిన నేతలు
- దమ్ముంటే టచ్ చేయాలని మంత్రి పొన్నం వ్యాఖ్య
- అమిత్ షా, గడ్కరీ భాగ్యలక్ష్మి ఆలయంలో ప్రమాణం చేయాలన్న కోమటిరెడ్డి
- ఏలేటి ఓ జోకర్.. కాంగ్రెస్‌లోకి రానివ్వనందుకే ఆరోపణలు
- నోటికొచ్చినట్టు మాట్లాడొద్దని బీజేపీ నేతలకు మంత్రి ఉత్తమ్ హెచ్చరిక



కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలంగాణ షిండే

- ఆయన, మరో ఐదుగురు మంత్రులు బీజేపీతో టచ్‌లో ఉన్నారు
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

ఐదేళ్లకోసారి పార్టీ మారే నువ్వా మాట్లాడేది?

బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డిపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఫైర్

బీజేపీ నోట బీఆర్ఎస్ పాట

మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్

వివరాలు 2లో

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూలిపోతుందన్న వ్యాఖ్యలు మరోసారి దుమారం రేపాయి. రెండు జాతీయ పార్టీల నేతల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లకు కారణమయ్యాయి. బీజేపీ ఎమ్మెల్యేలను టచ్ చేయాలని చూస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చడానికి 48 గంటలు చాలంటూ బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యానించడంతో వివాదం మొదలైంది. అంతేకాదు.. ఆరుగురు మంత్రులు బీజేపీతో టచ్‌లో ఉన్నారనడం.. ఏక్‌నాథ్ షిండే తరహాలో ఇక్కడ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యవహరించేందుకు సిద్ధమయ్యారనడం.. కోమటిరెడ్డి కేంద్ర మంత్రులు గడ్కరీ, అమిత్ షాలను కలిశారనడం కలకలం రేపింది. దీనితో ఇంతకుముందు బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ కూడా లోక్‌సభ ఎన్నికల తర్వాత తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పడుతుందంటూ చేసిన వ్యాఖ్యలు మళ్లీ తెరపైకి వచ్చాయి. అధికార పార్టీ నేతలను బీజేపీ టచ్‌లోకి తెచ్చుకుంటోందంటూ ప్రచారం మొదలైంది. ఈ క్రమంలో కాంగ్రెస్ మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ ఘాటుగా స్పందించారు. బీజేపీ పలు రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూల్చిందని, కానీ ఇక్కడ అలా సాధ్యం కాదని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఏలేటి వ్యాఖ్యలు మోదీ, అమిత్ షాల ఆలోచన తీరును తెలియచేస్తున్నాయని విమర్శించారు. ''నిన్నటి వరకు బీఆర్ఎస్ వాళ్లు ఈ పాట పాడారు. ఇప్పుడు బీజేపీ వాళ్లు ఎత్తుకున్నారు. దమ్ముంటే టచ్ చేసి చూడండి.. ఏం జరుగుతుందో తెలుస్తుంది..'' అని సవాల్ చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడ్డారు. దమ్ముంటే అమిత్ షా, గడ్కరీలను భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయానికి తీసుకుని వచ్చి ప్రమాణం చేయించాలని, తాను కూడా ప్రమాణం చేయడానికి సిద్ధమని సవాల్ చేశారు. మహేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి వస్తానంటే ఎవరూ స్పందించకపోయేసరికి ఇలా తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇక ఏలేటి వ్యాఖ్యలపై మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. ఏదో నోటికి వచ్చినట్టు మాట్లాడటం సరి కాదని, అనవసర ఆరోపణలు పద్ధతికాదని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లూ అధికారంలో ఉండి ప్రజలకు సేవ చేస్తుందన్నారు.



రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా పీవీ తరపున భారతరత్న పురస్కారాన్ని అందుకుంటున్న ఆయన కుమారుడు పీవీ ప్రభాకర్‌రావు

పీవీకి భారతరత్న

ఆయనతో సహా నలుగురికి మరణానంతరం ప్రదానం

అవార్డు అందుకున్న పీవీ కుమారుడు ప్రభాకర్‌రావు

6లో

మాజీ ప్రధానమంత్రులు పీవీ నరసింహారావు, చౌదరి చరణ్‌సింగ్, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్, బిహార్ మాజీ సీఎం కర్పూరీ ఠాకూర్‌కు మరణానంతరం దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న'ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శనివారం ప్రదానం చేశారు. పీవీ నరసింహారావు తరపున ఆయన కుమారుడు పీవీ ప్రభాకర్‌రావు పురస్కారం అందుకున్నారు. ఎల్‌కే అడ్వాణీకి ఆదివారం ఆయన నివాసంలో ముర్ము పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు.

రేవంత్‌రెడ్డికి కేకే విందు

- కేకే ఆహ్వానం మేరకు ఆయన నివాసానికి వెళ్లిన సీఎం, కాంగ్రెస్ నేతలు
- కడియం శ్రీహరి, కావ్య నేడు చేరే చాన్స్
- కాంగ్రెస్‌లో చేరిన మేయర్ విజయలక్ష్మి

2లో



కేకేను ఆయన నివాసంలో కలిసిన సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, కాంగ్రెస్ నేతలు అనిల్ కుమార్ యాదవ్, గడ్డం వినోద్ తదితరులు

న్యూస్‌రీల్

కేటీఆర్‌పై క్రిమినల్ కేసు



బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. సీఎం రేవంత్‌రెడ్డి బిల్డర్లు, కాంట్రాక్టర్ల నుంచి రూ.2,500 కోట్లు వసూలు చేసి ఢిల్లీకి పంపారంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత బత్తిన ఫిర్యాదు చేశారు.

- వివరాలు 3లో

ప్రైవేట్ కాలేజీలను బతకనివ్వరా?



ప్రైవేటు డిగ్రీ, పీజీ, ఇతర వృత్తి విద్యా కాలేజీలకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించక పోవడంతో ఆయా కాలేజీ యాజమాన్యాలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని బీజేపీ ఎంపీ బండి సంజయ్ అన్నారు.

- వివరాలు 5లో

518 ఎకరాలు హాంఫట్!



అవి పంటలు పండించుకుని జీవనాధారం పొందేందుకు పేదలకిచ్చిన అసైన్డ్ భూములు. క్రయ విక్రయాలు, వ్యవసాయేతర పనులు చేయడానికి వీల్లేని భూములు. కానీ 'ధరణి'లో రికార్డులను తారుమారు చేశారు. దీంతో 518 ఎకరాలు పెద్దల చేతుల్లోకి వెళ్లిపోయాయి.

- వివరాలు 5లో

డోర్నకల్–గద్వాల మధ్య కొత్త రైల్వేలైన్!



ఇప్పటి వరకు రైల్వేలైన్‌తో అనుసంధానం లేని కీలక ప్రాంతాలను జత చేస్తూ కొత్త రైల్వే లైన్ ఖరారుకు అడుగులు పడుతున్నాయి. హైదరాబాద్–విజయవాడ, హైదరాబాద్–బెంగళూరు రైల్వే మార్గాలను కలుపుతూ కొత్త లైన్ నిర్మించేందుకు ఫైనల్ లొకేషన్ సర్వే నిర్వహిస్తున్నారు.

- వివరాలు 13లో



ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్



అనంతపురం జిల్లా గుత్తిలో ఏపీ సీఎం వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతున్న భారీ జనసందోహంలో ఓ భాగం

మీ ఓటుతోనే మీ రాత మార్పు

పత్తికొండ నియోజకవర్గం తుగ్గలిలో ప్రజలతో ముఖాముఖిలో ఏపీ సీఎం వైఎస్ జగన్

- కళ్లెదుట కనిపిస్తున్న అభివృద్ధిని ఇంటింటా వివరించండి
- ఈ 58 నెలల పాలనలో ఊరూరా సంక్షేమాభివృద్ధి
- ఇదివరకెన్నడూ లేని విధంగా ఇంటింటికీ లబ్ధి
- సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా విప్లవాత్మక మార్పులు

11లో

కరెంట్ కోతలుండొద్దు

వేసవి డిమాండ్‌కు సరిపడా విద్యుత్ లభ్యత ఉంది.. నిరంతర సరఫరాకు సన్నద్ధంగా ఉండాలి

తాగునీటి కొరత రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

విద్యుత్, తాగునీటి సరఫరాపై అధికారులకు సీఎం రేవంత్ సూచనలు

సాక్షి, హైదరాబాద్: వేసవిలో పెరిగిన డిమాండ్‌కు సరిపడా విద్యుత్ లభ్యత ఉందని.. ఎక్కడా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండరాదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి తీవ్రతతో పెరిగిన డిమాండ్‌కు సరిపడా విద్యుత్ సరఫరా చేసేందుకు సన్నద్ధంగా ఉండాలని అన్నారు. కరెంట్ పోయిందనే ఫిర్యాదులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరించాలని చెప్పారు. వేసవిలో విద్యుత్, తాగునీటి సరఫరాకు తీసుకోవాల్సిన చర్యలపై శనివారం అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచనలు జారీ చేశారు. అత్యవసర సేవలైన విద్యుత్, తాగునీటి సరఫరాలపై తొలుత సమీక్ష నిర్వహించాలని

మిగతా 3వ పేజీలో ▶

వంద రోజుల పాలన పోలీస్ రాజ్యమే

- ప్రభుత్వం మారినా నిర్బంధం కొనసాగుతోంది
- 'ప్రజాస్వామ్య పరిరక్షణ' మాటలకే పరిమితమైంది
- ప్రజా సంఘాల 'నిగాహ్' సమావేశంలో వక్తల అభిప్రాయాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వంద రోజుల కాంగ్రెస్ పాలనలో పోలీసుల రాజ్యమే కనిపించిందని రాష్ట్రంలోని ప్రజా సంఘాల ప్రతినిధులు ముక్తకంఠంతో అభిప్రాయపడ్డారు. ప్రతి అంశంలోనూ పోలీసుల జోక్యం పెరిగిందని, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పోలీసులు చేసిన ఓవరాక్షన్ ఇప్పటికీ కొనసాగుతోందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత టీపీసీసీ అధ్యక్షుడిగా మీడియాతో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఏర్పాటయ్యే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తుందని పదేపదే చెప్పారని, ఆ తర్వాత ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత కూడా పలు సందర్భాల్లో ఈ వ్యాఖ్యలు చేశారని, కానీ ప్రజాస్వామ్య పరిరక్షణ అనేది మాటలకే పరిమితమైందని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల పాలనపై ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విశ్రాంత అధ్యాపకురాలు రమా మేల్కోటే అధ్యక్షతన శనివారం 'నిగాహ్'రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం వందరోజుల్లో అనుసరించిన కార్యక్రమాలు, చేసిన పనులను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరైన వక్తలు విశ్లేషించారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న పౌరహక్కుల నేతలపై

మిగతా 5వ పేజీలో ▶

కేసీఆర్ పల్లెబాట

- నేడు జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో పర్యటన
- ఎండిన పంట పొలాల పరిశీలన
- నష్టపోయిన రైతులతో ముఖాముఖి



సాక్షి, హైదరాబాద్: సాగునీరు అందక, భూగర్భ జలాలు అడుగంటడంతో ఎండిపోయిన పంటలను పరిశీలించేందుకు బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదివారం క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. ఓ వైపు రాష్ట్రంలో కరువు పరిస్థితులు, మరోవైపు అకాల వర్షాలతో నష్టపోయిన రైతుల్లో ధైర్యం నింపడం లక్ష్యంగా కేసీఆర్ పర్యటన ఉంటుందని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. ఆదివారం జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో కేసీఆర్ పర్యటిస్తారు. పర్యటనలో భాగంగా పంట పొలాలను పరిశీలించడంతోపాటు

మిగతా 2వ పేజీలో ▶



మూసీ సుందరీకరణకు రూ.60 వేల కోట్లు

- జోన్ల వారీగా వాణిజ్య అనుమతులతో నిధుల సమీకరణ
- ప్రతి రోజూ 1–2 టీఎంసీల నీటి విడుదలతో మూసీ శుద్ధి
- నదికి ఇరువైపులా కిలోమీటర్ మేర ఇంపాక్ట్ ఏరియా
- 10 వేలకు పైగా ఆక్రమణలే మూసీ సుందరీకరణకు అడ్డంకులు

వివరాలు 10లో



క్లుప్తంగా...

రేపు నల్లగొండకు కేటీఆర్



నల్లగొండ: బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గస్థాయి ఎన్నికల సన్నాహక సమావేశం ఏప్రిల్ 1న ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని లక్ష్మీగార్డెన్స్‌లో నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి కేటీఆర్‌తోపాటు సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి హాజరుకానున్నారు. ఒక్కో నియోజకవర్గం నుంచి 500 మందికి పైగా 7 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి దాదాపు 4 వేల మంది వరకు ఈ కార్యక్రమానికి రానున్నట్లు మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి తెలిపారు.

మోసపూరిత హామీలతో అధికారంలోకి కాంగ్రెస్

ఎమ్మెల్యే కేపీ వివేకానంద



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. వచ్చేనెల ఆరోతేదీన తుక్కుగూడలో నిర్వహించే సభలో ప్రజలకు ఇచ్చిన హామీలపై ఆ పార్టీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శనివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక కూడా వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నారని, కేసీఆర్ వయసుకు గౌరవం ఇవ్వకుండా నీచంగా మాట్లాడటం సరికాదన్నారు. రైతుబంధు, రైతు భరోసా విషయంలో ప్రజలకు ఏం చెప్పారో సమాధానం చెప్పాలని, డిసెంబర్ తొమ్మిదో తేదీన చేస్తామన్న రెండు లక్షల రుణ మాఫీ ఏమైందని, హామీలు ఇచ్చిన రోజు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి భట్టి విక్రమార్కకు తెలియదా అని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కేటీఆర్ స్పష్టంగా చెప్పారని, కానీ ఆయన మాటలకు వక్ర భాష్యం చెప్తున్నారన్నారు. దానం నాగేందర్, రంజిత్‌రెడ్డిని ఉద్దేశించి గతంలో రేవంత్‌రెడ్డి ఏం మాట్లాడారో అందరికీ తెలుసన్నారు.

కాంగ్రెస్ జాతీయ మేనిఫెస్టో కమిటీ భేటీ

లోక్‌సభ ఎన్నికల హామీలపై చర్చించిన శ్రీధర్‌బాబు కమిటీ

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ జాతీయ మేనిఫెస్టో కమిటీ శనివారం గాంధీభవన్‌లో సమావేశమైంది. కమిటీ చైర్మన్, మంత్రి శ్రీధర్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిటీ సభ్యులు అనంతుల శ్యాంమోహన్, కమలాకర్‌రావు, వినోద్‌కుమార్, అల్దాసు జానయ్య, జనక్‌ప్రసాద్, రియాజ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోక్‌సభ ఎన్నికల కోసం రాష్ట్రానికి సంబంధించి పార్టీ జాతీయ మేనిఫెస్టోలో చేర్చాల్సిన అంశాలపై చర్చించారు. వరంగల్ ఎయిర్ పోర్ట్ ఆధునీకీకరణ, సింగరేణి రైల్వే, స్పోర్ట్స్ యూనివర్సిటీ, కేంద్రీయ విద్యాలయాలు, సైనిక స్కూళ్లు, నవోదయ పాఠశాలల ఏర్పాటుతో పాటు రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న పలు అంశాలపై చర్చించారు. కాంగ్రెస్ జాతీయ మేనిఫెస్టోను ఇంటింటికీ తీసుకెళ్లే ప్రణాళికను రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు.

కేసీఆర్ వెంటే నడుస్తాం

బీఆర్ఎస్ మహారాష్ట్ర విభాగం ప్రకటన

సాక్షి, హైదరాబాద్: పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న నేపథ్యంలో తాము పార్టీ వెంటే నిలుస్తామని బీఆర్ఎస్ మహారాష్ట్ర విభాగం ప్రకటించింది. పూణేలోని పింప్రీ చించ్వాడలో ఆదివారం బీఆర్ఎస్ మహారాష్ట్ర విభాగం విస్తృతస్థాయి సమావేశం జరిగింది. శివాజీ జాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మహారాష్ట్రలోని అన్ని జిల్లాల సమన్వయకర్తలతో పాటు 286 అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు హాజరయ్యారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభు త్వం తమ రాజకీయ విరోధులను అణిచివేసేందుకు ప్రయత్నిస్తోందని సమావేశం అభిప్రాయపడింది. ఈడీ వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థల ద్వారా విపక్షాలపై దాడులు చేస్తోంద ని వక్తలు విమర్శించారు. దేశంలో రైతు రాజ్యం ఏర్పాటు చేసేందుకు తామంతా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వెంట నడుస్తామని ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యేలు శంకరన్న దోంగ్డే, మనోహర్ పట్వారి, మాజీ ఎంపీ హరిబాబు రాథోడ్‌తో పాటు పార్టీ నేతలు సుదీర్ బిందు, బాలాసాహెబ్, విజయ్ మోహితే, గణేష్ కదం తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పల్లెబాట

▶ మొదటి పేజీ తరువాయి

రైతులతో మాట్లాడి వారి కష్టాలను తెలుసుకుంటారు. కేసీఆర్ ఉదయం 8:30 గంటలకు ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రం నుంచి రోడ్డు మార్గంలో జిల్లాల పర్యటనకు బయలుదేరతారు. 10:30 గంటలకు జనగామ జిల్లా దేవరుప్పుల మండలం ధరావత్ తండాకు చేరుకుని అక్కడ ఎండిపోయిన పంట పొలాలను పరిశీలిస్తారు. అనంతరం జనగామ, సూర్యాపేట మార్గంలో ప్రయాణించి 11:30 గంటలకు సూర్యాపేట జిల్లా తుంగతుర్తి, అర్వపల్లి, సూర్యాపేట రూరల్ మండలాల్లో ఎండిన పంట పొలాలను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 1:30 గంటలకు సూర్యాపేట ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసుకు చేరుకుంటారు. అక్కడ 2 గంటలకు భోజనం చేసి 3 గంటలకు మీడియాతో మాట్లాడతారు. 3:30 గంటలకు సూర్యాపేట నుంచి బయలుదేరి 4.30కు నల్లగొండ జిల్లా నిడమనూరులో పంట పొలాలను పరిశీలిస్తారు. ప్రతీ చోటా రైతులతో ముఖాముఖి సంభాషిస్తారు. సాయంత్రం 6 గంటలకు నిడమనూరు నుంచి బయల్దేరి నల్లగొండ, నార్కట్‌పల్లి, చిట్యాల, భువనగిరి మీదుగా ఎర్రవెల్లి ఫాంహౌజ్‌కు రాత్రి 9 గంటలకు చేరుకుంటారు.





చిన్నేటివాగు.. కన్నీటి సాగు

గత ఏడాది మార్చిలో జలకళతో కనువిందు చేసిన వాగు.. ఈ ఏడాది మార్చికి ఎడారిలా మారింది. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల పరిధిలోని రైతాంగం ప్రధాన సాగునీటి వనరైన చిన్నేటివాగు వట్టిపోయి ఎడారిని తలపిస్తోంది. సాగునీటి కోసం వాగులో రైతులు ఏర్పాటు చేసుకున్న మోటార్లు నీరు లేక ఇలా దర్శనమిస్తున్నాయి. - బీబీనగర్

తెలంగాణ షిండే.. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఆయన, మరో ఐదుగురు మంత్రులు బీజేపీతో టచ్‌లో ఉన్నారు



- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపణలు
- కోమటిరెడ్డి కేంద్రమంత్రి గడ్కరీ వద్దకెళ్లి తెలంగాణలో షిండే పాత్ర పోషిస్తానని చెప్పారు
- కానీ ఆయనపై నమ్మకం లేక వారు అంగీకరించలేదు
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎవరూ కూల్చాల్సిన అవసరం లేదు.. వాళ్ల మంత్రులే కూల్చుతారు... ఇప్పటికే పది మంది సీఎం పదవిపై కన్నేశారు
- ఓటుకు కోట్లు కేసుతో తన సీటుకు ఎసరొస్తుందని రేవంత్ భయపడుతున్నారు
- రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి చేస్తున్న వసూళ్ల చిట్టా తమ దగ్గర ఉందని వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: బీజేపీతో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితోపాటు మరో ఐదుగురు మంత్రులు టచ్‌లో ఉన్నారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. కేంద్ర మంత్రులు అమిత్ షా, నితిన్ గడ్కరీల వద్దకు మంత్రి వెంకట్‌రెడ్డి వెళ్లి తెలంగాణలో షిండే పాత్ర పోషిస్తానని చెప్పారన్నారు. కానీ ఆయనపై ఎవరికీ నమ్మకం లేదని, అందుకే ఆయనకు షిండే పాత్ర ఇవ్వడం లేదని వ్యాఖ్యానించారు. బీజేపీ హైకమాండ్‌తో ఆయన టచ్‌లో ఉంటూ.. బీజేపీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారనడం ఏమిటని పేర్కొన్నారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ.. 8 మంది బీజేపీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారని మాట్లాడుతున్నారు. వెంకట్‌రెడ్డితో ఆయన సోదరుడే టచ్‌లో లేరు. అలాంటిది బీజేపీ ఎమ్మెల్యేలు ఎలా టచ్‌లోకి వస్తారు. బీజేపీ ఎమ్మెల్యేల్లో ఎవరికీ అలాంటి చరిత్ర లేదు. మా పార్టీ వారిని ముట్టుకునే సాహసం చేయొద్దు. మా పార్టీ ఎమ్మెల్యేల్లో ఒక్కరిని ముట్టుకున్నా 48 గంటల్లో రాష్ట్ర ప్రభుత్వం కూలిపోతుంది. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి బీజేపీ ప్రజాస్వామ్యబద్ధంగా సహకరిస్తోంది. వెంకటరెడ్డికి దమ్ముంటే భువనగిరి ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకోవాలి.

భయపెట్టి వసూళ్లు చేస్తున్నారు


రేవంత్‌రెడ్డి విపక్షంలో ఉన్నప్పుడు ఒక విధంగా, అధికారంలోకి వచ్చాక మరో విధంగా మాట్లాడటం సమంజసం కాదు. కాంట్రాక్టర్లు, వ్యాపారస్తులను విచారణల పేరుతో భయపెట్టి వసూళ్లకు పాల్పడుతున్నారు. రేవంత్ వసూళ్ల చిట్టా, ఆధారాలు మా దగ్గర ఉన్నాయి. రాష్ట్రంలో ఆర్ ట్యాక్స్ పేరిట రూ.3 వేల కోట్లు వసూలు చేశారు. ఆ డబ్బును దేశవ్యాప్తంగా రాజకీయాల కోసం కాంగ్రెస్ వినియోగిస్తోంది. తుగ్లక్ చేష్టలు చేస్తున్న రేవంత్‌రెడ్డిపై మా పోరాటం కొనసాగుతుంది. కాంగ్రెస్‌ది అసమర్థ ప్రభుత్వం. వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకు ఏదో ఒకఅంశాన్ని తెరపైకి తెచ్చి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తోంది. ఇతర పార్టీల ఎమ్మెల్యేలు, ఎంపీలను రాజీనామా చేయకుండా కాంగ్రెస్‌లో చేర్చుకుని టికెట్లు ఎలా ఇస్తున్నారు.''అని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. రాజీనామాలు చేశాకే ఇతర పార్టీల వారిని బీజేపీ చేర్చుకుంటోందన్నారు.

వాళ్ల మంత్రులే కూల్చుతారు..

మేం గేట్లు తెరిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోవడానికి 48 గంటలు కూడా పట్టదు. కానీ మేం అలా చేయబోం. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎవరూ కూల్చాల్సిన అవసరం లేదు. వాళ్ల మంత్రులే కూల్చుతారు. ఇప్పటికే పది మంది మంత్రులు సీఎం పీఠంపై కన్నేశారు. ఓటుకు కోట్లు కేసుతోనో, ఇంకో అంశంతోనో తన సీటుకు ప్రమాదం వస్తుందన్న భయంతో సీఎం రేవంత్‌కు నిద్రపట్టడం లేదు. ఎమ్మెల్యేలు రాజీనామా చేయకుండా పార్టీ మారితే వారిని రాళ్లతో కొట్టాలని గతంలో రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఎలా కొంటున్నారు? ఇప్పుడు దేనితో వారిని కొట్టాలి. గతంలో బీఆర్ఎస్ ఎంపీ రంజిత్‌రెడ్డిపై అవినీతి ఆరోపణలు చేసిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ఆయనకు టికెట్ ఎలా ఇచ్చారు? ఆయన తరఫున ప్రచారం ఎలా చేస్తారు? వారి మధ్య ఎలాంటి ఒప్పందం కుదిరిందో బయటపెట్టాలి.

ఐదేళ్లకోసారి పార్టీ మారే వ్యక్తా నా గురించి మాట్లాడేది?

బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డిపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఫైర్



- 'కాంగ్రెస్‌లో చేరుతా సాయం చేయాల'ని ఏలేటి నన్ను అడిగారు
- ఇప్పుడు నాపై అసత్య ఆరోపణలు చేస్తున్నారు..
- భాగ్యలక్ష్మి ఆలయంలో ప్రమాణం చేద్దాం.. రావాలని సవాల్
- మహేశ్వర్‌రెడ్డి జోకర్ అని, మతిస్థిమితం తప్పినట్టుందని వ్యాఖ్యలు
- దేశంలోనే అత్యంత దిగజారిన పార్టీ బీజేపీ అని మండిపాటు

సాక్షి, హైదరాబాద్: తనపై బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సత్యదూరమని.. ఐదేళ్లకోసారి పార్టీ మారే వ్యక్తి తన గురించి మాట్లాడటమేమిటని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో 'కాంగ్రెస్‌లో చేరుతా.. సాయపడు అన్నా'అని మహేశ్వర్‌రెడ్డి తనను కోరారని.. అలాంటిది ఇప్పుడు తనను టార్గెట్ చేసి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఆయన ఓ రాజకీయ జోకర్ అని వ్యాఖ్యానించారు. శనివారం తనపై మహేశ్వర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. అందులోని వివరాలు ఆయన మాటల్లోనే..

''కాంగ్రెస్‌లోకి వస్తా.. మంత్రి పదవి కావాలన్నా అని అసెంబ్లీ సమావేశాల సమయంలో మహేశ్వర్‌రెడ్డి నన్ను అడిగారు. మాకే పూర్తి మెజారిటీ ఉంది. ఎవరినీ చేర్చుకునే ఉద్దేశం లేదని చెప్పాను. అది మనసులో పెట్టుకుని ఏదేదో మాట్లాడుతున్నారు. కేంద్రంతో ఆరుగురు మంత్రులు టచ్‌లో ఉన్నారంటూనే.. తమకు అవసరం లేదనడం.. కాంగ్రెస్ ప్రభుత్వంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డినే ఏక్‌నాథ్ షిండే పాత్ర పోషిస్తారనడం మహేశ్వర్‌రెడ్డికి మతిస్థిమితం లేదనడానికి నిదర్శనం. గడ్కరీ, అమిత్ షాలను తాను కలసి షిండే పాత్ర పోషిస్తానని చెప్పినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. దీనిపై భాగ్యలక్ష్మి ఆయానికి వారిని తీసుకుని వచ్చి ప్రమాణం చేయాలి. నేను కూడా ప్రమాణం చేస్తా..

బీజేపీతో లాభం లేదన్నారు..

'రాష్ట్రాన్ని అభివృద్ధి చేద్దామంటే తమ (బీజేపీ) వాళ్లు రామ మందిరాన్ని పట్టుకున్నారని... దానితో తెలంగాణలో ఓట్లు పడతాయా'అని మహేశ్వర్‌రెడ్డి నాతో చెప్పారు. తాను సొంత ఇమేజీతో ఎమ్మెల్యేగా గెలిచానని, బీజేపీతో లాభమేమీ లేదని కూడా అన్నారు. కాంగ్రెస్‌లోనే ఉండుంటే మంత్రిని అయ్యేవాడినని చెప్పారు. నేను షిండే అవునో, కాదో తెలియదుగానీ.. మహేశ్వర్‌రెడ్డి మాత్రం కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్‌లకు వెన్నుపోటు పొడిచే నయా గాలి జనార్దనరెడ్డి లాంటివారు. మహేశ్వరరెడ్డి వ్యాఖ్యల వెనుక పెద్ద కుట్ర ఉంది. నేను కాంగ్రెస్‌లోనే పుట్టా.. కాంగ్రెస్‌లోనే పోతా...

దిగజారుడు పార్టీ బీజేపీ..

ఈ దేశంలో పార్టీ చేరికల కమిటీ పెట్టిన దిగజారుడు పార్టీ బీజేపీ. చేరికల కమిటీకి చైర్మన్‌ను కూడా నియమించారు. అయినా ఒక్క కార్పొరేటర్ కూడా ఆ పార్టీలో చేరలేదు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి డబ్బు పంపుతున్నారని ఇష్టమొచ్చినట్టు ఆరోపణలు చేస్తున్నారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల సీఎంలు మోదీకి, నడ్డాకు డబ్బు పంపుతున్నారా? దేశాన్ని అదానీ, అంబానీలకు దోచిపెట్టిన బీజేపీ ఇతరులను విమర్శించడం సిగ్గుచేటు. నిజానికి ఒక్క ఓటు రెండు రాష్ట్రాలంటూ ప్రజలను మోసం చేసిన పార్టీ బీజేపీ. ఆ పార్టీకి తెలంగాణ ఏర్పాటు ఏమాత్రం ఇష్టం లేదు. సోనియాగాంధీ పార్టీకి నష్టం కలుగుతుందని తెలిసినా తెలంగాణ ఇచ్చారు.''అని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

టచ్ చేసి చూడండి.. ఏం జరుగుతుందో!



- బీజేపీ నోట బీఆర్ఎస్ పాట.. మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్
- మాది ప్రజలెన్నుకున్న ప్రభుత్వం.. ఎవరూ ఏమీ చేయలేరు
- బీసీలకు టికెట్లు అంటూ కేటీఆర్ మాట్లాడటం విడ్డూరం
- బీఆర్ఎస్‌కు బీసీని అధ్యక్షుడిని చేయాలని వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందని మొన్నటివరకు బీఆర్ఎస్ పాట పాడిందని.. ఇప్పుడు బీజేపీ నేతల నోట అదే పాట వినిపిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. తలచుకుంటే 48 గంటల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొడతామన్న బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యలను తప్పుపట్టారు. 'కాంగ్రెస్‌ను టచ్ చేసి చూడండి.. ఏం జరుగుతుందో' అని హెచ్చరించారు. తమది ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వమని, తమను ఎవరూ ఏమీ చేయలేరని పేర్కొన్నారు. పొన్నం శనివారం గాంధీభవన్‌లో టీపీసీసీ నేతలు నిజాముద్దీన్, కోట్ల శ్రీనివాస్ తదితరులతో కలసి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని చెప్పడానికి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఏమైనా జ్యోతిష్యం చదువుకున్నారా అని ప్రశ్నించారు.

బీఆర్ఎస్‌కు బీసీని అధ్యక్షుడ్ని చేయండి

లోక్‌సభ ఎన్నికల్లో బీసీలకు టికెట్ల కేటాయింపుపై మంత్రి కేటీఆర్ మాట్లాడటం విడ్డూరమని పొన్నం విమర్శించారు. బీఆర్ఎస్ ఏర్పాటైన 23 ఏళ్లలో ఒక్క బీసీ నేత అయినా ఆ పార్టీకి అధ్యక్షుడయ్యారా అని ప్రశ్నించారు. కేసీఆర్ సీఎం అయ్యాక అయినా, లేక ఎన్నికల్లో ఓడిపోయాక అయినా బీసీలకు అధ్యక్ష పదవి ఇవ్వాల్సిందని పేర్కొన్నారు. పార్టీ అధ్యక్షుడు, కార్యనిర్వాహక అధ్యక్షుడు, శాసనసభాపక్ష నేత, ప్రతిపక్ష నేత, మండలిలో ప్రతిపక్ష నేత.. ఇలా ఏ పదవిని కూడా బీసీలకు ఇవ్వకుండా.. బీసీలను ఉద్ధరిస్తున్నట్టు మాట్లాడటం ఏమిటని నిలదీశారు. తమ ప్రభుత్వం కులగణన తీర్మానాన్ని అసెంబ్లీలో ఆమోదింపజేసి, రూ.150 కోట్లు నిధులు ఇచ్చిందని, 17 కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసిందని చెప్పారు. కాంగ్రెస్‌తోనే బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీలో బీసీలకు అన్యాయం జరిగితే పార్టీలో అంతర్గతంగా అడుగుతామని, బీఆర్ఎస్‌లో అలా అడిగే స్వేచ్ఛ కొంచెమైనా లేదని విమర్శించారు.

బీసీని అధ్యక్ష పదవి నుంచి తీసేసి..

బలహీనవర్గాల నాయకుడిని పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తీసేసిన బీజేపీ.. బీసీ నేతను సీఎం చేస్తామని చెప్పడం ఏమిటని పొన్నం నిలదీశారు. అవినీతి చేసినందుకే బండి సంజయ్‌ను తీసేశామని కిషన్‌రెడ్డి వర్గం చెప్తుంటే.. కిషన్‌రెడ్డిని కేసీఆర్ నియమించుకున్నారని బండి సంజయ్ వర్గం అంటోందని వ్యాఖ్యానించారు. కాగా.. మంత్రులు టచ్‌లో ఉన్నారని బీజేపీ నేతలు అంటున్నారని మీడియా ప్రస్తావించగా.. తనను అలాంటి చర్యకు పాల్పడాలని అడిగే ధైర్యం ఎవరికీ లేదని, కలలో కూడా బీజేపీ ఊసెత్తనంటూ మంత్రి పొన్నం మీసం మెలితిప్పారు.

'దానం'పై వేటు వేయకుంటే కోర్టుకు వెళతాం

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని అసెంబ్లీ స్పీకర్‌కు పిటిషన్ ఇచ్చి 12 రోజులు కావస్తున్నా స్పందన లేదని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. దానం అనర్హత పిటిషన్‌పై స్పీకర్ చర్య తీసుకోని పక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, బండారి లక్ష్మారెడ్డితో కలిసి శనివారం తెలంగాణ భవన్‌లో కౌశిక్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. అనర్హత వేటుకు సంబంధించి అదనపు అఫిడవిట్ సమర్పించేందుకు శనివారం సభాపతిని కలిసేందుకు వెళ్లినా అసెంబ్లీలో ఎవరూ అందుబాటులో లేరన్నారు. కార్యదర్శి కూడా అందుబాటులో లేకపోవడంపై ఆయనపై ఒత్తిళ్లు ఉన్నాయనే అభిప్రాయం కలుగుతోందన్నారు. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం అభ్యర్థిగా దానంను కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ప్రకటించినా స్పీకర్ నిర్ణయం తీసుకోవడం లేదన్నారు. దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తే దేశమంతా హర్షిస్తుందని కౌశిక్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లినా కనీసం తమ వినతిపత్రం కూడా తీసుకోకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఒక పార్టీలో గెలిచి మరో పార్టీలోకి వెళ్లడం సిగ్గుచేటని, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పార్టీ మారడం నమ్మించి గొంతు కోయడమే అని పేర్కొన్నారు.

పార్టీకి నష్టం చేసిన వారిని వదిలిపెట్టం

- వడ్డీతో సహా బదులు తీర్చుకుంటాం: ఎమ్మెల్యే హరీశ్‌రావు
- ఆరు నెలలు ఓపిక పట్టండి, భవిష్యత్ మనదే
- వంద రోజుల పాలనలో కాంగ్రెస్ ఒరగబెట్టిందేమీ లేదు
- బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ముఖ్యనేతల సమావేశం



బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ముఖ్య నేతల సమావేశంలో ప్రసంగిస్తున్న హరీశ్‌రావు

గజ్వేల్: పార్టీకి నష్టం చేసిన వారిని వదిలిపెట్టేదిలేదని, అన్ని లెక్కలు రాసి పెడుతున్నామని వడ్డీతో సహా బదులు తీర్చుకుంటామని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు హెచ్చరించారు. శనివారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు నెలలు ఓపిక పట్టండి.. భవిష్యత్ మనదే అంటూ నాయకులకు భరోసా ఇచ్చారు. భూకబ్జాలకు పాల్పడిన వారు మాత్రమే ప్రస్తుతం పార్టీ మారుతున్నారని దుయ్యబట్టారు. వంద రోజుల పాలనలో కాంగ్రెస్ ప్రజలకు ఒరగబెట్టిందేమీలేదని ఆరోపించారు. ప్రభుత్వ విధానాల వల్ల ఆర్టీసీ, పౌరసరఫరాల కార్పొరేషన్లు దివాళా తీయడం ఖాయమన్నారు. పింఛన్ రూ.4వేలకు పెంపు, రైతు బంధు రూ.15వేలకు పెంపు, వ్యవసాయకూలీలకు రూ.12వేలు ఏమయ్యాయని ప్రశ్నించారు. గజ్వేల్ నియోజకవర్గానికి బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.150 కోట్ల పనులను రద్దు చేశారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చాక పెద్దగా చేసిందేమీ లేకుండా ఎంపీ ఎన్నికల్లో ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. దుబ్బాకలో మోసం చేస్తే బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావును బండకేసి కొట్టారని చెప్పారు. గజ్వేల్‌పై కేసీఆర్‌కు ఉన్న ప్రేమ రఘునందన్‌కు ఎలా ఉంటుందో మీరే ఆలోచించుకోవాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేసిన రఘునందన్‌పై గ్రామస్థాయిలో చర్చ పెట్టాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 2న గజ్వేల్‌లో నియోజకవర్గస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలుపుపై కార్యాచరణ రూపొందించుకుందామని చెప్పారు. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏడున్నరేళ్లు జాయింట్ కలెక్టర్‌గా, కలెక్టర్‌గా పనిచేసే అవకాశం కల్పించిన మాజీ సీఎం కేసీఆర్, హరీశ్‌రావును ఎప్పటికీ మరిచిపోనని చెప్పారు. రూ.100 కోట్లతో స్థాపించాలనుకుంటున్న పీవీఆర్ ట్రస్టు ద్వారా కార్యకర్తల పిల్లలకు విస్తృతంగా విద్యావకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ పదవులు అనుభవించిన వారే పార్టీలు మారుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి కేకే విందు

- కేకే ఆహ్వానం మేరకు ఆయన నివాసానికి వెళ్లిన సీఎం, కాంగ్రెస్ నేతలు
- కాంగ్రెస్‌లో కేకే ఎప్పుడు చేరే అంశంపై చర్చ
- నేడు ఢిల్లీ వెళ్లనున్న రేవంత్, భట్టి, ఉత్తమ్



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇతర కాంగ్రెస్ నేతలకు బీఆర్ఎస్ సెక్రెటరీ జనరల్, రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు తన ఇంట్లో విందు ఇచ్చారు. కేకే బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్న నేపథ్యంలో ఈ కార్యక్ర మం ఏర్పాటు చేశారు. కేకే శుక్రవారమే సీఎం నివాసానికి వెళ్లి.. తన ఇంట్లో డిన్నర్‌కు రావాల్సిందిగా ఆహ్వానించారు. పలువురు మంత్రులు, నేతలను కూడా రావాలని కోరారు. ఈ మేరకు శనివారం సాయంత్రం సీఎం రేవంత్, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు రేణుకా చౌదరి, అనిల్‌యాదవ్, సీనియర్ నేత కె.జానారెడ్డి, ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, వివేక్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులు హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కేకే నివాసానికి వెళ్లారు. శనివారం ఉదయమే కాంగ్రెస్‌లో చేరిన హైదరాబాద్ మేయర్, కేకే కుమార్తె గద్వాల విజయలక్ష్మి వారికి స్వాగతం పలికారు. కేకే ఆతిథ్యాన్ని స్వీకరించాక రేవంత్ వెళ్లిపోయారు. ఈ సందర్భంగా కేకే ఎప్పుడు కాంగ్రెస్‌లో చేరుతారు, ఎవరి సమక్షంలో చేరుతారన్న దానిపై నేతలు చర్చించారు. అయితే కేకే ఆదివారం ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ పెద్దల సమక్షంలో పార్టీలో చేరనున్నట్టు ప్రచారం జరుగుతోంది.

కడియం శ్రీహరి, కావ్య నేడు చేరే చాన్స్!

బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కుమార్తె కావ్య కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడు చేరుతారన్న దానిపై స్పష్టత రాలేదు. శనివారం తన అనుచరులతో సమావేశమైన కడియం.. అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటానని మాత్రమే చెప్పారు. మరోవైపు లోక్‌సభ అభ్యర్థిత్వాల ఖరారు కోసం కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) ఆదివారం ఢిల్లీలో సమావేశం కానుంది. తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న నాలుగు స్థానాలకు అభ్యర్థులను ఈ భేటీలో ఖరారు చేయనున్నట్టు సమాచారం. కడియం కుమార్తె కావ్య వరంగల్‌లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో ఉంటారన్న చర్చ నేపథ్యంలో.. శ్రీహరి, ఆయన కుమార్తె కావ్య ఆదివారమే కాంగ్రెస్ కండువా కప్పుకొనే అవకాశం ఉందని గాంధీభవన్ వర్గాలు చెప్తున్నాయి. కాగా సీఈసీ సమావేశంలో పాల్గొనేందుకు సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ ఆదివారం ఢిల్లీ వెళ్లనున్నారు.

కాంగ్రెస్‌లో విజయలక్ష్మి చేరిక

బంజారాహిల్స్ (హైదరాబాద్): కేకే కుమార్తె, గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం జూబ్లీహిల్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి క్యాంపు ఆఫీసులో జరిగిన కార్యక్రమంలో.. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, సీఎం రేవంత్‌ల సమక్షంలో ఆమె పార్టీ కండువా కప్పుకొన్నారు.

వాళ్లను రాళ్లతో కొట్టినా పాపం లేదు

చంద్రబాబు డైరెక్షన్‌లోనే రేవంత్ పాలన: ఎర్రోళ్ల శ్రీనివాస్




సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్‌లో రాజకీయ అవకాశాలు పొంది, పదవులు అనుభవించి పార్టీలు మారుతున్న నేతలను రాళ్లతో కొట్టినా తప్పులేదని బీఆర్ఎస్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీనియర్ రాజకీయ నాయకులు కొందరు రాజకీయ విలువలు లేని పవర్ బ్రోకర్లలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నేతలతో కలిసి శనివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. 'కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల్లో అవకాశాలు లేక రాజకీయంగా వెంటిలేటర్‌పై ఉన్న నేతలకు కేసీఆర్ పదవులతో సంజీవని ఇచ్చి బతికించారు. ఎంతో మంది నేతలున్నా కడియం శ్రీహరికి కేసీఆర్ వరుస అవకాశాలు కల్పించారు. కడియం కారణంగానే తాటికొండ రాజయ్య, అరూరి రమేశ్, పసునూరి దయాకర్ పార్టీకి దూరమయ్యారు. ఉద్యమంలో మేము త్యాగాలు చేస్తే కడియం లాంటి వాళ్లు భోగం అనుభవించారు. బీఆర్ఎస్ ద్వారా సంక్రమించిన పదవులకు పార్టీ నుంచి బయటకు వెళ్లే వారు రాజీనామా చేయాలని, లేని పక్షంలో గతంలో రేవంత్‌రెడ్డి చెప్పినట్లు వారి ఇళ్ల ముందు చావు డప్పు కొట్టి, రాళ్లతో కొట్టాలి. కడియం లాంటి నేతల పట్ల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కూడా అప్రమత్తంగా ఉండకపోతే మా తరహాలోనే నష్టపోతారు. కేసీఆర్‌ను తప్పు పట్టే అర్హత కడియం శ్రీహరి కుమార్తె కావ్యకు లేదు. చంద్రబాబు డైరెక్షన్‌లోనే కొందరు నేతలు కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టాలని ప్రయత్నం చేస్తున్నారు. కేకే, కడియంకు బీఆర్ఎస్ పార్టీ ఏం తక్కువ చేసిందో చెప్పాలి'అని ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తనకు అవకాశం ఇస్తే వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు.

మెడికల్ కాలేజీల్లో పోస్టుల భర్తీ షురూ

- ప్రభుత్వానికి ఈసీ అనుమతి
- కాంట్రాక్ట్ పద్ధతిలో 5,819 ఖాళీల భర్తీ

సాక్షి, హైదరాబాద్: మెడికల్ కాలేజీల్లో పోస్టుల భర్తీకి ఎన్నికల కమిషన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా 34 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని 5,819 పోస్టులను భర్తీ చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఈసీ అనుమతినిచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, స్టాఫ్ నర్సులు ఇతర పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేస్తారు. వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తూ ఆదేశాలివ్వగా, అన్ని మెడికల్ కాలేజీల్లో వెంటనే భర్తీ ప్రక్రియ మొదలుపెట్టాలని డీఎంఈ డాక్టర్ వాణి ప్రిన్సిపాల్స్, సూపరింటెండెంట్లకు శనివారం సర్క్యులర్ జారీ చేశారు. నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనల ప్రకారం భర్తీ చేపట్టాలని, జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలోనే నియామకాలు జరగాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

గతేడాది మార్చిలో..



ప్రస్తుతం



నీళ్లు.. రాళ్లు.. మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండల కేంద్రం శివారులోని ఆకేరు వాగులో రాళ్లు తేలాయి. వాగుకింద చిన్నగూడూరు, పగిడిపల్లి, ఉగ్గంపల్లి, విస్సంపల్లి, జయ్యారం, మన్నెగూడెం గ్రామంలోని రైతులకు చెందిన వదలాది ఎకరాలు నీరు లేక ఎండిపోతున్నాయి. గత ఏడాది మార్చిలో మత్తడి పోసిన వాగు నేడు రాళ్లు, గుండ్లు తేలి పూర్తిగా ఎండిపోయి ఎడారిని తలపిస్తోంది. - చిన్నగూడూరు

కాలేజీలకు నేటి నుంచి సెలవులు

- జూన్ 1 నుంచి జూనియర్ కళాశాలల పున:ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 2024-25 విద్యాసంవత్సరానికి జూనియర్ కళాశాలలు జూన్ ఒకటో తేదీ నుంచి పునఃప్రారంభం అవుతాయని తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి తెలిపింది. ప్రభుత్వ, ప్రభుత్వ రంగంలోని జూనియర్ కళాశాలలతో పాటు ఎయిడెడ్, ప్రైవేటు కళాశాలలకు సంబంధించిన పనిదినాలు, సెలవులు, పరీక్షలకు సంబంధించిన తాత్కాలిక వార్షిక విద్యా కేలండర్‌ను విద్యామండలి కార్యదర్శి శృతి ఓజా విడుదల చేశారు. ఈ విద్యా సంవత్సరంలో 2024 జూన్ నుంచి 2025 మార్చి వరకు 302 రోజుల్లో 227 పనిదినాలు ఉంటాయని, 75 రోజులు సెలవులని పేర్కొన్నారు. 48వ బోర్డు సమావేశం ప్రకారం 220 రోజుల పాటు జూనియర్ కళాశాలలు పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ క్యాలెండర్‌ను అన్ని జూనియర్ కళాశాలల (జనరల్, వొకేషనల్ కోర్సులు) ప్రిన్సిపాల్స్ అనుసరించాలని సూచించారు. కాగా 2023-24 విద్యా సంవత్సరం క్యాలెండర్ ప్రకారం మార్చి 31 (ఆదివారం) నుంచి మే 31 వరకు వేసవి సెలవులుగా పేర్కొన్నారు. అన్ని ప్రైవేటు అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకొని వేసవి సెలవుల్లో భాగంగా జూనియర్ కళాశాలలను మూసివేయాలని స్పష్టం చేశారు. ఆదివారాలు, పబ్లిక్ హాలిడేస్‌ను కూడా సెలవు దినాలుగా పరిగణించాలని, ఈ విషయంలో ఎలాంటి అతిక్రమణలనైనా ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందని పేర్కొన్నారు. కళాశాలల అడ్మిషన్ షెడ్యూల్ వెలువడిన తరువాతే కొత్తగా విద్యార్థులను కళాశాలల్లో చేర్చుకోవాలని స్పష్టం చేశారు.

ఇంటర్మీడియట్ బోర్డు వార్షిక క్యాలెండర్ - 2024-25

జూనియర్ కళాశాలల పునః ప్రారంభం	: 01-06- 2024
దసరా సెలవులు	: 06-10-2024 - 13-10-2024
దసరా సెలవుల తరువాత పున:ప్రారంభం	: 14 అక్టోబర్ 2024
హాఫ్ ఇయర్లీ పరీక్షలు	: 18-11-2024 - 23-11-2024
సంక్రాంతి సెలవులు	: 11-01-2025 - 16-01-2025
సంక్రాంతి సెలవుల తరువాత పునఃప్రారంభం	: 17 జనవరి 2025
ప్రీ ఫైనల్ ఎగ్జామ్స్	: 20-01-2025- 25-01-2025
ప్రాక్టికల్ ఎగ్జామ్స్ ఐపీఈ -2025	: ఫిబ్రవరి మొదటి వారం, 2025
థియరీ ఎగ్జామ్స్ ఐపీఈ-2025	: మార్చి మొదటి వారం, 2025
విద్యా సంవత్సరం చివరి వర్కింగ్ డే	: 29 మార్చి, 2025
వేసవి సెలవులు	: 30-03-2025- 01-06-2025
అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు 2024-25	: మే చివరి వారం, 2025
కళాశాలల పునఃప్రారంభం (2025-26)	: 02 జూన్ 2025

కరెంట్ కోతలుండొద్దు

▶ మొదటి పేజీ తరువాయి

సీఎం భావించినా, ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో కేవలం సూచనలు జారీ చేశారని సీఎంఓ కార్యాలయ వర్గాలు తెలిపాయి. వేసవి అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేసే కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని ముఖ్యమంత్రి కోరారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా, పంటలు ఎండిపోకుండా, పరీక్షలకు ప్రిపేరయ్యే విద్యార్థులకు ఇబ్బంది తలెత్తకుండా చూడాలని చెప్పారు. గత ఏడాది కంటే రాష్ట్రంలో ఈ ఏడాది అత్యధికంగా విద్యుత్ సరఫరా చేయటం కొత్త రికార్డును నమోదు చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. మార్చిలో డిమాండ్ గణనీయంగా పెరిగిందని, పీక్ డిమాండ్ ఉన్నా, కోత లేకుండా విద్యుత్‌ను అందించటంలో డిస్కంలు సమర్థవంతమైన పాత్ర పోషించాయని ప్రశంసించారు. ఆ శాఖ మంత్రి భట్టి విక్రమార్కని అభినందించారు.

తాగునీటి సరఫరాకు యాక్షన్‌ప్లాన్

అన్ని ప్రాంతాల్లో ప్రజలకు తాగునీటి కొరత లేకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఏప్రిల్, మే, జూన్ వరకు స్థానికంగా ఉన్న నీటి వనరులను ఉపయోగించుకోవాలని సూచించారు. బోర్‌వెల్స్, బావులను తాగునీటి అవసరాలకు వాడుకోవాలని, సమీపంలో ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడకుండా జిల్లా కలెక్టర్లు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు. సమస్య ఉన్న చోట తక్షణ పరిష్కారాలను పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో ఒక సీనియర్ అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించాలని ఆదేశించారు. గ్రామాలవారీగా డ్రింకింగ్ వాటర్ యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలని చెప్పారు. అవసరాన్ని బట్టి రాష్ట్రస్థాయి నుంచి సంబంధిత శాఖల ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలలో తాగునీటి కొరత అధిగమించేందుకు వాటర్‌ట్యాంకులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ట్యాంకర్లు బుక్ చేస్తే ఆలస్యం లేకుండా 12 గంటల్లోపు అవసరమైన చోటకు చేరేలా చూడాలని, అందుకు సరిపడా ట్యాంకర్లు సమకూర్చుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు.

భారీగా పెరిగిన విద్యుత్ డిమాండ్..

గత ఏడాదితో పోలిస్తే డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా గణనీయంగా పెరిగింది. రాష్ట్రంలో సగటున 9,712 మెగావాట్ల విద్యుత్ లోడ్ ఉంటుంది. గత రెండు వారాలుగా 14,000 మెగావాట్ల నుంచి 15,000 మెగావాట్ల పీక్ డిమాండ్ ఉంటోంది. ఏప్రిల్ నెల రెండోవారం వరకు ఇంచుమించుగా ఇదే స్థాయిలో డిమాండ్ ఉంటుందని విద్యుత్ అధికారులు అంచనా వేశారు.

- గత ఏడాది జనవరి నుంచి మార్చి వరకు సగటున రోజుకు 239.19 మిలియన్ యూనిట్ల(ఎంయూ) విద్యుత్ వినియోగం ఉంటే.. 2024 జనవరి నుంచి మార్చి మధ్యకాలంలో సగటున రోజుకు 251.59 ఎంయూల విద్యుత్ వినియోగం ఉంది.
- గత ఏడాది మార్చి 14న అత్యధికంగా 297.89 ఎంయూల విద్యుత్ వినియోగం ఉండగా, ఈ ఏడాది 308.54 ఎంయూల వినియోగం జరిగి కొత్త రికార్డును సృష్టించింది.
- గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనూ గత ఏడాదితో పోలిస్తే విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది.

ఆ మీడియాలకు కేటీఆర్ లీగల్ నోటీసులు

- దుష్ప్రచారం చేస్తున్న టీవీ, సోషల్ మీడియాతో సహా 10 సంస్థలకు తాఖీదులు
- గతంలోనే కొన్ని సంస్థలకు లీగల్ నోటీసులు పంపిన కేటీఆర్
- దుష్ప్రచారాన్ని చట్టబద్ధంగా ఎదుర్కొంటామని ప్రకటన



సాక్షి, హైదరాబాద్: కుట్రతో తనపైన, తన కుటుంబంపైన అసత్య ప్రచారాలను, కట్టు కథలను ప్రచారం చేస్తున్న కొన్ని టీవీ చానళ్లతో పాటు యూట్యూబ్ సంస్థలు, సోషల్ మీడియా సంస్థలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు శనివరం లీగల్ నోటీసులు పంపించారు. పక్కా ప్రణాళికతో తనకు, తన కుటుంబానికి నష్టం కలిగించాలనే దురుద్దేశంతోనే ఈ చానళ్లు, మీడియా సంస్థలు దుష్ప్రచారం సాగిస్తున్నాయని ఆయన తాను పంపిన లీగల్ నోటీసుల్లో పేర్కొన్నారు. మీడియా ముసుగులో పక్కా ఎజెండాతో సాగిస్తున్న కుట్రలో భాగంగా తమకు సంబంధం లేని అనేక అంశాల్లో తమ పేర్లను, ఫొటోలను వాడుకుంటూ అత్యంత హీనమైన థంబ్ నెయిల్స్ పెడుతూ పబ్బం గడుపుకొంటున్నారని, ఈ చానళ్లపై తగిన చర్యలు తీసుకోవాలనుకుంటున్నట్లు కేటీఆర్ తెలిపారు.

వెంటనే ఆ వీడియోలను తొలగించండి

తమకు, తమ కుటుంబానికి సంబంధంలేని అంశాలలో దుర్మార్గపూరిత ప్రచారం చేస్తూ పెట్టిన వీడియోలను వెంటనే తొలగించాలని వారికి పంపిన లీగల్ నోటీసుల్లో పేర్కొన్నారు. కేవలం కొందరు వ్యక్తులు నడిపే యూట్యూబ్ చానళ్లతో పాటు కొన్ని మీడియా సంస్థలు కూడా పక్కా ప్రణాళిక ప్రకారం కక్షపూరితంగా వ్యవహరిస్తున్నాయని ఆయన ఆరోపించారు. కొన్ని మీడియా సంస్థలు, యూట్యూబ్ చానల్స్ ఇప్పటికే జరిగిన తమ తప్పును సరిదిద్దుకొని, అలాంటి వీడియోలను, కంటెంట్‌ను తీసివేసినట్లు చెప్పాయని కేటీఆర్ తెలిపారు. వారం రోజుల్లోగా మిగిలిన మీడియా చానళ్లు, యూట్యూబ్ చానల్స్ ఇలాంటి కంటెంట్ ని తీసివేయకుంటే మరిన్ని న్యాయపరమైన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

యూట్యూబ్‌కి సైతం నోటీసులు

కేవలం ఆయా సంస్థలకే కాకుండా నేరుగా యూట్యూబ్‌కి సైతం లీగల్ నోటీసులు పంపించామని కేటీఆర్ తెలిపారు. తమ పట్ల కుట్రపూరితంగా వ్యవహరిస్తూ అడ్డగోలుగా ప్రచారం చేస్తున్న సంస్థలు భవిష్యత్తులోనూ మరిన్ని లీగల్ నోటీసులకు, కేసులకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు.

కేటీఆర్‌పై క్రిమినల్ కేసు

బంజారాహిల్స్: బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బిల్డర్లు, కాంట్రాక్టర్ల నుంచి రూ. 2,500 కోట్లు వసూలు చేసి ఢిల్లీకి పంపారంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత బత్తిన శ్రీనివాసరావు హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హనుమకొండ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు పంపగా, బంజారాహిల్స్ పోలీసులు కేటీఆర్‌పై ఐపీసీ సెక్షన్ 504, 505(2) కింద కేసు నమోదు చేశారు. కేటీఆర్ నిరాధారమైన ఆరోపణలు చేసి కాంగ్రెస్ పార్టీపై బురదజల్లే ప్రయత్నం చేశారని, దీంతో కాంగ్రెస్ కార్యకర్తల మనోభావాలు దెబ్బతినడమే కాకుండా సీఎం ప్రతిష్ఠ కూడా దిబ్బతినేలా ఉందన్నారు. అలాగే తెలంగాణ ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళ్తున్నాయని, ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. రేవంత్ పార్లమెంట్ ఎన్నికల తరువాత బీజేపీలో చేరతారని దుష్ప్రచారం చేశారన్నారు.

ఏప్రిల్ 1న ఐచ్ఛిక సెలవు

సాక్షి, హైదరాబాద్: షహదత్ హజ్రత్ అలీ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఏప్రిల్ 1న ఐచ్ఛిక సెలవును రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మార్చి 31న ఐచ్ఛిక సెలవుగా ప్రకటిస్తూ గతంలో జారీ చేసిన ఉత్తర్వులను ఈ మేరకు సవరిస్తూ రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి ఎం.రఘునందన్ రావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.



క్షయమైన ఆహారముకొరకు కష్టపడకుడి గాని నిత్యజీవము కలుగ జేయు అక్షయమైన ఆహారముకొరకే కష్టపడుడి ; మనుష్య కుమారుడు దానిని మీకిచ్చును, ఇందుకై తండ్రియైన దేవుడు ఆయనకు ముద్రవేసియున్నాడు.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, **తిథి:** బ.షష్ఠి సా.5.23 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** జ్యేష్ఠ రా.7.14 వరకు, తదుపరి మూల, **వర్జ్యం:** తె.3.13 నుండి 4.43 వరకు (తెల్లవారితే సోమవారం), **దుర్ముహూర్తం:** సా.4.34 నుండి 5.22 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.11 నుండి 11.46 వరకు

సూర్యోదయం : 6.01
సూర్యాస్తమయం : 6.08
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

కంగనా రనౌత్ (బాలీవుడ్ స్టార్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

రాణిలా బతకటం అంటే ఏమిటి? రాణిలా బతకటం మాత్రం కాదు!

అరిచేతుల్లో, గుండెలమీదా పెరిగే ఆడపిల్లలకు, అంతఃపుర రాణులకు అన్నీ ఉంటాయి. నేలపై పాదం మోపే స్వేచ్ఛే ఉండదు. పాదం మోపే స్వేచ్ఛ ఉన్నప్పుడే కదా అడుగు ముందుకు పడటానికీ, అడుగు వెనక్కు తీసుకోవటానికీ ఉంటుంది.

ఒకటి తెలుసా? అడుగు వెనక్కు తీసుకోవటానికి ఉండే స్వేచ్ఛే ఆడపిల్లను నిజంగా రాణిని చేస్తుంది. ఆమె వేసే వెనకడుగే కొత్త జీవితానికి ఆమె తొలి అడుగు అంటాన్నేను.

మెడిసిన్ చదవాలనుకున్నాం. సైన్స్ స్ట్రీమ్‌లో చేరిపోయాం. కాలేజ్‌లో ఒకట్రెండు క్లాస్‌లకు అటెండ్ కూడా అయ్యాం. ఇంటికి వచ్చాక, అద్దంలో చూసుకున్నప్పుడు మనది మెడిసిన్ చదివే ముఖంలా అనిపించలేదు. మరింత బ్రైట్ గా ఉంది! 'క్వీన్' ముఖంలా, 'సిమ్రాన్' ముఖంలా, 'మణికర్ణిక' ముఖంలా, ఇందిరాగాంధీ ముఖంలా... అమాయకత్వంతో, ఆత్మవిశ్వాసంతో, ప్రతీకారేచ్ఛతో, రాజనీతిజ్ఞతతో వెలిగిపోతూ ఉంది. అప్పుడు



వెనకడుగు వేసే స్వేచ్ఛ లేకపోతే.. ల్యాబ్‌లో చచ్చిన కప్పకు, మనకు ఏం తేడా ఉంటుంది?

మెడిసిన్ బయటికి నా వెనకడుగే... యాక్టింగ్‌లోకి నా ముందడుగు. క్వీన్, సిమ్రాన్, మణికర్ణిక... ఇంకా ఇందిరాగాంధీ పాత్రలు నేను నటించినవి కావు. వారే ఒక్కొక్కరుగా వచ్చి నా పాత్రలో నటించినవి.

ఈ మాత్రం కాన్ఫిడెన్స్ ఉండాలి అమ్మాయిలూ మనకు! మీరు ఏ రంగంలోనైనా ఉండండి... అక్కడి రణరంగంలో మీ ఆయుధం... సెల్ఫ్ కాన్ఫిడెన్స్.

రాజకీయాలు... ఇప్పుడు నేనున్న రంగం. మోదీజీ తర్వాత ఎప్పటికైనా నేను నా దేశానికి ప్రధానమంత్రిని అవుతానన్నది... నాకున్న సెల్ఫ్ కాన్ఫిడెన్స్.

రాజకీయాల్లో కాన్ఫిడెంట్‌గా ఉండాలి. అక్కడ మనల్ని ఒకరు ఒక మాట అన్నప్పటి కంటే... మనం ఒకర్ని ఒక మాట అన్నప్పుడే మనం గట్టిగా నిలబడాలి.

కానీ సుప్రియా శ్రీనేత్ నిలబడలేక పోయారు! సుప్రియ కాంగ్రెస్ లీడర్. అందంగా ఉంటారు. పొగరుగా ఉంటారు. మాటకు మాట అన్నట్లుంటారు. మాటంటే మాటే అన్నట్లుంటారు. బీజేపీ నాకు 'మండీ' లోక్‌సభ టికెట్ ఇవ్వగానే ఆమె... "మండీలో ఇప్పుడు రేటెంత పలుకుతోంది?" అని ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు!

ఆ మాటలోని అర్థం మగాళ్లకు తెలుస్తుంది. సుప్రియ నన్ను ఉద్దేశించే ఆ మాట అన్నారని నాకూ తెలుసు. అందుకు నేనేమీ వ్యథ చెందలేదు. సుప్రియను ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్, ఢిల్లీ పోలీస్ కమిషనర్, ఎలక్షన్ కమిషన్... అంతా చుట్టుముట్టినప్పుడు... ఆమె తన మాటపై తను నిలబడకుండా... 'ఆ కామెంట్‌ను పోస్ట్ చేసింది నేను కాదు...' అని ఆమె ఆ పోస్టును తొలగించటం కూడా నాకు ఆశ్చర్యాన్ని కలిగించలేదు.

కానీ... పోస్ట్ పెట్టినందుకు క్రమశిక్షణ చర్యగా కాంగ్రెస్ పార్టీ మహరాజ్‌గంజ్ లోక్‌సభ టికెట్‌ను తన నుంచి వాపస్ తీసుకుని, వీరేంద్ర చౌదరికి ఇచ్చినప్పుడు సుప్రియ మౌనంగా ఉండిపోవటం నన్ను తీవ్రమైన అసంతృప్తికి గురి చేసింది. సుప్రియ నాకేం కారు. తనకైనా తనేం కారా!!

ఏం?! మహరాజ్‌గంజ్‌లో ఇంకో మహరాణి లేరా? మగ మహారాజుకే టిక్కెట్ ఇవ్వాలా? ఆ మాట సుప్రియ ఎందుకు తన పార్టీని అడగలేకపోయారు?!

వెనకడుగు వెయ్యటం, మాటను వెనక్కు తీసుకోవటం తల దించుకోవలసిన పనులేమీ కావు. అందుకు శిక్షగా... సమాజం కానీ, పార్టీ అధిష్ఠానం గానీ అపరాధ రుసుమును విధించినప్పుడు నిశ్శబ్దంగా వెళ్లి, కౌంటర్ ముందు నిలబడి రుసుమును చెల్లించి రసీదును తెచ్చుకోవటమే మనల్ని మనం తగ్గించుకునే విషయం.

ఆడవాళ్లు ఎలా ఉండాలి! ఎలాగైనా ఉండొచ్చు. రాణుల్లా, రప్పల్లా మాత్రం కాదు.

పెత్తందారుకు టిప్పర్ సవాల్!



జనతంత్రం

వర్ధెల్లి మురళి



మన సమాజం వర్గాలుగా విభజితమై ఉన్నమాట ఒక వాస్తవం. కులాలుగా విడిపోయి ఉన్న మాట కూడా నిజం. ఈ కుల–వర్గ వేర్పాటులో కొందరిది ఆధిపత్య స్థానం, మెజారిటీ ప్రజలది అణచివేతకు గురయ్యే స్థానం. అవమానాలను మోసే స్థానం. ఈ విభజన సత్యాన్ని గుర్తించే సాహసం మన రాజకీయ నాయకులు చస్తే చేయరు. ఆ సత్యం మీద మసిపూసి మాయం చేస్తారు. అందరి క్షేమం తమ ధ్యేయమంటారు. సకల జనుల శ్రేయోరాజ్యం తమ ఆశయమంటారు. సర్వేజనాః సుఖినో భవన్తని ఆశీర్వదిస్తారు. అభివృద్ధి–సంక్షేమం తమకు రెండు కళ్లంటారు. 'పేదల కోసం సంక్షేమం, పెద్దలతోనే అభివృద్ధి' అనే చిత్ర రచన చేస్తారు. పేదలకు తిండి దొరకని పరిస్థితిని ఈ సంక్షేమం అరికట్టగలిగింది. లేబర్ మార్కెట్ నిక్షేపంగా నిలబడేందుకు ఈ సంక్షేమాన్ని మన పాలకులు వెదజల్లుతారు.

ఐదు రూపాయలకే భోజనం పెట్టేంత అపురూపమైన ఔదార్యాన్ని కూడా మన పాలకులు కనబరుస్తుంటారు. అది బాల్యవివాహమైనా సరే ఓ పాతిక వేలు సర్కారీ కట్నం చదివించి మంచి మనసును చాటుకుంటుంటారు. బాల్యవివాహం వల్ల పిల్ల చదువు ఆగిపోయినా లెక్క చేయరు. హిందూ, ముస్లిం, క్రైస్తవులకు ఒక్కో పండుగ చొప్పున ఓ సంచెడు ఉప్పూ, పప్పూ, చెక్కెర వగైరాలతో స్వయం పాకాన్ని అందజేస్తారు. పండు ముదుసళ్లను పదిసార్లు తిప్పించుకున్నప్పటికీ ఓ వేయి రూపాయలను పెన్షన్‌గా అందజేసేంత విశాల హృదయం మన సంక్షేమ పాలకుల్లో ఉన్నది. కానీ, పేదలు సాధికారత సంతరించుకునే అవకాశాలు వీరి కార్యక్రమంలో ఉండవు. ఈ తరహా రెండు కళ్ల సిద్ధాంత 'సంక్షేమ' పాలకుల్లో మన చంద్రబాబు నాయుడు కూడా ఉంటారు.

ఈ రెండు కళ్ల సిద్ధాంతంలో అభివృద్ధి – సంక్షేమం అనేవి రెండు సమాంతర రేఖలు మాత్రమే! ఒకదాన్నొకటి తాకదు. సంక్షేమం కోటాలోని జనం అభివృద్ధి కేటగిరీలోకి చేరిపోవడమనేది ఒక అరుదైన సన్నివేశం. లేబర్ మార్కెట్‌లోని ప్రజలు సంపన్న శ్రేణిలోకి చేరాలంటే వారికి నాణ్యమైన ఉచిత విద్య మొదటి షరతు. ఇక్కడే మన సంక్షేమ పాలకుల వర్గదృక్పథం బట్టబయలయ్యేది. నాణ్యమైన ఉచిత విద్యకు మన పాలకులు ససేమిరా అంగీకరించరు. విద్య అనేది ప్రభుత్వ బాధ్యత కాదని ముఖ్యమంత్రి హోదాలోనే చంద్రబాబు పలుమార్లు చెప్పిన విషయం గుర్తు చేసుకోవాలి. విద్యారంగాన్ని వ్యాపారస్తుల రేస్‌కోర్స్‌గా మార్చిన ఘనుల్లో నిస్సందేహంగా చంద్రబాబు అగ్రగణ్యుడు. విద్యాబేహారులకు ప్రభుత్వ పాలనలో పెద్ద పీట వేసినవాడు చంద్రబాబు. పేదపిల్లలకు ఇంగ్లిష్ మీడియం విద్య అందకుండా ఎన్ని విధాలుగా అడ్డుపుల్లలు వేయడానికి ప్రయత్నించాడో మనం చూశాము.

నాణ్యమైన విద్యకు బదులుగా నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తెస్తామని చంద్రబాబు ఎన్నికల సభల్లో చెప్పుకొస్తున్నారు. పైగా దాన్ని తక్కువ ధరలకే అందజేస్తారట. ఇంకో రెండు రోజులు పోతే డోర్ డెలివరీ కూడా చేస్తామంటారేమో! మద్యం ఆరోగ్యానికి హానికరమైనదని వైద్యులందరూ చెబుతారు. నాణ్యమైన మద్యమైతే నెమ్మదిగా చస్తారు. నాసిరకం మద్యమైతే వెంటనే చస్తారని ఆయన భావం కావచ్చు. ఈ చంపేయడంలో నాణ్యతా ప్రమాణాలు దేనికి? ప్రజలను సాధికారం చేసే విద్యలోనూ, ఆరోగ్య సమాజాన్ని నిర్మించే వైద్యంలోనూ నాణ్యతా ప్రమాణాలు నెలకొల్పడం ప్రభుత్వం పనికాదనీ, అది ప్రైవేట్ వ్యాపారుల క్రీడాస్థలమనేది చంద్రబాబు సిద్ధాంతం. అందువల్లనే ఆయన పద్నాలుగేళ్ల ముఖ్యమంత్రిత్వ కాలంలో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులు శిథిలమై పోయాయి. ఈ రెండు వ్యవస్థల్లోనూ కార్పొరేట్ రంగం రంకె లేసింది. ఐదేళ్ల జగన్ పరిపాలన అందుకు పూర్తి విరుద్ధం. ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిష్ మాధ్యమాన్ని ప్రవేశ పెట్టడమే కాదు, అంతర్జాతీయ స్థాయి బోధనా పద్ధతులు ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో పేద విద్యార్థులందరికీ అందుబాటులోకి వచ్చాయి.

ప్రభుత్వాస్పత్రులు ఇప్పుడు బ్రహ్మాండంగా పని చేస్తున్నాయి. ఒక్క వైద్య ఆరోగ్య రంగంలోనే 58 వేల ఉద్యోగ ఖాళీలను 58 మాసాల కాలంలో భర్తీ చేయగలిగారు. అంటే నెలకు వేయి ఖాళీల చొప్పున భర్తీ. ప్రభుత్వం ఎంత ఉద్యమ

ఉచిత విద్య మొదటి షరతు. ఇక్కడే మన సంక్షేమ పాలకుల వర్గదృక్పథం బట్టబయలయ్యేది. నాణ్యమైన ఉచిత విద్యకు మన పాలకులు ససేమిరా అంగీకరించరు. విద్య అనేది ప్రభుత్వ బాధ్యత కాదని ముఖ్య మంత్రి హోదాలోనే చంద్రబాబు పలుమార్లు చెప్పిన విషయం గుర్తు చేసుకోవాలి. విద్యారంగాన్ని వ్యాపారస్తుల రేస్ కోర్స్‌గా మార్చిన ఘనుల్లో నిస్సందేహంగా చంద్రబాబు అగ్రగణ్యుడు. విద్యాబేహారులకు ప్రభుత్వ పాలనలో పెద్ద పీట వేసినవాడు చంద్రబాబు. పేదపిల్లలకు ఇంగ్లిష్ మీడియం విద్య అందకుండా ఎన్ని విధాలుగా అడ్డు పుల్లలు వేయడానికి ప్రయత్నించాడో మనం చూశాము. నాణ్యమైన విద్యకు బదులుగా నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తెస్తామని చంద్రబాబు ఎన్నికల సభల్లో చెప్పుకొస్తున్నారు. పైగా దాన్ని తక్కువ ధరలకే అందజేస్తారట. ఇంకో రెండు రోజులు పోతే డోర్ డెలివరీ కూడా చేస్తామంటారేమో! మద్యం ఆరోగ్యానికి హానికరమైనదని వైద్యులందరూ చెబుతారు. నాణ్యమైన మద్యమైతే నెమ్మదిగా చస్తారు. నాసిరకం మద్యమైతే వెంటనే చస్తారని ఆయన భావం కావచ్చు. ఈ చంపేయడంలో నాణ్యతా ప్రమాణాలు దేనికి?

స్ఫూర్తిని ప్రదర్శిస్తే ఇది సాధ్యమవుతుంది? వేల కోట్ల రూపాయలు వెచ్చించి ప్రభుత్వాస్పత్రులను ఆధునికం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో పీరియాడికల్‌గా ప్రభుత్వ వైద్యుడు పర్యటిస్తాడు. రోగగ్రస్తులందరి రికార్డు ఆయన దగ్గరుంటుంది. క్రమం తప్పకుండా ఆయనే వాళ్లను పరీక్షించి మందులిస్తాడు. ఆ రకంగా ప్రతి పేదరోగికీ ఒక ఫ్యామిలీ డాక్టర్‌ను అందుబాటులోకి తెచ్చిన ఉత్తమ విధానానికి ఈ ఐదేళ్లలోనే శ్రీకారం చుట్టారు.

అన్నం ఉడికిందో లేదో చెప్పడానికి ఒక్క మెతుకు చాలంటారు. విద్య, వైద్య రంగాల్లో ఏ పాలకుని వైఖరి ఏమిటో తెలిస్తే ఆ పాలకుని వర్గ స్వభావమేమిటో చెప్పవచ్చు. చంద్రబాబు పుట్టుకరీత్యా పేదవాడే కావచ్చు. కానీ ఎత్తుజిత్తులతో పెత్తందారీ శ్రేణిలో చేరిన ఆయన ఆ వర్గ ప్రయోజనాల రక్షణ కోసం ఒక ఉగ్రవాదిగా మారిపోయాడు. ఇందుకు పూర్తి భిన్నంగా సంపన్న కుటుంబంలో పుట్టిన జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఎజెండాను భుజానికెత్తుకున్నాడు. పేదవర్గాలు–మహిళల సాధికారతను తన పార్టీ సిద్ధాంతంగా ప్రకటించుకున్నాడు. సమాజంలోని రెండు వైరివర్గాల గురించి ప్రస్తావించడమే కాకుండా ఈ రెండు వర్గాల మధ్యన యుద్ధం జరుగుతున్నదనీ, ఈ యుద్ధంలో తాను పేద వర్గాల తరఫున అర్జునుడి పాత్ర పోషిస్తాననీ కూడా ఆయన ప్రకటించారు.

ప్రజాస్వామ్య వ్యవస్థ పరిధిలో క్లాస్ వార్ (వర్గ పోరాటం) గురించి మాట్లాడిన మొట్టమొదటి నాయకుడు చరిత్రలో జగన్ మోహన్ రెడ్డి ఒక్కడే. కమ్యూనిస్టులు చెప్పే క్లాస్ వార్ వేరు. వర్గపోరు గురించి మాటలు చెప్పే కమ్యూనిస్టులు ఆచరణలో వర్గదృక్పథాన్ని కోల్పోయి ఉనికిని పోగొట్టుకున్న సంగతి మనకు తెలిసిందే. కమ్యూనిస్టులుగా ప్రకటించుకునే వారిలో కొంత మంది పెత్తందారీవర్గ ప్రవక్త చంద్రబాబు చుట్టూ చేరి చిడతలు వాయించే స్థితికి దిగజారిపోవడం కూడా చూస్తూనే ఉన్నాం. ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్య వ్యవస్థ పరిధిలోనే పేదల విముక్తి కోసం క్లాస్ వార్‌కు పిలుపునిచ్చి భారత రాజకీయాల్లో కొత్త ఒరవడిని జగన్‌మోహన్‌రెడ్డి సృష్టించారు. ఈ క్లాస్ వార్ మరోసారి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభంజనాన్ని సృష్టించబోతున్నది. క్షేత్రస్థాయి ప్రజా స్పందనల అంచనా ప్రకారం 2019 ఎన్నికల ఫలితాలే పునరావృతం కాబోతున్నాయి.

తాను పెత్తందారీ వర్గ ప్రయోజనాల కిరాయి మనిషిననే విషయాన్ని చంద్రబాబు తన చేతల్లోనే కాదు మాటల్లో కూడా పదేపదే వ్యక్తం చేస్తూనే ఉన్నాడు. అందులో భాగమే మొన్నటి టిప్పర్ ఎపిసోడ్. అనంతపురం జిల్లా సింగనమల నియోజక వర్గం నుంచి వీరాంజనేయులు అనే టిప్పర్ డ్రైవర్‌కు వైసీపీ టిక్కెట్ ఇచ్చింది. ఆయన విద్యాధికుడైనప్పటికీ బ్రతుకుతెరువు కోసం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పార్టీ కార్యకర్తగా కూడా పని చేస్తున్న అతని సేవలను గుర్తించి జగన్‌మోహన్‌రెడ్డి అతడిని అభ్యర్థిగా ఎంపిక చేశారు. పెత్తందారీ మనస్తత్వం నరనరాన జీర్ణించుకున్న చంద్రబాబు ఈ ఎంపికను అవహేళన చేస్తున్నారు. సింగనమలలో జరిగిన టీడీపీ సభలో మాట్లాడుతూ టిప్పర్ డ్రైవర్ అనే మాటను పదేపదే వెటకారంగా ఒత్తి పలికారు. ఇటువంటి నిశానీగాళ్లకు ఓటేస్తే ఎక్కడ పెట్టమంటే అక్కడ సంతకం పెడతారని ఎద్దేవా చేశారు. అంటే పేదవాళ్లు అజ్ఞానులనీ, వాళ్లు రాజకీయాలకు అనర్హులనే అర్థంలో మాట్లాడారు.

ఈవిధంగా మాట్లాడటం చంద్రబాబుకు కొత్తేమీ కాదు. 'ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా?' అని మీడియా సమావేశంలోనే ఆయన తన మనస్తత్వాన్ని బయట పెట్టుకున్నారు. నాయీ బ్రాహ్మణ (బీసీ వర్గం) ప్రతినిధులను మీడియా సమక్షంలోనే 'మీ తోకలు కత్తిరిస్తాన'ని బెదిరించారు. బీసీలకు జడ్జీ పదవులు ఇవ్వొద్దని, వారందుకు తగరని సాక్షాత్తూ కేంద్ర ప్రభుత్వానికే ఆయన స్వయంగా లేఖ రాశారు. 'కోడలు మగపిల్లాడిని కంటానంటే అత్త వద్దంటుందా?' అని మహిళా విద్వేషాన్ని బహిరంగంగా వెళ్లగక్కారు. నాయకుడి నుంచి ఈ స్ఫూర్తిని తీసుకొని పేదవర్గాలపై ఆయన అనుచరగణం చేసిన దాష్టీకం అంతా ఇంతా కాదు.

ఎన్నికల యుద్ధంలో తలపడకుండా పేద వర్గాలను, సంఘసేవకులను దూరం చేసిన భాగ్యశాలి కూడా చంద్రబాబే. ఎన్టీఆర్ మరణానంతరం ప్రజాదరణ పెద్దగా లేని తాను నెగ్గుకురావడం కోసం ఉపఎన్నికల సందర్భంగా కనీవినీ ఎరుగని రీతిలో ఖర్చుపెట్టి సంచలనం సృష్టించారు. అప్పటినుంచీ అదే మార్గాన్ని అనుసరిస్తున్నారు. ఎన్నిక ఏదైనా సరే పెద్ద ఎత్తున

అనంతపురం జిల్లా సింగనమల నియోజక వర్గం నుంచి వీరాంజనేయులు అనే టిప్పర్ డ్రైవర్‌కు వైసీపీ టిక్కెట్ ఇచ్చింది. ఆయన విద్యాధికుడైనప్పటికీ బ్రతుకు తెరువు కోసం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పార్టీ కార్యకర్తగా కూడా పనిచేస్తున్న అతని సేవలను గుర్తించి జగన్‌మోహన్‌రెడ్డి అతడిని అభ్యర్థిగా ఎంపిక చేశారు. పెత్తందారీ మనస్తత్వం నరనరాన జీర్ణించుకున్న చంద్రబాబు ఈ ఎంపికను అవహేళన చేస్తున్నారు. సింగనమలలో జరిగిన టీడీపీ సభలో మాట్లాడుతూ టిప్పర్ డ్రైవర్ అనే మాటను పదేపదే వెటకారంగా ఒత్తి పలికారు. ఇటువంటి నిశానీగాళ్లకు ఓటేస్తే ఎక్కడ పెట్టమంటే అక్కడ సంతకం పెడతారని ఎద్దేవా చేశారు. అంటే పేదవాళ్లు అజ్ఞానులనీ, వాళ్లు రాజకీయాలకు అనర్హులనే అర్థంలో మాట్లాడారు.

ఈవిధంగా మాట్లాడటం చంద్రబాబుకు కొత్తేమీ కాదు. 'ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా?' అని మీడియా సమావేశంలోనే ఆయన తన మనస్తత్వాన్ని బయటపెట్టుకున్నారు. నాయీ బ్రాహ్మణ (బీసీ వర్గం) ప్రతినిధులను మీడియా సమక్షంలోనే 'మీ తోకలు కత్తిరిస్తాన'ని బెదిరించారు. బీసీలకు జడ్జీ పదవులు ఇవ్వొద్దని, వారందుకు తగరని సాక్షాత్తూ కేంద్ర ప్రభుత్వానికే ఆయన స్వయంగా లేఖ రాశారు. 'కోడలు మగపిల్లాడిని కంటానంటే అత్త వద్దంటుందా?' అని మహిళా విద్వేషాన్ని బహిరంగంగా వెళ్లగక్కారు. నాయకుడి నుంచి ఈ స్ఫూర్తిని తీసుకొని పేద వర్గాలపై ఆయన అనుచరగణం చేసిన దాష్టీకం అంతా ఇంతా కాదు.

డబ్బు ఖర్చు చేయగలవారినే నిలబెట్టడం మొదలుపెట్టారు. ఆయన్ను చూసి మిగిలిన పార్టీల వాళ్లు కూడా అంతో ఇంతో అనుసరించక తప్పలేదు. పెట్టుబడి – రాజకీయాల మధ్యన ఉండే పరోక్ష బంధం నాటినుంచి ప్రత్యక్షంగా మారిపోయింది. వందల కోట్లు వెదజల్లి ఎన్నికల్లో గెలిచిపోవడమనే అప్రజాస్వామిక ధోరణికి గేట్లు తెరిచినవాడు చంద్రబాబు. ఈ అక్రమార్జనపరులైన కోటీశ్వరులపై సామాన్యులు విజయభేరి మోగించినప్పుడే మళ్లీ మన సిసలైన ప్రజాస్వామ్యం మన చేతికొస్తుంది.

టిప్పర్ డ్రైవర్‌గా చంద్రబాబు అవహేళన చేసిన వీరాంజనేయులు సింగనమలలో విజయఢంకా మోగిస్తేనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. మడకశిరలో ఉపాధి హామీ కూలీ లక్కప్ప భారీ మెజారిటీతో నెగ్గితే ప్రజాస్వామ్యం పది కాలాల పాటు వికసిస్తుంది. చదువుల సరస్వతీదేవిని అంగడి సరుకుగా మార్చి లక్షలాది సామాన్యుల రక్తం తాగి తెగబలిసి వేలకోట్లు ఆర్జించిన నారాయణ నెల్లూరు నుంచి అసెంబ్లీకి పోటీ చేస్తున్నాడు. వందల కోట్లు వెదజల్లి గెలవాలని చూస్తున్నాడు. అతడితో తలపడుతున్న సామాన్యుడు స్వర్ణకార వృత్తి చేసుకునే ముస్లిం మైనారిటీకి చెందిన ఖలీల్ అహ్మద్ గెలిస్తేనే ప్రజాస్వామ్యం గెలిచినట్టు! అనకాపల్లి లోక్‌సభ సీటుకు సీఎం రమేశ్ పోటీ చేస్తున్నాడు. ఈయన మనిషి బీజేపీలో ఉంటాడు. ఆత్మ తెలుగుదేశంలో ఉంటుంది. స్నేహం కాంగ్రెస్‌తో ఉంటుంది. కాంట్రాక్టుల పేరుతో భారీ ఎత్తున అక్రమార్జన చేశాడని ప్రతీతి. చంద్రబాబుకు బినామీగా కూడా చెబుతారు. ఇప్పుడు ఎంపీగా గెలవడం కోసం ప్రతి అసెంబ్లీ సెగ్మెంటుకూ వందకోట్ల చొప్పున ఖర్చు చేస్తాడట! డబ్బు విసిరితే గెలుస్తామనే ధీమా. ప్రజల వివేకం మీద చిన్నచూపు. ఇతని మీద పోటీ చేస్తున్న బూడి ముత్యాల నాయుడు రాష్ట్ర మంత్రి. పేరుకు మంత్రే కానీ, ఆర్థికంగా సామాన్యుడు. ఇప్పుడిక్కడ బీసీ వెలమ వర్సెస్ ఓసీ వెలమ, లోకల్ వర్సెస్ నాన్ లోకల్, సామాన్యుడు వర్సెస్ సంపన్నుడి మధ్యన పోటీ జరగబోతున్నది. సామాన్యుడు గెలిస్తేనే ధనస్వామ్యం తోక ముడుస్తుంది. ప్రజాస్వామ్య పతాకం రెపరెపలాడుతుంది.

vardhelli1959@gmail.com

ఇన్ బాక్స్

అరుదైన సాహిత్యకారుడు

కేవీ రమణారెడ్డి రచయితగా, కవిగా, విప్లవ రచయితల సంఘం వ్యవస్థాపక సభ్యులుగా తెలుగు సాహిత్యానికి సుపరిచితమే. సాహిత్యం ప్రజల మౌలిక సమస్యలకు పరిష్కారమని నమ్మి జీవితపు కొసవరకు సాహిత్య, ప్రజా ఉద్యమాలలో పని చేశారు. అనేకసార్లు జైలు జీవితం గడిపారు. కేవీఆర్ జీవిత కాలంలో అనేక పుస్తకాలను రచించారు. కొన్నిటిని అనువాదం చేశారు. నెల్లూరు జిల్లా రేబాల గ్రామంలో జన్మించిన కేవీఆర్ కావలి జవహర్ భారతి కాలేజీలో పాఠాలు చెప్పారు. తోటి ఉపాధ్యాయులను, విద్యార్థులను రచయితలుగా తీర్చిదిద్దారు. నిరంతరం రాయడం ద్వారా ఒక కాలపు ఉత్థాన పతనాలను సాహిత్యంలోకి తీసుకువచ్చారు.

అభ్యుదయ, ప్రగతిశీల భావాల వ్యాప్తికి సాహిత్యకారునిగా మార్క్సిజం వెలుగులో పనిచేశారు. విస్తారమైన సాహిత్య సృజన ఆయన ఆచరణలో భాగం. కేవీఆర్ మరణించి పదిహేనేళ్ల కాలం గడిచింది. అనేక కొత్త పోకడలు మధ్య మానవ సృజనాత్మకత పూర్వపక్షమవుతోంది. కొత్త తరం పాఠకుల అభిరుచులు మారుతున్నాయి. ప్రజలందరి కోసం జీవించాలనే ఆలోచనలకు కాలం చెల్లింది. భారతీయ సమాజపు వ్యక్తీకరణలోనే మానవీయ సంబంధాలకు తావులేని స్థితి! ఈ దేశ పరిస్థితులు ఇలా కావడానికి అన్వేషణ మొదలైంది. మొదటి తరం బుద్ధిజీవులు, సాహిత్యకారులు చేసిన సాహిత్య సృజన ఇవాళ్టి సమాజానికి ఒక అవసరంగా ముందుకు వచ్చింది కేవీఆర్ స్మారక కమిటీ.

ఈ స్మారక కమిటీ 2011లో ఏర్పడింది. ప్రతి ఏడాది కేవీఆర్ పుట్టినరోజున స్మారకోపన్యాసం, ఆయన రచనలు ప్రచురిస్తోంది. అందులో భాగంగా నేడు విజయవాడలో కవి, చరిత్రకారుడు కొప్పర్తి వెంకటరమణమూర్తితో 'చరిత్రతో సంభాషణ – వర్తమానం' అనే అంశంపై ప్రసంగాన్ని ఏర్పాటు చేసింది. అలాగే కేవీఆర్ రచనలు 'లూసన్ జీవితం – సాహిత్యం', 'అడవులు మండుతున్నాయి' ఆవిష్కరణ అవుతాయి. చరిత్రను సాహిత్యం ద్వారా రికార్డు చేసిన కేవీఆర్‌ను జ్ఞాపకం చేసుకోవడం వర్తమాన కాలపు ఆకాంక్షగా వుండాలి.

– అరసవిల్లి కృష్ణ (విరసం)
(నేడు విజయవాడలో కేవీఆర్ స్మారకోపన్యాస సభ)

ఆ పొత్తు భవిష్యత్తుకు విపత్తు

అభిప్రాయం



సంగిరెడ్డి హనుమంత రెడ్డి

ఎన్నికల్లో ఒంటరిగా నెగ్గే రాజకీయ పార్టీ ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకోదు. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ–టీడీపీ–జనసేనల పొత్తును ఈ నేపథ్యంలో అర్థం చేసుకోవాలి. దక్షిణ భారతంలో ప్రవేశానికి పాటుబడుతున్న బీజేపీకి ఇది దక్షిణ. ప్రజల ప్రయోజనానికే ఈ పొత్తు అని బాబు ప్రకటన బూటకమే. చిలకలూరిపేట వద్ద బొప్పూడిలో మార్చి 17న జరిపిన కూటమి ప్రజాగళం సభలో ప్రధాని ఆనకట్టలు, ప్రత్యేక హోదా, పరిశ్రమలు, రాజధాని నిర్మాణం, విశాఖ ఉక్కు అమ్మకం వంటి ప్రజల సమస్యల మాట ఎత్తలేదు. 'కూటమిని గెలిపించండి. వైసీపీ– కాంగ్రెస్‌లు ఒక్కటే. వాటిని ఓడించండి' అన్న పలుకులే వినిపించాయి. కల్యాణ్, బాబులు మోదీని దైవీకరించారు.



ఆటకు ముందే ఓటమిని వల్లించిన ఉత్తర కిరీటి పవన్. సైన్యమే లేని జనసేన భవిష్యత్తు ప్రశ్నార్థకం. టీడీపీ ఇప్పుడు రెండవ తరం వృద్ధ నాయకత్వంలో ఉంది. మూడవ తరం యువ నాయకునికి సముద్ర తీరం తెలియదు. ఉత్తర భారతంలో (వైదిక సమీకరణతో) 2024 గెలుపు ఖాయమనీ, తమ ప్రయత్నాలు 2029కేననీ, అందుకు దక్షిణంలో ప్రవేశానికి తమతో పొత్తు పెట్టుకున్న ప్రాంతీయ పార్టీల భుజాలపై స్వారీ చేసి 2029కి వాటి స్థానాన్ని ఆక్రమించాలనీ, 2034 ఎన్నికల నాటికి వాటిని లేకుండా చేయాలనీ మోదీ యోచన.

బీజేపీతో పొత్తుపెట్టుకున్న ప్రాంతీయ పార్టీలన్నీ బలహీనపడ్డాయి. మూతబడ్డాయి. వాటి స్థానాన్ని బీజేపీ ఆక్రమించింది. ప్రాంతీయ మతతత్వ శిరోమణి అకాలీదళ్ బీజేపీ పొత్తుతో పతనమయింది. బీజేపీ కేరళలో క్రైస్తవులను దువ్వుతోంది. ముస్లిమ్‌లను బెదిరిస్తోంది. ప్రముఖ కాంగ్రెస్ నాయకుల సంతానాన్ని (ఎ.కె. ఆంటోని కొడుకు, కె.కరుణాకరన్ కూతురు) తన వైపు తిప్పుకుంటోంది. సంప్రదింపుల శక్తి లేని లోకేశులు ఇందుకు అతీతులా? అసోంలో 2016 రాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ అస్సాం గణ పరిషత్ (ఏజీపీ), బోడోల్యాండ్ పీపుల్స్ ఫ్రంట్ (బీపీఎఫ్)లతో జతకట్టింది. తర్వాతి బోడోల్యాండ్ ట్రైబల్ కౌన్సిల్ ఎన్నికల్లో బీపీఎఫ్‌ను చెత్తలో వేసి ప్రమోద్ బోరో నాయకత్వంలోని యునైటెడ్ పీపుల్స్ పార్టీ లిబరల్ (యూపీపీ–ఎల్)తో కలిసింది. బాగా బలహీనపడిన బీపీఎఫ్ 2022 లో మరలా బీజేపీతో జత కట్టింది. నేటి టీడీపీ లాగా! ఏజీపీ నీడ కూడా కనిపించడం లేదు. బిహార్‌లో నితీశ్ కుమార్‌ను బలహీనపర్చడానికి రాం విలాస్ పాశ్వాన్ కొడుకు చిరాగ్ పాశ్వాన్‌ను వాడుకుంది. 2024 నాటికి నితీశ్ జేడీయూ ఉనికిలో ఉండవచ్చు. 2029 నాటికి మాయమవక తప్పదు. హరియాణాలో దుష్యంత్ చౌతాలా జేజేపీ కథ ముగిసినట్లే.

మహారాష్ట్రలో ఏకత్వ భావజాల చిరకాల మిత్రపక్షం శివసేనను బీజేపీ ముక్కలు చేసింది. శరద్ పవార్ ఎన్సీపీ నుండి అజిత్ పవార్‌ను వేరుచేసింది. బీజేపీ లేనిదే అజిత్ ఎన్సీపీకి మనుగడ, భవిష్యత్తు లేవు. మన రాష్ట్రంలో కొడిగట్టిన దీపం, బలహీన టీడీపీతో పొత్తుకు ఈ ప్రాతిపదికలే కారణం. 2029 నాటికి మూడో తరం టీడీపీ నాయకత్వం పూర్తిగా బలహీనమవుతుంది. దానిని అప్పుడు సులభంగా భవిష్యత్తు బీజేపీలో కలుపుకోవచ్చు.

ప్రస్తుత ఎన్నికల్లో బీజేపీ అమలుచేసిన పౌరసత్వ సవరణ చట్టంతో మొత్తం ముస్లిమ్‌లు వైఎస్సార్‌సీపీ వైపునకు రావచ్చు. కూటమిలో సీట్ల కేటాయింపుపై విభేదాలు భగ్గుమన్నాయి. సీట్ల కేటాయింపులో వైఎస్సార్‌సీపీ సామాజిక న్యాయాన్ని ప్రజాబాహుళ్యం గమనించింది. సంక్షేమాలు తగు పాత్ర పోషిస్తాయి.

వ్యాసకర్త ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి | 94902 04545

నమ్మినవాడు బతుకుతాడు

మనిషి మస్తిష్కంలోని నైరాశ్యాన్ని తొలగిస్తూ ఆశను పెంచుతోన్న ఒక ఉత్సాహమే ఈస్టర్. చీకటిపై విజయం సాధించే వెలుగు వైభవం ఈస్టర్. పాపానికి సంకేతం మరణం. దానిపై మహా భేరీ మ్రోయించి, సాధించిన విజయమే, ఈస్టర్.

క్రీస్తు మరణం, మామూలు మరణం కానే కాదు. ఒక హత్యోదంతం. ఒక విషాదం! ఆ మరణం నుంచి తిరిగి లేచిన సంఘటనే పునరుత్థానం. అదే ఈస్టర్. ఈ మరణం, ఈ పునరుత్థానం వల్ల మనకు అందే సందేశం ఏమిటీ?

మానవుని జీవితం చీకటి వెలుగుల సమ్మేళనం అనీ, ప్రతీ వైభవం వెనుక ఒక విషాదం దాగి ఉంటుందనీ, సౌఖ్యానికి కష్టమూ, సంతోషానికి దుఃఖమూ ప్రాతిపదికలనీ, చచ్చిపోయిందిలే ఆ విత్తనం అని నిరుత్సాహపడగూడదు, అందులోంచే పొడుచుకొంటూ చివురులు పైకి లేస్తాయనేది గ్రహించాలి. మనం ఒక్కోసారి తెలిసో తెలియకో తప్పు చేస్తాం. అందులోంచి మేల్కొని, బాగా కోల్కొని మళ్ళీ మామూలై పోవాలి. ఇదే ప్రతి మనిషికీ ఎదురయ్యే ప్రయోగాత్మక పునరుత్థానం.

అన్యాయమైన తీర్పునకు బలై, బరువైన శిలువ ఎత్తుకొని రాళ్ళల్లో, కొండ ఎక్కలేక ఎక్కుతూ ఉన్న ప్రభువును కొట్టుకొంటూ తీసుకుపోయి అదే శిలువపై కట్టి, మేకులతో కొట్టి చంపేశారు. మరణించిన క్రీస్తు శరీరాన్ని శిలువ నుంచి దించి, సమాధిలో ఉంచారు. మూడో రోజు ఆయన్ను చూద్దామని మగ్దలేనా మరియ వెళ్ళి చూసేసరికి ఆయన అక్కడ లేడు, దూతలు కాపలా కాస్తున్నారు. ఆయన ఎక్కడ? అని ఆ వెళ్ళిన మగ్దలేనా అడిగింది. కనబడీ కనబడక ఉషోదయాన ప్రభువు మాట్లాడాడు. ఎక్కడలేని ఉత్సాహంతో పోయి, ఆమె, ఆ విషయాన్ని అందరికీ చెప్పింది. క్రీస్తు శిలువ దగ్గర గుండె పగిలేట్టు ఏడ్చి, మొట్టమొదట ఆ పునరుత్థాన క్రీస్తును చూచిన మహిళగా మగ్దలేనా కనిపిస్తోంది. తన పునరుత్థానంతో క్రీస్తు ఈ లోకానికి 'పునరుత్థానం నేనే, జీవమూ నేనే, నన్ను నమ్మేవాడు చనిపోయినప్పటికీ బ్రతుకుతా'డని (యోహా 11:25), అనంత సందేశాన్ని అందిస్తున్నాడు.

– డా॥ దేవదాసు బెర్నార్డ్ రాజు
(నేడు ఈస్టర్ పర్వదినం)

క్లుప్తంగా...

జమ్మూకశ్మీర్ స్టార్ క్యాంపెయినర్‌గా రేవంత్‌రెడ్డి

- 27 మందితో ఏఐసీసీ జాబితా



సాక్షి, న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి స్టార్ క్యాంపెయినర్ల జాబితాను ఏఐసీసీ శనివారం విడుదల చేసింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీతో సహా 27 మందిని జాబితాలో చేర్చింది. ఇందులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖులకు సైతం చోటు కల్పించింది. జమ్మూకశ్మీర్‌లో ఐదు దశల్లో ఏప్రిల్ 19న ఉదంపూర్, ఏప్రిల్ 26న జమ్మూ, మే 7న అనంతనాగ్–రాజౌరీ, మే 13న శ్రీనగర్, మే 20న బారాముల్లాలో ఎన్నికలు జరగనున్నాయి.

'చాయ్ పే చర్చ' ఎన్నికల సూత్రాలకు విరుద్ధం

- ఎన్నికల ప్రధానాధికారికి కాంగ్రెస్ నేత నిరంజన్ ఫిర్యాదు



సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌తో 'చాయ్ పే చర్చ'నిర్వహించడం ఎన్నికల సూత్రాలకు విరుద్ధమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్ ఆరోపించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినందుకు మోదీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కేంద్ర ఎన్నికల సంఘానికి ఆయన ఫిర్యాదు చేశారు. 'చాయ్ పే చర్చ' పేరుతో మోదీ కొత్త ప్రచార సరళికి శ్రీకారం చుట్టారని, ఈ కార్యక్రమం మీడియాలో ప్రసారమైనందున ఓటర్లు ప్రభావితమయ్యే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించినందుకు మోదీపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

చెంగిచెర్ల ఘటనలో 'బండి'పై కేసులు ఎత్తేయాలి

- డీజీపీకి బీజేపీ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: చెంగిచెర్ల ఘటనలో తమ పార్టీ నేత, ఎంపీ బండి సంజయ్, ఇతర కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తేయాలని డీజీపీ రవి గుప్తాకు బీజేపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కేసు విషయంలో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ తమ పార్టీ వారిని వేధింపులకు గురిచేస్తున్నారని డీజీపీ దృష్టికి తీసుకొచ్చారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ, ఈ దాడి వెనుక ఉన్న కుట్రను వెలుగులోకి తీసుకువచ్చే విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ పేరిట దాడులకు పాల్పడిన వారిని, బాధితులను సమానసంఖ్యలో అరెస్టు చేసి బ్యాలెన్స్ చేసే ప్రయత్నం చేస్తున్నారని డీజీపీకి వెల్లడించారు. పోలీసులు అర్ధరాత్రి, అపరాత్రి అనే తేడా లేకుండా బీజేపీ కార్యకర్తల ఇళ్ల తలుపులు తడుతూ విచారణ పేరిట వేధిస్తున్నారన్నారు. ఈ మేరకు శనివారం డీజీపీ కార్యాలయంలో ఆయనకు మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, బీజేపీ లీగల్‌సెల్ విభాగం నాయకులు గోకుల రామారావు, జనార్దన్‌గౌడ్, ఆర్వీ పవన్ మైత్రేయ, నరేశ్ వినతిపత్రం అందించారు.

బీజేపీ నేత రఘునందన్‌పై చర్యలు తీసుకోండి

- ఎన్నికల సంఘానికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ లేఖ



సాక్షి, హైదరాబాద్: తమ పార్టీకి చెందిన నాయకులను అసభ్య పదజాలంతో దుర్భాషలాడిన బీజేపీ మెదక్ లోక్‌సభ అభ్యర్థి ఎం.రఘునందన్‌రావుపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. మాజీ మంత్రి హరీశ్‌రావు, మెదక్ లోక్‌సభ అభ్యర్థి పి.వెంకట్రామ్‌రెడ్డిపై ఆయన ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడమేనని పేర్కొంది. ఈ మేరకు సంగారెడ్డి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ శనివారం కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇటీవల సంగారెడ్డిలో రఘునందన్‌రావు నిర్వహించిన మీడియా సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఇద్దరు నేతలను ఉద్దేశించి దుర్భాషలాడటంతో పాటు దమ్ముంటే సంగారెడ్డి అంబేడ్కర్ చౌరస్తాకు రావాలని సవాలు చేశారన్నారు. ఈ తరహా వ్యాఖ్యలతో శాంతిభద్రతలు దెబ్బతింటాయని అన్నారు.

'మతతత్వ బీజేపీ నుంచి భారత్‌ను కాపాడాలి'

సాక్షి, హైదరాబాద్: మతతత్వ బీజేపీ నుంచి భారత్‌ను కాపాడాలని, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఏఐసీసీ అధికార ప్రతినిధి సుజాత పాల్ కోరారు. శనివారం గాంధీభవన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ అంటే భయపడుతోందని, అందుకే కాంగ్రెస్ పార్టీపై ఈడీ, ఐటీ దాడులు జరుపుతోందని ఆరోపించారు. పాత రూ.14.4 లక్షల విరాళాలకు లెక్కలు చూపించలేదని ఈడీ నోటీసు జారీ చేసిందని, రూ.1,823.8 కోట్లు ఫైన్ చెల్లించాలని ఐటీ శాఖ నోటీసు జారీ చేసిందని సుజాత మండిపడ్డారు.





సమావేశంలో అభివాదం చేస్తున్న రఘువీర్‌రెడ్డి, దీపాదాస్ మున్షీ, ఉత్తమ్, తుమ్మల, కోమటిరెడ్డి, దామోదర్‌రెడ్డి (పక్కన) సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలం

- అసెంబ్లీ తరహాలో అత్యధిక ఎంపీ స్థానాల్లో పార్టీని గెలిపించాలి
- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ
- తెలంగాణకు ఇచ్చిన ఏ హామీని బీజేపీ అమలు చేయలేదు: మంత్రి ఉత్తమ్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: దృఢ సంకల్పం కలిగిన కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలమని ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లిలో నిర్వహించిన నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సిమెంట్ లేకుండా ఇల్లు ఎలా కట్టలేమో కార్యకర్తలు లేకుండా కాంగ్రెస్ గెలుపు లేదన్నారు. నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ కార్యకర్తల వల్లే పార్టీ బలంగా ఉందని, కార్యకర్తలు చిందించిన చెమట వల్ల తెలంగాణలో కాంగ్రెస్ గెలిచిందని, ఎంపీ ఎన్నికల్లో కూడా నల్లగొండ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మెజారిటీ కోసం ఎలా పోటీ పడ్డారో, అలాగే పార్లమెంట్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. దీపాదాస్ మున్షీ ప్రసంగాన్ని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి తెలుగులోకి అనువదించారు.

కార్యకర్తలు గెలిపించాలి: మంత్రి తుమ్మల

మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి 1983 నుంచి ఈ ప్రాంతానికి ఎనలేని సేవలందించారని, అభివృద్ధికి కృషి చేశారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ముఖ్యంగా ఎస్‌ఎల్‌బీసీ, రోడ్లు, ఇతర అభివృద్ధి పనుల విషయంలో నిబద్ధతతో ముందుకుసాగి కీర్తి గడించారన్నారు ఆయన తనయుడిగా రఘువీర్‌రెడ్డిని కార్యకర్తలు అంతా కలిసి గెలిపించాలన్నారు.

రావి నారాయణరెడ్డిని మించిన మెజారిటీతో: మంత్రి కోమటిరెడ్డి

దేశంలోనే నల్లగొండ పార్లమెంట్ స్థానంలో అత్యధిక మెజారిటీ సాధించిన రావి నారాయణరెడ్డిని మించిన మెజారిటీతో రఘువీర్‌రెడ్డిని గెలిపించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తామంతా టీం వర్క్ చేస్తున్నామని, నల్లగొండ ఎంపీ అభ్యర్థి 6 లక్షల ఓట్ల మెజారిటీ టార్గెట్‌గా పెట్టుకున్నామన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు కుందూరు జానారెడ్డి, రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బాలునాయక్, జయవీర్‌రెడ్డి, బి.లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షులు శంకర్‌నాయక్, చెవిటి వెంకన్న యాదవ్ తదితరులు మాట్లాడారు.

పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ ఉండదు: మంత్రి ఉత్తమ్

పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ మనుగడ ఉండదని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గతంలో తెలంగాణకు హామీలు ఇచ్చిన బీజేపీ వాటిని అమలు చేయకుండా, ఈ ఎన్నికల్లో ఓట్లు ఎలా అడుగుతుందని ప్రశ్నించారు. బయ్యారం స్టీల్ ప్లాంట్, ఖాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐటీఐఆర్ ఇస్తానని ఇవ్వలేదని దుయ్యబట్టారు. నరేంద్రమోదీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చిన హామీల్లో భాగంగా ప్రభుత్వ ఉద్యోగాలు, ఇళ్ల నిర్మాణాలు చేపట్టకుండా మోసం చేసిందని దుయ్యబట్టారు. బీఆర్‌ఎస్ పార్టీ తెలంగాణలో నామరూపాలు లేకుండా పోవడం ఖాయమన్నారు. ఈ ప్రాంత సమస్యలపై తాను ఎంపీగా పార్లమెంట్‌లో గళమెత్తానని, తన స్థానంలో నల్లగొండ ఎంపీగా రఘువీర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఎంపీగా తాను ఐదేళ్లలో ఏడు నియోజకవర్గాల అభివృద్ధికి ఎంతో కృషి చేశానన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించానన్నారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఈ ప్రాంతానికి రైల్వేలైన్ మంజూరు చేయించానన్నారు. వేలాది ఎకరాలకు ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేసి సాగునీరు అందించామన్నారు. ఇతర పార్టీల నేతలను తాము బలవంతంగా కాంగ్రెస్‌లోకి చేర్చుకోవడం లేదని, వారే స్వచ్ఛందంగా వస్తున్నారని చెప్పారు.

ప్రైవేట్ కాలేజీలను బతకనివ్వరా?: బండి

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు డిగ్రీ, పీజీ, ఇతర వృత్తి విద్యా కాలేజీలకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించక పోవడంతో ఆయా కాలేజీ యాజమాన్యాలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని బీజేపీ ఎంపీ బండి సంజయ్ అన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దాలని సంజయ్ డిమాండ్ చేశారు. నిర్దిష్ట గడువులోగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలన్నీ చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల్లో అనుసరిస్తున్న విధానాలతో డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, వృత్తి విద్యా కళాశాలల పరిస్థితి దుర్భరంగా మారిందని శనివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను ఎన్నడూ సక్రమంగా కాలేజీలకు చెల్లించక పోవడంతో యాజమాన్యాలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారని తెలిపారు. గత మూడేళ్లుగా ఈ నిధులు చెల్లించకపోవడంతో దాదాపు రూ.7,800 కోట్ల బకాయిలు పేరుకుపోయాయని వివరించారు. ఫలితంగా సిబ్బంది జీతభత్యాలు, భవనం అద్దెలు చెల్లించలేక పలు కాలేజీలు మూతపడ్డాయన్నారు. డిగ్రీ, పీజీ కాలేజీలకు రూ.750 కోట్లు చెల్లిస్తామని టోకెన్లు ఇచ్చినా డబ్బులు ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లినా స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. ఆదివారంతో టోకెన్ల గడువు ముగుస్తున్నందున వెంటనే డబ్బులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

అధికారం కోసం మోదీ ఎంతకైనా తెగిస్తారు

ఎమ్మెల్యే కూనంనేని విమర్శ



సమావేశంలో మాట్లాడుతున్న కూనంనేని

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): ప్రధాని నరేంద్రమోదీ అధికారం కోసం ఎంతకైనా తెగిస్తారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక నిర్బంధాలు, దౌర్జన్యాలకు పాల్పడుతోందని ఆరోపించారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఎం, సీపీఐ, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, ఎంసీపీఐ తదితర వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ విధానాలు, మతోన్మాదానికి వ్యతిరేకంగా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ శ్రేణులు మతోన్మాదాన్ని రెచ్చగొట్టేందుకు కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. ఐటీ, ఈడీలాంటి సంస్థలను కేంద్రం తమ గుప్పిట్లో పెట్టుకుని ప్రతిపక్షాలపై దాడులు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎం రాష్ట్ర నాయకుడు ఎస్.వీరయ్య మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలం చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీజీ నర్సింహారావు, న్యూడెమోక్రసీ కార్యదర్శి సాదినేని వెంకటేశ్వర్‌రావు, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) కార్యదర్శి పోటు రంగారావు, ఎస్‌సీఐయూ కార్యదర్శి గాద గోని రవి, సీపీఐఎంఎల్ నేత ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గద్వాల కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు

- సంపత్‌ను బూతులు తిట్టిన జెడ్పీ మాజీచైర్మన్ భాస్కర్
- ఆయనపై దాడికి దిగిన కార్యకర్తలు



ఘర్షణ పడుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు

గద్వాల రూరల్: కాంగ్రెస్ పార్టీలో అంతర్గతంగా నెలకొన్న వర్గ విభేదాలు మంత్రి జూపల్లి సమక్షంలో రచ్చకెక్కాయి. ఏకంగా ఒకరిపై మరొకరు బూతులు తిట్టుకుంటూ దాడులు చేసుకున్న ఘటన శనివారం గద్వాలలో చోటుచేసుకుంది. గద్వాల జిల్లాకేంద్రంలో కాంగ్రెస్‌పార్టీ బూత్‌స్థాయి శిక్షణకార్యక్రమం జరిగింది. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఏఐసీసీ ఇన్‌చార్జ్ కొప్పుల రాజు, జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, మాజీ ఎంపీలు మల్లురవి, మందా జగన్నాథం, మాజీ జెడ్పీ చైర్మన్ బండారి భాస్కర్ హాజరయ్యారు. సంపత్‌కుమార్ ప్రసంగిస్తున్న క్రమంలో బండారి భాస్కర్ జోక్యం చేసుకుంటూ ఎంతసేపు మాట్లాడతాడు అంటూ బూతులు తిట్టాడు. ఇది విన్న సంపత్ వర్గీయులు ఆగ్రహానికి లోనై బండారి భాస్కర్‌పైకి దూసుకెళ్లారు. స్టేజీ మీదున్న ఆయన్ను కిందకు తీసుకొచ్చి భౌతికంగా దాడికి దిగారు. దీంతో స్టేజీపై ఉన్న మంత్రి జూపల్లి, కొప్పుల రాజు ఒక్కసారిగా అవాక్కయ్యారు. వెంటనే జూపల్లి మైక్ తీసుకొని గొప్ప మీటింగ్‌లో ఇలా ఘర్షణ పడటం సరైన పద్ధతి కాదని, అందరూ శాంతించి ఎవరి సీట్లలో వారిని కూర్చోవాలంటూ కోరారు. అయినా కార్యకర్తలు పట్టించుకోకుండా ఒకరిపై మరొకరు భౌతికదాడులకు దిగడంతో సమావేశం కాస్త రసాభాసగా మారింది.

518 ఎకరాలు.. హాంఫట్!

అసైన్డ్ భూములు పట్టాభూములుగా.. రికార్డుల్లో మార్పులు
ధరణి పోర్టల్‌లో దగా.. పట్టాదారు పాస్‌బుక్‌లు సైతం జారీ
తర్వాత ఆ భూములన్నీ బడాబాబుల చేతుల్లోకి..
వాటి విలువ సుమారు రూ.రెండున్నర వేల కోట్లపైమాటే
ప్రభుత్వ భూముల వెరిఫికేషన్‌లో వెలుగులోకి అక్రమాలు



కంది తహసీల్దార్ కార్యాలయం

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: అవి పంటలు పండించుకుని జీవనాధారం పొందేందుకు పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములు.. క్రయ విక్రయాలు, వ్యవసాయేతర పనులు చేయడానికి వీల్లేని భూములు.. కానీ ధరణి పోర్టల్‌లో రికార్డులను తారుమారు చేశారు. అసైన్డ్ భూములను పట్టా భూములుగా మార్చేశారు. దీనితో ఒకటీ, రెండూ కాదు.. ఏకంగా 518 ఎకరాల అసైన్డ్ భూములు బడాబాబుల చేతుల్లోకి వెళ్లిపో యాయి. సంగారెడ్డి జిల్లా కంది మండలంలో చోటుచేసుకున్న ఈ భూదందా.. తాజాగా ప్రభుత్వ భూముల వెరిఫికేషన్ సందర్భంగా వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉండటం, రెండు జాతీయ రహదారులు, ఐఐటీ ఉండటంతో కంది మండలంలో భూముల ధర ఎకరా రూ.ఐదు కోట్ల వరకు పలుకుతోంది. అంటే అక్రమాలు జరిగిన 518 ఎకరాల భూముల విలువ రెండున్నర వేల కోట్లకుపైనే ఉంటుందని అంచనా.

11 గ్రామాల పరిధిలో..

సంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వ భూముల వెరిఫి కేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములున్నాయి, ఎక్కడైనా అన్యా క్రాంతం అయ్యాయా? వాటి రికార్డుల పరిస్థితే మిటనే అంశాలను పరిశీలిస్తున్నారు. ఇద్దరు అదనపు కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీఓ స్థాయి అధికారులకు ఒక్కో మండలం చొప్పు న బాధ్యతను అప్పగించారు. ఈ క్రమంలోనే కంది మండలం పరిధిలోని 11 గ్రామాల్లో 518 ఎకరాల అసైన్డ్ భూములను పట్టా భూము లుగా రికార్డులను మార్చేసినట్టు తేలింది. అత్య ధికంగా బ్యాతోల్‌లో 181 ఎకరాలు, చిద్రుప్ప లో 154 ఎకరాలు, జుల్‌కల్‌లో 57 కాశీపూర్‌లో 41 ఎకరాలు, ఉత్తర్‌పల్లిలో 17 ఎకరాలు మిగ తాచోట్ల కలిపి 68 ఎకరాల అసైన్డ్ భూముల రికార్డులను మార్చేసినట్టు గుర్తించారు. ఈ మండలంలో మొత్తం 17 రెవెన్యూ గ్రామాలు ఉండగా.. మరో ఆరు గ్రామాల రికార్డులను వెరిఫికేషన్ చేయాల్సి ఉంది. వాటిలోనూ తని ఖీ పూర్తయితే.. మరిన్ని అక్రమాలు వెలుగు లోకి వస్తాయని అధికారులు చెప్తున్నారు.

ధరణి పోర్టల్‌లో మార్చేసి..

అధికారులు, దళారులు కుమ్మక్కై, ధరణి పోర్ట ల్‌ను ఆసరాగా చేసుకుని ఈ భూదందాకు తెరలేపారు. అసైన్డ్‌భూములను ధరణి పోర్టల్‌లో పట్టా భూములుగా మార్చేశారు. ఈ మేరకు పట్టాదారు పాసు పుస్తకాలు కూడా జారీ చేశారు. తర్వాత ఆ పాసు పుస్తకాల ఆధారంగా.. చాలావరకు భూముల క్రయవిక్రయాలు చేతులు మారాయి. బడాబాబుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. రాజకీయ నేతలు, బడాబాబులకు భూములు దక్కేలా చేసిన కొందరు రెవెన్యూ అధికారులు భారీగా దండుకున్నారని.. కోట్లకు పడగలెత్తారని ఆరోపణలు ఉన్నాయి.

వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతోంది

కలెక్టర్ ఆదేశాల మేరకు కంది మండలంలో ప్రభుత్వ భూముల వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టాం. భూములకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. అసైన్డ్ భూములను పట్టాభూములుగా మార్చి నట్టు గుర్తించాం. అన్ని గ్రామాల్లో వెరిఫి కేషన్ పూర్తిచేసి నివేదిక ఇస్తాం.

– విజయలక్ష్మి, కంది మండల తహసీల్దార్.

ఓడిపోయే పార్టీ నుంచి కూతురి పోటీ వద్దనుకొనే..

- కాంగ్రెస్ పార్టీలో చేరాలనుకోవడంపై కడియం శ్రీహరి
- బీఆర్‌ఎస్ ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది
- వరంగల్ జిల్లాలో పార్టీ బలహీనపడింది
- కాంగ్రెస్‌లో చేరాలని ఇంటికి వచ్చి మరీ అడిగారు
- నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలతో భేటీ



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో మొదటిసారిగా పోటీ చేస్తున్న తన కూతురు కడియం కావ్య ఓడిపోయే పార్టీ నుంచి పోటీ చేయొద్దనే ఉద్దేశంతోనే బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి ప్రకటించారు. బీఆర్‌ఎస్ ఒడిదుడుకులను ఎదుర్కొంటోందని, పార్టీలో కొనసాగడంపై నాయకులు అయోమయంలో ఉన్నారన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో చాలా మంది నాయకులు బీఆర్‌ఎస్‌ను వీడి ఇతర పార్టీల్లో చేరడంతో పార్టీ బలహీనపడిందని ఆయన చెప్పారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాస సముదాయంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ముఖ్య నాయకులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలతో కడియం శ్రీహరి సమావేశమయ్యారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ బీఆర్‌ఎస్ తరఫున ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు నిరాకరించినందునే తన కూతురు కావ్యకు పార్టీ టికెట్ ఇచ్చిందన్నారు. పార్టీ ఒడిదుడుకుల్లో ఉన్నా, పోటీ చేసేందుకు ముందుకొచ్చినా వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని పార్టీ నాయకుల నుంచి తనకు సహకారం అందలేదని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పదేళ్ల అధికారంలో ఉన్నా తన వెంట ఉన్న నాయకులు, కార్యకర్తలు ప్రతిపక్షంలో ఉన్నట్లుగానే ఇబ్బందులు పడ్డారని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్నందున నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చాల్సిన బాధ్యత తనపై ఉందని కడియం చెప్పారు.

ఎవరినీ అడగకుండానే నిర్ణయం తీసుకున్నా..


కాంగ్రెస్ పార్టీలో చేరాలనే నిర్ణయాన్ని ఎవరినీ సంప్రదించకుండానే తీసుకున్నానని... కాంగ్రెస్ ప్రతినిధులు పార్టీలోకి రావాల్సిందిగా తనను ఆహ్వానించినట్లు కడియం తెలిపారు. బీఆర్‌ఎస్ ఎవరికీ అన్యాయం చేయలేదని, పార్టీ మారకముందే తనపై తీవ్ర విమర్శలు చేస్తున్నారన్నారు. తాటికొండ రాజయ్య, అరూరి రమేశ్, పసునూరు దయాకర్ పార్టీ మారిన సమయంలో లేని విమర్శలు తనపై ఎందుకని ప్రశ్నించారు. అవకాశాలు అందరికీ వస్తాయని... కానీ వాటిని ఎలా ఉపయోగించుకుంటున్నామనేదే ముఖ్యమన్నారు. కాంగ్రెస్‌లో చేరతామని కొందరు నెలల తరబడి ఆ పార్టీ నేతల ఇళ్ల చుట్టూ తిరిగినా చేర్చుకోలేదని... కానీ కాంగ్రెస్ నేతలే తన ఇంటికి వచ్చి చేరాలని అడుగుతున్నారన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో తాను తప్పు చేయలేదని, అవినీతి, అక్రమ సంపాదనకు పాల్పడలేదని చెప్పారు. తాను ప్రైవేటు యూనివర్సిటీలు పెట్టుకోలేదని, భూకబ్జాలు చేయలేదన్నారు. తనను ప్రశ్నించే హక్కు కేవలం స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలకే ఉందని కడియం అన్నారు. కార్యకర్తలను కాపాడుకోవడానికే తన తండ్రి పార్టీ మారుతున్నారని కుమార్తె కడియం కావ్య చెప్పారు.

ఫిర్యాదుల పరిష్కారానికి కాంగ్రెస్ కొత్తకమిటీ

సాక్షి, హైదరాబాద్: అధికార కాంగ్రెస్ పార్టీ మరో కొత్త కమిటీని నియమించింది. లోక్‌సభ ఎన్నికల్లో టికెట్ల కేటాయింపు సందర్భంగా పార్టీ నేతల మధ్య ఏర్పడ్డ అభిప్రాయ భేదాలను పరిష్కరించుకోవడంతో పాటు ఫిర్యాదులు చేసేందుకు ఈ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు శనివారం గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. సీఎల్పీ మాజీ నేత కె.జానారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి ఎస్.సంపత్‌కుమార్‌లతో కూడిన ఈ త్రిసభ్య కమిటీ దృష్టికి పార్టీలో అంతర్గత ఫిర్యాదులను తీసుకెళ్లాలని సూచించింది. పార్టీ నేతల మధ్య ఎలాంటి అభిప్రాయ భేదాలున్నా ఈ కమిటీకి మాత్రమే ఫిర్యాదు చేయాలంది. పార్టీ అంతర్గత వ్యవహారాల విషయంలో క్రమశిక్షణా రాహిత్యాన్ని ఉపేక్షించేది లేదన్న సీఎం రేవంత్ సూచన మేరకు ఈ కమిటీ ఏర్పాటైంది. కమిటీకి ఫిర్యాదు చేయకుండా బయట మాట్లాడితే చర్యలుంటాయని స్పష్టం చేసింది.

భూదందాలకు ఇవిగో ఆధారాలు

- తూంకుంట, బొంరాస్‌పేట, చందవెల్లి, మాజిల్‌పూర్ గ్రామాల్లో భూకుంభకోణాలు
- కుట్రపూరితంగానే ధరణి రూపకల్పన.. భూఅక్రమాలకు కేసీఆర్, కేటీఆర్‌లే బాధ్యులు
- వెంటనే విచారణ జరిపించండి: ఏఐసీసీ కిసాన్‌సెల్ వైస్‌చైర్మన్ ఎం.కోదండరెడ్డి



సాక్షి, హైదరాబాద్: నిషేధిత భూముల జాబితాను అడ్డుపెట్టుకుని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోని పెద్దలు అనేక భూకుంభకోణాలకు పాల్పడ్డారని ఏఐసీసీ కిసాన్‌సెల్ వైస్‌చైర్మన్ ఎం.కోదండరెడ్డి ఆరోపించారు. షామీర్‌పేట మండలం తూంకుంట, బొంరాస్‌పేట, చేవెళ్ల మండలం చందవెల్లి, మాజిల్‌పూర్ గ్రామాల్లో జరిగిన భూకుంభకోణాలకు సంబంధించిన సమగ్ర ఆధారాలను సమర్పించానని, వీటిపై విచారణ జరిపించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం గాంధీభవన్‌లో కోదండరెడ్డి మీడియాతో మాట్లాడారు. షామీర్‌పేట మండలం తూంకుంట గ్రామంలోని 164/1 సర్వే నెంబర్‌లోని 26 ఎకరాల అటవీ భూమిని జూన్, 2022లో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారని ఆరోపించారు. బొంరాస్‌పేట గ్రామంలోని 260/2, 261, 265/8, 361/7, 361/9 సర్వే నెంబర్లలో రక్షణ శాఖకు చెందిన భూమిని బాలాజీ అసోసియేట్ అనే సంస్థకు ఇచ్చారని, అదే గ్రామంలోని 65 ఎకరాల ప్రైవేటు భూమిని రైతులకు కాకుండా అప్పట్లో రాజ్యసభ సభ్యుడు సంతోశ్ కుటుంబానికి చెందిన ఎఫ్‌ఫర్‌ఎల్ ఫార్మ్ అనే సంస్థకు దారాదత్తం చేశారని నిందించారు. నిషేధిత జాబితాలో పెట్టిన భూములను 2018లో ఎన్నికలు కాగానే అంబుజ్ అగర్వాల్ పేరిట రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. 24లక్షల ఎకరాల అసైన్డ్ భూమిని నిషేధిత జాబితాలో పెట్టి వారికి అనుకూలమైన వ్యక్తులకు కట్టబెట్టారని కోదండరెడ్డి విమర్శించారు.

దళితుల భూములను కేటీఆర్ అమ్ముకున్నారు

చేవెళ్ల మండలం చందవెల్లి అనే గ్రామంలో దళితుల నుంచి ఎకరం రూ.9 లక్షల చొప్పున 1,500 ఎకరాలు తీసుకుని తనకు అనుకూలంగా ఉన్న మల్టీనేషనల్ కంపెనీకి ఎకరానికి రూ.1.30 కోట్లకు కేటీఆర్ అమ్ముకున్నారని కోదండరెడ్డి ఆరోపించారు. మాజిల్‌పూర్ అనే గ్రామంలో ల్యాండ్‌సీలింగ్‌లో ఉన్న 25 ఎకరాల భూమిని పట్టా చేసుకున్నారని చెప్పారు. వీటన్నింటికీ సంబంధించి సమగ్ర ఆధారాలను ప్రభుత్వానికి ఇచ్చానని, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదు చేశానని ఆయన తెలిపారు. భూములను కాజేయాలనే కుట్రపూరిత ఆలోచనలతోనే కేసీఆర్ ధరణికి రూపకల్పన చేశారని, రాష్ట్రంలో జరిగిన భూకుంభకోణాలు, అక్రమాలకు కేసీఆర్, కేటీఆర్‌లే బాధ్యులని ఆరోపించారు. అప్పటి సీఎస్ సోమేశ్‌కుమార్ ఆధ్వర్యంలో దేశంలోనే అతి పెద్ద భూకుంభకోణం జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. పార్లమెంటు ఎన్నికలు పూర్తికాగానే చర్యలకు ఉపక్రమించి కేసీఆర్, కేటీఆర్‌లతో పాటు ఇందుకు బాధ్యులైన ఎంతటి వారిపైన అయినా కఠినచర్యలు తీసుకోవాలని కోదండరెడ్డి డిమాండ్ చేశారు.

వంద రోజుల పాలన పోలీస్ రాజ్యమే

▶ మొదటి పేజీ తరువాయి

గత ప్రభుత్వం ఉపా చట్టాలను అమలు చేసి తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందని, కానీ ఇప్పుడున్న ప్రభుత్వం కూడా అలాంటి మార్గాన్నే అనుసరిస్తోందని ఆరోపించారు. పదిరోజులుగా అన్ని మీడియాల్లో పతాకస్థాయిలో వస్తున్న ఎస్ఐబీ దాదాపు 30 సంవత్సరాలుగా కొనసాగుతోందని, అత్యంత దుర్మార్గమైన చర్యలకు పాల్పడుతున్న ఎస్ఐబీపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఏమిటో తెలియజేయాలని సీనియర్ సంపాదకుడు ఎన్.వేణుగోపాల్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బలం పెంచుకునేందుకు బీఆర్‌ఎస్ నేతలను చేర్చుకునే పనిలో పడిందని, కానీ ప్రజాసమస్యల పరిష్కారంపై అంతగా దృష్టి పెట్టడం లేదని మరో సంపాదకుడు కె.శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వం మారినంత మాత్రాన వ్యవస్థ మారినట్లు కాదని, మార్పు కోసం అన్నివర్గాలు ఉద్యమించాలని పీఓడబ్ల్యూ అధ్యక్షురాలు సంధ్య పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, దేవులపల్లి అజయ్, కె.సజయ తదితరులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న కోదండరాం తదితరులు



ద్రవిడ నేలపై కమలం వికసించేనా?

తమిళనాడుపై బీజేపీ ఫోకస్

అన్నామలై రాకతో ఫుల్ జోష్ | అన్నాడీఎంకే ఓటు బ్యాంకుపై కన్ను | చిన్న పార్టీలతోనే కమలనాథుల పొత్తు | ఆసక్తి రేపుతున్న ముక్కోణపు పోటీ



స్టేట్ స్కాన్

దక్షిణాదిని పాదాక్రాంతం చేసుకోవాలని ఉవ్విళ్లూరుతున్న బీజేపీ ఈ లోక్‌సభ ఎన్నికల్లో ప్రధా నంగా తమిళనాడుపై స్పెషల్ ఫోకస్ పెట్టింది. ద్రవిడ పార్టీల ఆవిర్భావంతో దశాబ్దాలుగా జాతీయ పార్టీలకు ఆ రాష్ట్రం కొరకరాని కొయ్యగా మారిపోయింది. డీఎంకే, అన్నాడీఎంకేల్లో ఏదో ఒకదానికి తోక పార్టీగా కొనసాగడం మినహా కాంగ్రెస్, బీజేపీలకు మరో దారి లేని పరిస్థితి! ఈసారి ఈ పరిస్థితిని ఎలాగైనా మార్చాలని బీజేపీ కంకణం కట్టుకుంది. కె.అన్నామలై రాష్ట్ర బీజేపీ పగ్గాలు చేపట్టిన నాటినుంచీ దూకుడుగా వెళ్తున్నారు. రాష్ట్రమంతటా కలియదిరుగుతూ ఇటు జనాన్ని ఆకట్టుకుంటున్నారు. మంత్రుల అవినీతిపై వీడియోలు విడుదల చేస్తూ అటు అధికార డీఎంకేకు వణుకు పుట్టిస్తున్నారు. రాష్ట్రంలోని మొత్తం 39 లోక్‌సభ స్థానాలకూ ఏప్రిల్19న తొలి విడతలోనే పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో తమిళనాట ఎన్నికల వేడి ఇప్పటికే పరాకాష్టకు చేరింది...

జాతీయ పార్టీలతో కుర్చీలాట

తమిళనాట 50 ఏళ్లుగా ద్రవిడ పార్టీలైన డీఎంకే, అన్నాడీఎంకేలదే హవా. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు 1967లో డీఎంకే తొలిసారి ఓటమి రుచి చూపింది. 234 అసెంబ్లీ స్థానాలకు గాను ఏకంగా డీఎంకే 179 చోట్ల గెలవగా కాంగ్రెస్ 51 స్థానాలకు పరిమితమైంది. నాటినుంచి నేటిదాకా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాలేకపోయింది! కరుణానిధితో విభేదాలతో 1972లో ఎంజీ రామచంద్రన్ డీఎంకేను చీల్చి అన్నాడీఎంకేను ఏర్పాటు చేశారు. నాటినుంచీ వాటి మధ్యే ప్రధాన పోరు సాగుతూ వస్తోంది. జాతీయ రాజకీయాల్లో సంకీర్ణ యుగం ఆవిర్భావంతో 1989 నుంచి రెండు దశాబ్దాల పాటు కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటులో డీఎంకే, అన్నాడీఎంకే కీలక పాత్ర పోషించాయి. ఆ క్రమంలో రాష్ట్రంలోనూ కాంగ్రెస్, బీజేపీలతో మార్చి మార్చి పొత్తు పెట్టుకుంటూ వస్తున్నాయి. డీఎంకే 2004 దాకా కాంగ్రెస్‌కు బద్ధ విరోధిగా కొనసాగింది. అన్నాడీఎంకే కేంద్రంలో వాజ్‌పేయి ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించడంతో 1999లో బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమిలో చేరింది. కానీ 2004లో అన్నాడీఎంకే మళ్లీ ఎన్డీఏ గూటికి చేరడంతో డీఎంకే తన వైఖరి మార్చుకుని కాంగ్రెస్‌తో చేతులు కలిపింది. నాటినుంచీ 2014లో మినహాయిస్తే వాటి బంధం అన్ని ఎన్నికల్లోనూ కొనసాగుతూ వస్తోంది. ఇక అన్నాడీఎంకే తాను తొలిసారి ఎన్నికల బరిలో 1977లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంది. తర్వాత 1984 నుంచి 1991 ఎన్నికల దాకా వాటి బంధం సాగింది. 1998లో తొలిసారి బీజేపీతో చేతులు కలిపినా ఏడాదికే మళ్లీ కాంగ్రెస్ గూటికి చేరింది. 2004లో మళ్లీ బీజేపీతో జట్టు కట్టింది. అప్పటి నుంచీ కాంగ్రెస్‌ను దూరం పెట్టింది. 2004 లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాజయం నేపథ్యంలో 2009, 2014 ఎన్నికల్లో బీజేపీతో బంధం తెంచుకుంది. 2019లో మళ్లీ ఎన్డీఏలో చేరినా ఈసారి మాత్రం ఒంటరిగానే పోటీ చేస్తోంది. చిన్న పార్టీలైన పీఎంకే, ఎండీఎంకే కూడా పరిస్థితిని బట్టి డీఎంకే, అన్నాడీఎంకేలతో పొత్తు పెట్టుకుంటూ వస్తున్నాయి.

పొత్తులు ఇలా...

డీఎంకే ఈసారి కూడా చిరకాల మిత్రులు కాంగ్రెస్, వామపక్షాలతో పొత్తు పెట్టుకోగా అన్నాడీఎంకే మాత్రం బీజేపీతో దూరం పాటిస్తోంది. దివంగత నటుడు విజయ్‌కాంత్‌కు చెందిన డీఎండీకేతో పొత్తు పెట్టుకుంది. ఇక బీజేపీ ఈసారి పీఎంకే, ఏఎంఎంకే, టీఎంసీ (ఎం) వంటి చిన్న పార్టీలతో జట్టు కట్టింది. 1999లో రాష్ట్రంలో అత్యధికంగా 4 లోక్‌సభ స్థానాల్లో నెగ్గిన బీజేపీ ఈసారి ఆ రికార్డును అధిగమించాలని పట్టుదలతో ఉంది. పోలింగ్ తేదీ సమీపిస్తుండటంతో ప్రధాని నరేంద్ర మోదీ తమిళనాట పర్యటనలతో హోరెత్తిస్తున్నారు. ఈ మధ్యకాలంలోనే రాష్ట్రానికి ఆయన ఏకంగా ఆరుసార్లు వచ్చారు.

ఎవరెన్ని సీట్లలో...

తమిళనాట ఎన్డీఏ, ఇండియా, అన్నాడీఎంకే కూటముల మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. ఇండియా కూటమిలో డీఎంకే 22 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేస్తోంది. కాంగ్రెస్‌కు 9, వామపక్షాలకు 4, ఇతర పార్టీలకు మరో 4 స్థానాలు కేటాయించింది. ఎన్డీఏ కూటమి విషయానికొస్తే బీజేపీ 20 చోట్ల, పీఎంకే 10, టీఎంసీ(ఎం) 3, ఏఎంఎంకే 2 చోట్ల, ఇతర పార్టీలు మూడింట బరిలో ఉన్నాయి. మరోచోట ఎన్డీఏ మద్దతుతో ఓ.పన్నీర్‌సెల్వం స్వతంత్రునిగా బరిలో దిగుతున్నారు. ఇక అన్నాడీఎంకే 32 స్థానాల్లో పోటీ చేస్తోంది. డీఎండీకేకు 5, ఇతరులకు 2 సీట్లు కేటాయించింది.


యువ ఓటర్లపైనే బీజేపీ ఆశలు...



తమిళనాట బీజేపీ ప్రధానంగా యువ ఓటర్లపైనే ఆశలు పెట్టుకుంది. ద్రవిడ పార్టీలతో విసిగిపోయారని, మార్పు కోసం చూస్తున్నారని నమ్ముతోంది. బీజేపీ రాష్ట్ర సారథి అన్నామలైకి వారిలో ఆదరణ నానాటికీ పెరుగుతోందని పరిశీలకులు చెబుతున్నారు. దీనికితోడు ద్రవిడ పార్టీల నేతలపైనా బీజేపీ కన్నేసింది. ఇప్పటికే అన్నాడీఎంకేకు చెందిన ఒక మాజీ ఎంపీ, 17 మంది మాజీ ఎమ్మెల్యేలు ఇటీవలే బీజేపీలో చేరారు. దక్షిణ తమిళనాట పదేళ్లుగా తమకు గట్టి పునాదే ఏర్పడిందని పార్టీ భావిస్తోంది. అక్కడి కొంగు ప్రాంతంలో పార్టీకి సంస్థాగతంగా చెప్పుకోదగ్గ బలమే ఉంది. దీనికితోడు కోయంబత్తూరు నుంచి రాష్ట్ర పార్టీ సారథి అన్నామలై పోటీ చేస్తున్నారు. పీఎంకేతో పొత్తు ద్వారా ఉత్తర తమిళనాడులో తన బలహీనతను అధిగమిస్తానని బీజేపీ భావిస్తోంది. 2014లోనూ ఇలాగే చిన్న పార్టీలతో జట్టు కట్టి బీజేపీ ఏకంగా 19 శాతం ఓట్లు రాబట్టడమే గాక ఒక లోక్‌సభ స్థానాన్ని గెలుచుకుందని ఆ పార్టీ అభిమానులు గుర్తు చేస్తున్నారు. కాకపోతే అప్పటి భాగస్వాముల్లో డీఎండీకే, ఎండీఎంకే ఇప్పుడు ఎన్డీఏతో లేవు. పైగా ముక్కోణపు పోటీలో విపక్షాల ఓట్లు చీలి ఇండియా కూటమికే లబ్ధి చేకూరవచ్చన్న విశ్లేషణలున్నాయి. ఇక 2019 లోక్‌సభ ఎన్నికల్లో ప్రస్తుత ఇండియా కూటమి ఏకంగా 53 శాతం ఓట్లు ఒడిసిపట్టింది! ఎన్డీఏ కేవలం 10 శాతంతో సరిపెట్టుకోగా అన్నాడీఎంకే కూటమికి 21 శాతం వచ్చాయి. అయితే ఈసారి ఏఎంఎంకే వంటి భాగస్వాములు అన్నాడీఎంకే ఓటు శాతానికి గండి కొట్టి తమవైపు మళ్లిస్తాయని బీజేపీ ఆశ పెట్టుకుంది. అన్నాడీఎంకే ఓట్లను ఏకంగా మూడొంతల దాకా ఒడిసిపట్టడంతో పాటు మోదీ చరిష్మా, స్టాలిన్ సర్కారుపై వ్యతిరేకత సాయంతో ఇండియా కూటమి ఓట్లలోనూ 10 శాతం దాకా ఎన్డీఏ కొల్లగొట్టగలిగితే 7 సీట్ల దాకా నెగ్గవచ్చని విశ్లేషకుల అంచనా. కాకపోతే అన్నాడీఎంకే ఓటు శాతానికి అంతగా గండి పెట్టడం బీజేపీకి పెనుసవాలే!

ప్రచారంలో సినీ తళుకులు..

బీజేపీ తరఫున సినీ నటులు ఖుష్బూ, ఇటీవలే తన పార్టీని విలీనం చేసిన శరత్ కుమార్, సెంథిల్ ప్రచారంలో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారు. డీఎంకేకు కమల్‌హాసన్, అన్నాడీఎంకేకు గౌతమి, గాయత్రీ రఘురాం తదితర సినీ స్టార్లు ప్రచారం చేయనున్నారు.



ఎవరి సర్వేలు ఏమంటున్నాయి...


సీఎన్‌ఎన్–న్యూస్ 18 సర్వే ఈసారి ఎన్డీఏకు రాష్ట్రంలో 5 సీట్ల దాకా వస్తాయని పేర్కొనగా ఇండియాటుడే సర్వే మాత్రం మొత్తం 39 సీట్లనూ విపక్ష ఇండియా కూటమి క్లీన్‌స్వీప్ చేస్తుందని జోస్యం చెప్పింది.

భార్యను భూతం పిశాచి అనడం క్రూరత్వం కాదు

పట్నా హైకోర్టు స్పష్టీకరణ

పట్నా: వైవాహిక జీవితం విఫలమైన సందర్భంలో ఒక భర్త తన భార్యను భూతం, పిశాచి అంటూ దూషించడం క్రూరత్వం కాదని పట్నా హైకోర్టు తేల్చిచెప్పింది. తననుంచి విడాకులు తీసుకున్న మహిళ ఫిర్యాదుపై కిందికోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఆమె మాజీ భర్త దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా హైకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. జార్ఖండ్‌లోని బొకారోకు చెందిన నరేశ్‌కుమార్‌గుప్తాకు 1993లో బిహార్‌లోని నవదా పట్టణానికి చెందిన మహిళతో వివాహం జరిగింది. అదనపు కట్నం కింద కారు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తన భర్త, అతడి తండ్రి సహదేవ్ గుప్తా కలిసి తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారంటూ ఆమె 1994లో నవదాలో పోలీసులకు ఫిర్యాదు చేసింది. తండ్రీకుమారులపై కేసు నమోదైంది. వారిద్దరి విజ్ఞప్తి మేరకు ఈ కేసు నలందా జిల్లాకు బదిలీ అయ్యింది. నరేశ్‌కుమార్ గుప్తా, సహదేవ్ గుప్తాకు 2008లో నలందా కోర్టు ఏడాదిపాటు కఠిన కారాగార శిక్ష విధించింది. దీనిని వ్యతిరేకిస్తూ వారిద్దరూ అదనపు సెషన్స్ కోర్టును ఆశ్రయించారు. వారి అప్పీల్‌ను పదేళ్ల తర్వాత కోర్టు తిరస్కరించడంతో పట్నా హైకోర్టుకు వెళ్లారు. ఇంతలో జార్ఖండ్ హైకోర్టు విడాకులు మంజూరు చేసింది. 21వ శతాబ్దంలో ఒక మహిళను ఆమె అత్తింటివారు భూతం, పిశాచి అంటూ ఘోరంగా దూషించడం దారుణమని విడాకులు తీసుకున్న మహిళ తరఫున ఆమె లాయర్ వాదించారు. ఇది ముమ్మాటికీ క్రూరత్వమేనని, తండ్రీ కుమారులను కఠినంగా శిక్షించాలని కోరారు. అందుకు జస్టిస్ బిబేక్ చౌదరి నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం నిరాకరించింది. విఫలమైన వివాహ బంధాల్లో దంపతులు పరస్పరం దూషించుకొనే సందర్భాలు చాలా వస్తుంటాయని అభిప్రాయపడింది. భర్త తన భార్యను భూతం, పిశాచి అంటూ దూషించడం క్రూరత్వం కిందికి రాదని తేల్చిచెప్పింది. పైగా సదరు మహిళ నిర్దిష్టంగా ఏ ఒక్కరిపైనా ఆరోపణలు చేయలేదని పేర్కొంది. కింది కోర్టులు ఇచ్చిన తీర్పులను కొట్టివేసింది.

మద్యం కుంభకోణంలో ఢిల్లీ మంత్రి కైలాశ్ గహ్లోత్‌ను ప్రశ్నించిన ఈడీ



న్యూఢిల్లీ: సంచలనం సృష్టించిన ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఈడీ అధికారులు వేగం పెంచారు. దీనితో ముడిపడ్డ మనీ లాండరింగ్ కేసులో ఢిల్లీ మంత్రి, ఆప్ సీనియర్ నేత కైలాశ్ గహ్లోత్‌ను ఈడీ శనివారం దాదాపు 5 గంటలపాటు ప్రశ్నించారు. ఆయన వాంగ్మూలం నమోదు చేసింది. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు సన్నిహితుడైన గహ్లోత్ హోం, రవాణా, న్యాయ శాఖల మంత్రిగా పనిచేస్తున్నారు. ఈడీ ఆదేశాల మేరకు శనివారం ఉదయం 11.30 గంటలకు ఆయన ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. వివాదాస్పద 2021–22 ఢిల్లీ మద్యం పాలసీని రూపొందించిన మంత్రుల బృందంలో గహ్లోత్ కూడా ఉన్నారు. చార్జిషీట్‌లో ఆయన పేరునూ ఈడీ చేర్చింది. మద్యం విధానం ముసాయిదా తయారీ సందర్భంగా ఆప్ కమ్యూనికేషన్ల ఇన్‌చార్జి విజయ్ నాయర్ ఢిల్లీలోని గహ్లోత్ అధికారిక నివాసాన్ని ఉపయోగించుకున్నట్లు గుర్తించింది. ప్రజాప్రతినిధికి కేటాయించిన అధికారిక బంగ్లాను మరొకరు వాడటం నేరమేనని, దీనిపై చర్యలు తీసుకోవాలని సీబీఐకి సూచించింది. గహ్లోత్ ఒకే సిమ్ కార్డు వాడినా సెల్‌ఫోన్ ఐఎంఈఐ నెంబర్ మూడుసార్లు మారినట్లు ఈడీ ఆరోపించింది

రూ.46 కోట్లు కట్టు!

పీజీ విద్యార్థికి ఐటీ నోటీసు

గ్వాలియర్: మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ప్రమోద్ దండోతియా(25) అనే పీజీ విద్యార్థి ఏకంగా రూ.46 కోట్ల ఆదాయ పన్ను నోటీసు అందుకున్నాడు! దాంతో షాకై పోలీసులను ఆశ్రయించాడు. తన పాన్ కార్డు వివరాల ద్వారా ఎవరో ఢిల్లీ, పుణేల్లో తన పేరిట ఓ కంపెనీని సృష్టించి ఈ లావాదేవీలు జరిపినట్లు ఐటీ, జీఎస్టీ అధికారుల ద్వారా తెలిసిందని బాధితుడు చెప్పారు. పోలీసులకు ఫిర్యాదు చేయాలని వారతనికి సూచించారు. ఐటీ నోటీసులు, ఇతర ఆధారాలతో ఫిర్యాదు చేయాలని ప్రమోద్‌కు చెప్పినట్టు ఏఎస్పీ షియాజ్ తెలిపారు. దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

అన్సారీ అంత్యక్రియలు పూర్తి

లక్నో: గ్యాంగ్‌స్టర్, రాజకీయ నేత ముఖ్తార్ అన్సారీ అంత్యక్రియలు శనివారం యూపీలోని గాజీపూర్‌లో ముగిశాయి. వేలాది మంది అన్సారీకి మద్దతుగా నినాదాలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు. పట్టణంలో 144 సెక్షన్ అమలు చేశారు. కొందరు శ్మశాన వాటికలోకి చొచ్చుకెళ్లడానికి ప్రయత్నించగా అడ్డుకున్నారు. అన్సారీ సోదరుడు, ఎంపీ అఫ్జల్ అన్సారీ, ఘాజీపూర్ జిల్లా మేజిస్ట్రేట్ ఆర్యక అఖౌరీ మధ్య ఈ సందర్భంగా కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది.

పెరూ అధ్యక్షురాలి ఇంట్లో 'రోలెక్స్'ల కోసం సోదాలు!



లీమా: రోలెక్స్ గేట్ వ్యవహారం పెరూను కుదిపేస్తోంది. అధ్యక్షురాలు డినా బొలార్టే వద్ద 10కి పైగా అతి ఖరీదైన లెక్స్ గడియారాలున్నాయన్న ఆరోపణలపై దర్యాప్తు మొదలైంది. వాటికోసం కోర్టు ఆదేశాలతో లిమాలోని ఆమె నివాసంలో పోలీసులు సోదాలు నిర్వహించారు! సోదాలను టీవీ చానల్‌లో ప్రసారం చేశారు. వాచ్‌లు దొరికాయో లేదో వెల్లడించలేదు. తనవద్ద 18 ఏళ్ల వయసులో సొంత డబ్బులతో కొనుక్కున్న ఒకే రోలెక్స్ ఉందని డినా అంటున్నారు.

అరుణాచల్‌లో 10 ఏకగ్రీవాలు

ఇటానగర్: అరుణాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం పెమా ఖండూ, డిప్యూటీ సీఎం చౌనా మెయిన్ సహా 10 మంది బీజేపీ అభ్యర్థుల ఎన్నిక ఏకగ్రీవమైంది. శనివారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసే సరికి ఆయా నియోజకవర్గాల్లో వారు మాత్రమే బరిలో మిగిలారు. దాంతో వారు ఎమ్మెల్యేలుగా ఎన్నికైనట్టు చీఫ్ ఎలక్టోరల్ అధికారి పవన్ కుమార్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో అరుణాచల్‌లోని మిగతా 60 అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు రెండు లోక్‌సభ స్థానాలకు ఏప్రిల్ 19వ తేదీన తొలి విడతలో పోలింగ్ జరగనుంది.

కాంగ్రెస్ పార్టీకి మరో రెండు ఐటీ నోటీసులు

న్యూఢిల్లీ/బెంగళూరు: దేశంలో ప్రతిపక్షాలను నిర్వీర్యం చేయడానికి ప్రధాని నరేంద్ర మోదీ కుట్రలు చేస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ శనివారం ఆరోపించారు. ఆదాయపు పన్ను విభాగం నుంచి తమ పార్టీకి శుక్రవారం రాత్రి మరో రెండు నోటీసులు వచ్చాయన్నారు. పెనాల్టీలు, వడ్డీల కింద రూ.1,823 కోట్లు చెల్లించాలంటూ కాంగ్రెస్‌కు ఐటీ నోటీసులందడం తెలిసిందే. వీటిని వ్యతిరేకిస్తూ శనివారం కాంగ్రెస్ దేశవ్యాప్త నిరసనకు దిగింది. మరోవైపు, ఇప్పటికే పరిష్కారమైన కేసులో తనకూ ఐటీ నోటీసులొచ్చాయని కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ చెప్పారు.

సునీతా కేజ్రీవాల్‌తో కల్పనా సోరెన్ భేటీ



శనివారం ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ భార్య సునీతను కలిసిన జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సొరేన్ భార్య కల్పన

న్యూఢిల్లీ: జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ భార్య కల్పనా సోరెన్ శనివారం ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ భార్య సునీతా కేజ్రీవాల్‌ను కలిశారు. ఢిల్లీలోని ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్డులో ఉన్న సీఎం నివాసానికి ఆమె వెళ్లారు. సునీతా కేజ్రీవాల్, కల్పనా సోరెన్‌లు సుమారు 20 నిమిషాల సేపు మాట్లాడుకున్నారని అధికారులు తెలిపారు. అనంతరం కల్పన మీడియాతో మాట్లాడారు. 'సునీతా జీతో ఆవేదన, బాధను పంచుకునేందుకు ఇక్కడికి వచ్చా. ఆమె తన పరిస్థితిని వివరించారు. తుది వరకు పోరాడాలని ఇద్దరం నిర్ణయించుకున్నాం. యావత్తూ జార్ఖండ్ ప్రజలు కేజ్రీవాల్ వెన్నంటే ఉంటారు'అని చెప్పారు. 'జార్ఖండ్‌లో రెండు నెలల క్రితం జరిగిందే ఢిల్లీలో పునరావృతమైంది. నా భర్త హేమంత్ జైలుకు వెళ్లారు. కేజ్రీవాల్ కస్టడీలో ఉన్నారు. జార్ఖండ్, ఢిల్లీల్లో పరిస్థితులు ఒకేలా ఉన్నాయి'అని చెప్పారు. కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీని కలిసి, పరిస్థితిని వివరిస్తానన్నారు. భూకుంభకోణం మనీ లాండరింగ్ కేసులో హేమంత్ సోరెన్‌ను ఈడీ జనవరిలో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. కాగా, కల్పనా సోరెన్, జార్ఖండ్ సీఎం చంపాయి సోరెన్‌తోపాటు ఆదివారం ఢిల్లీలో జరిగే ఇండియా కూటమి ర్యాలీలో పాల్గొంటారని సమాచారం. సునీతా కేజ్రీవాల్ కూడా ర్యాలీలో పాలు పంచుకుంటారని ఆప్ నేతలు తెలిపారు.

పీవీ, చరణ్ సింగ్ సహా నలుగురికి భారతరత్న ప్రదానం



శనివారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నుంచి భారతరత్న పురస్కారం స్వీకరిస్తున్న బిహార్ మాజీ సీఎం కర్పూరీ ఠాకూర్ కుమారుడు రాంనాథ్, వ్యవసాయవేత్త ఎంఎస్ స్వామినాథన్ కుమార్తె నిత్యా రావు, చరణ్‌సింగ్ మనవడు జయంత్

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ ప్రధాన మంత్రులు పీవీ నరసింహారావు, చౌదరి చరణ్ సింగ్, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్, బిహార్ మాజీ సీఎం కర్పూరీ ఠాకూర్‌లకు మరణానంతరం దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న'ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శనివారం ప్రదానం చేశారు. పీవీ నరసింహారావు తరఫున ఆయన కుమారుడు పీవీ ప్రభాకర్‌రావు, చరణ్ సింగ్ తరఫున ఆయన మనవడు జయంత్ చౌదరి, ఎంఎస్ స్వామినాథన్ తరఫున ఆయన కుమార్తె నిత్యా రావు, కర్పూరీ ఠాకూర్ తరఫున కుమారుడు రాంనాథ్ ఠాకూర్ పురస్కారాన్ని అందుకున్నారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హాజరయ్యారు. ఈ సందర్భంగా పీవీ సేవలను స్మరించుకుంటూ ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. బీజేపీ నేత ఎల్‌కే అద్వానీకి భారతరత్న పురస్కారాన్ని ఆదివారం ఆయన నివాసంలో రాష్ట్రపతి ప్రదానం చేయనున్నారు.

ఎలక్షన్ బీట్



ఎన్నికల విచిత్రం లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం తమిళనాడులోని సేలంలో డీఎంకే అభ్యర్థి సెల్వ గణపతితో పాటు టీ కొట్టులో చాయ్ తాగుతున్న పార్టీ చీఫ్, సీఎం ఎంకే స్టాలిన్

హస్తినలో విపక్షాల ర్యాలీ నేడే

ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న ఆప్

న్యూఢిల్లీ: 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' నినాదంతో విపక్ష ఇండియా కూటమి ఆదివారం తలపెట్టిన భారీ ర్యాలీకి సర్వం సిద్ధమైంది. ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో ఇందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. కూటమిలోని 29 పార్టీలూ ర్యాలీలో పాల్గొంటాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తెలిపారు. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, అగ్ర నేత రాహుల్‌గాంధీతో పాటు కూటమికి చెందిన పలువురు నేతలు ప్రసంగిస్తారన్నారు. కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ కూడా పాల్గొనే అవకాశముందని చెప్పారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను మోదీ సర్కారు అడ్డంగా దుర్వినియోగం చేస్తోందని, ర్యాలీలో దీన్ని ప్రధానంగా ప్రస్తావిస్తామని తెలిపారు. డెరిక్ ఒబ్రియాన్ (టీఎంసీ), తిరుచ్చి శివ (డీఎంకే), అఖిలేశ్ యాదవ్ (ఎస్పీ), శరద్ పవార్ (ఎన్సీపీ–ఎస్‌సీపీ), తేజస్వీ యాదవ్ (ఆర్జేడీ), సీతారాం ఏచూరి (సీపీఎం), డి.రాజా (సీపీఐ), ఫరూక్ అబ్దుల్లా (నేషనల్ కాన్ఫరెన్స్), మెహబూబా ముఫ్తీ (పీడీపీ) తదితరులు పాల్గొంటారన్నారు. ఇండియా కూటమి భాగస్వామి ఆమ్ ఆద్మీ పార్టీ ఈ ర్యాలీని ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. పార్టీ సారథి, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మద్యం కుంభకోణం కేసులో జైలుపాలైన నేపథ్యంలో ర్యాలీకి భారీగా జన సమీకరణ చేసి సత్తా చాటాలని పట్టుదలగా ఉంది.

రాజ్‌నాథ్ సారథ్యంలో మేనిఫెస్టో కమిటీ

27 మందితో ఏర్పాటు చేసిన బీజేపీ

న్యూఢిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికలకు మేనిఫెస్టో రూపకల్పనకు గాను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సారథ్యంలో బీజేపీ 27 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీకి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కన్వీనర్‌గా, కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ కో కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. పార్టీ ఎన్నికల హామీలపై ఈ కమిటీ మేధో మథనం చేయడంతోపాటు దేశవ్యాప్తంగా ప్రజల నుంచి సూచనలను స్వీకరించనుంది. ఇందులో కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, అశ్వినీ వైష్ణవ్, భూపేంద్ర యాదవ్, కిరెన్ రిజిజు, అర్జున్ ముండా, అర్జున్ రామ్ మేఘ్వాల్, స్మృతి ఇరానీ, రాజీవ్ చంద్ర శేఖర్ ఉన్నారు. బీజేపీ పాలిత గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, అస్సాం సీఎం హిమాంత బిశ్వ శర్మ, మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్, ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణు డియో సాయి కూడా కమిటీలో ఉన్నారు. శివరాజ్ సింగ్ చౌహాన్, వసుంధరా రాజే వంటి సీనియర్ నేతలకు కూడా బీజేపీ అధిష్టానం స్థానం కల్పించింది. క్రైస్తవులు, ముస్లింలకు ఆంటోనీ, మన్సూర్‌లు ప్రాతినిధ్యం వహించనున్నారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, రాజస్తాన్ సీఎం భజన్‌లాల్ శర్మ పేర్లు కమిటీలో లేవు.

పోటీపై 3న నిర్ణయం: సుమలత

బెంగళూరు: లోక్‌సభ ఎన్నికల్లో పోటీపై తన నిర్ణయాన్ని ఏప్రిల్ 3న వెల్లడిస్తానని మండ్య ఎంపీ, సినీ నటి సుమలత పేర్కొన్నారు. 2019లో బీజేపీ మద్దతుతో ఇండిపెండెంట్‌గా నెగ్గిన ఆమె ఈసారి కూడా ఎన్డీఏ తరఫున టికెట్ ఆశించారు. కానీ పొత్తులో భాగంగా మండ్య స్థానాన్ని జేడీ(ఎస్)కు బీజేపీ కేటాయించింది. మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి అక్కడి నుంచి బరిలో దిగుతున్నారు. 2019లో ఇక్కడ కుమారస్వామి కుమారుడు నిఖిల్‌ను సుమలత ఓడించడం విశేషం.ఈ నేపథ్యంలో ఏప్రిల్ 3న మండ్యలోనే తన భావి నిర్ణయాన్ని ప్రకటిస్తానని ఆమె ఆదివారం ప్రకటించారు. సుమలతను అనునయించేందుకు కర్ణాటక బీజేపీ చీఫ్ విజయేంద్ర యడ్యూరప్ప విఫలయత్నం చేశారు.

కార్యకర్తలే నాకు స్ఫూర్తి: మోదీ

తిరువనంతపురం: లోక్‌సభ ఎన్నికల్లో విజయం కోసం కేరళలో బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తలు అహోరాత్రాలు చెమటోడుస్తున్నారని ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు. నమో యాప్ ద్వారా శనివారం ఆయన వారితో ముచ్చటించారు. అధికార లెఫ్ట్ కూటమి నుంచి ఎన్ని అడ్డంకులు ఎదురవుతున్నా బీజేపీ కార్యకర్తలు చూపుతున్న పట్టుదల, ఉత్సాహం ప్రశంసనీయమన్నారు. వారి త్యాగం, క్రమశిక్షణ, కష్టించే తత్వం తనకు స్ఫూర్తిగా నిలిచి శక్తినిస్తున్నాయని మోదీ అన్నారు. ఇంటింటికీ వెళ్లి ముమ్మరంగా ఎన్నికల ప్రచారం చేపట్టినట్టు కార్యకర్తలు ఆయనకు వివరించారు. కేరళలో ఏప్రిల్ 26న రెండో విడతలో పోలింగ్ జరగనుంది.

బారామతిలో ప'వార్'

కీలక లోక్‌సభ స్థానంలో వదినా మరదళ్ల పోరు

ముంబై: మహారాష్ట్రలోని బారామతి లోక్‌సభ స్థానంలో ఈసారి ఎన్నికలు రంజుగా మారుతున్నాయి. ఇక్కడ వదిన మరదళ్ల పోరు తప్పదని తేలిపోయింది. నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) నుంచి మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ భార్య సునేత్ర పవార్ అభ్యర్థిత్వాన్ని శనివారం ఖరారు చేశారు. ఇక్కడ ఎన్సీపీ(శరద్ పవార్) నుంచి శరద్ పవార్ కుమార్తె, అజిత్ పవార్‌కు సోదరి వరుసయ్యే సుప్రియా సూలే మరోసారి బరిలోకి దిగబోతున్నారు. బారామతిలో పవార్ కుటుంబానికి గట్టి పట్టుంది. దాదాపు సమానమైన అంగబలం, అర్థబలం కలిగిన వదిన మరదళ్లలో విజయం ఎవరిని వరిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. బారామతి నుంచి పోటీ చేయడానికి అవకాశం దక్కడం పట్ల సునేత్ర పవార్ ఆనందం వ్యక్తం చేశారు. ఇది తనకు లక్కీ డే అని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతోపాటు శివసేన, బీజేపీ, ఎన్సీపీ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. తన సామర్థ్యంపై విశ్వాసం ఉంచి ఎన్నికల్లో పోటీకి అవకాశం కల్పించారని పేర్కొన్నారు.

బీజేపీలో చేరిన శివరాజ్ పాటిల్ కోడలు

ముంబై: కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి శివరాజ్ పాటిల్ కోడలు అర్చనా పాటిల్ శనివారం బీజేపీలో చేరారు. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ సమక్షంలో బీజేపీ కండువా కప్పుకున్నారు. మరాఠ్వాడాలోని నాందేడ్‌కు చెందిన కీలక నేత, మాజీ సీఎం అశోక్ చవాన్ గత నెలలో కాంగ్రెస నుంచి బీజేపీలో చేరడం తెలిసిందే. వీరిద్దరి చేరికతో అక్కడ బీజేపీ బలోపేతమవుతుందని భావిస్తున్నారు.

11 మంది అభ్యర్థులతో బీజేపీ మరో జాబితా

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ శనివారం 11 మంది అభ్యర్థులతో మరో జాబితాను విడుదల చేసింది. ఇందులో ఇతర పార్టీల నుంచి బీజేపీలో చేరిన భర్తృహరి మహతాబ్, రవ్‌నీత్ సింగ్ బిట్టూ, సుశీల్ కుమార్ రింకూ, ప్రణీత్ కౌర్ తదితర సిట్టింగులున్నారు. వీరంతా అవే స్థానాల నుంచి మళ్లీ బరిలోకి దిగుతున్నారు. అమెరికాలో భారత మాజీ రాయబారి తరన్‌జీత్ సింగ్ సంధు అమృత్‌సర్‌లో పోటీ చేయనున్నారు. 2019లో బీజేపీ తరఫున నార్త్‌వెస్ట్ ఢిల్లీలో గెలుపొందిన హన్స్ రాజ్ హన్స్ ఈసారి ఫరీద్‌కోట్ బరిలో ఉంటారు. బీజేడీకి గుడ్ బై చెప్పిన భర్తృహరి కటక్ నుంచి పోటీ చేస్తున్నారు.



హర.. హర మహాదేవ
వేములవాడ: రాజన్న ఆలయంలో కొనసాగుతున్న శివకల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు చేశారు. వీరశైవుల ఖడ్గాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆది(సా॥)	సహర్ సోమ(ఉ॥)
కరీంనగర్	6.27	4.41
పెద్దపల్లి	6.34	4.48
రాజన్న సిరిసిల్ల	6.34	4.49
జగిత్యాల	6.34	4.48

గరిష్టం/కనిష్టం
41.0/27.0

వాతావరణం
జిల్లాలో ఈరోజు వాతావరణం సాధారణంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఉక్కపోత ఉంటుంది. రాత్రిపూట కాస్త చల్లగా ఉంటుంది.





రన్ ఫర్ జీసస్

నగరంలో ర్యాలీ తీస్తున్న క్రైస్తవులు

ఈస్టర్ సందర్భంగా శనివారం స్థానిక సెంటినరీ వెస్లీ, వెస్లీ కేథడ్రల్ సెండ్ మార్క్ చర్చితో పాటు నగరంలోని పలు చర్చిల పాస్టర్ల ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించారు. కోర్టు చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి ప్రారంభమైన రన్ అమరవీరుల స్తూపం మీదుగా వెస్లీచర్చి వరకు ఉత్సాహంగా సాగింది. తిమోతి జయరాజ్ మాట్లాడుతూ స్థానిక సంఘాల సౌజన్యంతో కార్యక్రమాన్ని ఘనంగా ఏర్పాటు చేశామన్నారు. పాల్కో మాల్, ఎస్.జాన్, రాములు, ఎలీషా, డేవిడ్ రాజ్, కృష్ణఫర్, సురేశ్, చంద్రరావు, సత్యం, దేవదాస్, విల్సన్, సంజయ్, మధుమోహన్ పాల్గొన్నారు. – సప్తగిరికాలనీ(కరీంనగర్)



ఆనందోత్సాహాలతో విద్యార్థులు

ఇళ్లకు వెళ్తున్న ఆనందంలో బాలికలు

బైబై.. ఎంజాయ్

పదోతరగతి పరీక్షలు శనివారంతో ముగిశాయి. హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు ఇంటిబాట పట్టారు. స్నేహితులకు సెండాఫ్ ఇచ్చుకున్నారు. మళ్లీ కలుద్దాం మిత్రమా అంటూ.. బైబై చెప్పుకున్నారు. సమ్మర్ సెలవులు ఎంజాయ్ చేస్తామని అన్నారు. ఈ క్రమంలో బస్టాండ్, పలు ఏరియాలు విద్యార్థులతో రద్దీగా కనిపించాయి. ఈ నెల 18నుంచి ప్రారంభమైన పరీక్షలు 30తో ముగిశాయి. చివరిరోజు సాంఘీకశాస్త్రం పరీక్షకు 12,565మందికి గానూ 12,548మంది హాజరై, 14మంది గైర్హాజరైనట్లు డీఈవో సీహెచ్.జనార్దన్‌రావు తెలిపారు. ప్రైవేటు విద్యార్థులు 34మందికి 15మంది హాజరుకాగా 19మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. – సప్తగిరికాలనీ(కరీంనగర్)



చల్లని సేవలకు సలామ్

తడారుతున్న గొంతులకు చల్లని నీరందించి ప్రాణాలు నిలుపుతూ.. నీటి జాడల కోసం వెతుకుతున్న పిచ్చుకల కోసం నీటితొట్టెలు పెడుతూ.. అలసిపోయిన ప్రయాణికులకు మజ్జిగ ఇచ్చి సత్తువ నింపుతూ.. ఆదర్శంగా నిలుస్తున్నారు పలువురు దాతలు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేసవిలో పలువురు స్వచ్ఛందంగా చలివేంద్రాలు.. మజ్జిగ కేంద్రాలు.. నీటితొట్లు ఏర్పాటు చేసి దాహార్తి తీరుస్తున్నారు. ఎండాకాలంలో గుక్కెడునీరు పోసి ప్రాణాలు నిలుపుతున్న మానవతవాదులపై ఈ వారం సండే స్పెషల్...

- వివరాలు 8లో

న్యూస్‌రీల్

ఉపాధి హామీలో కొత్తపల్లి టాప్



కొత్తపల్లి: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో అత్యున్నత పనితీరు కల్పించినందుకుగాను కొత్తపల్లి మండలానికి రాష్ట్రంలో నంబర్‌వన్ ర్యాంకు లభించింది. మండలంలోని ఎనిమిది గ్రామాల్లో ఉన్న ఉపాధి హామీ పథకం కూలీలకు 100రోజుల పాటు పనిదినాలు కల్పించడంతో పాటు మెరుగైన పనితీరును కల్పించినందుకు ఈ అవార్డు లభించినట్లు ఎంపీపీ పిల్లి శ్రీలత తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 598 మండలాల్లో కొత్తపల్లికి ప్రథమస్థానం లభించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌లను శనివారం మర్యాదపూర్వకంగా కలవగా వారు అభినందనలు తెలిపారు. వైస్ ఎంపీపీ భూక్య తిరుపతి నాయక్, ఎంపీటీసీలు కొమ్ము హేమలత, కో–ఆప్షన్ సభ్యుడు షరీఫ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాసారపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రామడుగు ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం



రామడుగు: రామడుగు ఎంపీపీ కలిగేటి కవితపై ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గింది. మండలంలో 13మంది ఎంపీటీసీలు ఉండగా, శనివారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో 12మంది అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. దీంతో ఎంపీపీపై ఎంపీటీసీలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు ఆర్డీవో మహేశ్వర్, ఎంపీడీవో రాజేశ్వరి తెలిపారు. మరో నాలుగైదు రోజుల్లో మండల పరిషత్తు ఉపాధ్యక్షుడు పూరెల్ల రాజగోపాల్‌గౌడ్‌కు ఇన్‌చార్జి ఎంపీపీగా ఆధికారులు బాధ్యతలు అందించే అవకాశముంది. కాగా ఎంపీటీసీలు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు సన్నిహితుడైన వన్నారం ఎంపీటీసీ జవ్వాజి హరీశ్‌కు మద్దతుగా ఎంపీపీ కవితపై అవిశ్వాసం ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ఎంపీటీసీ అయిన హరీశ్‌ను ఎంపీపీగా ఎన్నుకునే అవకాశముంది.

టికెట్ ఎవరి చేతికో..

అభయ 'హస్తం'పై ఉత్కంఠ
- కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిని ఇంకా ప్రకటించని కాంగ్రెస్
- తీన్మార్ మల్లన్నను వ్యతిరేకిస్తున్న ప్రవీణ్ రెడ్డి వర్గం
- ఇప్పటికే బీఆర్ఎస్– బీజేపీల మధ్య నాన్‌లోకల్ మాటల యుద్ధం
- స్థానికేతరులకు ఇస్తే.. పనిచేసేది లేదంటున్న హస్తం కేడర్
- అసెంబ్లీ తరహాలోనే ఆలస్యం చేస్తున్నారని మండిపాటు
- త్వరలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి కీలక నేతలు

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

కరీంనగర్ పార్లమెంటు అభ్యర్థిని కాంగ్రెస్ పార్టీ ఇంకా ప్రకటించలేదు. ముందుగా అనుకున్న విధంగా అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి పేరు కాకుండా తెరపైకి మరో రెండు కొత్త పేర్లు రావడంతో కేడర్ అయోమయంలో పడింది. ఇప్పటికే కరీంనగర్‌లో లోకల్ నాన్ లోకల్ అంటూ సిట్టింగ్ ఎంపీ బండి సంజయ్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ మధ్య మాటల యుద్ధం నడుస్తున్న వేళ మరో స్థానికేతరుడు తీన్మార్ మల్లన్నకు టికెట్ ఇస్తే తాము పనిచేసే పరిస్థితి ఉండదని స్థానికనేతలు కుండబద్దలు కొడుతున్నారు. ఇప్పటికే పలు దఫాలుగా ఎంపీ అభ్యర్థులను ప్రకటించిన హస్తం అధిష్టానం తెలంగాణలో ఎంతో కీలకమైన కరీంనగర్ ఎంపీ స్థానానికి మాత్రం ఇంకా అభ్యర్థిని ప్రకటించకపోవడం, స్థానికేతరులకు అవకాశం ఇస్తారన్న ఊహాగానాలు మొదలవడంతో కేడర్‌లో గందరగోళ పరిస్థితి నెలకొంది.



ప్రవీణ్‌రెడ్డి అభిమానుల గుస్సా
అసెంబ్లీ ఎన్నికల్లో తన సీటును పార్టీ కోసం త్యాగం చేసిన హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డికి అదే సమయంలో ఎంపీ సీటు ఇస్తామని అధిష్టానం మాటిచ్చింది. ప్రవీణ్‌రెడ్డి పోటీకి సిద్ధమయ్యారు. పార్లమెంటు పరిధిలో ప్రచార పోస్టర్లు వేసుకున్నారు. కానీ, అకస్మాత్తుగా తెరపైకి వెలిచాల రాజేందర్‌రావు పేరు వచ్చింది. ఇప్పుడు ఆయన ఢిల్లీలో ప్రయత్నాలు చేస్తూ అధిష్టానాన్ని ఒప్పించే పనిలో పడ్డారు. ఈ పరిణామాన్ని నిశితంగా పరిశీలిస్తున్న ప్రవీణ్‌రెడ్డి వర్గం కిమ్మనడం లేదు. ఇది చాలదన్నట్లుగా అదనంగా తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ పేరును తెరపైకి కాంగ్రెస్ నేతలు తీసుకువచ్చారు. దీంతో ప్రవీణ్‌రెడ్డి అభిమానులు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. తమకు హుస్నాబాద్, హుజూరాబాద్, మానకొండూరు, కరీంనగర్ నియోజవకర్గాల్లో బలమైన ఓటు బ్యాంకు ఉందని, తమను కాదని ఎక్కడి నుంచో నాయకులను తీసుకురావాల్సిన అగత్యమేంటని ప్రశ్నిస్తున్నారు.

ఇప్పటికే దూరమైన రోహిత్‌రావు
పార్టీ టికెట్ కోసం కొన్నేళ్లుగా ఎమ్మెస్సార్ మనవడు మేనేని రోహిత్‌రావు కాంగ్రెస్‌లో పనిచేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ నిరాకరించిన అధిష్టానం ఎంపీ ఎన్నికల సమయంలో పరిశీలిస్తామని హామీ ఇచ్చినా నెరవేరలేదు. దీంతో ఆయన కొంతకాలంగా పార్టీ వ్యవహారాలకు అంటిముట్టనట్లుగా ఉంటున్నారు. తనకు టికెట్ రాకున్నా.. ప్రవీణ్‌రెడ్డి కోసం పనిచేసేందుకు రోహిత్‌రావు సంసిద్ధత వ్యక్తం చేశారని తెలిసింది. తీరా ప్రవీణ్‌రెడ్డిని కాదని ఇంకెవరికి ఇచ్చినా రోహిత్‌రావు వర్గం పనిచేసే పరిస్థితి కనిపించడం లేదు. పార్టీ కోసం పనిచేసిన వారిని కాదని, కనీసం పార్టీలో సభ్యత్వం లేనివారిని పోటీలోకి దింపడంపై జిల్లా కాంగ్రెస్‌లో భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి.

త్వరలో కాంగ్రెస్‌లోకి గులాబీ నేతలు
బీఆర్ఎస్ అధిష్టానానికి వరుసషాకులు తగులుతున్న వేళ.. కరీంనగర్ జిల్లా మాత్రం కంచుకోటలా ఉంటూ వస్తోంది. కొంతకాలంగా హస్తం పార్టీ నేతల లాబీయింగ్ కొలిక్కి వచ్చినట్లే కనిపిస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. జిల్లాకు చెందిన కీలక గులాబీ నేతలు ఈనెల 6న హైదరాబాద్ శివారులోని తుక్కుగూడలో జరిగే రాహుల్ గాంధీ సభలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోనున్నారని సమాచారం.

తెరపైకి మరో వ్యక్తి..
కరీంనగర్ పార్లమెంటు స్థానానికి కాంగ్రెస్ నుంచి అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, తీన్మార్ మల్లన్న, వెలిచాల రాజేందర్‌రావులతోపాటు మరో ఆసక్తికర వ్యక్తి పేరు వినిపిస్తోంది. బీఆర్ఎస్‌లో ముఖ్యనేతగా ఉన్న ఓ వ్యక్తిని పార్టీలోకి చేర్చుకోగానే అతన్నే ఎంపీగా పోటీ చేయిస్తారన్న ప్రచారం ఆసక్తిగా మారింది. ఒకవేళ అదే వాస్తవరూపం దాలిస్తే.. కరీంనగర్ రాజకీయాలు ఊహించని మలుపు తీసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

టికెట్ ప్రకటించిన పెద్దపల్లిలో అనిశ్చితే..
పెద్దపల్లి పార్లమెంట్‌లో కాంగ్రెస్ టికెట్ ఖరారైనా అనిశ్చితే నెలకొంది. గడ్డం కుటుంబానికి చెందిన వినోద్‌కుమార్ బెల్లంపల్లికి, వివేక్ చెన్నూర్ ఎమ్మెల్యేలుగా ఉన్నారు. తాజాగా పెద్దపల్లి ఎంపీగా ఆదే కుటుంబానికి చెందిన గడ్డం వంశీకృష్ణకు టికెట్ కేటాయించడంపై నియోజకవర్గంలో రచ్చ జరుగుతోంది. మాదిగలు ఎక్కువగా ఉండే పెద్దపల్లి స్థానానికి మాదిగ సామాజికవర్గం వారికే టికెట్ ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తున్నారు. స్థానిక మంత్రి, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షుడికి సమాచారం ఇవ్వకుండా గడ్డం వంశీకి టిక్కెట్ కేటాయించారని, పునరాలోచన చేయకపోతే వచ్చే నెల 5న న్యాయ దీక్ష చేస్తానంటూ యువజన జాతీయ మాజీ కార్యదర్శి ఊట్ల వరప్రసాద్ అధిష్టానాన్ని హెచ్చరించారు. తాజాగా రాష్ట్రంలో మారిన రాజకీయ సమీకరణలతో టికెట్ మార్పుపై ఉహాగానాలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలోని మూడు రిజర్వ్‌డ్ స్థానాల్లోని పెద్దపల్లి, నాగర్‌కర్నూల్‌లో మాల సామాజికవర్గానికి టికెట్ కేటాయించింది. వరంగల్‌లో మాదిగ సామాజికవర్గంలోని ఉప కులానికి చెందిన కడియం శ్రీహరికే టిక్కెట్ కేటాయించనున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి టికెట్ మార్పు చేస్తుందా? గడ్డం వంశీనే కొనసాగిస్తాందో వేచి చూడాల్సి ఉంది. కాగా.. టికెట్ ఖరారు చేసుకున్న గడ్డం వంశీ ప్రచారంలో దూసుకపోకపోయినా.. వివిధ పార్టీల్లో ఉన్న నేతలను కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుతూ బలాన్ని పెంచుకుంటున్నారు.

సస్పెండ్ చేయిస్తా..!

- బల్దియా ఉద్యోగులపై ఓ కార్పొరేటర్ వీరంగం

కరీంనగర్ కార్పొరేషన్: 'ఇక్కడి నుంచి వెళ్లండి. ఆమె ఆస్తిపన్ను కట్టదు. నిన్ను, మీ అధికారులను సస్పెండ్ చేయిస్తా'..అంటూ ఓ కార్పొరేటర్ నగరపాలకసంస్థ అధికారులపై వీరంగం సృష్టించారు. ఆర్థిక సంవత్సరం ముగియనుండడంతో ఆస్తిపన్ను వసూళ్లకు నగరపాలకసంస్థ రెవెన్యూ విభాగం ఉద్యోగులు శనివారం నగర శివారులోని ఓ డివిజన్‌కు వెళ్లారు. ఆస్తిపన్ను చెల్లించాలని ఓ ఇంటి యజమానిపై ఒత్తిడి పెంచారు. ఆ సమయంలోనే అక్కడికి వచ్చిన ఆ డివిజన్ కార్పొరేటర్ కార్పొరేషన్ ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తన డివిజన్‌లో పన్ను వసూలు చేయొద్దంటూ హెచ్చరించారు. అవసరమైతే సదరు ఇంటి యజమానితో మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేపిస్తానన్నారు. అవాక్కైన నగరపాలకసంస్థ ఉద్యోగులు చేసేదేమిలేక వెనుదిరిగారు. ఆస్తి పన్ను వసూళ్లకు సహకరించాల్సిన ప్రజాప్రతినిధులు అడ్డుపడడం ఉద్యోగవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

నగరపాలక కలెక్షన్ రూ.1.38 కోట్లు

కరీంనగర్ కార్పొరేషన్: ఆస్తి పన్ను వసూళ్లకు ఒక్కరోజే సమయం ఉండడంతో నగరపాలక సంస్థ మరింత వేగం పెంచింది. ఉన్నతాధికారులు సైతం క్షేత్రస్థాయిలో బకాయిలు అధికంగా ఉన్న సంస్థలను సంప్రదిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం రూ.1.38లక్షలు వసూలయ్యాయి. ఇందులో బీఎస్ఎన్ఎల్, డీటీఓ ఆఫీసుల పన్ను రూ.65,78,749, రూ.7,90,080 వసూలు చేశారు. ఆదివారం ఈ ఆర్థిక సంవత్సరం చివరిరోజు కావడంతో బల్దియాలో ప్రత్యేక కౌంటర్లను అందుబాటులో ఉంచామని కమిషనర్ తెలిపారు.

పోస్టల్ ఓటింగ్ సౌకర్యం కల్పించండి

- వీసీలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

కరీంనగర్ అర్బన్: ఎన్నికల విధుల్లో సేవలు అందించే ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ కలెక్టర్‌ను ఆదేశించారు. శనివారం రాత్రి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యం కల్పనపై హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ వద్ద తప్పనిసరిగా ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బంది పేరు, ఎంప్లాయీకోడ్, హోదా, మొబైల్ నంబర్, ఓటరు వివరాలు రూపొందించాలని సూచించారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతుల నిర్వహించే సమయంలో అవసరమైన మేర కంప్యూటర్లు ఏర్పాటు చేసి ఫారం–12 అందజేసి ఉద్యోగి ఆప్షన్ తీసుకోవాలని పేర్కొన్నారు. రవాణా, మీడియా, విద్యుత్, బీఎస్ఎన్ఎల్, పోస్టల్, టెలిగ్రామ్, ఆర్టీసీ, అగ్నిమాపక సేవలు, ట్రాఫిక్ పోలీస్, మొదలగు అత్యవసర శాఖల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించడం జరుగుతుందని అన్నారు. 85 సంవత్సరాల పైబడి పూర్తిగా నడవలేని సీనియర్ సిటిజెన్లకు, దివ్యాంగులకు ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ అమలు చేస్తోందన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



వీసీలో కలెక్టర్ పమేలా సత్పతి

యాసంగి కొనుగోళ్లపై దృష్టి సారించండి
యాసంగి ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులు, మిల్లర్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో యాసంగి కొనుగోళ్లపై మిల్లర్లు, సివిల్ సప్లయ్ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో కొనుగోళ్లకు మిల్లర్లు సహకరించాలని తెలిపారు. క్వాప్రా పురుగువల్ల మిల్లర్లు ఎదుర్కొనే సమస్యలపై ఎఫ్‌సీఐ అధికారులతో సమీక్షిస్తానని అన్నారు. యాసంగిలో బాయిల్డ్ రైస్ మాత్రమే మిల్లింగ్ చేయడానికి మిల్లర్లు ముందుకురావడంతో వారి నుంచి వినతిపత్రం తీసుకున్న కలెక్టర్ విషయాన్ని పైఅధికారులకు నివేదిస్తానని పేర్కొన్నారు. ప్రతిరోజు 3873 మిల్లింగ్ టార్గెట్ జరిగేలా చూడాలని పేర్కొన్నారు. జిల్లాలో 341 కొనుగోలు కేంద్రాలకు ఇన్‌చార్జిలను ఏర్పాటు చేశామని వివరించారు. అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఎస్వో గౌరిశంకర్, డీఎం రజనీకాంత్, రైస్‌మిల్లర్లు పాల్గొన్నారు.

ఆర్థికంగా దెబ్బతీసేందుకు మోదీ కుట్ర

- ఇందిరాచౌక్‌లో కాంగ్రెస్ ఆందోళన

కరీంనగర్ కార్పొరేషన్: కాంగ్రెస్ పార్టీని ఆర్థికంగా దెబ్బతీసేందుకు ప్రధాని నరేంద్రమోదీ కుట్ర పన్నారని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆరోపించారు. ఆదాయపన్ను పేరిట కాంగ్రెస్‌పార్టీని వేధించడాన్ని నిరసిస్తూ పీసీసీ పిలుపు మేరకు శనివారం నగరంలోని ఇందిరాచౌక్‌లో ఆందోళన నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించి, ప్లకార్డులు ప్రదర్శిస్తూ మోదీకి, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్‌ను దెబ్బతీయాలనే కుట్రతోనే ఎన్నికల వేళ రూ.1820 కోట్లు ఆదాయ పన్ను కట్టాలని నోటీసు ఇచ్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు మోదీని ఓడగొట్టడం ఖాయమని, ఓటమి భయంతోనే కాంగ్రెస్‌పై కుట్రలు చేస్తున్నారన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, రహమత్ హుస్సేన్, మునిగంటి అనిల్, శ్రావణ్‌నాయక్, కొరివి అరుణ్‌కుమార్, పెద్దిగారి తిరుపతి, చర్ల పద్మ పాల్గొన్నారు.



ఇందిరాచౌక్‌లో ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

క్లుప్తంగా

బావిలో దూకిన వృద్ధురాలు

● కాపాడిన దివ్యాంగుడు



వృద్ధురాలిని బయటకు తీస్తున్న రవి



యువకుడు రవి

శంకరపట్నం: ఓ కాలు సరిగా పని చేయకున్నా బావిలో దూకిన వృద్ధురాలిని కాపాడి శభాష్ అనిపించుకున్నాడు ఓ దివ్యాంగుడు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలో శనివారం ఓ వృద్ధురాలు వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బావి సమీపంలో నివాసముంటున్న బండారి రవి అనే దివ్యాంగుడు గమనించి కాపాడాడు. వృద్ధురాలు కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నట్లు తెలిసింది. బావిలో దూకిన గడ్డం మల్లీశ్వరి(68)ని కాపాడేందుకు చెట్టు కొమ్మలు పట్టుకొని బావిలో దిగిన రవి నీటమునుగుతున్న మల్లీశ్వరిని రక్షించాడు. బావి వద్ద గుమిగూడిన ప్రజలు తాళ్ల సహాయంతో బావి నుంచి బయటికి తీశారు. వృద్ధురాలికి ఇద్దరు కుమారులున్నారు. వెంటనే 108 వాహనానికి సమాచారమందించి చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

ఆర్మీ సోల్జర్ ఆత్మహత్య



నెల్లి రామకృష్ణ(ఫైల్)

సైదాపూర్: దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న కరీంనగర్ జిల్లాకు చెందిన సైనికుడు నెల్లి రామకృష్ణ(27) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు, మృతుని బంధువులు తెలిపిన వివరాలు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం గొడిశాలకు చెందిన నెల్లి తిరుపతి–స్వరూప దంపతుల కుమారుడు రామకృష్ణ ఆర్మీలో ఐదేళ్లుగా సైనికుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. రెండు నెలల క్రితం స్వగ్రామం వచ్చి వెళ్లాడు. ఆ సమయంలో అక్కడ ఇబ్బందిగా ఉందని తల్లిదండ్రులతో చెప్పినట్లు సమాచారం. శుక్రవారం రాత్రి డ్యూటీ ముగియగానే గదిలోకి వెళ్లిన రామకృష్ణ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహం స్వగ్రామానికి శనివారం చేరుకుంటుందని అక్కడి అధికారులు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. రామకృష్ణ మృతిపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రామకృష్ణ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం ఇవ్వాలని భగవంతున్ని కోరారు.

ట్రాక్టర్ బోల్తాపడి ఒకరు మృతి



శ్రీనివాస్ (ఫైల్)

ముత్తారం(మంథని): ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ముత్తారంలో శనివారం వాటర్ ట్యాంకర్ ట్రాక్టర్ బోల్తాపడి జంబు శ్రీనివాస్(45) దుర్మరణం చెందాడు. ముత్తారంలో నిర్మాణం చేపట్టిన సీసీ రోడ్డుకు వాటర్ ట్యాంకర్ ట్రాక్టర్ నడుపుతుండగా ప్రమాదం జరిగింది. సంఘటన స్థలాన్ని ఎస్సై మధుసూదన్‌రావు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. శ్రీనివాస్‌కు భార్య దేవక్క, కొడుకు మధుకర్, కూతురు నిరోష ఉన్నారు.

చల్లని సేవలకు సలామ్

సండే స్పెషల్

● చలివేంద్రాలతో దప్పికతీరుస్తున్న దాతలు
● పక్షులకు నీళ్లు పెడుతున్న ప్రేమికులు
● ఏళ్లుగా సమాజసేవతో సంతృప్తి
● ఆదర్శం చిరువ్యాపారుల సేవాస్ఫూర్తి

మండే వేసవిలో తడారుతున్న గొంతులకు తాగునీరు అందించే వారు కొందరు. నీటి జాడ కనిపించని పక్షుల కోసం డాబాలపై నీటితొట్టీలు పెట్టేవారు మరికొందరు. తాహతమకు మించినప్పటికీ కూలీలు.. బాటసారుల కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారు ఇంకొందరు. అందరి ఉద్దేశం సమాజసేవే.. నిండు వేసవిలో గుక్కెడు నీటి కోసం తండ్లాటే మనుషులకు గ్లాసు నీళ్లందించి ప్రాణాలు నిలుపుతున్నారు. భానుడి ప్రతాపానికి విలవిల్లాడే పక్షులకు నీటి తొట్టీలు పెట్టి వాటి మనుగడకు సాయం చేస్తున్నారు. ఇలా.. నిండు వేసవిలో చల్లటి నీటితో ఆప్యాయతలు పంచుతున్న దాతలపై ప్రత్యేక కథనం...

పక్షుల కోసం వాటర్‌ఫౌంటేన్



కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని సింగరేణి సంస్థ ఓసీపీ–2లో సేఫ్టీ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎండీ ఆసిఫ్, ఆయన భార్య ఫర్వీన్‌కు పక్షులు, జంతువులు ఉంటే ప్రేమ. స్థానిక విఠల్‌నగర్‌లో ఉంటున్నారు. వేసవిలో పక్షుల దాహార్తి తీర్చేందుకు గత ఎనిమిదేళ్లుగా వారి ఇంటి ఆవరణలో తొలత మట్టి తొట్లు ఏర్పాటు చేశారు. అయితే తొట్టిల్లోని నీరు వేడి అవుతుండడంతో వాటర్‌ఫౌంటేన్ ఏర్పాటు చేశారు. ఒక డ్రమ్ములో చల్లటి నీటిని పోసి, అందులో కూలర్ మోటార్‌ను పెట్టి.. వాటర్ ఫౌంటేన్‌గా తయారు చేశారు. దీన్ని వారి ఇంటిలోని చెట్ల కింద పెట్టి ఫౌంటేన్‌లా నీళ్ల పైకి చిమ్మేలా ఏర్పాట్లు చేశారు. ఇలా పైకి చిమ్మే నీటిలో పక్షులు ఎంచక్కా ఆడుతూ.. చల్లని నీటిని తాగుతున్నాయి. అంతేకాకుండా పక్షుల కోసం ప్రత్యేకమైన ఆహారం తీసుకొచ్చి చెట్లకింద చల్లుతుంటారు.

15 ఏళ్లుగా దాహం తీరుస్తూ..



రాచర్లగొల్లపల్లిలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్న లయన్ సభ్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండు వేసవిలో వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రయాణికులు, ప్రజల దాహార్తిని తీర్చాలనే లక్ష్యంతో 15 ఏళ్ల క్రితం 12 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు కలిసి మైత్రి పరివార్ అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. చలివేంద్రాలు ఏర్పాటు చేసి దాహార్తి తీర్చుతున్నారు. 'నీళ్ల దానం మహాదానం' అనే నానుడిని అనుసరించి ఏటా ఎల్లారెడ్డిపేట మండలకేంద్రం, రాచర్లగొల్లపల్లి గ్రామాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. మైత్రి పరివార్ అనంతరం అదే సంస్థలోని సభ్యులు లయన్స్ క్లబ్‌గా ఏర్పడి ఆ సేవలను కొనసాగిస్తున్నారు. లయన్ కోట సతీశ్ సహకారంతో ప్రతీ ఏడాది మార్చి 15 నుంచి జూన్ 10 వరకు రూ.50వేలు ఖర్చుచేసి తాగు నీటితోపాటు మజ్జిగను అందిస్తున్నారు.

సామాజిక సేవతో సంతృప్తి



సామాజిక సేవలో సంతృప్తి ఉంటుంది. వేసవిలో ప్రజలకు తాగు నీటిని అందించాలనే సంకల్పంతో 12 మంది ఉపాధ్యాయులం కలిసి మైత్రి పరివార్‌ను ఏర్పాటు చేశాం. గత 15 ఏళ్లుగా రెండు చలివేంద్రాలను ఏర్పాటు చేసి తాగునీటిని అందిస్తున్నాం. ఈ కార్యక్రమాన్ని ప్రతీ వేసవిలో నిరంతరం కొనసాగిస్తాం.

– ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి, లయన్స్ క్లబ్ జిల్లా క్యాబినెట్ సభ్యుడు, ఎల్లారెడ్డిపేట

మనసున్న చిరువ్యాపారులు..

జగిత్యాలటౌన్: వారంతా చిరువ్యాపారులే. రూపాయి.. రూపాయి జమచేస్తేనే వారి కుటుంబాలను వెల్లదీసుకోగలరు. కానీ తమ వంతుగా వేసవిలో కష్టమర్లు, ప్రయాణికుల దాహార్తి తీర్చాలనే కోరికతో మినీచలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. గత కొన్నాళ్లుగా తమ తాహతుకు మించినప్పటికీ ప్రయాణికులు, వినియోగదారుల దాహార్తి తీర్చడంలోనే తమకు తృప్తి ఉందంటున్నారు.

15 ఏళ్లుగా..



మంచి చేయాలనే సంకల్పంతోనే నా పండ్ల బండి వద్ద చల్లని నీటి డబ్బాను పెడుతున్నాను. గత 15 ఏళ్లుగా ప్రయాణికుల దాహార్తి తీర్చుతున్నాను. రోజుకు ఐదు నుంచి ఆరు డబ్బాల నీటిని అందిస్తున్నాను. నాకెంతో సంతృప్తినిస్తుంది.

– అబ్దుల్ బాసిద్ పండ్ల వ్యాపారి, జగిత్యాల

కస్టమర్ల కోసం..



నాకు ఉపాధి కల్పిస్తున్న కస్టమర్ల కోసం నీటి డబ్బాను ఏర్పాటు చేస్తున్న. గత పదేళ్లుగా మినీ చలివేంద్రం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది. ఎండలో వచ్చే వారి దాహం తీర్చడం ఎంతో సంతృప్తినిస్తుంది.

– చేని నాగరాజు, తాళం చెవుల తయారీ, విక్రయదారు

మానవ సేవే.. మాధవ సేవ



మనుషులకు సేవ చేస్తే భగవంతునికి చేసినట్లే. అందుకే కొన్నేళ్లుగా జగిత్యాల ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం ఏటా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నాం. సత్యసాయిబాబా సందేశం స్ఫూర్తితోనే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం.

– బట్టు రాజేందర్ సత్యసాయి సేవాసమితి కన్వీనర్ జగిత్యాల

పక్షుల సేవలో కుటుంబం



కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని కాకతీయనగర్‌కు చెందిన బోళ్ల చంద్రశేఖర్–పావని దంపతులు పక్షి ప్రేమికులు. చంద్రశేఖర్ ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. తమ ఇంట్లోని ఏసీ కంప్రెషర్ల నుంచి కారే నీటిని పక్షుల తాగడాన్ని చూసి చంద్రశేఖర్ చలించిపోయాడు. వెంటనే పక్షుల కోసం తమ డాబాపై ప్రత్యేకంగా నీటితొట్లు ఏర్పాటు చేశారు. గత నాలుగేళ్లుగా ఏటా వేసవిలో తమ డాబాపై, వరండాలో తల్లి శ్రీలతతో కలిసి చంద్రశేఖర్ దంపతులు మట్టితొట్లలో నీళ్లు పెడుతున్నారు. వాటి ఆకలి తీర్చేందుకు మరో తొట్టిలో గింజలు పోస్తున్నారు.

స్నేహితుడి కోరిక మేరకు..



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ (ఫైల్)

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రగతినగర్‌కు చెందిన సయ్యద్ ఖాలిద్ స్థానిక చౌరస్తాలో పదేళ్లుగా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. పదేళ్ల క్రితం ఖాలిద్ గల్ఫ్‌లో ఉన్న సమయంలో స్థానికంగా తాగునీటి గోస ఉండేది. ఆ రోజుల్లో తన మిత్రుడు, స్థానిక న్యాయవాది ఉప్పు రాజు కోరిక మేరకు ప్రగతినగర్ చౌరస్తాలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఏటా వేసవిలో ప్రయాణికుల కోసం చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే ఎండలు ముదరడంతో ప్రస్తుతం ఇక్కడే ఉంటున్న సయ్యద్ ఖాలిద్ త్వరలోనే చలివేంద్రం ఏర్పాటు చేస్తానని తెలిపారు.

బాటసారుల సేవలో..



నీళ్లందిస్తున్న సత్యసాయి సేవాసమితి సభ్యులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో పదహారేళ్లుగా సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఏటా వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు జెండా ప్రాంతంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. వివిధ పనుల కోసం జిల్లా కేంద్రానికి వచ్చే ప్రజలు, ప్రయాణికులు, కూలీల సేవలో తరిస్తున్నారు. దినసరి కూలీలకు ఎండ నుంచి రక్షణకు టోపీలు అందిస్తున్నారు.

ఆదర్శం కూరగాయల వ్యాపారి



జూలపల్లిలో ఏర్పాటు చలి వేంద్రం

పెద్దపల్లిరూరల్: మండల కేంద్రానికి చెందిన మైనార్టీ నిరుపేద యువకుడు ఆతిక్ పాషా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అభిమాని.కూరగాయలు విక్రయించే ఆతిక్‌పాషా ఏటా వేసవిలో దుద్దిళ్ల శ్రీపాదరావు స్మారకార్థం స్థానిక మందోట వద్ద చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నాడు. ఎవరి నుంచి రూపాయి ఆశించకుండా కూరగాయలు విక్రయిస్తే వచ్చిన లాభాల నుంచే కొంత మొత్తం సమాజసేవకు వెచ్చిస్తున్నాడు. ఆతిక్‌పాషా స్వస్థలం జూలపల్లి. చిన్న తనంలోనే తండ్రి అనారోగ్యంతో చనిపోగా.. తల్లి కష్టపడి పెంచింది. ప్రతీ రోజు వారసంతల్లో కూరగాయలు విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నాడు.

పక్షి ప్రేమికుడు



పక్షుల కోసం నీటిని, గింజలను ఏర్పాటు చేసిన అనంతుల రమేశ్

విద్యానగర్ : కరీంనగర్ కిసాన్‌నగర్‌కు చెందిన అనంతుల రమేశ్ పక్షి ప్రేమికుడు. తండ్రి రైతు కావడంతో ఆయన పక్షుల కోసం ఇంటి చుట్టూ వాసాలు, గుంజలకు వరి గొలుసులు వేలాడదీసేవాడు. మట్టి పాత్రల్లో నీళ్లు ఉంచేవాడు. దీంతో ఇంటి పరిసరాలు పిచ్చుకల కిచకిచ రావాలతో సందడిగా ఉండేది. తండ్రి వారసత్వాన్ని రమేశ్ కొనసాగిస్తున్నాడు. పదేళ్లుగా ఇంటిచుట్టూ పల్లె వాతావరణం ఏర్పాటు చేసి పిచ్చుకల కోసం వరి గింజలు, నీటి కోసం ప్రత్యేక పాత్రలు ఏర్పాటు చేసాడు. దీంతో ఆయన ఇంటి చుట్టూ పగలు, రాత్రి తేడాలేకుండా సందడి చేస్తుంటాయి.

జంతు స్నేహితుడు



బోయినపల్లి: సైకిల్‌పై వస్తున్న ఆయనను చూడగానే కుక్కలు తోకాడించుకుంటూ వస్తాయి. కవర్‌లో బిస్కెట్లు తీసేవరకు ఎదిరి చూస్తాయి. బిస్కెట్లు వేయగానే ఆనందంగా తింటాయి. పక్కవాడు ఆకలితో గోస పడుతున్న పట్టించుకోని ఈ రోజుల్లో బోయినపల్లిలో సుబ్బారావు కుక్కలకు చేను పరిసరాల్లో బిస్కెట్లు ఇస్తున్నాడు. 15 ఏళ్ల క్రితం ఆంధ్రా నుంచి వచ్చిన ఈయన బోయినపల్లిలో భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తాడు. నాలుగేళ్ల క్రితం కోవిడ్ సమయంలో ఆహారం దొరకక అల్లాడిన కుక్కలను చూసి చలించిపోయినట్లు చెప్పారు.

పక్షుల దాహార్తి తీర్చండి



బహుదూర్‌ఖాన్‌పేట పల్లె ప్రకృతి వనంలో ఏర్పాటు చేసిన డబ్బాలో నీళ్లు పోస్తున్న పంచాయతీ సిబ్బంది

కరీంనగర్‌రూరల్: ఎండలు మండుతున్నాయి. వచ్చే రెండు నెలల్లో తీవ్రత మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ముందస్తుగా స్పందించిన కరీంనగర్ కలెక్టర్ పమేల సత్పతి.. పశువులు, పక్షుల కోసం పల్లెప్రకృతి వనాల్లో నీళ్లు, దాణా అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. దీంతో పంచాయతీల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు పక్షులు, పశువులకు తాగు నీటి సౌకర్యం కల్పనకు చర్యలు తీసుకున్నారు. ప్లాస్టిక్ డబ్బాలు చెట్లకు ఏర్పాటు చేశారు. పక్షుల ఆహారం కోసం ధాన్యం, మొక్కజొన్న, బియ్యం అందుబాటులో ఉంచారు. పశువుల దాహార్తి తీర్చడం కోసం నీటితొట్లు అందుబాటులోకి తెచ్చారు. వేసవికాలం పూర్తయ్యే వరకూ ఈ ప్రక్రియ కొనసాగాలని డీఎల్‌పీవోలు, ఎంపీడీవోలు, ఎంపీవోలను కలెక్టర్ ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

14 మంది మహిళల బైండోవర్

వేములవాడ: వేములవాడలోని మహాలక్ష్మి వీధిలో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారంతో కొన్ని గృహాలపై డీఎస్పీ నాగేంద్రచారి, శిశు సంక్షేమశాఖ అధికారులతో కలసి శనివారం దాడులు చేశారు. వ్యభిచార వృత్తిని కొనసాగిస్తున్న 14 మంది మహిళలను ఠాణాకు తీసుకొచ్చారు. అక్కడే వారికి కౌన్సెలింగ్ ఇచ్చిన అనంతరం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

జ్యోతిష్మతిలో 'ఉత్సవ్– 2024'



విద్యార్థినుల నృత్యం





కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు మాట్లాడుతున్న సాగర్‌రావు



తిమ్మాపూర్: జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కాలేజీ వార్షికోత్సవం శనివారం ఉత్సవ్–2024 పేరుతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి డిఫెన్స్ రీసెర్చ్, డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా (డీఆర్ఎంఎల్) మాజీ డైరెక్టర్ డాక్టర్ జి.మధుసూదన్ రెడ్డి, వరంగల్ చీఫ్ ఇన్వెస్టిగేటర్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీసీ అకాడమీ, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) సీఎస్ఈ విభాగం ప్రొఫెసర్ ఆర్‌బీవీ సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జ్యోతిష్మతి కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావుతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక నైపుణ్యాలు పెంపొందిచుకోవాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా దూసుకెళ్లాలన్నారు. కంపెనీలు స్థాపించి ఉద్యోగాలు ఇచ్చేస్థాయికి ఎదగాలన్నారు. కళాశాలలో చేరిన ప్రతీ విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు అన్నారు. తల్లిదండ్రులు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సెక్రటరీ జువ్వాడి సుమిత్ సాయి, ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ రావు, అకాడమీ ఆడిట్ డీన్ డాక్టర్ పీకే వైశాలి, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ పి. సంపత్ రావు పాల్గొన్నారు.

మనవడిపై తాత హత్యాయత్నం

● నిద్రిస్తున్న సమయంలో గొడ్డలితో దాడి
● ఆస్పత్రికి తరలింపు.. పరిస్థితి విషమం



మహేశ్

ధర్మారం(ధర్మపురి): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారం గ్రామానికి చెందిన సామంతుల మహేశ్ (28)పై తాత సామంతుల కొమురయ్య హత్యాయత్నం చేశాడు. ఎస్సై సత్యనారాయణ, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొమురయ్యకు కుమారుడు మల్లేశం, కూతురు కనుకవ్వ సంతానం. మల్లేశంకు వివాహమై ఇద్దరు కుమారులు జన్మించిన తరువాత దాదాపు 20ఏళ్ల క్రితం అనారోగ్యంతో మరణించాడు. దీంతో అతడి కుమారులిద్దరు అశోక్, మహేశ్‌ను కొమురయ్య పెంచి పెద్దచేశాడు. ఇద్దరికీ పెళ్లిళ్లు చేసి వారికి తన వ్యవసాయ భూమిని పంపకం చేశాడు. కాగా మహేశ్ తరచూ తాగి వచ్చి తాతతో గొడవపడేవాడు. తన అన్న అశోక్‌కు ఎనిమిది గుంటల భూమి ఎక్కువ ఇచ్చావని దూషిస్తూ బెదిరించేవాడు. ఈ క్రమంలో మహేశ్‌తో ఎప్పటికైనా తనకు ఇబ్బందులు తప్పవని కొమురయ్య భావించాడు. ఇంటి ముందు పడుకున్న మహేశ్‌పై శనివారం వేకువజామున గొడ్డలితో దాడి చేశాడు. ఇంట్లో నిద్రిస్తున్న అతడి తల్లి, భార్యకు మెలకువ వచ్చి బయటకు రావడంతో కొమురయ్య గొడ్డలిని అక్కడే వదిలేసి పరారయ్యాడు. ఈ ఘటనపై మహేశ్ మేనమామ కట్ట కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా మహేశ్‌ను చికిత్స నిమిత్తం కరీంనగర్ తీసుకెళ్లగా, పరిస్థితి విషమించడంతో వరంగల్ ఆసుపత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు.

క్లుప్తంగా

ఉద్యోగ విరమణ చేసిన పోలీసులకు సన్మానం



ఏఎస్సైలను సన్మానిస్తున్న సీపీ అభిషేక్ మహంతి

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ కమిషనరేట్‌లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన నలుగురు ఏఎస్సైలను శనివారం సీపీ అభిషేక్ మహంతి సన్మానించారు. స్పెషల్ బ్రాంచ్ ఏఎస్సై మహ్మద్ నూరుద్దీన్, మానకొండూర్ ఏఎస్సై మహ్మద్ బషీరుద్దీన్, ఏఆర్ ఏఎస్సై సయ్యద్ మొయినుద్దీన్, హుజురాబాద్ ఏఎస్సై పి.చంద్రారెడ్డిలకు పూలమాలవేసి శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనివార్యమన్నారు. విరమణ పొందుతున్న అధికారులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఏ.లక్ష్మీనారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మునిరామయ్య, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్‌రెడ్డి (వెల్ఫేర్), సురేష్ (అడ్మిన్), కరీంనగర్ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్సై మామిడి సురేందర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలి

విద్యానగర్(కరీంనగర్): మాదిగలకు జనాభా ప్రాతిపదికన అన్ని రాజకీయ పార్టీలు పార్లమెంటు సీట్లు కేటాయించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పొట్టపింజర రమేశ్ అన్నారు. శనివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో నిర్వహించిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని అధికారంలోకి వచ్చిన బీజేపీ మోసం చేసిందని, ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఈ సమావేశంలో సమితి జిల్లా అధ్యక్షుడు కొలిపాక సారంగం, నాయకులు ఎ.వెంకట్, శనిగరపు మధు, జి.వెంకన్న, నగేశ్, లక్ష్మణ్, రవికుమార్, రమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ ఉపకులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయించండి

కరీంనగర్‌టౌన్: ఎస్సీ ఉప కులాలకు తక్షణమే కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ ఎస్సీ 57 ఉప కులాల హక్కుల పోరాట సమితి నాయకులు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను కోరారు. ఈ మేరకు శనివారం కరీంనగర్‌లో ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి నాయకులు బండి సంజయ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన బండి సంజయ్ ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

వివాహ పరిచయ వేదిక

సప్తగిరికాలనీ(కరీంనగర్),: నగరంలోని పద్మనగర్‌లో గల భట్రాజు భవనంలో శనివారం జిల్లా భట్రాజ్ సంఘం ఆధ్వర్యంలో వివాహ పరిచయ వేదిక నిర్వహించారు.తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 200 మంది హాజరయ్యారు. జిల్లా నాయకుడు చెన్నమాధవుని పవనసుత రాజు, నాయకులు బాపు, విజయ రఘురామ, రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.


అమ్మకానికి సిద్ధంగా ఉన్న స్మార్ట్ వాచ్‌లు

సండే స్పెషల్

ఇస్మార్ట్ టైం

- స్మార్ట్ వాచ్‌లపై పెరుగుతున్న క్రేజ్
- ఆండ్రాయిడ్ ఫోన్లకు అనుసంధానం చేస్తూ వినియోగం
- మణికట్టుపై ఆరోగ్య సమాచారం

కరీంనగర్‌టౌన్: స్మార్ట్ వాచ్ ఇప్పుడు ఆరోగ్య సమాచారాన్ని అందించే హెల్త్ అనలైజర్ అయింది. మన హెల్త్ స్టేటస్‌ను ఒక డాక్టర్‌లా మానిటర్ చేస్తూ ఉంటుంది. వాచ్‌కు వెనుక ఉండే ఈసీజీ సెన్సార్లు ప్రతిక్షణం మన హెల్త్‌కు సంబంధించిన బులెటిన్ సిద్ధం చేస్తుంది. ఎప్పుడు కావాలంటే అప్పుడు మన హెల్త్ బులెటిన్ (బీపీ, పల్స్, బ్రీత్)ను చెక్ చేస్తూ నార్మల్‌గా ఉన్నారా? లేరా? విషయాన్ని తెలియజేస్తుంది. ఫ్రీఫాల్ డిటెక్షన్ టెక్నాలజీతో ఈ వాచ్ ఉపయోగిస్తున్న వారు సడెన్‌గా పడిపోతే ఈ వాచ్‌లో ఉన్న ఎమర్జెన్సీ నంబర్లకు లొకేషన్‌తో సహా ఎస్ఎంఎస్ చేస్తుంది.

ఆరోగ్య సమాచారం



స్మార్ట్ వాచ్ తయారైన రోజుల్లో డిజిటల్ సమయం, వివిధ దేశాల సమయం, టెంపరేచర్, ఫోన్ కనెక్టివిటీ మాత్రమే ఉండేవి. మారుతున్న టెక్నాలజీతో సరికొత్తగా స్మార్ట్ వాచ్ రూపాంతరం చెందింది. అడ్వాన్స్‌డ్ మోడ్‌లోకి వెళ్లి పల్స్, బీపీ, గుండె వేగం, ఆక్సిజన్ స్థాయి, ఈసీజీతో పాటు ఫిజికల్ ఫిట్‌నెస్‌ను ట్రాక్‌చేసి చూపించగలుగుతున్నాయి. ఈ సమాచారాన్ని 24 గంటల పాటు ట్రాక్ చేస్తుండడంతో ఎప్పుడంటే అప్పుడు చూసుకునే వీలుంటుంది.

ఫిజికల్ ఫిట్‌నెస్



స్మార్ట్ వాచ్ ఫిజికల్ ఫిట్‌నెస్‌కు ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రతీ రోజు వాకింగ్, వ్యాయ మం చేసే వారు ఈ వాచ్‌ల ను ఎక్కువగా ధరిస్తున్నారు. ఎంత దూరం వాకింగ్ చేశారు. ఎ న్ని స్టెప్స్ వేశారు. ఎన్ని క్యాలరీ లు కరిగించారనే ఇన్ఫర్మేషన్ ఇందులో చూపిస్తుంది. ఇందులో అడ్వాన్స్‌గా బ్రీత్ అనే అప్లికేషన్‌ను తీసుకు వచ్చారు. మనకు కావాల్సిన ఆక్సిజన్ లె వల్స్‌ను గమనిస్తుంది. మనం తీసుకునే ఆక్సిజన్ కంటే తక్కువ ఆక్సిజన్ తీసుకుంటున్నామంటే ఆటోమెటిక్‌గా ఒక అలర్ట్‌ను చూపిస్తుంది. ఆ టైంలో సరైన బ్రీత్ చేస్తే నార్మల్‌గా ఉంటుంది. పర్సనల్ ఆక్టివిటీస్‌ను ట్రాక్ చేస్తూ ప్రతిరోజూ మనల్ని ఫిట్‌గా ఉంచేందుకు పనిచేస్తుంది.

ట్రెండ్‌కు తగ్గట్టుగా..

పలు కంపెనీలు రోజురోజుకు అప్‌డేట్ వర్షన్‌తో, అత్యాధునిక ఫీచర్స్‌ను అందిస్తున్నాయి. ఒకప్పుడు మనం అనలాగ్ వాచ్‌లను మాత్రమే వాడేవారం. అందులో టైం, డేట్ తప్ప మరేదీ ఉండేది కాదు. అన్ని వసతులతో సెల్‌ఫోన్ చేతిలోకి వచ్చాక వాటి వినియోగం తగ్గింది. గత దశాబ్ద కాలంగా ట్రెండ్ పూర్తిగా మారిపోయింది. అనలాగ్ వాచ్‌ల స్థానాన్ని స్మార్ట్ వాచ్‌లు భర్తీ చేస్తున్నాయి. స్మార్ట్‌వాచ్‌లు అనేక రకాల పనులు చేయగలుగుతున్నాయి. పర్సనల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ మన లైఫ్‌నే శాసించగలుగుతున్నాయి.

డ్రైవింగ్‌లో సునాయాసంగా..

స్మార్ట్ వాచ్‌ను ఆండ్రాయిడ్ ఫోన్‌కు అనుసంధానం చేస్తే బైక్ డ్రైవ్ చేస్తున్నప్పుడు రిస్ట్ మీద మెస్సేజెస్, నోటిఫికేషన్స్ ఎవ్రీ థింగ్ ఫోన్ చూడకుండానే అలర్ట్ చేస్తుంది. జీపీఎస్, గూగుల్ మ్యాప్స్ వాడుతున్నప్పుడు మీ కండ్లు మొబైల్ ఫోన్‌పైనే ఉండాల్సి ఉంటుంది. అయితే డ్రైవింగ్ చేసేటప్పుడు స్మార్ట్ వాచ్ ఎంతో ఉపయోగపడుతుంది. చేతికి స్మార్ట్‌వాచ్ పెట్టి బైక్ హ్యాండిల్ పట్టుకున్నా, కారు స్టీరింగ్ పట్టుకున్నా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈజీగా నావిగేషన్ చూసుకునే అవకాశం ఉంటుంది. రైట్ తిరగాలంటే సింగిల్ వైబ్రేషన్, లెఫ్ట్ తిరగాలంటే డబుల్ వైబ్రేషన్ గైడెన్స్ ఇస్తుంది. ఇలా సింపుల్‌పై చేస్తూ డ్రైవింగ్‌ను సులువు చేస్తుంది.

ఆరోగ్యం విషయంలో సపోర్టుగా..



స్మార్ట్ వాచ్ కొనుగోలు చేసిన తర్వాత బ్లడ్ ప్రెషర్ (బీపీ), పల్స్, ఆక్సిజన్ లెవల్స్ చూసుకోవడం సులువైంది. గతంలో డాక్టర్ వద్దకు వెళ్తే తప్ప ఇవన్నీ చూసుకునే అవకాశం ఉండేది కాదు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. ఆరోగ్యం విషయంలో స్మార్ట్ వాచ్ బాగా సపోర్టు చేస్తుంది.

– బొంగోని రాజాకిషన్‌గౌడ్, సప్తగిరికాలనీ

వాకింగ్‌లో ఎక్కువగా ఉపయోగిస్తున్నా..



వాకింగ్ ప్రారంభించినప్పటి నుంచి పూర్తయ్యే వరకు ఏం చేస్తున్నామనేది వాచ్ చెబుతుంది. ఎంత సేపు నడిచాం, ఎన్ని క్యాలరీలు కరిగాయి, వ్యాయామం చేసే సమయలలో గుండె వేగం ఎలా ఉంటుందనే స్పష్టంగా తెలుస్తుంది. ఫిట్‌నెస్ సమాచారానికి బాగా ఉపయోగపడుతుంది.

– వేల్పుల వెంకటేశ్, భగత్‌నగర్

సేల్స్ పెరిగాయి



అనలాగ్ వాచ్‌ల కంటే స్మార్ట్ వాచ్‌ల సేల్స్ ఎక్కువగా పెరిగాయి. రూ.1,000 నుంచి రూ.45 వేల వరకు మోడల్‌ను బట్టి రేట్లు ఉన్నాయి. అడ్వాన్స్‌డ్ మోడల్స్ కంటే బేసిక్ మోడల్స్ ఎక్కువగా అమ్ముడవుతున్నాయి. మీడియం రేంజ్‌ను ఎక్కువగా ఇష్టపడుతున్నారు.

– కిరణ్, కరీంనగర్ వాచ్ సెంటర్ యజమాని

అఖిల్ కుటుంబానికి అండగా ఉంటాం


అఖిల్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్: అకాల మరణం పొందిన మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు సయ్యద్ అఖిల్ కుటుంబానికి అండగా ఉంటామని డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఇందిరాచౌక్‌లో అఖిల్ చిత్రపటానికి నివాళి అర్పించారు. అంతకుముందు అఖిల్ పార్థివదేహాన్ని సందర్శించి, వారి కుటుంబసభ్యులకు సానుభూతి ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలో చురుకైన నాయకుడు అఖిల్ హఠాన్మరణం తీవ్రంగా కలిచివేసిందన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ అండదండలు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఖ్రమొద్దిన్, అరుణ్‌కుమార్, సిరాజొద్దిన్, పులి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బావుపేటలో కేంద్ర బలగాల కవాతు



కొత్తపల్లి: కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్(బావుపేట)లో శనివారం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌కుమార్ నేతృత్వంలో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా కవాతు చేపట్టారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా శాంతి భద్రతల భంగం కలగకుండా ప్రజలు సహకరించాలని.. ప్రజలంతా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సీఐ కోరారు.

కడియం శ్రీహరి, కేకే చరిత్ర హీనులు


మాట్లాడుతున్న సుంకె రవిశంకర్

కరీంనగర్: పదేళ్లు బీఆర్ఎస్‌లో అనేక పదవులు అనుభవించి ఇప్పుడు పార్టీ మారిన కడియం శ్రీహరి, కె.కేశవరావులు చరిత్రహీనులని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అవకాశవాదులు పార్టీని వీడినంత మాత్రాన జరిగే నష్టమేమీ లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కేకేను ఆయన కుటుంబాన్ని అవమానిస్తే కేసీఆర్ చేరదీసి అందలమెక్కించారని తెలిపారు. కడియం, కేశవరావుకు కేసీఆర్ పునర్జన్మ ఇచ్చాడని అన్నారు. పాలనపై దృష్టి పెట్టాల్సిన సీఎం రేవంత్ రెడ్డి గేట్లు తెరిచామంటూ ఇతర పార్టీ నేతలను తమ పార్టీలకు చేర్చుకుంటున్నాడని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్, యువత అధ్యక్షుడు దీకొండ కుల్దీప్ వర్మ, మైనార్టీ ప్రెసిడెంట్ షౌకత్ అలీ, మాజీ గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్‌గౌడ్, నాయకులు ఆరె రవి, పబ్బతి శ్రీనివాస్ రెడ్డి, ఓద్నాల రాజు, బొంకూరి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూమిని కాపాడండి


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్‌టౌన్: సీతారాంపూర్‌లోని సర్వే నం.16లో గల 2.30 ఎకరాల ప్రభుత్వ భూమిని భూకబ్జాదారుల నుంచి కాపాడాలని కోరుతూ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్‌కుమార్ శనివారం అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు రియల్ ఎస్టేట్ వ్యాపారం అవతారం ఎత్తి సీతారాంపూర్ గ్రామపంచాయతీగా ఉన్నప్పటి నుంచి నగరపాలక సంస్థలో విలీనం జరిగే వరకు ఈ ప్రాంతంలో అక్రమంగా కబ్జా చేశారని, దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపించి భూకబ్జాదారులపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, యుగేందర్ తదితరులు ఉన్నారు.

కూచిపూడి నృత్యంలో ప్రతిభ


అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రశాంత్

సప్తగిరికాలనీ (కరీంనగర్): నగరంలోని మెహర్‌నగర్‌లో గల విద్యావాలీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు నిహారిక, అన్విక్షశ్రీలు కూచిపూడి నృత్యంలో ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంత్ తెలిపారు. వీరికి కీర్తి ఆర్ట్స్ అకాడమీ వారు నాట్యమయూరి కళా పురస్కారాలు ప్రదానం చేశారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశ్‌రావు, వైస్ చైర్మన్ పృథ్వీరావు, ప్రిన్సిపాల్ ప్రశాంత్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

రూ.1.08 లక్షలు పట్టివేత

కరీంనగర్‌క్రైం: నగరంలోని శాతవాహన యూనివర్సిటీ సమీపంలో శనివారం రాత్రి పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో ఒక కారులో రూ.1.08 లక్షలు పట్టుబడినట్లు టూటౌన్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. గ్రానైట్ ఫ్యాక్టరీకి యజమాని అసురాంకు చెందిన ఆ నగదును సీజ్ చేశామన్నారు. సీజ్ చేసిన నగదుకు సంబంధించిన వివరాలు సరిగా లేనందున బ్యాంకులో డిపాజిట్ చేస్తామని తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

కరీంనగర్‌క్రైం: మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో కరీంనగర్ కోర్టు ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ కరీంఉల్లాఖాన్ తెలిపారు. నగరంలో మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన తొమ్మిది మందిని ట్రాఫిక్ పోలీసులు శనివారం కోర్టులో హాజరుపర్చగా ఒక వ్యక్తికి పది రోజుల జైలు, మరో వ్యక్తికి ఏడు రోజుల జైలుశిక్షతో పాటు రూ.4,000 జరిమానా, మిగితా వారికి రూ.10,500 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు సీఐ తెలిపారు.

చిత్ర కథ



నగరంలోని ప్రధాన కూరగాయల మార్కెట్ మధ్యలో ఉన్న అన్నపూర్ణ కాంప్లెక్స్ పార్కింగ్ స్థలంలో వేసిన వ్యర్థాల చెత్త తొలగించకపోవడంతో ఆ ప్రాంతమంతా కంపు కొడుతోంది. అదే కంపులో వర్తకులు కూరగాయలు విక్రయిస్తున్నారు. అధికారులు పట్టించుకొని ఏరోజు చెత్త అదే రోజు తొలగించాలని వ్యాపారులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

క్రమశిక్షణతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్



మాట్లాడుతున్న రంగప్రసాద్

కరీంనగర్‌సిటీ: క్రమశిక్షణ, సత్ప్రవర్తనతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్ అని శాతవాహన యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ ఎస్.వి. రంగప్రసాద్ అన్నారు. నగరంలోని టీఎన్జీవో ఫంక్షన్ హాల్‌లో విఫెస్ట్ 2కె24 పేరుతో శనివారం నిర్వహించిన వాణినికేతన్ డిగ్రీ, పీజీ కళాశాల వార్షికోత్సవ వేడుకలను ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తాను చదివిన కళాశాలకే అతిథిగా రావడం ఆనందంగా ఉందన్నారు. ఇంతటి ఉన్నత స్థాయికి చేరుకునేందుకు కారణం ఈ కాలేజీలో చదవడమేనని తెలిపారు. కెరీర్‌లో సక్సెస్ కావాలంటే క్రమశిక్షణతో కూడిన విద్య ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో వాణినికేతన్ విద్యాసమితి చైర్మన్ సీహెచ్.విజయ, ఎంబీఏ డైరెక్టర్ వెంకట్ రావు, వాణినికేతన్ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ప్రశాంత్ రావు, వాణినికేతన్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డి.వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

10 జీపీఏ సాధిస్తాం..

- ఇక టైం వేస్ట్ చేయం.. ఫ్యూచర్‌పై దృష్టిపెడుతాం
- సెలవుల్లో కోచింగ్ తీసుకుంటాం
- 'పది' పరీక్షలు ముగిసిన అనంతరం కేంద్రాల వద్ద విద్యార్థుల ఆనందం


పరీక్షా కేంద్రం ఎదుట ఎగిరి గంతులేస్తున్న విద్యార్థులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఏడాది పాటు చదివిన చదువు.. ఎప్పుడెప్పుడా అంటూ ఎదురుచూసిన పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారంతో ముగిశాయి. పరీక్ష ముగిసిన అనంతరం ఆయా సెంటర్ల వద్ద విద్యార్థులు రెక్కలు వచ్చిన పక్షుల్లా ఎగిరి గంతేశారు. తమతో పరీక్షలు రాసిన వారిని పలకరిస్తూ ఒకరికొకరు బై..బై చెప్పుకుంటూ, సెల్ఫీలతో సందడి చేశారు. మళ్లీ కలుద్దామంటూ విజయసంకేతాలిచ్చుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులను 'సాక్షి' పలకరించగా.. పరీక్షలు రాసిన తీరు, భవిష్యత్ ప్రణాళిక, ఎంచుకున్న లక్ష్యాలు వారి మాటల్లోనే..

ఇంజినీర్ అవుతా



పదో తరగతి పరీక్షలన్నింటినీ బాగా రాశా. తెలుగు పరీక్ష రోజు టెన్షన్ అయ్యింది. హిందీ పేపర్ నుంచి పరీక్షలన్నీ సంతోషంగా రాశా. 9.5పై జీపీఏ వస్తుంది. ఇంటర్ ఎంపీసీ తీసుకుంటా. ఇంజినీరింగ్ చేసి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలని ఉంది.

– రితేశ్

ఇంటర్‌లో ఎంపీసీ తీసుకుంటా..



పదో తరగతి పరీక్షల్లో పది జీపీఏ వస్తుంది. ఏడాది పాటు బాగా చదివా. ఇంటర్‌లో ఎంపీసీ తీసుకుంటా. ఇంజినీరింగ్ చేయాలని ఉంది. ఫ్రెండ్స్ అందరూ బాగా రాశారు. అందరికీ పది జీపీఏ వస్తాయి. థాంక్స్ టూ ఆల్ టీచర్స్.

– మైత్రి

కోచింగ్ తీసుకుంటా..



పరీక్షలు ముగిసినందుకు హ్యాపీగా ఉంది. పరీక్షల్లో పదికి పది జీపీఏ సాధిస్తా. ఏడాది పాటు టెన్షన్‌లోనే ఉన్నా. రిలాక్స్ అయింది. ఈ హాలిడేస్‌లో కంప్యూటర్‌లో శిక్షణ తీసుకోవాలనుకుంటున్నా. ఇంజినీర్ కావాలనేది నా ఆశయం.

– యశ్వంత్

ఎగ్జామ్స్ బాగా రాశా



పది పరీక్షలు అనగానే మాలో టెన్సన్ ఉండేది. ఫస్ట్ ఎగ్జామ్ కాగానే టెన్షన్ పోయింది. పరీక్షలన్నీ హ్యాపీగా జరిగాయి. 10 జీపీఏ లక్ష్యంతో పరీక్షలు బాగా రాశా. ఈ హాలీడేస్‌లో టైం వేస్ట్ చేయకుండా కంప్యూటర్ వాటిలో కోచింగ్ తీసుకొంటా.

– అభినయ

పది జీపీఏ వస్తాయి



పదో తరగతి పరీక్షలు బాగా రాశా. పది జీపీఏ ఖచ్చితంగా వస్తుంది. పేపర్‌లో ఉన్న ప్రశ్నల కంటే ఎక్స్‌ట్రా ప్రశ్నలు రాశా. నా టార్గెట్ పది జీపీఏ అది నెరవేరుతుంది. పరీక్షలు ఎలా రాస్తామో అన్న టెన్షన్ ఉండేది. ఇప్పుడు హ్యాపీగా ఉంది.

– వర్షిణి

సీఏ చేస్తా..



పది పరీక్షలు బాగా రాశా. నా టార్గెట్ పదికి పది జీపీఏ తప్పకుండా వస్తుంది. ఈ సారి ప్రశ్నపత్రాలు కొంత వరకు సులువుగా వచ్చాయి. పాలిటెక్నిక్, టీఎస్ఆర్జెసీ, తదితర ఎంట్రన్స్‌లకు ప్రిపేరవుతా. సీఏ చేయాలనుకుంటున్నా.

– రిత్విక్

పరీక్షలకు బాగా ప్రిపేర్ అయ్యా



పదో తరగతి పరీక్షలు బాగా రాయాలని ప్రిపేర్ అయ్యా. పరీక్షలన్నీ బాగా రాశాను. పదికి పది జీపీఏ వస్తుందనే నమ్మకం ఉంది. ప్రిపేర్ అయిన ప్రశ్నలన్నీ రావడం చాలా సంతోషం.సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలని ఉంది.

– సింధూజ

అలరించిన 'పారమిత' వార్షికోత్సవం


చిన్నారుల నృత్యప్రదర్శన

కరీంనగర్‌టౌన్: మంకమ్మతోటలోని పారమిత లిటిల్ జీనియస్ పాఠశాలలో శనివారం 'ఆనంద' పేరుతో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలు అలరించాయి. పారమిత, ఎక్స్ ప్లోరికా విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఇనుగంటి ప్రసాద రావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించిన వేడుకల్లో విద్యార్థుల జానపద నృత్య ప్రదర్శన, కృష్ణాష్టమి, హోలి, ఈద్, క్రిస్మస్, దసర, దీపావళి, శ్రీరామనవమి వంటి పండుగల ప్రాముఖ్యతను తెలిపే నృత్య ప్రదర్శనలు, దేశభక్తితో కూడిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రశ్మిత, వినోదరావు, రాకేశ్ ప్రసాద్, ప్రాచీ, వీయూఎం ప్రసాద్, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు కవిత ప్రసాద్, బాలాజీ, ప్రశాంత్, రితేష్ మెహత, శ్రీకర్, శర్మిష్ఠ, ప్రోగ్రామ్ హెడ్ గోపీకృష్ణ, సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు, డీటీఆర్ మరమ్మతు పనులు చేపడుతున్నందున ఆదివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు 11కేవీ బ్యాంక్ కాలనీ, 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు 11కేవీ క్రిస్టియన్‌కాలనీ ఫీడర్ల పరిధిలోని బ్యాంక్ కాలనీ, గుండు హనుమాన్ ఆలయం, క్రిస్టియన్‌కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–1 ఏడీఈ ఎస్.నరేందర్ తెలిపారు. అదే విధంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు 11కేవీ ఉజ్వల పార్కు పరిధిలోని ఎన్‌టీఆర్ విగ్రహం, హనుమాన్‌నగర్, శ్రద్ధ ఇన్ లేన్, ఉజ్వల పార్కు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ పేర్కొన్నారు.

బీసీల అభ్యున్నతికి కృషి


మాట్లాడుతున్న దేశభక్తుల సుధా

కరీంనగర్‌టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీల అభ్యున్నతికి కృషి చేస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఆఫీస్ ఇన్‌చార్జి దేశభక్తుల సుధా అన్నారు. శనివారం కరీంనగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఓబీసీ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. బీసీ నినాదం ఎత్తుకొని ధర్మమార్గంలో పోరాడుతున్న ఏకైక పార్టీ బీజేపీ అన్నారు. బీసీలకు అండగా నిలిచిన మోదీ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ దూబాల శ్రీనివాస్ ఆధ్వర్యంల జరిగిన సమావేశంలో నాయకులు దుబ్బాల శ్రీనివాస్, ఎడమ సత్యనారాయణ రెడ్డి, మల్లికార్జున్, వంగల రవి, గోపాల్, చంద్రగిరి వేణు, కందుల శ్రావణ్, కొత్తకొండ హరీష్, దమ్మయ్య, కృష్ణ రెడ్డి, మిడుదొడ్డి దీపక్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

సీపీఎం తొలి జాబితా విడుదల

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు సీపీఎం అభ్యర్థుల తొలి జాబితాను ఆ పార్టీ శనివారం విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 44 స్థానాలకు అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ నుంచి ఒకరిని, తెలంగాణ నుంచి ఒకరిని మాత్రమే ఎంపిక చేసింది. ఏపీలోని అరకు లోక్‌సభ అభ్యర్థిగా పాచిపెంట అప్పల నరస పేరును, తెలంగాణలోని భువనగిరి లోక్‌సభ అభ్యర్థిగా ఎండీ జహంగీర్ పేర్లను ఖరారు చేసింది. అత్యధికంగా పశ్చిమ బెంగాల్ నుంచి 17 మందిని, కేరళ నుంచి 15 మందిని అభ్యర్థులుగా ప్రకటించింది.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్సీ సతీశ్

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సతీశ్‌కు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భవన్‌ను స్టార్ హోటల్‌గా మార్చుకోండి

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



సాక్షి, హైదరాబాద్: పార్లమెంటు ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ కనుమరుగు కాబోతుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఇప్పటికే ఆపార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు మొహం చాటేస్తున్నారని, సీఎం రేవంత్‌రెడ్డి తలుచుకుంటే 24 గంటల్లో బీఆర్ఎస్ నుంచి ఖాళీ అవుతారని చెప్పారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ భవన్‌గా ఉన్న పార్టీ ఆఫీస్‌ను మూసివేసి స్టార్ హోటల్‌గా మార్చుకోవాలని సూచించారు. రాజకీయం మానేసి బిజినెస్ చేసుకుంటే హరీశ్, కేటీఆర్‌కి మంచిదని సత్యం హితవు పలికారు. కేటీఆర్, హరీశ్‌రావు నీతిమంతుల్లా మాట్లాడుతుండటాన్ని ప్రజలు ఛీకొడుతున్నారన్నారు. కల్వకుంట్ల కుటుంబ నేతలను మించిన పవర్ బ్రోకర్లు ఇంకెవరూ లేరని, పదేళ్ల ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదని ధ్వజమెత్తారు.

మూసీ సుందరీకరణకు రూ.60 వేల కోట్లు



- జోన్ల వారీగా వాణిజ్య అనుమతులతో నిధుల సమీకరణ
- ప్రతి రోజూ 1–2 టీఎంసీల నీటి విడుదలతో మూసీ శుద్ధి
- నదికి ఇరువైపులా కిలోమీటర్ మేర ఇంపాక్ట్ ఏరియా
- 10 వేలకు పైగా ఆక్రమణలే మూసీ సుందరీకరణకు అడ్డంకులు

ప్రాజెక్టు తొలి దశ అంచనా వ్యయమిలా

వెస్ట్ కారిడార్- ఈస్ట్ కారిడార్ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.15,000 కోట్లు	ట్రంక్ లైన్‌కు రూ.3,000 కోట్లు
రివర్ లింకేజీకి రూ.3,000 కోట్లు	
మూసీ మొత్తం పరీవాహక ప్రాంతం: 110 చ.కి.మీ.	ఆక్రమణలున్న ప్రాంతం: 55 చ.కి.మీ.

సాక్షి, హైదరాబాద్: మూసీ సుందరీకరణ ప్రాజెక్టు అంచనా వ్యయం అక్షరాలా రూ.60 వేల కోట్లు. దశల వారీగా మూసీని ప్రక్షాళన చేయాలని నిర్ణయించిన సర్కారు.. నది సుందరీకరణ, నిర్వహణ కోసం నిధుల సమీకరణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోంది. 2050 మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా నది పరిసరాలను జోన్ల వారీగా విభజించి వాణిజ్య కార్యకలాపాలను అనుమతించడం ద్వారా నిధులను సమీకరించాలని భావిస్తోంది. దీనికి అనుగుణంగా మూసీ వెంట రవాణా కారిడార్లు, లాజిస్టిక్ హబ్‌లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. నదీ గర్భం నుంచి ఇరువైపులా కిలోమీటరు మేర ఇంపాక్ట్ ఏరియాగా ప్రకటించాలని సూత్రప్రాయంగా నిర్ణయించిన మూసీ సుందరీకరణ ప్రాజెక్టు యంత్రాంగం.. ఇప్పటికే నది హద్దులు, ఆక్రమణలపై ప్రాథమికంగా సర్వే నిర్వహించింది. ఈ సర్వే ఆధారంగా జీఐఎస్ మ్యాపింగ్‌ను చేసింది.

ఆక్రమణలే అడ్డంకి..

మూసీ రివర్ ఫ్రంట్‌ను పునరాభివృద్ధి చేయాలనే ఆలోచన తొలుత 1908లోనే వచ్చింది. 1990లో కాస్త ముందుకు కదిలినా.. పూర్తిస్థాయిలో పురోగతి సాధించలేదు. మురుగునీరు, ఆక్రమణలే మూసీ పునరుజ్జీవానికి ప్రధాన అడ్డంకులుగా నిలిచాయి. 55 కి.మీ మేర నదీ మార్గంలో ఉన్న ఆక్రమణలను తొలగించడం ప్రభుత్వానికి కష్టతరమైన పనే అని అంటున్నారు. నది పునరుజ్జీవం కావడానికి 15–20 ఏళ్ల సమయం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఆక్రమణలు సుమారు 2వేల మేర ఉంటాయని అంచనా వేసిన యంత్రాంగం.. వీటిని తొలగించేందుకు ఎలాంటి న్యాయపరమైన అడ్డంకులు లేనప్పటికీ, కొన్నిచోట్ల పట్టా భూముల్లో వెలిసిన నిర్మాణాల విషయంలో మాత్రం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించింది. ఇలాంటి కట్టడాలు 10వేల వరకు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించింది. భూ సేకరణ చట్టం కింద వీరికి పరిహారం చెల్లించడమా? ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించడమా? ఇతర మార్గాలేమిటనే కోణంలో అధ్యయనం చేస్తోంది. పాతబస్తీలో మూసీ కుచించుకుపోయిందున ఇక్కడ ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించే ఆలోచన కూడా చేస్తోంది.

జంట జలాశయాల నుంచి రోజూ నీరు

గుజరాత్‌లో నర్మదా నది నీటిని సబర్మతికి తీసుకెళ్లిన మాదిరే గోదావరిని ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ జంట జలాశయాలకు అనుసంధానం చేయాలనేది ప్రణాళిక. మురుగునీటితో నిండి ఉన్న మూసీ నదికి ఈ జంట జలాశయాల నుంచి నీటిని విడుదల చేస్తారు. ఇలా రోజుకు 1–2 టీఎంసీల జలాల విడుదలతో మురుగు శుద్ధి జరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. వరద నీరు, మురుగు నీరు కూడా నదిలో కలుస్తున్నందున మూసీ కలుషితం అవుతుందని తేలడంతో అమృత్ పథకం కింద 39 మురుగునీటి శుద్ధీకరణ ప్లాంట్ (ఎస్టీపీ)లను నిర్మిస్తోంది. వీటిద్వారా వందశాతం శుద్ధి చేసిన నీటిని నదిలోకి విడుదల చేస్తారు. వీటికి అనుబంధంగా ప్రతి రోజు జంట జలాశయాల నుంచి నీటిని వదలడం ద్వారా నదీలో స్వచ్ఛమైన నీరు ప్రవహించేలా.. సందర్శకులను ఆకర్షించేలా రూపొందిస్తారు. మార్గమధ్యంలో పార్కులు, బోటింగ్ కూడా ఏర్పాటు చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది.

సబర్మతి.. మూసీ

కృష్ణా నదికి ఉపనది అయిన మూసీ వికారాబాద్ జిల్లా అనంతగిరి కొండలో పుట్టి.. నార్సింగి ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి గౌరెల్లి ఓఆర్ఆర్ వరకు 55 కి.మీ. మేర ప్రవహిస్తుంది. దేశంలోనే నది పునరాభివృద్ధి ప్రాజెక్ట్‌ల్లో మూసీ రివర్ ఫ్రంట్ అత్యంత ప్రతిష్టాత్మకం. నీటి నిర్వహణ, ప్రణాళిక, రవాణా, పునరావాసం, పట్టణ పునరుజ్జీవం తదితరాల కోసం రూ.60 వేల కోట్ల వ్యయం, సుమారు 36 నెలల సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గుజరాత్‌లోని సబర్మతి నది పునరాభివృద్ధికి మూసీకి దగ్గరి పోలికలున్నాయి, కాకపోతే సబర్మతి అహ్మదాబాద్ నగరంలో 11 కి.మీ. మేర మాత్రమే విస్తరించి ఉండగా.. మూసీ నది హైదరాబాద్‌లో 55 కి.మీ. మేర ప్రవహిస్తుంది. అదీగాక సబర్మతి కంటే మూసీ పరీవాహక ప్రాంతాలు ఎక్కువ ఆక్రమణకు గురవడం తోపాటు జనసాంద్రత కలిగిన ప్రాంతాలు కావడం గమనార్హం.

హైవేపై పెరిగిన టోల్‌ఫీజు

నేటి అర్ధరాత్రి నుంచి అమల్లోకి రానున్న ధరలు

కేతేపల్లి: హైదరాబాద్–విజయవాడ 65 నంబరు జాతీయ రహదారిపై టోల్‌గేట్ల వద్ద వాహనదారుల నుంచి వసూలు చేస్తున్న టోల్ ఫీజును రహదారి విస్తరణ కాంట్రాక్టు సంస్థ జీఎమ్మార్ యాజమాన్యం పెంచింది. ఒక్కో వాహనానికి ఒక వైపు, ఇరు వైపులా కలిపి రూ. 5నుంచి రూ. 40 వరకు, స్థానికుల నెలవారీ పాస్‌ను రూ.330 నుంచి రూ.340 కి పెంచింది. యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండల అంథోల్ మైసమ్మ దేవాలయం నుంచి ఏపీలోని కృష్ణా జిల్లా చిల్లకల్లు వరకు గల 181.5 కి.మీ మేర రెండులేన్లుగా ఉన్న రహదారిని దాదాపు రూ.2000 కోట్ల వ్యయంతో 2012లో బీవోటీ పద్ధతిన జీఎమ్మార్ సంస్థ నాలుగు లేన్లుగా విస్తరించింది. ఈ విస్తరణ పనులకు అయిన వ్యయాన్ని రాబట్టుకునేందుకు 65 నంబరు జాతీయ రహదారిపై ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చౌటుప్పల్ మండలం పంతంగి, కేతేపల్లి మండలం కొర్లపహాడ్, ఏపీలోని కృష్ణా జిల్లా చిల్లకల్లు వద్ద ఒకొక్కటి చొప్పున మూడు టోల్‌ప్లాజాలను జీఎమ్మార్ సంస్థ ఏర్పాటు చేసింది. వీటి ద్వారా 2012 నుంచి టోల్‌ఫీజు వసూళ్లను కాంట్రాక్టు సంస్థ ప్రారంభించింది. ఎన్‌హెచ్ఏఐ సూచించిన నిబంధనల మేరకు వార్షిక సవరణల పేరిట ఏడాదికి ఒకమారు వాహనాల నుంచి వసూలు చేస్తున్న టోల్‌ఫీజు ధరలను పెంచుకునే వెసులుబాటు జీఎమ్మార్ సంస్థకు ఎన్‌హెచ్ఏఐ కల్పించింది. ఆయా టోల్‌ప్లాజాల వద్ద ఈనెల 31(ఆదివారం) అర్ధరాత్రి 12 గంటల తర్వాత అంటే ఏప్రిల్ 1 నుంచి పెంచిన టోల్ ధరలు అమల్లోకి రానున్నాయి. ఏడాది కాలం పాటు ఇవే ధరలు అమల్లో ఉంటాయి.

పెరిగిన టోల్‌ఫీజులు ఇలా..

వాహనం	పంతంగి టోల్‌ప్లాజావద్ద		కొర్లపహాడ్ వద్ద	
	ఒకవైపు	ఇరువైపులా	ఒక వైపు	ఇరువైపులా
కారు,జీపు,వ్యాను (లైట్ మోటార్ వెహికల్)	95	145	130	195
లైట్‌కమర్షియల్,గూడ్స్	150	230	205	310
మినీ బస్సు బస్సు, ట్రక్కు (2యాక్సిళ్లు)	315	470	430	640
భారీ వాహనాలు (3 నుండి 6 యాక్సిళ్లు)	485	725	665	995
అతి భారీ వాహనాలు (7 అంతకంటే ఎక్కువ యాక్సిళ్లు)	605	910	825	1240



మూలమూర్తుల ఫొటోలు బయటకు..

- భద్రాచలంలో మాజీ ఎంపీ దర్శనం సందర్భంగా ఫొటోలు తీసిన ఓ వ్యక్తి
- ఆపై సోషల్ మీడియాలో వైరల్



ఆలయంలో ధ్వజస్తంభం వద్ద మాజీ ఎంపీ సీతారాంనాయక్, అనుచరులు

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలో పూజలు చేస్తున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడం వివాదాస్పదంగా మారింది. మాజీ ఎంపీ, మహబూబాబాద్ లోక్‌సభ స్థానం బీజేపీ అభ్యర్థి సీతారాం నాయక్ శనివారం భద్రాచలంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆయన వెండి వాకిలి వద్ద నుంచే స్వామిని దర్శించుకుంటుండగా.. వెంట వచ్చిన ఓ వ్యక్తి ఫొటోలు తీశాడు. ఈ ఫొటోలో సీతారాంనాయక్‌తో పాటు అంతరాలయంలో మూలమూర్తులు, అర్చకులు పూజలు చేస్తుండటం కనిపించగా.. బీజేపీ నేతలు మీడియాకు ఈ ఫొటోలనే విడుదల చేశారు. అంతరాలయంతో పాటు ఉపాలయాల్లోని మూలవరుల ఫొటోలు సైతం బయటకు రాగా.. సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అంతరాలయంతో పాటు ఉపాలయాల్లో ఫొటోలు తీయడంపై నిషేధం ఉండగా.. సాధారణ భక్తులెవరినీ సెల్‌ఫోన్లు, కెమెరాలతో ఆలయ ఆవరణలోకి అనుమతించరు. కానీ సీతారాంనాయక్ వెంట ఉన్న వ్యక్తుల విషయంలో అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. ఈ విషయమై ఆలయ ఈఓ రమాదేవిని వివరణ కోరగా, అంతరాలయం, ఉపాలయాల్లో ఎవరు ఫొటోలు తీశారో గుర్తించేందుకు సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎంపీ సీతారాంనాయక్ వెంట ఉన్న వ్యక్తులే ఇందుకు కారణమని ప్రాథమిక విచారణలో తేలిందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులకు అందజేస్తామని తెలిపారు.

పరీక్ష రాసినా గైర్హాజరు!

- యాజమాన్యం తప్పిదం.. విద్యార్థినికి శాపం
- కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఓ స్కూల్‌లో ఇష్టారాజ్యం

జ్యోతినగర్(రామగుండం): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఓ పాఠశాలలో ఇటీవల ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు జరిగాయి. అయితే అందులో ఓ విద్యార్థిని పరీక్ష రాసినా గైర్హాజరు అయినట్టు మార్కుల షీట్ పంపిణీ చేశారు. కాగా తాను పరీక్ష రాసినా గైర్హాజరు కావడం ఏంటని అడిగితే.. తర్వాత 10 మార్కులే వచ్చాయని ఫెయిల్ అయినట్లు మార్కుల షీట్ ముద్రించి ఇచ్చారని విద్యార్థిని పేర్కొంది. సదరు విద్యార్థిని తండ్రితో పాటు పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలకు మార్కులు తక్కువగా వచ్చాయంటూ.. మరికొందరు ఫెయిల్ అయ్యారని యాజమాన్యాన్ని సంప్రదించారు. అయితే, ఎలాంటి రీ కౌంటింగ్ ఉండదని యాజమాన్యం తేల్చి చెప్పినట్లు తల్లిదండ్రులు పేర్కొన్నారు.

మానవ తప్పిదం అంటూ సమాధానం

బాధిత విద్యార్థినికి సంబంధించి పరీక్షకు హాజరైన రోజును క్షుణ్ణంగా పరిశీలిస్తే పది మార్కులకు బదులుగా 23 మార్కులు వచ్చాయని, కంప్యూటర్‌లో ఉన్నాయని యాజమాన్యం చెప్పినట్లు సదరు విద్యార్థిని తండ్రి పేర్కొన్నారు. అయితే వెంటనే తనకి ఇచ్చిన మార్కుల జాబితాను తిరిగి తీసుకొని ఆన్‌లైన్ సర్వర్ ఓపెన్ కావడం లేదంటూ తిరిగి పంపించేశారని, రెండుసార్లు స్కూల్‌కు రప్పించుకుని మరో రెండు రోజుల తర్వాత కలవమని నిర్లక్ష్యంగా చెప్పినట్లు విద్యార్థిని తండ్రి తెలిపారు. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ను 'సాక్షి' సంప్రదించగా.. మానవ తప్పిదం వల్లే అంటూ సింపుల్‌గా సమాధానం ఇచ్చారు. కాలేజీకి సంబంధించి రీజనల్ లెవల్‌లో కొత్త సాఫ్ట్‌వేర్ వచ్చిందని, అందుకే ఇలాంటి ప్రాబ్లమ్స్ వచ్చాయని పేర్కొన్నారు. ఈ విషయంలో రెక్టిఫైడ్ చేశామని, ఓవర్ లుక్‌లో అయి ఉంటుందని వివరించారు. కాగా మరికొందరు తల్లిదండ్రులు సైతం తమ పిల్లలు పరీక్షలు మంచిగా రాసినా సరైన మార్కులు రాలేదంటూ ఆరోపిస్తున్నారు. ఓ విద్యార్థినికి జరిగిన తప్పిదమే మరికొందరికి జరిగి ఉంటుందని పాఠశాల యాజమాన్యాన్ని సంప్రదించినా సరైన సమాధానం రావడం లేదని చెబుతున్నారు. ఏదీ ఏమైనా ఈ విషయంలో ఉన్నత విద్యాశాఖ వారికి ఫిర్యాదు చేస్తామని పేర్కొంటున్నారు.

తొలి కాత విద్యార్థులకే..

- ఏటా పుచ్చకాయలు పంపిణీ చేస్తున్న రైతు ఆనంద్



అందజేసిన పుచ్చకాయలను చూపుతున్న పాఠశాల విద్యార్థులు, రైతు ఆనంద్

తాంసి: పిల్లలు దేవుడితో సమానం అంటారు. అలాంటి చిన్నారులతో కార్యక్రమాలూ ప్రారంభిస్తారు. కాగా ఓ రైతు ఏటా తాను పండించిన పుచ్చకాయలను తొలుత పాఠశాల విద్యార్థులకు అందజేస్తుంటాడు. ఆనవాయితీని కొనసాగిస్తూ ఈసారీ పంపిణీకి శ్రీకారం చుట్టాడు. అతడే తాంసి మండలం పొన్నారి గ్రామానికి చెందిన రైతు ఆండే ఆనంద్. ఈ ఏడాది రెండెకరాల్లో పుచ్చ సాగుచేశాడు. తొలి దిగుబడిగా వచ్చిన కాయలను గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం పంపిణీ చేశాడు. 80మంది విద్యార్థులకు ఉపాధ్యాయుల చేతుల మీదుగా అందజేశాడు. మూడేళ్లుగా విద్యార్థులకు తొలికాతను అందజేయడం ఆనందంగా ఉందని చెబుతున్నాడు రైతు ఆనంద్. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణ, శ్రీవాణి, సరిత పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలన గాడితప్పింది

- వందరోజుల్లోనే రైతులకు వేల కష్టాలు
- పంటలు ఎండుతున్నా పట్టించుకోని సర్కార్
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత కొప్పుల ఈశ్వర్



దీక్షను ప్రారంభించి మాట్లాడుతున్న ఈశ్వర్

పెద్దపల్లిరూరల్: 'రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన వంద రోజుల్లోనే గాడి తప్పింది.. రైతులకు గత పదేళ్లలో ఎన్నడూ లేనన్ని కష్టాలు వచ్చిపడ్డాయి. పొట్టదశకు చేరిన వరిపైరుకు అవసరమైన సాగునీరందించడంలో సర్కార్ దారుణంగా విఫలమైంది' అని మాజీ మంత్రి, పెద్దపల్లి బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం 36గంటల దీక్షా శిబిరాన్ని జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్, జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, బాల్క సుమన్, దాసరి ఉష తదితరులతో కలిసి ప్రారంభించారు. కొప్పుల మాట్లాడుతూ.. రైతులు సాగునీటి కోసం పడుతున్న గోసను కళ్లారా చూసి, వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే సాగునీరందక ఎండిన పంటలకు ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం అందించాలన్నారు. ఇందుకోసం జిల్లా రైతాంగానికి బీఆర్ఎస్ బాసటగా నిలిచేందుకు 36గంటల దీక్షకు దిగిందన్నారు. అయినా ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. జెడ్పీటీసీలు గంట రాములు, బొద్దుల లక్ష్మణ్, నాయకులు రఘువీర్‌సింగ్, చొక్కారెడ్డి, గోపు ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.



క్యూలైన్‌లో భక్తులు

కొండగట్టులో భక్తుల రద్దీ

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆంజనేయస్వామితోపాటు శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీలక్ష్మీ అమ్మవారు, బేతాళస్వామి, సీతారాములను దర్శించుకున్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో భక్తులు ఉదయమే స్వామివారిని దర్శించుకుంటున్నారు. భక్తుల ఇబ్బంది తలెత్తకుండా ఏఈవో అంజయ్య, సూపరింటెండెంట్ శ్రీనివాస శర్మ, సునీల్, సిబ్బంది పర్యవేక్షించారు.

వడదెబ్బతో రైతు మృతి



చిన్న కొమురయ్య (ఫైల్)

నేరడిగొండ: ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన మిట్టపల్లి చిన్న కొమురయ్య (58) వడదెబ్బతో మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే.. శనివారం వ్యవసాయ పంట పొలానికి వెళ్లి వచ్చిన ఆయన సాయంత్రం ఇంటివద్ద అపస్మారక స్థితికి చేరుకున్నాడు. విషయాన్ని కుటుంబీకులు గమనించి ఓ ప్రైవేట్ వాహనంలో కొంత దూరం వరకు తీసుకురాగా, 108లో నేరడిగొండ వరకు తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు 108 సిబ్బంది నిర్ధారించడంతో మృతదేహాన్ని వడూర్‌కు తీసుకెళ్లారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- ఎస్పీ గౌస్ ఆలం
- పోలీస్ శిక్షణ కేంద్రం సందర్శన



కుక్‌తో మాట్లాడుతున్న ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: శిక్షణ కానిస్టేబుళ్లకు నాణ్యమైన భోజనం అందించాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. పట్టణంలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రాన్ని ఎస్పీ శనివారం సందర్శించారు. ప్రస్తుతం 260 మంది సివిల్ కానిస్టేబుళ్లకు అందిస్తున్న శిక్షణను పరిశీలించారు. వారికి అందిస్తున్న భోజన సదుపాయాలపై ఆరా తీశారు. భోజనశాల పరిశుభ్రత, సరుకుల నాణ్యతను స్వయంగా పరిశీలించారు. నిరంతరం పరిశుభ్రత పాటించాలని అధికారులకు సూచించారు. ఐదు జిల్లాలకు సంబంధించిన సివిల్ కానిస్టేబుళ్లకు తొమ్మిది నెలలపాటు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. సీఆర్‌పీసీ, ఐపీసీ, పోలీసు పరేడ్, ఆయుధాల పరిజ్ఞానం, సంఘ విద్రోహశక్తులతో పోరాటం, శారీరక దృఢత్వం వంటి తదితర అంశాల్లో కానిస్టేబుళ్లకు శిక్షణ అందిస్తున్నట్లుగా వెల్లడించారు.

జిల్లా జైలు సందర్శన

పట్టణంలోని జిల్లా జైలును ఎస్పీ సందర్శించారు. సూపరింటెండెంట్ అశోక్ ఆయనకు స్వాగతం పలికారు. జైలు ఆవరణలోని పండ్ల తోటలు, కూరగాయల పెంపకం, నాటుకోళ్లను పరిశీలించారు. ఖైదీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలు విషయాలపై చర్చించారు. వారి వెంట డీఎస్పీ జీవన్ రెడ్డి, టూ టౌన్ సీఐ అశోక్ తదితరులున్నారు.

నృసింహుడి హుండీ ఆదాయం రూ. 30.64 లక్షలు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామికి భక్తుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని శనివారం ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. రూ.30,64,396 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 16 నుంచి 30వ తేదీవరకు 14 రోజుల హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు పేర్కొన్నారు. 57 గ్రాముల బంగారం, 5.200 కిలోల వెండి, 7 విదేశీ కరెన్సీ వచ్చినట్లు తెలిపారు. దేవాదాయశాఖ సహాయ కమిషనర్ చంద్రశేఖర్, సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

నృసింహుడి సన్నిధికి పోటెత్తిన భక్తులు

శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా గోదావరిలో స్నానాలు ఆచరించారు.



హుండీ లెక్కింపులో ఆలయ అధికారులు

ఇప్పపువ్వు.. బతకుదెరువు







వేసవి వచ్చిందంటే ఆదివాసీలు ఇప్పపువ్వు సేకరణలో బిజీగా ఉంటారు. ఉదయాన్నే అటవీ ప్రాంతానికి వెళ్తారు. అక్కడ సేకరించి తెచ్చిన ఇప్పపువ్వును ఇంటివద్ద ఆరబెడతారు. అనంతరం విక్రయిస్తూ ఉపాధి పొందుతారు. ఆదిలాబాద్ రూరల్ మండలం అల్లికోరి, బోరింగ్ గూడ, పాతగూడలలో ఆదివాసీ మహిళలు, చిన్నారులు అడవినుంచి ఇప్పపువ్వు సేకరించి గ్రామాలకు తిరిగి వస్తుండగా కనిపించిన దృశ్యాలివి.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్








'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా నాలుగో రోజైన శనివారం కర్నూలు, అనంతపురం జిల్లాల్లో పర్యటించిన సీఎం వైఎస్ జగన్ పలు ఫొటోలను ట్వీట్ చేశారు. 'నాలుగో రోజు మేమంతా సిద్ధం యాత్రలో నా స్టార్ క్యాంపెయినర్‌లతో..' అంటూ పేదలతో మమేకమైన ఫొటోలను ముఖ్యమంత్రి విడుదల చేశారు. ఈ ఫొటోలు అందర్నీ విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

మీ ఓటుతోనే మీ రాత మార్పు

కళ్లెదుట కనిపిస్తున్న అభివృద్ధిని ఇంటింటా వివరించండి

పత్తికొండ నియోజకవర్గం తుగ్గలి, రాతనలో ప్రజలతో ముఖాముఖిలో సీఎం వైఎస్ జగన్

- ఈ 58 నెలల పాలనలో ఊరూరా సంక్షేమాభివృద్ధి
- ఇదివరకెన్నడూ లేని విధంగా ఇంటింటికీ లబ్ధి
- సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా విప్లవాత్మక మార్పులు
- రైతులు, అవ్వాతాతలకు అండగా నిలిచాం
- అక్క చెల్లెమ్మల నుంచి విద్యార్థుల వరకు అందరికీ మంచి చేశాం
- మీ ఊళ్లో సచివాలయం, ఆర్బీకే, విలేజ్ క్లినిక్‌లు నిర్మించి పాలన మీ ఇంటికే తెచ్చాం
- మరింత మంచి చేసేందుకు మీ బిడ్డకు అండగా నిలబడి ఆశీర్వదించండి

సాక్షి ప్రతినిధి, కర్నూలు: 'గత ప్రభుత్వానికి, మనం దరి ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడా ఏమిటో ఊరూరా స్పష్టంగా కనిపిస్తోంది. విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ మార్పులు కొనసాగడం చాలా అవసరం. ఈ ఎన్నికల్లో ఓటు వేసేది కేవలం ఎంపీ, ఎమ్మెల్యేను ఎన్నుకునేందుకు మాత్రమే కాదు. జరుగుతున్న మార్పును కొనసాగించేందుకే అన్నది ప్రధానం. ఈ మార్పులు కొనసాగితేనే పేదవాడి బతుకులు మారతాయి. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. నేను చెప్పిన మాటల్లో వాస్తవం ఉందనుకుంటేనే మీ బిడ్డకు అండగా నిలిచి ఓటు వేయాలని కోరుతున్నా. జరిగిన మేలును ఇంటింటా చెప్పాలి' అని ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 'మేమంతా సిద్ధం' పేరుతో నిర్వహిస్తున్న బస్సు యాత్ర నాలుగో రోజు శనివారం కర్నూలు జిల్లాలోని పత్తికొండ నియోజక వర్గంతోపాటు అనంతపురం జిల్లాలోనూ కొనసాగింది. తుగ్గలి, రాతన గ్రామస్తులతో ముఖాముఖి నిర్వహించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించిన సంక్షేమాభివృద్ధిపై రెండు గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేసి ఆశీస్సులు తెలిపారు. 'మళ్లీ ముఖ్యమంత్రిగా నువ్వే రావాలన్నా.. మళ్లీ సీఎంగా ఇక్కడికి రావాలి' అంటూ మహిళలు, రైతులు, విద్యార్థులు హర్షధ్వానాల మధ్య ముకుమ్మడిగా నినదించారు. 'రెండు గ్రామాల పరిధిలో 10 వేల జనాభా ఉన్నారు. గ్రామస్తులంతా కలిసికట్టుగా ఏకమయ్యారు. అందరినీ ఒకేటే కోరుతున్నా. ఇంతకు ముందు ప్రభుత్వాలను చూశారు. ఇవాళ మన ప్రభుత్వాన్నీ చూస్తున్నారు. మీరు ఇంతకు ముందు చూడని విధంగా మన ప్రభుత్వ హయాంలోని 58 నెలల్లో ప్రస్ఫుటమైన మార్పులు కన్పిస్తున్నాయి. ఇలాంటి విప్లవాత్మక మార్పులు గత ప్రభుత్వాల్లో ఎందుకు కన్పించలేదు? తుగ్గలి, రాతన సచివాలయ పరిధిలోని గ్రామాల్లో కూడా గొప్ప మార్పు కన్పిస్తుండటం పట్ల ప్రతి ఒక్కరూ ఆలోచించాలి' అని సీఎం కోరారు. ఈ ముఖాముఖిలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

రెండు గ్రామాల అక్క చెల్లెమ్మలకు రూ.56.24 కోట్లు

- తుగ్గలి సచివాలయ పరిధిలో 1,748, రాతన సచివాలయ పరిధిలో 1,569 ఇళ్లు ఉన్నాయి. తుగ్గలిలో 1,666 ఇళ్లకు, రాతనలో 1,486 ఇళ్లకు అంటే 95 శాతం ఇళ్లకు మీ బిడ్డ బటన్ నొక్కి అక్క చెల్లెమ్మల ఖాతాల్లోకి నేరుగా డబ్బులు పంపారు. ఎక్కడా లంచాలు, వివక్ష, కులం, రాజకీయం, చివరకు గత ఎన్నికల్లో మనకు ఓటు వేయకపోయినా ఫర్వాలేదనుకుని.. అర్హత ఉన్న వారందరికీ మేలు చేశాం. రెండు గ్రామాల అక్క చెల్లెమ్మలకు రూ.56.24 కోట్లు లబ్ధి కలిగించాం.
- గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు రాజ్యమేలుతున్న పరిస్థితుల్లో చివరకు మరుగుదొడ్లు కావాలన్నా లంచాలు అడిగే పరిస్థితి. చివరకు పింఛన్, సబ్సిడీ రుణాలు కావాలన్నా లంచాలే. ఆ రోజుల్లో ప్రభుత్వం ఇచ్చే ప్రతి రూపాయి లంచాలు లేకుండా మీకు అందిందని ఎవరైనా చెబుతారా? (లేదు...లేదు అని జనాలు చేతులు అడ్డంగా ఊపారు) తుగ్గలిలో 5,200 జనాభా ఉన్న సచివాలయ పరిధిలో ఈ 58 నెలల్లో రూ.29.65 కోట్లు ఇచ్చాం. ఈ సంఖ్యలు చెబుతుంటే ఆశ్చర్యంగా లేదా.. అని అడుగుతున్నా. రాతనలో 4,888 జనాభా ఉంటే రూ. 26.59 కోట్లు ఇచ్చాం. ఎక్కడా లంచాలు, వివక్ష లేకుండా నా ఆడబిడ్డల ఖాతాల్లో నగదు జమ చేశాం.
- అమ్మఒడి పథకం ద్వారా తుగ్గలిలో రూ.2.91 కోట్లు, రాతనలో రూ.2.50 కోట్లు.. రెండింటికీ కలిపి రూ.5.41 కోట్లు ఇచ్చాం. చేయూత ద్వారా తుగ్గలిలో రూ.2.30 కోట్లు, రాతనలో రూ.2.19 కోట్లు.. రెండు గ్రామాల్లో కలిపి రూ.4.49 కోట్లు అక్క చెల్లెమ్మల ఖాతాల్లోకి వెళ్లాయి. విద్యాదీవెన ద్వారా తుగ్గలిలో రూ.1.16 కోట్లు, రాతనలో రూ.1.26 కోట్లు.. మొత్తంగా రూ.2.42 కోట్లు జమ చేసి, పిల్లలు మంచి చదువులు చదవాలని, తల్లిదండ్రులపై భారం పడకుండా చూశాం.
- జగనన్న వసతి దీవెన ద్వారా తుగ్గలిలో రూ.51 లక్షలు, రాతనలో రూ.54 లక్షలు.. ఆసరా ద్వారా తుగ్గలిలో రూ.1.95 కోట్లు, రాతనలో రూ.65 లక్షలు ఇచ్చాం. మన ప్రభుత్వం రాక ముందు పొదుపు సంఘాల అక్క చెల్లెమ్మల పరిస్థితి దారుణం. అప్పట్లో 18 శాతం నాన్ పర్మార్మెన్స్ అసెట్స్, అవుట్ స్టాండింగ్ లోన్లు ఉండి అక్క చెల్లెమ్మల బతుకులు కుదేలైన పరిస్థితుల్లో ఆసరా ద్వారా ఆదుకున్నాం. ఈ ఒక్క పథకం ద్వారానే ఈ గ్రామాలకు రూ.2.60 కోట్లు ఇచ్చాం. సున్నా వడ్డీ ద్వారా రాతనలో రూ.15 లక్షలు, తుగ్గలిలో రూ.60 లక్షలు ఇచ్చి మంచి చేశాం. ఇళ్ల విషయానికొస్తే తుగ్గలిలో 66, రాతనలో 122 ఇళ్లు ఇచ్చాం. వైఎస్సార్ కళ్యాణ మస్తు, షాదీతోఫా ద్వారా తుగ్గలిలో రూ.3 లక్షలు, రాతనలో రూ.4.8 లక్షలు ఇచ్చాం.
- అవ్వాతాతలకు రాతనలో రూ.7.54 కోట్లు, తుగ్గలిలో రూ.7.58 కోట్లు పింఛన్ల ద్వారా అందించాం. రైతులకు వైఎస్సార్ రైతు భరోసా ద్వారా తుగ్గలిలో రూ.6.15 కోట్లు, రాతనలో రూ.5.49 కోట్లు ఇచ్చాం. ఇలా అన్ని పథకాల ద్వారా మేలు చేశాం. గాంధీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం ప్రతీ గ్రామంలో చూపిస్తామని, ప్రతి 60–70 ఇళ్లకు వలంటీర్‌ను పెట్టాం. వారు ప్రతి పథకాన్ని నేరుగా మీ చేతుల్లో పెట్టి వెళుతున్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో గతానికి భిన్నంగా మార్పు జరుగుతోంది. తుగ్గలిలో ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా ద్వారా రూ.98 లక్షలు ఇచ్చాం. ఉచితంగా వైద్యం అందించాం. రాతనలో రూ.84 లక్షలు ఇచ్చాం. ఈ మార్పులను అందరూ గమనించాలి.

రెండు గ్రామాల అభివృద్ధి ఇలా..

- గ్రామంలో అడుగు పెడుతూనే సచివాలయం కన్పించింది. గతంలో ఇది లేదు. ఈ 58 నెలల కాలంలోనే వచ్చింది. వలంటీర్లు సేవలు అందిస్తున్నారు. మరో నాలుగు అడుగులు ముందుకేస్తే ఆర్బీకే ఉంది. ఓ అగ్రికల్చర్ గ్రాడ్యుయేట్ అక్కడే ఉంటున్నారు. విత్తనం నుంచి పంట కొనుగోలు దాకా ప్రతి దశలో రైతన్నకు అండగా నిలుస్తున్నారు. ఇంతకు ముందు రైతన్నలు బ్యాంకుకు వెళ్లి క్రాప్‌లోన్ తీసుకుంటేనే పంటలకు ఇన్సూరెన్స్ చేసేవారు. లోన్లో రూ.లక్షకు రూ.5వేలు కట్ చేసి ఇచ్చేవారు.
- ఇవాళ ప్రతి ఎకరా ఈ క్రాప్ చేశాం. ఉచితంగా పంటల బీమా అమలు చేస్తున్నాం. పెట్టుబడి సాయంగా రైతు భరోసా ఇస్తూ రైతన్నకు సాయంగా ఉంటున్నాం. ఇక్కడే ప్రభుత్వ బడి కన్పిస్తోంది. తొలిసారి నాడు-నేడుతో రూపురేఖలు మారాయి. ఇంగ్లిష్ మీడియం వచ్చింది. 8వ తరగతి పిల్లలకు ట్యాబ్‌లు ఇచ్చాం. 6వ తరగతి నుంచి ఐఎఫ్‌బీ ప్యానల్ ద్వారా డిజిటల్ బోధన కల్పించాం. కార్పొరేట్ స్కూళ్లు కూడా ప్రభుత్వంతో పోటీ పడాల్సిన పరిస్థితులు గ్రామంలో కన్పిస్తున్నాయి.
- ప్రజలు ఏ ఒక్కరూ వైద్యం కోసం అప్పులపాలు కాకూడదని మార్పులు తెచ్చాం. విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో అనుసంధానం చేశాం. 15 రోజులకు ఒకసారి వచ్చి చికిత్స అందిస్తున్నారు. ఆరోగ్య సురక్ష ప్రతి ఆర్నెళ్లకు ఓసారి జరుగుతోంది. ప్రతి ఇంటిని జల్లెడ పట్టి వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఉచితంగా మందులు ఇస్తున్నారు. ఆరోగ్యశ్రీ పరిధిని వెయ్యి రోగాల నుంచి 3,330 దాకా పెంచాం. ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందిస్తున్నాం. ఈ మార్పులన్నింటికీ మనందరి ప్రభుత్వమే కారణం అని గమనించాలి.

మన వద్దే రూ.3 వేల పింఛన్

- మన ప్రభుత్వం రాక ముందు చంద్రబాబు 4 ఏళ్ల 10 నెలల (58 నెలలు) పాలనలో పింఛన్ రూ.వెయ్యి మాత్రమే ఇచ్చాడు. మీ బిడ్డ హయాంలో పింఛన్ రూ.3 వేలు. ఇంత పింఛన్ ఇచ్చే రాష్ట్రం దేశంలో మరొకటి లేదు. పింఛన్ల కోసం ఏడాదికి రూ.24 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. మన తర్వాత తెలంగాణ రూ.12 వేల కోట్లు ఇస్తోంది. ఆపై 3, 4 స్థానాల్లో ఉన్న రాష్ట్రాల్లో ఏడాదికి పింఛన్ కోసం రూ.8 వేల కోట్లు, రూ.6 వేల కోట్లు ఇస్తున్నారు.
- ఒరిస్సా, ఉత్తరప్రదేశ్‌లో రూ.500 పింఛన్ ఇస్తున్నారు. మీ బిడ్డ ప్రభుత్వానికి అవ్వాతాతలు, వితంతువులపై ఎంత ప్రేమ ఉందో చెప్పేందుకు ఇది ఉదాహరణ మాత్రమే. మనం రాకముందు రాష్ట్రంలో పింఛన్‌లు 39 లక్షలు ఉంటే మీ బిడ్డ ప్రభుత్వం వచ్చాక 66 లక్షలకు తీసుకెళ్లాం. ఇందులో ఏకంగా 45 లక్షల పింఛన్లు నా అక్కచెల్లెమ్మలు, అవ్వలకే ఇస్తున్నాం. ఇంకా లోటుపాట్లు సవరించుకుని మంచి పాలన అందించేందుకు సలహాల కోసం మీ వద్దకు వచ్చాను.

వలంటీర్లతో పెన్షన్ల పంపిణీ వద్దు

- వాటితోపాటు అన్ని సంక్షేమ పథకాలకు వారిని దూరంగా పెట్టండి
- వీటి అమలుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేసుకోండి
- వలంటీర్లకు ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు ఇతర పరికరాలనూ స్వాధీనం చేసుకోండి
- సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఫిర్యాదుల మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పెన్షన్లతో సహా ఇతర అన్ని సంక్షేమ పథకాల నగదు పంపిణీ విధుల నుంచి వలంటీర్లను దూరంగా ఉంచాలంటూ కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి ఆదేశాలను జారీచేసింది. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ పదేపదే చేసిన ఫిర్యాదులకు తోడు.. అదే సంస్థ హైకోర్టులో వేసిన కేసు, వలంటీర్లకు వ్యతిరేకంగా పదేపదే వివిధ దినపత్రికల్లో వస్తున్న కథనాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఆదేశాలను జారీచేస్తున్నట్లు ఆ ఉత్తర్వులో పేర్కొంది. అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి సంక్షేమ పథకం కిందైనా నేరుగా నగదును ఇచ్చే విధుల నుంచి వలంటీర్లను తొలగించాలని స్పష్టంచేసింది. అదేవిధంగా వలంటీర్లకు ఇచ్చిన సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లువంటి ఇతర పరికరాలన్నింటినీ కూడా ఎన్నికల ప్రవర్తనా నియమావళి పూర్తయ్యేవరకు డీఈఓకి అప్పజెప్పాల్సిందిగా ఆదేశించింది. ఇక పెన్షన్లు వంటి సంక్షేమ పథకాల నగదు పంపిణీ కోసం రెగ్యులర్ ఉద్యోగులద్వారా ఇప్పటికే రాష్ట్రంలో వివిధ సంక్షేమ పథకాలకు వినియోగిస్తున్న ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ)వంటి ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిందిగా ఎన్నికల సంఘం కోరింది.

వలంటీర్లపై ఈసీ నిర్ణయం దురదృష్టకరం

- ఎన్నికల కమిషన్ తన నిర్ణయాన్ని పునఃసమీక్షించాలి
- సీఎం వైఎస్ జగన్‌పై కక్షతో పేదల్ని ఇబ్బంది పెట్టేలా చంద్రబాబు వ్యవహరిస్తున్నారు
- జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- వలంటీర్ల సేవలు నిలిపివేయించిన నీచుడు చంద్రబాబు: మంత్రి కారుమూరి
- చంద్రబాబు పెత్తందారీ పోకడలతో ప్రజలకు ఇబ్బందులు: ఎంపీ కేశినేని, ఎమ్మెల్యేలు మల్లాది, వెలంపల్లి
- వలంటీర్ల వ్యవస్థపై బాబు కుట్రలకు పరాకాష్ట: వాసిరెడ్డి పద్మ
- మేధావుల ముసుగులో వలంటీర్లపై కుట్ర: లేళ్ల అప్పిరెడ్డి
- వలంటీర్లను నియంత్రించడం ప్రజలను ఇబ్బందులు పెట్టడమే: ఎమ్మెల్యే కన్నబాబు

జనసేనను చిదిమేసిన చంద్రబాబు

- పొత్తు పేరుతో జనసేన ఉనికికే ఎసరు పెట్టిన టీడీపీ అధినేత
- 175 అసెంబ్లీ స్థానాల్లో ఇచ్చింది 21 మాత్రమే
- రాయలసీమలోని 4 ఉమ్మడి జిల్లాల్లో 52 సీట్లలో దక్కింది రెండే
- ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరులో 4 మాత్రమే జనసేనకు
- ఉభయ గోదావరి జిల్లాల్లో 34 స్థానాల్లో జనసేనకు 12
- విశాఖ జిల్లాలో 15 సీట్లలో ఇచ్చింది 3
- ఇలా రెండు మూడు జిల్లాలకే జనసేనను పరిమితం చేసిన బాబు
- వీటిలోనూ జనసేన నాయకులకు దక్కిన సీట్లు చాలా తక్కువ
- అధిక భాగం ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికే కేటాయింపు
- గత ఎన్నికల్లో ఎక్కువ ఓట్లు వచ్చిన భీమిలి, విజయవాడ వెస్ట్ ఈసారి జనసేనకే రాలేదు
- మనకేదీ ప్రాధాన్యత అంటూ ప్రశ్నిస్తున్న జనసేన అభిమానులు
- సమాధానం చెప్పలేకపోతున్న నాయకులు
- పార్టీ అధినేతకు చెప్పుకుందామన్నా స్పందన లేక నిరాశ

టీడీపీలో టికెట్ల వేలం!

- అభ్యర్థుల ఎంపికలో డబ్బుకే ప్రాధాన్యత ఇచ్చినట్లు తేటతెల్లం
- పార్టీ నేతలను కాదని బయటి వ్యక్తులకు సీట్లు ఇవ్వడానికి ఇదే కారణం
- అనంతపురం అర్బన్ సీటును రూ.30 కోట్లకు అమ్ముకున్నట్లు టీడీపీ నేతల ఆరోపణ
- గంటాకు భీమిలి ఇవ్వడం వెనుకా భారీ డీల్
- దర్శి, గుంతకల్లు ఎమ్మెల్యే, ఒంగోలు ఎంపీ సీటు ఖరారుకీ ఇదే సూత్రం
- అంతకుముందు ప్రకటించిన అనేక సీట్లలోనూ ఇదే పంచాయతీ
- రెండు రకాల డిపాజిట్లు చేస్తే కానీ సీటు ఖరారు కాలేదంటున్న అభ్యర్థులు
- అనేక చోట్ల డబ్బుకి సీట్లు అమ్మేసుకున్నారని ఆరోపిస్తున్న టీడీపీ నేతలు
- ఎక్కడికక్కడ మిన్నంటుతున్న ఆందోళనలు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

జీవన్‌రెడ్డి రోహింగ్యాల అభ్యర్థి: ఎంపీ అర్వింద్



జగిత్యాలటౌన్: నిజామాబాద్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న తాటిపర్తి జీవన్‌రెడ్డి బంగ్లాదేశ్‌లోని రోహింగ్యాల అభ్యర్థి అని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ఆరోపించారు. తాను భారతీయ హిందువుల అభ్యర్థినని, రోహింగ్యాల అభ్యర్థికి.. తనకు జరగబోయే పోరులో జగిత్యాల ప్రజలు ఎవరికి మద్దతుగా నిలుస్తారో జూన్ 4న తెలుస్తుందని చెప్పారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో అర్వింద్ జీవన్‌రెడ్డిపై ఈ వ్యాఖ్యలు చేశా రు. బీజేపీకి ప్రత్యర్థే లేరని, బీఆర్ఎస్ పార్టీకి రాష్ట్రంలో ఒక్క ఎంపీ సీటు కూడా రాదని తెలిపారు. కనీసం డిపాజిట్ వచ్చే పరిస్థితే లేదన్నారు. తాను మోదీ సైనికుడినని, రాబోయే ఎన్నికల్లో మోదీ మూడోసారి ప్రధాని అవుతారని అర్వింద్ ధీమా వ్యక్తంచేశారు.

17 సీట్లపై బీజేపీ దృష్టి

రాష్ట్ర పార్టీ లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జిగా అభయ్ పాటిల్ బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని 17 ఎంపీ సీట్లను గెలుచుకునేలా జాతీయ నాయకత్వం సూచనలకు అనుగుణంగా రాష్ట్ర పార్టీ ముందుకెళుతోందని బీజేపీ అధికార ప్రతినిధి రాణీ రుద్రమ తెలిపారు. రాష్ట్రపార్టీ లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జిగా నియమితులైన అభయ్ పాటిల్ శనివారం పార్టీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారని తెలిపారు. పార్టీ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన లీగల్‌సెల్ సమావేశంలో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన చట్టపరమైన అంశాలపై మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు, కన్వీనర్ గోకుల రామారావు, ఇతర నాయకులతో చర్చించారని తెలిపారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, పార్టీపరంగా లోక్‌సభ నియోజకవర్గాల వారీగా నిర్వహిస్తున్న ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశాల వివరాలను వెల్లడించారు. రాష్ట్రంలోని 17 ఎంపీ సీట్లలో 17 మీడియా సెంటర్లను ఏర్పాటు చేసి, వాటికి రాష్ట్ర అధికార ప్రతినిధులను ఇన్‌చార్జిలుగా నియమించినట్టు తెలియజేశారు. ఇదిలా ఉంటే... పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి అభయ్ పాటిల్‌కు పార్టీ తమిళనాడు, కర్ణాటకల సహ ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకరరెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనతో వివిధ సంస్థాగత, ఎన్నికల సంబంధిత అంశాలపై చర్చించినట్టు పొంగులేటి తెలిపారు.

అవ్వాతాతలపై బాబు పగ..

- సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ ముసుగులో చంద్రబాబు కుట్ర
- నిజానికి ఇది ఆయన జేబు సంస్థ
- దీనికి బాబు నమ్మినబంటు.. నిమ్మగడ్డ నేతృత్వం

సాక్షి, అమరావతి: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా.. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో క్షేత్రస్థాయిలో ఎలాంటి పైరవీలు, లంచాలకు తావులేకుండా.. కుల, మత, ప్రాంత, వర్గాలకు అతీతంగా.. అర్హత ఉన్న ప్రతీఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేయడంలో కీలకంగా ఉన్న వలంటీర్లపై చంద్రబాబు నేతృత్వంలోని ఎల్లో గ్యాంగ్ చివరకు తన పగ సాధించింది. అవ్వాతాతలకు ఏ కష్టం లేకుండా నెలనెలా ఒకటో తారీఖు పొద్దున్నే తలుపుకొట్టి మరీ పింఛన్లు అందజేస్తున్న ఈ వలంటీర్లపై టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ మొదటినుంచీ రకరకాల వివాదాస్పద ఆరోపణలు చేస్తూ తమ అక్కసును, ఆక్రోశాన్ని వెళ్లగక్కుతూ వచ్చారు. ఇప్పుడు ఎన్నికల వేళ అవ్వాతాతలు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తదితర దాదాపు 66.40 లక్షల మంది లబ్ధిదారులను మళ్లీ టీడీపీ పాలనలో మాదిరిగా ఇబ్బందులకు గురిచేయడానికే చంద్రబాబు బరితెగించారు. ఇందుకు సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ అనే సంస్థను పావుగా వాడుకున్నారు.

బాబు జేబు సంస్థ ముసుగులో..

నిజానికి.. తన జేబు సంస్థ అయిన సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థను చంద్రబాబు కొద్దిరోజుల ముందే ఏర్పాటు చేయించారు. దీని ముసుగులో చంద్రబాబు తన కుట్రలకు ఎప్పటినుంచో పదునుపెట్టారు. ఎన్నికల సమయంలో ఈ వలంటీర్లను ఎలాగైనా విధుల నుంచి దూరం పెట్టాలని పచ్చబ్యాచ్ కుట్ర పన్నింది. ఇందులో భాగంగా.. తన నమ్మినబంటు.. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ ఈ సంస్థకు నేతృత్వం వహించి బాబు డైరెక్షన్‌లో కేంద్ర ఎన్నికల సంఘానికి మొన్న ఫిబ్రవరి నుంచి అదేపనిగా వలంటీర్ల వ్యవస్థపై ఫిర్యాదులు చేస్తూ వచ్చారు. దీంతో కేంద్ర ఎన్నికల సంఘం వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ సహా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి ఎలాంటి నగదు పంపిణీ చేపట్టవద్దంటూ ప్రభుత్వానికి తాజాగా ఆదేశాలు జారీచేసింది. ఈ విషయం ఈసీ తన ఉత్తర్వులో పేర్కొంది.

చంద్రబాబు సేవలోనే తరిస్తున్న నిమ్మగడ్డ..

నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ ఐఏఎస్ అధికారి అయినప్పటికీ.. ఆయన పూర్తిగా చంద్రబాబు రాజకీయ ప్రయోజనాల కోసమే మొదటి నుంచీ పనిచేసిన వ్యక్తే. స్థానిక సంస్థల నిర్వహణలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని ఆయనపై ఆరోపణలు వెల్లువెత్తాయి. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే నిమ్మగడ్డను రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా సిఫార్సు చేశారు. వాస్తవానికి.. 2018లో రాష్ట్రంలో సర్పంచుల పదవీకాలం ముగిసినా.. 2019 సాధారణ ఎన్నికల ముందు ఆ ఎన్నికల జరిగితే నాటి చంద్రబాబు ప్రభుత్వానికి రాజకీయ ఇబ్బందులు తలెత్తుతాయని భావించి నిబంధనలకు విరుద్ధంగా కోర్టు సాకుల పేరుతో సార్వత్రిక ఎన్నికలు ముగిసేవరకు సర్పంచి ఎన్నికలు జరగకుండా నిమ్మగడ్డ అడ్డుకున్నారు. ఇక వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక కూడా.. 2020 ఆరంభంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో ప్రభుత్వానికి కనీసం సమాచారం కూడా ఇవ్వకుండా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ హోదాలో నిమ్మగడ్డ కరోనా పేరుతో స్థానిక సంస్థల ఎన్నికలను అర్ధంతరంగా వాయిదా వేశారు. అప్పట్లో ఈ నిర్ణయం కూడా తీవ్ర వివాదాస్పదమైంది.

సుప్రీంకోర్టులోనూ నిమ్మగడ్డ కేసులు..

రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ పదవీ విరమణ చేసిన తర్వాత తన పూర్తి సమయాన్ని ఆయన తన బాస్ చంద్రబాబుకే కేటాయించారు. ప్రస్తుత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆయన నేతృత్వంలో పలువురు ద్వారా చంద్రబాబు సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థను ఏర్పాటుచేసి, ఆ సంస్థ ద్వారా వలంటీర్ల వ్యవస్థపై పెద్దఎత్తున ఫిర్యాదులు చేస్తూ కోర్టులోనూ కేసులు దాఖలు చేయించారు. వలంటీర్ల వ్యవస్థ చెల్లుబాటునే ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టులో కేసు నమోదు చేసి, ఆ తర్వాత తనంతట తానుగా ఆ కేసును ఉపసంహరించుకున్నారని అధికారులు చెప్పారు. ఆ తర్వాత వలంటీర్లకు వ్యతిరేకంగా ఢిల్లీ హైకోర్టులోనూ కేసు దాఖలు చేశారని, రాష్ట్ర హైకోర్టులోనూ కేసులు వేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే.. ఈ ఏడాది ఫిబ్రవరి 23, 25 తేదీల్లో వరుసగా రెండుసార్లు వలంటీర్లపై కేంద్ర ఎన్నికల సంఘానికి కూడా సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ ఫిర్యాదు చేసింది.

రూ.లక్షల్లో లాయర్లకు ఫీజులు..

సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ ద్వారా వలంటీర్లపై మొత్తం కథ నడిపించిన చంద్రబాబు ఇందుకు లాయర్ల ఫీజుల నిమిత్తం రూ.లక్షల్లో వెచ్చించారు. సుప్రీంకోర్టులో ఇందుకు సంబంధించిన కేసులు వాదించేందుకు ఖరీదైన లాయర్లను వినియోగించారు. నిజానికి.. అంత పెద్ద లాయర్లను భరించడం ఈ సంస్థవల్ల కాదు కాబట్టి చంద్రబాబే వెనుకనుండి ఇదంతా నడిపిస్తున్నారు.

కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్‌పై నెగ్గిన అవిశ్వాసం

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి(బీఆర్ఎస్)పై కాంగ్రెస్ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. శనివారం కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్‌హాల్‌లో కలెక్టర్ జితేష్‌వి.పాటిల్, కమిషనర్ సుజాత ఆధ్వర్యంలో అవిశ్వాస తీర్మానంపై సమావేశం నిర్వహించారు. ఉదయం 10: 44 గంటలకు ప్రత్యేక బస్సులో 27 మంది కాంగ్రెస్ సభ్యులు, ఆ వెంటనే రెండు కార్లలో బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది కౌన్సిలర్లు సమావేశానికి హాజరయ్యారు. 49 మంది సభ్యులు ఉన్న కౌన్సిల్‌లో అవిశ్వాసం నెగ్గడానికి 34 మంది సభ్యులు అవసరం ఉండగా 37 మంది సభ్యులు హాజరై తమ మద్దతు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు పటాకులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. జాహ్నవి తండ్రి, బీఆర్ఎస్ రాష్ట్రనేత నిట్టు వేణుగోపాల్‌రావు మీడియాతో మాట్లాడుతూ అవిశ్వాస తీర్మానంలో బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు కాంగ్రెస్‌కు కోవర్టులుగా మారి అమ్ముడుపోయారని ఆరోపించారు.

చోరీకి వచ్చి గ్రామస్తుల దాడిలో ఒకరి మృతి

నవీపేట: నిజామాబాద్ జిల్లా పాల్దా శివారు లోని రైస్‌మిల్‌లో పాత ఇనుప సామగ్రి దొంగతనానికి ప్రయత్నించిన వ్యక్తిని గ్రామస్తులు చితకబాదడంతో మృతి చెందాడు. శనివారం సాయంత్రం ఆరుగురు వ్యక్తులు పాల్దా శివారు లోని మూతపడిన వెంకటేశ్వర రైస్‌మిల్‌లోకి పాత ఇనుప సామగ్రిని దొంగిలించేందుకు వెళ్లారు. గమనించిన గ్రామస్తులు వారిని వెంబడించగా అయిదుగురు పరారయ్యారు. డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి తండాకు చెందిన సునీల్ (44) గ్రామస్తుల చేతికి చిక్కాడు. గ్రామస్తులు తీవ్రంగా కొట్టడంతో స్పృహ తప్పి పడిపోయి అక్కడికక్కడే మృతి చెందా డు. రూరల్ సీఐ సతీష్, నవీపేట ఎస్సై యా దగిరిగౌడ్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

మొదటి ముద్దాయి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మాజీ మంత్రి కేటీఆర్‌ను మొదటి ముద్దాయిగా విచారించాలని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ డిమాండ్ చేశారు. కేటీఆర్‌తో పాటు అప్పటి డీజీపీ, మాజీ సీఎం కేసీఆర్, ఇతర మంత్రులను కూడా విచారించాలని కోరారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్, కేటీఆర్ సూచనలతోనే బీఆర్ఎస్ పార్టీ నేతలు కాంగ్రెస్‌లోకి చేరుతున్నారని ఆరోపించారు.

మద్యం మంచి బ్రాండ్లు తెస్తా

- ఒక్కసారి నన్ను అసెంబ్లీకి పంపించండి
- ఎన్నికల ప్రచారంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్



పిఠాపురం: తాను గెలిస్తే మద్యం మంచి బ్రాండ్లు తీసుకువస్తానని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చెప్పారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలం చేబ్రోలులో శనివారం రాత్రి నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. పదేళ్లుగా రాజకీయాల్లోకి వచ్చి కూడా పదవి లేకుండా తిరిగానని, ఒక్కసారి తనను గెలిపించి అసెంబ్లీకి పంపించాలని విజ్ఞప్తి చేశారు. పిఠాపురం నియోజకవర్గాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా దేశం గర్వించే విధంగా అభివృద్ధి చేస్తానని అన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు వచ్చి ఓట్లు అడిగితే నిలదీయాలని అన్నారు. అక్రమాలు, అన్యాయాలకు నెలవుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉందని, అటువంటి పార్టీకి భారీ భంగపాటు కలిగేలా ఓడించాలన్నారు. కేంద్ర నేతల వద్ద తనకు ఉన్న పలుకుబడితో రూ.100 కోట్ల వరకూ నిధులు తీసుకువచ్చి, పిఠాపురాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. 'నా టీడీపీని గెలిపించండి, నా బీజేపీని గెలిపించండి, నాతో పాటు నా 21 మంది ఎమ్మెల్యేలను గెలిపించి అసెంబ్లీకి పంపించండి' అని కోరారు.

విశాఖలో విద్యార్థిని ఆత్మహత్యపై విచారణకు కమిటీ

సాక్షి, అమరావతి/మహారాణిపేట(విశాఖ దక్షిణ): విశాఖ జిల్లా కొమ్మాదిలోని చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లమో విద్యార్థిని రూపశ్రీ బలవన్మరణంపై సాంకేతిక విద్యా శాఖ విచారణకు ఆదేశించింది. సంఘటన పూర్వాపరాలపై పూర్తిస్థాయి విచారణ జరిపి 24 గంటల్లోపు వివరణాత్మక నివేదిక అందించాలని కమిషనర్ చదలవాడ నాగరాణి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీని నియమిస్తున్నామన్నారు. పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.చంద్ర శేఖర్ నేతృత్వంలో విశాఖపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ మెటలర్జీ విభాగం అధిపతి డాక్టర్ కె.రత్నకుమార్, సివిల్ ఇంజినీర్‌లో లెక్చరర్ డాక్టర్ కె.రాజ్యలక్ష్మి సభ్యులుగా కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యాసంస్థలోని ఫ్యాకల్టీ లైంగిక వేధింపుల కారణంగానే తాను చనిపోతున్నానని, తనలాగే కాలేజీలో పలువురు విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారని తండ్రికి మెసేజ్ చేసి రూపశ్రీ చనిపోయిన విషయం తెలిసిందే.

డీఎస్సీ పరీక్షలు వాయిదా

- ఏపీ టెట్ ఫలితాల వెల్లడి కూడా..
- ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు ఆపాలని ఈసీ ఆదేశాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో త్వరలో నిర్వహించనున్న ఉపాధ్యాయ నియామక పరీక్ష (డీఎస్సీ)లను ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు వాయిదా వేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. అలాగే టెట్ ఫలితాలను కూడా వెల్లడించవద్దని సూచించింది. డీఎస్సీ పరీక్షల నిర్వహణ, టెట్ ఫలితాల వెల్లడిపై వివిధ వర్గాల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో మార్గనిర్దేశం చేయాలని కోరుతూ కేంద్ర ఎన్నికల సంఘానికి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా లేఖ రాశారు. దీంతో రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగిసేవరకు ఏపీ టెట్ ఫలితాల వెల్లడి, డీఎస్సీ పరీక్షల నిర్వహణను వాయిదా వేయాలని కేంద్ర ఎన్నికల సంఘం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల కోడ్ ముగిశాక హైకోర్టు తీర్పుకనుగుణంగా వీటిని నిర్వహించుకోవచ్చని తెలిపింది.

లక్నో సూపర్ జెయింట్స్ జట్టులో మాథ్యూ హెన్రీ



న్యూజిలాండ్ పేస్ బౌలర్ మాథ్యూ హెన్రీకి ఐపీఎల్‌లో ఆడే అవకాశం లభించింది. గత ఏడాది జరిగిన వేలంలో హెన్రీని ఏ జట్టూ తీసుకోలేదు. అయితే లక్నో సూపర్ జెయింట్స్ జట్టు సభ్యుడు, ఇంగ్లండ్ పేస్ బౌలర్ డేవిడ్ విల్లే వ్యక్తిగత కారణాలతో ఐపీఎల్ నుంచి వైదొలిగాడు. దాంతో లక్నో ఫ్రాంచైజీ విల్లే స్థానంలో హెన్రీని అతని కనీస ధర రూ. 1 కోటీ 25 లక్షలకు తీసుకుంది. గతంలో చెన్నై సూపర్ కింగ్స్, పంజాబ్ కింగ్స్ జట్టులో సభ్యుడిగా ఉన్న 32 ఏళ్ల హెన్రీ న్యూజిలాండ్ తరఫున 25 టెస్టులు, 82 వన్డేలు, 17 టి20లు ఆడి 256 వికెట్లు పడగొట్టాడు.

రన్నరప్ అంకిత-రుతుజా జోడీ



అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య డబ్ల్యూ50 టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో అంకిత రైనా-రుతుజా భోస్లే (భారత్) జోడీ రన్నరప్‌గా నిలిచింది. జపాన్‌లో శనివారం జరిగిన ఫైనల్లో అంకిత-రుతుజా ద్వయం 3-6, 5-7తో ఇరీనా హయాషి-సాకి ఇమామురా (జపాన్) జంట చేతిలో ఓడిపోయింది. 86 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అంకిత, రుతుజా తమ సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయింది.

సెమీస్‌లో ఓడిన సిక్కిరెడ్డి-సుమీత్ జోడీ



మాడ్రిడ్: స్పెయిన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ వరల్డ్ టూర్ సూపర్-300 టోర్నీలో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. బరిలో మిగిలిన మిక్స్‌డ్ డబుల్స్ జోడీ సిక్కి రెడ్డి-సుమీత్ రెడ్డి సెమీఫైనల్లో వెనుదిరిగింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 66వ ర్యాంక్‌లో ఉన్న సిక్కి-సుమీత్ 17-21, 12-21తో ప్రపంచ 17వ ర్యాంక్‌లో ఉన్న రినోవ్ రివాల్డీ-పితా మెంతారి (ఇండోనేసియా) జంట చేతిలో ఓడిపోయింది. సిక్కి-సుమీత్ జోడీకి 2,940 డాలర్ల (రూ. 2 లక్షల 45 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 4,900 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

శ్రీలంక 314/4

నిశాన్, కరుణరత్నే, కుశాల్ అర్ధ సెంచరీలు



కుశాల్, కరుణరత్నే

చట్టోగ్రామ్: బంగ్లాదేశ్‌తో మొదలైన రెండో టెస్టులో శ్రీలంక భారీ స్కోరు దిశగా సాగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంక తొలి రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 314 పరుగులు సాధించింది. టాపార్డర్ బ్యాటర్లు నిశాన్ మదుష్కా (57; 6 ఫోర్లు), దిముత్ కరుణరత్నే (86; 8 ఫోర్లు, 1 సిక్స్), కుశాల్ మెండిస్ (93; 11 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో రాణించారు. నిశాన్, కరుణరత్నే తొలి వికెట్‌కు 96 పరుగులు జోడించారు. నిశాన్ అవుటయ్యాక కుశాల్ మెండిస్‌తో కలిసి కరుణరత్నే రెండో వికెట్‌కు 114 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. ప్రస్తుతం దినేశ్ చండీమల్ (34 బ్యాటింగ్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ ధనంజయ డిసిల్వా (15 బ్యాటింగ్; 2 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. నాలుగు నెలల తర్వాత మళ్లీ అంతర్జాతీయ మ్యాచ్ ఆడుతున్న బంగ్లాదేశ్ స్టార్ షకీబ్ అల్ హసన్ 18 ఓవర్లు వేసి 60 పరుగులిచ్చి ఒక వికెట్ పడగొట్టాడు.

లక్నో సూపర్‌గా...



సొంతగడ్డపై జెయింట్స్ గెలుపు బోణీ
- 21 పరుగులతో ఓడిన పంజాబ్
- బంతితో హడలెత్తించిన మయాంక్
- రాణించిన డికాక్, కృనాల్, పూరన్

శిఖర్ ధావన్

ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ మయాంక్ యాదవ్

ఐపీఎల్ కొత్త సీజన్‌ను ఓటమితో మొదలు పెట్టిన లక్నో సూపర్ జెయింట్స్ జట్టు వెంటనే కోలుకుంది. సొంతగడ్డపై సత్తా చాటి గెలుపు బోణీ చేసింది. బ్యాటింగ్‌లో డికాక్, కృనాల్, పూరన్ కీలక పాత్ర పోషించగా... మయాంక్ యాదవ్, మొహసిన్ పదునైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని దెబ్బ కొట్టారు. ముఖ్యంగా తొలి ఐపీఎల్ మ్యాచ్ ఆడిన 21 ఏళ్ల మయాంక్ యాదవ్ తాను వేసిన 24 బంతుల్లో తొమ్మిది బంతులను గంటకు 150 కిలోమీటర్ల కంటే వేగంగా వేయడం విశేషం. భారీ ఛేదనలో 100కు పైగా తొలి వికెట్ భాగస్వామ్యంతో మంచి పునాది వేసుకున్నా... చివరకు పంజాబ్ కింగ్స్‌కు పరాజయం తప్పలేదు. బ్యాటర్ల నిర్లక్ష్యపూరిత షాట్లతో ఆ జట్టు వరుసగా రెండో ఓటమిని మూటగట్టుకుంది.

లక్నో: ఐపీఎల్‌లో లక్నో తొలి విజయంతో పాయింట్ల ఖాతా తెరిచింది. శనివారం జరిగిన పోరులో లక్నో 21 పరుగుల తేడాతో పంజాబ్ కింగ్స్‌ను ఓడించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న లక్నో 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది. క్వింటన్ డికాక్ (38 బంతుల్లో 54; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), కృనాల్ పాండ్యా (22 బంతుల్లో 43 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), నికోలస్ పూరన్ (21 బంతుల్లో 42; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లతో జట్టు భారీ స్కోరుకు బాటలు వేశారు. అనంతరం పంజాబ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 178 పరుగులు సాధించింది. శిఖర్ ధావన్ (50 బంతుల్లో 70; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), జానీ బెయిర్‌స్టో (29 బంతుల్లో 42; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) తొలి వికెట్‌కు 70 బంతుల్లోనే 102 పరుగులు జోడించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మయాంక్ యాదవ్ (3/27) పంజాబ్‌ను దెబ్బ కొట్టాడు.

సమష్టి ప్రదర్శన...

రబాడ ఓవర్లో వరుస బంతుల్లో ఫోర్, సిక్స్‌తో లక్నో ఇన్నింగ్స్‌ను డికాక్ ధాటిగా ప్రారంభించగా... అర్ష్‌దీప్ ఓవర్లో సిక్స్, ఫోర్ కొట్టిన కేఎల్ రాహుల్ (15) అదే ఓవర్లో వెనుదిరిగాడు. పడిక్కల్ (9) విఫలం కాగా... రాహుల్ చహర్ ఓవర్లో వరుసగా రెండు సిక్స్‌లు బాదిన స్టొయినిస్ (19) తర్వాతి బంతికే అవుటయ్యాడు. 34 బంతుల్లో డికాక్ అర్ధసెంచరీ పూర్తి చేసుకోగా... చహర్ ఓవర్లో 2 సిక్స్‌లు, ఫోర్‌తో పూరన్ జోరు ప్రదర్శించాడు. పూరన్ వెనుదిరిగిన తర్వాత కృనాల్ కూడా చెలరేగడంతో జట్టు భారీ స్కోరు చేయగలిగింది.

శతక భాగస్వామ్యం...

ఛేదనలో పంజాబ్‌కు ధావన్, బెయిర్‌స్టో ఘనమైన ఆరంభాన్ని అందించారు. సిద్ధార్థ్ ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్ కొట్టిన ధావన్... మొహసిన్ ఓవర్లోనూ 2 ఫోర్లు, సిక్స్ బాదాడు. దాంతో 6 ఓవర్లు ముగిసే సరికి స్కోరు 61 పరుగులకు చేరింది. 30 బంతుల్లోనే ధావన్ హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకోగా, కృనాల్ ఓవర్లో రెండు వరుస సిక్స్‌లతో బెయిర్‌స్టో దూకుడు చూపించాడు. ఎట్టకేలకు 12వ ఓవర్లో మయాంక్ యాదవ్ ఈ జోడీని విడదీయగా, క్రీజ్‌లో ఉన్న కొద్దిసేపు ప్రభ్‌సిమ్రన్ (7 బంతుల్లో 19; 1 ఫోర్, 2 సిక్స్‌లు) వేగంగా ఆడాడు. అయితే 13 పరుగుల వ్యవధిలో 4 వికెట్లు కోల్పోయిన పంజాబ్ కింగ్స్ ఓటమి దిశగా పయనించింది. గెలుపు కోసం 23 బంతుల్లో 59 పరుగులు చేయాల్సిన స్థితిలో ధావన్ అవుట్ కావడం జట్టు అవకాశాలకు దాదాపుగా తెర వేసింది.

స్కోరు వివరాలు

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: డికాక్ (సి) జితేశ్ (బి) అర్ష్‌దీప్ 54; రాహుల్ (సి) బెయిర్‌స్టో (బి) అర్ష్‌దీప్ 15; పడిక్కల్ (సి) ధావన్ (బి) స్యామ్ కరన్ 9; స్టొయినిస్ (బి) చహర్ 19; పూరన్ (బి) రబాడ 42; బదోని (సి) బెయిర్‌స్టో (బి) కరన్ 8; కృనాల్ పాండ్యా (నాటౌట్) 43; రవి బిష్ణోయ్ (సి) (సబ్) తనయ్ 0; మొహసిన్ (రనౌట్) 2; నవీన్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 199. వికెట్ల పతనం:** 1-35, 2-45, 3-78, 4-125, 5-146, 6-189, 7-189, 8-197. **బౌలింగ్:** స్యామ్ కరన్ 4-0-28-3, అర్ష్‌దీప్ 3-0-30-2, రబాడ 4-0-38-1, రాహుల్ చహర్ 3-0-42-1, హర్‌ప్రీత్ బ్రార్ 2-0-14-0, హర్షల్ పటేల్ 4-0-45-0.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ధావన్ (సి) డికాక్ (బి) మొహసిన్ 70; బెయిర్‌స్టో (సి) స్టొయినిస్ (బి) మయాంక్ 42; ప్రభ్‌సిమ్రన్ (సి) నవీన్ (బి) మయాంక్ 19; జితేశ్ (సి) నవీన్ (బి) మయాంక్ 6; లివింగ్‌స్టోన్ (నాటౌట్) 29; కరన్ (సి)పూరన్ (బి) మొహసిన్ 0; శశాంక్ (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 178. వికెట్ల పతనం** : 1-102, 2-128, 3-139, 4-141, 5-141. **బౌలింగ్:** సిద్ధార్థ్ 2-0-21-0, నవీన్ 4-0-43-0, మొహసిన్ 4-0-34-2, కృనాల్ 3-0-26-0, బిష్ణోయ్ 3-0-25-0, మయాంక్ యాదవ్ 4-0-27-3.

ఐపీఎల్‌లో నేడు

గుజరాత్ × హైదరాబాద్
వేదిక: అహ్మదాబాద్
మధ్యాహ్నం 3: 30 గంటల నుంచి


ఢిల్లీ × చెన్నై
వేదిక: విశాఖపట్నం
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
చెన్నై	2	2	0	4	1.979
కోల్‌కతా	2	2	0	4	1.047
రాజస్తాన్	2	2	0	4	0.800
హైదరాబాద్	2	1	1	2	0.675
లక్నో	2	1	1	2	0.025
పంజాబ్	3	1	2	2	-0.337
బెంగళూరు	3	1	2	2	-0.711
గుజరాత్	2	1	1	2	-1.425
ఢిల్లీ	2	0	2	0	-0.528
ముంబై	2	0	2	0	-0.925

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

బోపన్న-ఎబ్డెన్ జోడీకి మయామి మాస్టర్స్ టైటిల్



బోపన్న, ఎబ్డెన్

ఫ్లోరిడా: ప్రతిష్టాత్మక మయామి ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో టాప్ సీడ్ రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ టైటిల్ సాధించింది. శనివారం జరిగిన ఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 6-7 (3/7), 6-3, 10-6తో 'సూపర్ టైబ్రేక్'లో రెండో సీడ్ ఆస్టిన్ క్రాయిసెక్ (అమెరికా)-ఇవాన్ డోడిగ్ (క్రొయేషియా) జంటపై నెగ్గింది. బోపన్న-ఎబ్డెన్‌లకు 4,47,300 డాలర్ల (రూ. 3 కోట్ల 72 లక్షలు) ప్రైజ్‌మనీ, 1000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

ఒక గంట 42 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో బోపన్న ద్వయం ఆరు ఏస్‌లు సంధించి, ఆరు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది. బోపన్న కెరీర్‌లో ఇది 26 డబుల్స్ టైటిల్‌కాగా... 'మాస్టర్స్ సిరీస్'లో ఆరో టైటిల్ కావడం విశేషం. 44 ఏళ్ల బోపన్న గతంలో 'మాస్టర్స్ సిరీస్'లో ఇండియన్ వెల్స్ (2023), మోంటెకార్లో ఓపెన్ (2017), మాడ్రిడ్ ఓపెన్ (2015), పారిస్ ఓపెన్ (2012), పారిస్ ఓపెన్ (2011) టైటిల్స్ సాధించాడు. లియాండర్ పేస్ (2012లో) తర్వాత మయామి ఓపెన్ డబుల్స్ టైటిల్ నెగ్గిన రెండో భారతీయ క్రీడాకారుడిగా బోపన్న గుర్తింపు పొందాడు. ఈ విజయంతో బోపన్న సోమవారం విడుదల చేసే డబుల్స్ ర్యాంకింగ్స్‌లో మళ్లీ ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకుంటాడు.

సినిమా

గుర్తింపు అవసరం లేదు!



నాని

హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో గత ఏడాది మార్చి 30న విడుదలైన 'దసరా' చిత్రం హిట్‌గా నిలిచింది. ఈ హిట్ కాంబినేషన్ రిపీట్ అవుతోంది. నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో మరో సినిమా తెరకెక్కనుంది. నాని కెరీర్‌లోని ఈ 33వ సినిమాను 'దసరా' నిర్మాత సుధాకర్ చెరుకూరియే నిర్మించనున్నారు. 'దసరా' విడుదలై, ఏడాది పూర్తయిన సందర్భంగా తాజా చిత్రాన్ని శనివారం (మార్చి 30)న అధికారికంగా ప్రకటించింది యూనిట్. 'లీడర్ కావాలనుకుంటే నీకు గుర్తింపు అవసరం లేదు' అని అర్థం వచ్చేలా ఈ సినిమా అనౌన్స్‌మెంట్ పోస్టర్ పై ఓ ఇంగ్లిష్ కోట్ ఉంది. ఈ చిత్రం 2025లో విడుదల కానుంది. ఇక ప్రస్తుతం నాని 'సరిపోదా శనివారం' సినిమా చిత్రీకరణతో బిజీగా ఉన్నారు. అలాగే సుజిత్ డైరెక్షన్‌లో హీరోగా నాని ఓ సినిమా కమిటైన సంగతి తెలిసిందే.



కరీనా కపూర్

సెంటిమెంట్... అడ్వెంచర్

నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'తమ్ముడు'. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. శనివారం (మార్చి 30) నితిన్ బర్త్‌డే. ఈ సందర్భంగా 'తమ్ముడు' సినిమా టైటిల్ లోగో, ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. అక్కా తమ్ముడి సెంటిమెంట్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రంలో సీనియర్ నటి లయ కీలక పాత్ర చేస్తున్నారు. ఈ సినిమాకు బి. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు. మరోవైపు 'భీష్మ' వంటి సక్సెస్‌ఫుల్ మూవీ తర్వాత హీరో నితిన్, దర్శకుడు వెంకీ కుడుముల కాంబినేషన్‌లో రూపొందుతున్న యాక్షన్ అడ్వెంచరస్ థ్రిల్లర్ మూవీ 'రాబిన్ హుడ్'. ఈ సినిమా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. రాజేంద్రప్రసాద్, 'వెన్నెల' కిశోర్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం అందిస్తున్నారు.



'తమ్ముడు'లో నితిన్

అయ్యో రామ!



మాళవిక, సుహాస్, అనిత

సుహాస్, మాళవికా మనోజ్ జంటగా, 'నువ్వు నేను' చిత్రం ఫేమ్ అనితా హస్సానందని ఓ కీలక పాత్ర చేస్తున్న 'ఓ భామ అయ్యో రామ' సినిమా ప్రారంభోత్సవం శనివారం జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు వశిష్ఠ కెమెరా స్విచ్చాన్ చేయగా, 'దిల్' రాజు క్లాప్ ఇచ్చారు. దర్శకుడు శైలేష్ కొలను బౌండెడ్ స్క్రిప్ట్‌ను దర్శకుడికి అందించారు. ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను దర్శకులు కిశోర్ తిరుమల-విజయ్ కనకమేడలతో కలిసి నిర్మాత సుదర్శన్ రెడ్డి ఆవిష్కరించారు. రామ్ గోదాల దర్శకత్వంలో హరీష్ నల్లా, ప్రదీప్ తాళ్లపు రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి రథన్ స్వరకర్త. ఈ సినిమా కథ తననెంతగానో ఆకట్టుకుందని అన్నారు సుహాస్. ఈ సినిమాకు సహ-నిర్మాత ఆనంద్ గడగోని.

యశ్‌కు సిస్టర్?

'కేజీఎఫ్' ఫేమ్ యశ్ హీరోగా మలయాళ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో 'టాక్సిక్' అనే సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో కరీనా కపూర్ ఓ హీరోయిన్‌గా నటించనున్నారన్న వార్త ప్రచారంలోకి వచ్చింది. అయితే ఈ సినిమాలో కరీనాది హీరోయిన్ పాత్ర కాదని, యశ్‌కు అక్క పాత్రలో ఆమె కనిపించనున్నారనే టాక్ తాజాగా తెరపైకి వచ్చింది. అలాగే ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం గతంలో శ్రుతీహాసన్, సాయిపల్లవి వంటి వార్ల పేర్లు తెరపైకి రాగా, తాజాగా కియారా అద్వానీ పేరు వినిపిస్తోంది. మరి.. యశ్‌కు సిస్టర్ పాత్రలో కరీనా కనిపిస్తారా? యశ్‌తో కియారా జోడీ కడతారా? అనే విషయాలు తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే. వచ్చే ఏడాది ఏప్రిల్ 10న ఈ చిత్రం విడుదల కానుంది.

యాక్షన్ వైబ్



సందీప్ కిషన్

సందీప్ కిషన్ హీరోగా స్వరూప్ ఆర్ఎస్‌జె దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రానికి 'వైబ్' టైటిల్ ఖరారైంది. రాహుల్ యాదవ్ నక్కా నిర్మిస్తున్న ఈ చిత్రం టైటిల్ లోగో శనివారం విడుదలైంది. ''కాలేజ్ బేస్డ్ యాక్షన్ లవ్ స్టోరీగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. ఒక స్టూడెంట్, అతని స్నేహితులు సాధారణ వ్యక్తుల నుంచి రెబల్‌గా మారడానికి దారి తీసిన కారణాలేంటి? అనేది ఈ చిత్రం కథాంశం. వచ్చే ఏడాది వేసవిలో 'వైబ్'ని విడుదల చేస్తాం'' అని మేకర్స్ తెలిపారు.

ఇదొక కొత్త ప్రయత్నం


- 'దిల్' రాజు

ఆశిష్, వైష్ణవీ చైతన్య హీరో హీరోయిన్‌గా నటించిన చిత్రం 'లవ్ మీ'. 'ఇఫ్ యు డేర్' (నీకు ధైర్యం ఉంటే...) అనేది ఉపశీర్షిక. శిరీష్ సమర్పణలో 'దిల్' రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 25న విడుదల కానుంది. ఈ సినిమాలోని 'రావాలి రా..' అనే లిరికల్ సాంగ్ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో జరిగింది. కీరవాణి సంగీత సారథ్యంలో చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటను చెబోలు అమల, గోమతీ అయ్యర్, అదితీ భావరాజు, అజ్మల్ ఫాతిమా పర్విన్, సాయి శ్రేయ ఆలపించారు. ''ఓ ఘోస్ట్ లవ్‌స్టోరీ నేపథ్యంలో హారర్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది'' అని చిత్రం యూనిట్ పేర్కొంది. ''లవ్ మీ ఒక కొత్త ప్రయత్నం'' అన్నారు 'దిల్' రాజు.




ఆశిష్, 'దిల్' రాజు

నటుడు బాలాజీ కన్నుమూత



ప్రముఖ నటుడు డేనియల్ బాలాజీ (48) శుక్రవారం అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో గుండెపోటుతో కన్నుమూశారు. దివంగత నటుడు మురళికి బంధువు బాలాజీ. చెన్నైలోని తరమణి ఇన్‌స్టిట్యూట్‌లో దర్శకత్వ శాఖలో శిక్షణ పొందిన బాలాజీ ముందు ప్రొడక్షన్ నిర్వాహకుడిగా చేశారు. కమల్‌హాసన్ నటించిన 'మరుదనాయగన్' చిత్రానికి ప్రొడక్షన్ నిర్వాహకుడిగా బాధ్యతను నిర్వహించారు. ఇక నటి రాధిక నిర్మించి, ప్రధాన పాత్ర పోషించిన 'చిత్తి' (పిన్ని) సీరియల్‌లో బాలాజీ తొలిసారిగా నటించారు. 'చిత్తి'లో డేనియల్ అనే పాత్ర పోషించడంతో డేనియల్ బాలాజీగా గుర్తింపు పొందారు. 'ఏప్రిల్ మాదత్తిల్' చిత్రంతో వెండితెరకు పరిచయం అయ్యారు. కమల్‌హాసన్ నటించిన 'వేట్టైయాడు విళైయాడు'లో విలన్‌గా నటించి, మంచి పేరు తెచ్చుకున్నారు. అదే విధంగా సూర్య హీరోగా రూపొందిన 'కాక్క కాక్క'లో చేసిన పాత్ర ద్వారా పాపులర్ అయ్యారు బాలాజీ. ఇదే చిత్రం తెలుగులో వెంకటేశ్ హీరోగా 'ఘర్షణ'గా రీమేక్ అయింది. తమిళంలో చేసిన పాత్రనే బాలాజీ తెలుగులో చేసి, మంచి గుర్తింపు పొందారు. అలాగే 'చిరుత', 'టక్ జగదీష్' వంటి తెలుగు చిత్రాల్లోనూ నటించారు. కాగా ఈయన అవివాహితుడు. తల్లి అంటే ఎంతో ప్రేమ. ఆమె కోరిక మేరకు స్థానిక ఆవడి సమీపంలో గుడి కట్టించారు. బాలాజీ మృతికి కమల్‌హాసన్ తదితర ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. బాలాజీ అంత్యక్రియలు శనివారం చెన్నైలో జరిగాయి.



రాకేశ్

చరిత్ర చెప్పాలి

'బాహుబలి' ఫేమ్ రాకేశ్ వర్రే టైటిల్ రోల్‌లో రూపొందిన చిత్రం 'జితేందర్ రెడ్డి'. హిస్టరీ నీడ్స్ టు బీ టోల్డ్ అనేది ఉపశీర్షిక (చరిత్ర చెప్పాల్సిన అవసరం ఉంది), 'ఉయ్యాలా జంపాలా, మజ్ను' వంటి ప్రేమ కథా చిత్రాలకు దర్శకత్వం వహించిన విరించి వర్మ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ముదుగంటి రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం మే 3న రిలీజ్ కానుంది. ''జగిత్యాలలో 1980లలో జరిగిన కథే ఈ సినిమా. ఆ రోజుల్లో విలువలతో కూడిన పాత్ర, దాని చుట్టూ తిరిగే కథని ఈ తరం ప్రేక్షకులకు అందించాలని చేసిన ప్రయత్నమే ఈ సినిమా'' అన్నారు విరించి వర్మ. ''జరిగిన కథను చూపించాం తప్ప ఎవర్నీ కించపరిచే విధంగా తీయలేదు'' అన్నారు రవీందర్ రెడ్డి.

మూడు దశాబ్దాలకు మళ్లీ..!

అరడజను ఆస్కార్ అవార్డులు గెలుచుకున్న హాలీవుడ్ బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ 'ఫారెస్ట్ గంప్'. టామ్ హాంక్స్ టైటిల్ రోల్‌లో, రాబిన్ రైట్ ఓ లీడ్ రోల్‌లో నటించిన ఈ సినిమాకు రాబర్ట్ జెమెక్కిస్ దర్శకత్వం వహించారు. 1994 జూన్‌లో విడుదలైన 'ఫారెస్ట్ గంప్' చిత్రం బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇప్పుడు ఈ సినిమా ప్రస్తావన ఎందుకంటే.. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత యాక్టర్స్ టామ్ హాంక్స్-రాబిన్ రైట్, దర్శకుడు రాబర్ట్ కలిసి 'హియర్' అనే సినిమా చేస్తున్నారు. అంతేకాదు... 'ఫారెస్ట్ గంప్'కు రైటర్‌గా చేసిన ఎరిక్ రోత్ ఈ సినిమాకు వర్క్ చేస్తున్నారు. ఇంకో విశేషం ఏంటంటే... 'ఫారెస్ట్ గంప్' సినిమాను ఇదే టైటిల్‌తో ఉన్న 'ఫారెస్ట్ గంప్' అనే నవల ఆధారంగా తెరకెక్కించారు. ఇప్పుడు 'హియర్' సినిమాను కూడా ఇదే టైటిల్‌తో ఉన్న ఓ గ్రాఫిక్ నవల ఆధారంగా తెరకెక్కిస్తున్నారని టాక్. ఇక 'హియర్' చిత్రాన్ని నవంబరులో రిలీజ్ చేయాలనుకుంటున్నారు.



టామ్ హాంక్స్

ప్రతి మహిళ చూడాలి



హారిక

సాయి కుమార్, పార్వతీశం, ఐశ్వర్య, హారిక ముఖ్య తారలుగా సూరపల్లి వెంకటరమణ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మెర్సీ కిల్లింగ్'. వేదుల బాల కామేశ్వరి సమర్పణలో సిద్ధార్థ్ హరియల, మాధవి తాలబత్తుల నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 12న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో కోన వెంకట్, ఆకాశ్ పూరి అతిథులుగా పాల్గొన్నారు. ''స్వేచ్ఛ అనే అమ్మాయి చుట్టూ తిరిగే ఈ సినిమాలో మంచి పాత్ర చేశాను. మెర్సీ కిల్లింగ్ అంటూ సమాజంలో ఆడవారిపై జరుగుతున్న అకృత్యాలను దర్శకుడు కళ్లకు కట్టినట్లు చూపించారు. ప్రతి మహిళ చూడాల్సి సినిమా'' అన్నారు సాయికుమార్. ''భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ఆధారంగా తెరకెక్కిన చిత్రమిది'' అన్నారు వెంకటరమణ.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



యాదవ/B.Tech/Govt. Asst. ఇంజినీర్/ట్రాన్స్‌కో/20Lakhs PA/ 5'11" ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-14242]

SC మాదిగ హిందూ/M.Tech, NIT/ C. Govt.సెక్షన్ ఇంజినీర్/ ONGC/ 80,000/-PM/6'ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 6305007091 [HA-14242]

SC హిందూ మాల/M.Tech, IIT/ C. Govt.సైంటిస్ట్/ ఇస్రో/1 Lakh. PM/ 5'11"ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-14242]

గౌడ/M.Tech/ C.Govt. Sr.ఇంజినీర్/ రైల్వేస్/90,000/-PM / 5'11"ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-14242]

వడ్డెర/B.Tech / C.Govt. బ్యాంక్ Asst. మేనేజర్/SBI/60,000/-PM/ 5'10" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-14242]

క్రిస్టియన్ మాల/కట్నం ప్రసక్తి లేదు/28/5'10"/B.Tech/Govt.A.E.E./ట్రాన్స్‌కో/90,000/-PM/అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-14242]

రిటైర్డ్ Govt. ఇంజినీర్ – హైదరాబాద్‌కు ఏబాదరాబందీలేని BC, OC వధువు కావలెను. డైరెక్ట్‌గా సంప్రదించండి Ph: 8179713792 [H-799826]

79Y, Hyd, పెన్షనర్ మంచి ఆరోగ్యం బాదరబందీలు లేవు అల్కహాలు సిగిరెట్టు గుట్కా ఎలాంటి చెడు అలవాట్లు లేవు. శాకాహారం వధువు కావలెను. నో బ్రోకర్స్. డైరెక్ట్. 6305715756 [HA-14243]

రెడ్డి/41/5'.10" B.Sc/రెండవపెళ్ళి/ Business /Own House/Car/1 Lakh/ 2 కోట్ల ప్రాపర్టీ ఉన్న వరునికి, OC 1 or 2 మ్యారేజ్ పిల్లలు లేని వధువు కావలెను. (డైరెక్ట్). 9848230725. [T-1252690]

కాపు, OC, 30 సం॥, జీతం: 40,000 గల వరుడుకి 1వ, 2వ సంబంధం సంప్రదాయ వధువు కావలెను. కట్నం పట్టింపు లేదు. డైరెక్ట్‌గా సంప్ర॥ 77802 56329. [B-1239602]

Reddy:40/5.4/B.Tech Software Employee అందమైన అమ్మాయి తోడుకు కావలెను. Direct Contact: 73375 86682. [L-806469]

40Y, రెండో పెళ్లి: ఏ బాదరబందీ లేని వరునికి మంచి ఆర్థిక స్తోమత గల (పిల్లలు లేని) మంచి మనస్తత్వం గల వధువు కావలెను. CNB. 8143152503. [W-1264866]

★

వెలమ / 5'8"/ 33/ Diploma/ Fair/ తల్లి, తండ్రిలేని ఏకైక వరునికి OC లేక BC వధువు కావలెను. డైరెక్ట్ వాట్సప్ సెల్ : 8331961507 [K- 1185979]

విశ్వబ్రాహ్మణ Age : 38 Yr. Hight : 5'10, జూ॥అసిస్టెంట్ (రెవిన్యూ Dept. Govt.)గా జాబ్ చేస్తున్న వరునికి తగిన (Any OC or BC) వధువు కావలెను. సెల్ : 90630 58576 (డైరెక్ట్) [M-1167657]

వరుడు కావలెను



రెడ్డి/విడో/కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు/ Age: 29, Qly: డిగ్రీ/సొంత వ్యాపారం కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. 1st (or) 2nd (ఇల్లరికము OK) Ph: 9515673252 [HA-14243]

రజక/M.Sc / C. Govt. ట్యాక్స్ Asst. / ఇన్ కమ్ ట్యాక్స్ Dept/45000/-PM/5'5" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-14242]

బ్రాహ్మణ/24/5'3"/డిగ్రీ *27/5'3"/ఇంటర్ *32/5'2"/ఇంటర్ *28/5'2"/డిగ్రీ *34/5'3"/డిగ్రీ అందమైన వధువులకు వరులు కావలెను. జాబ్ / బిజినెస్ /పురోహితులు కూడా సంప్ర: 7842635086 [HA-14242]

37yr/డైవర్సీ/కుల పట్టింపులేదు/Govt. ఎంప్లాయ్ 2,00,000/-లక్షలు (PM), వెల్‌సెటిల్డ్, పిల్లలులేని అందమైన వధువుకి వరుడు కావలెను. (పిల్లలు ఉన్నా Ok & ఇల్లరికం Ok). సంప్ర: 9505422536 [H-804836]

47yrs/2nd మ్యారేజ్ Canada సిటిజన్‌షిప్ కలిగిన అందమైన వధువుకి (ఇండియా/ Canada) Good Looking తగిన వరుడు కావలెను. సంప్రదించండి: 8688671906 [H-804836]

క్రిస్టియన్ మాల/25/5'4"/ B.Tech/ Govt. బ్యాంక్ P.O/ ఇండియన్ బ్యాంక్ /50,000/-PM/అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6309258463 [HA-14242]

కాపు/CNB/2nd/పిల్లలు లేరు/35/5'5"/M.Tech/ జాబ్/ 20 Lakhs. PA/Own House * రెడ్డి/ 24/5'8"/M.Tech/18 Lakhs. PA/2Cr. షేర్: వెరి అర్జెంట్. వాట్సాప్: 8187053655, 6303293337 [HA-14242]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Hyderabad. Ph: 9849321309 / 9347807015. PLEASE CHECK MY WHATSAPP STATUS. Email: kcreddy43@gmail.com, Facebook.com/kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/B.Tech/MS/H1/USA/1996/5'11"/150K/50Cr *1997/5'9"/60Cr *1994/5'9"/120K/150Cr *1995 / 5'9"/ 110K/50Cr. * Cont. K.C.Reddy-Hyd-Ph: 9347807015

Reddy/B.Tech/MS/ H1/ USA *1997/ 6'/400Cr *1995/5'7"/300K/10Cr *1995/ 5'10"/220K/70Cr *1995/6'/ 200K/20Cr * Cont : K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/B.Tech/MS/H1/USA * 1989/ 5'8"/200K *1991/ 5'11"/140K/200Cr * 1987/5'9"/150K/50Cr *1990/5'7"/ 120K/ 50Cr. *Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy/Good Business /B.Tech / 1995/5'10"/250Cr *1997/6'/400Cr *1994/ 5'11"/250Cr *1997/6'/150Cr *1990/6'/ 1000Cr. * Cont: K.C. Reddy -Hyd. Ph: 9849321309

Reddy/Good Business *B.Tech / MBA/ 1989/5'11"/500Cr *1991/5'11"/400Cr *1995/6'/100Cr *1994/5'11"/150Cr *1994/5'10"/100Cr. *Cont :K.C. Reddy - Hyd. Ph: 9347807015.

Reddy/IIT/IIM/B.Tech/ MBA *1994 / 5'9"/30Cr / 1Cr/yr *1994/5'11"/70L/yr / 25Cr *1992/ 5'9"/85L/yr *1996/5'7"/50L/yr/ 20 Cr. * Cont: K.C. Reddy-Hyd- Ph: 9849321309

Reddy/MBBS/PG/DM *1995/ 5'10"/ 400Cr *1996/6'/ 50Cr *1994/5'10"/75Cr *1993/ 5'10"/50"Cr *1993/5'11"/20Cr *1989/5'9"/30Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015

Reddy/USA-Doc *1995/5'8"/10Cr *1998/5'8"*1992/5'11" / 10Cr *1983/ 5'6"/50Cr *1975/6'/10Cr *1990/6' / 50"Cr * Cont : K.C. Reddy-Hyd- Ph: 9849321309

Reddy/Divorcee *B.Tech/ Builder/ 1994/300Cr *1981/5'8"/500Cr *USA-Citizen/1976/6'/Rich / 280K. * Cont: K. C.Reddy-Hyd- Ph: 9347807015

Reddy/Catholic *MBA/1996/5'10"/500Cr * 2001/5'8"/500Cr *B.Tech/ Canada/ 1990/ 6'/ 15Cr *USA-Citizen/ 1994/ MS/ 5'7"/ 150K/5Cr *Cont: K.C. Reddy -Hyd. Ph: 9849321309

వరుడు కావలెను

Reddy/B.Tech/ SWE/ 1999/5'7"/100Cr *1997/5'6"/30Cr *1996/5'4"/30Cr *2000/ 5'4"/ 30Cr *2000/5'5"/100Cr. * Cont: K.C.Reddy-Hyd.Ph: 9347807015/9849321309

Reddy/B.Tech/1997/5'4" / 150Cr *1995/ 5'8"/ 100Cr *1994/5'6"/ 100Cr *1995 / 5'7"/ 150Cr *1994/5'3"/400Cr *1999/5'8"/15Cr. * Cont : K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy/B.Tech / 1998/5'5"/ 100Cr *1996/ 5'4"/ 30Cr *1998/5'4"/40Cr *1995/5'3"/50Cr *1993/ 5'7"/ 100Cr *1992/ 5'3½"/ 40Cr. * Cont. K.C.Reddy-Hyd. Ph: 9849321309

Reddy/MBBS/PG / DM/ 1995/5'5"/100Cr *1997/5'6"/500Cr *1994/5'6"/100Cr *1993/ 5'2"/ 20Cr *1998/5'6"/20Cr *1998/5'5"/25Cr. * Cont : K.C. Reddy-Hyd- Ph: 9347807015

Reddy/MBBS/PG/1998/5'9"/50Cr *1995/ 5'7"/15Cr *1996/5'8"/ 40Cr *1998/5'7"/ 50Cr *1990/5'10"/15Cr *1990/5'6"/100Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/USA- Doc *1996 / 5'8"/40Cr *1996/ 5'2"/20Cr *1995/5'7"/ *1992/5'5"/ 50Cr *1992/5'4"/50Cr *1985/5'4"/50Cr. *Cont: K.C.Reddy-Hyd.Ph: 9347807015

Reddy/B.Tech/MS/H1/USA *1997/ 5'5"/ 60Cr *1989/5'6"/30Cr *1996 / 5'8"/100K *1996/5'3"/20"Cr *1999 / 5'6"/ 200Cr. * Cont : K.C. Reddy -Hyd-Ph: 9849321309

Reddy/B.Tech/MS/H1/ USA *IIT / 1996/ 5'7"*1997/5'5"/15Cr*1996/5'8"/15Cr*1997/ 5'4"/200K *1997/5'8"/12Cr *1990/ 5'8"/ 100 Cr. * Cont:K.C.Reddy-Hyd-Ph: 9347807015

Reddy/ Divorcee *B.Tech / 1985/5'5"/ 400Cr *MBBS/MD/ 1994/5'5"/100Cr *1991/ 5'2"/ 40Cr *1986/5'6"/50Cr *1993/ 5'8"/ 40 Cr. *Cont:K.C.Reddy-Hyd-Ph: 9849321309

Reddy/Catholic *MBA / 1998/5'5"/200Cr *B.Tech/1996/5'5" *MS/ USA/ 2000/ 5'4"/ 100Cr *1992/5'5" *1993/5'3"/B.Tech/500"Cr * Cont: K.C.Reddy-Hyd. Ph: 9849321309

[P-543]

రెండవ పెళ్ళి/విడో/55y/ Fair/ ఆంధ్ర/Govt. Job/ 1L pm/ Own House, Lands, Rents వెల్‌సెటిల్డ్, పిల్లలులేని ఏబాదరాబందీలేని అందమైన వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 7997175138 [H-799826]

రెడ్డి/విడో/Age: 31/H: 5'5"/Qly: డిగ్రీ, Own Shops, Well Settled గల అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం ఓకే) (కుల, ఆస్తి ప్రసక్తి లేదు) 1st or 2nd OK. Ph: 9849337176 [HA-14243]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Citizen, BS, 27, 6' 1", SoftWare Engineer, 100 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 11", Engineer, 200 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, MBA, 29, 5' 11", Rich Family, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి UK, BE (BITS), 29, 5' 10", SWE, 150 K Pounds, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి BE, 27, 5' 4", SWE, 20 L P/A, 20 Crores, Fair & Slim, Hyd. Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 28, 5' 5", Software Developer, 130 K, Rich, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 26, 5' 6", SWE, 64 L P/A, 10 Crores, Fair & Slim, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 3", SWE, 150 K, H1, 5 Crores, Fair & Slim, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి BE, PGDM, 29, 5' 8", Sr Analyst, 30.3 L P/A, Hyd, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 32, 5' 11", SWE, 350 K, 10 Crores, Handsome, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, MCH, 26, 5' 11", Doctor, Rich Family, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, Business, MBBS, 38, 6', Rich, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBA, 29, 5' 7", 10 Crores, Fair & Slim, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26, 5' 6", SWE, Amazon, 200 K, H1, USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 26, 5' 5", PG Doctor, 25 Crores, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, PG (IIIT), 29, 5' 4", Developer, 10 L P/A, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

రెడ్డి/విడో/48y/ Govt. Job(VRS)/ 80K pm/ గ్రానైట్ బిజినెస్, Own House Rents, Lands/3L pm కోట్ల ప్రాపర్టీ గల పూర్తి ఫ్యామిలీని కోల్పోయిన వధువుకు FC/BC వరుడు కావలెను. పిల్లలు ఉన్నా Ok. Ph: 7993631419 [H-799826]

కుల ప్రసక్తిలేదు/విడో/46y/ Govt. Job/ ఫైనాన్స్ కార్పొరేషన్/ 1L pm/ Own House/ 10 ఎ॥ ల్యాండ్స్/ కోట్ల ఆస్తులు గల ఆర్థికంగా స్థిరపడిన అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9030342549 [H-799826]

కుల పట్టింపు లేదు/21y&23y&25y& 26y & 27y&29&30y&31y&33y&35y&37y&39y&40y&41y&43y&45y&47y&49y&50y&52y&54y & 55y&57y&59y/ "మా సేవ" (Since 1998): PH/WA: 9291503949 [HA-14243]

SC మాదిగ/23/5'5"/M.Tech(NIT), డిప్యూటీ మేనేజర్ (Tech) RAILTeL(C.Govt) 70,000/-PM వెల్ సెటిల్డ్ వధువుకి తగిన వరుడు కావలెను. Any Software or Govt. Ph: 8074766368 [HA-14243]

BC/విడో/53y/ 5'2"/ గవర్నమెంట్ స్టాఫ్ నర్సు/ సొంత ఇల్లు గల వధువుకి మధ్యతరగతి వరుడు కావలెను. Ph: 9014716216 [H-800464]

డైవర్సీ/40yr/ Govt. ఎంప్లాయ్, 2.25 లక్షలు (PM), కుల ప్రసక్తిలేదు/ పిల్లలులేని వెల్‌సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను. (Any Profession Ok). సంప్ర: 8332006483 [H-804836]

ఆస్తి, కుల పట్టింపులేని వధువుకి వరుడు కావలెను/58y/ విడో/ 5'3"/ Govt. టీచర్/70,000/-pm / సొంత ఇల్లు & రెంట్స్ / 50,000/- pm / పిల్లలు లేరు. ఒంటరి వధువు. Ph: 8019357892 [H-800464]

రెడ్డి/ఏజ్ 50 yrs/ 5'5"/ పెయిర్/ Govt. జాబ్ 90K (pm)/ నో ట్యైర్‌మెంట్స్/ లేట్, 2nd మ్యారేజ్, ఒంటరి, ఇల్లరికం అయినా Ok/ కుల పట్టింపులేదు. ప్రాపర్టీ గల వధువుకు వరుడు కావలెను. Ph: 9581120134 [H-800464]

యాదవ్/ఎల్లారెడ్డి అప్పర్ మిడిల్/ 37/ 5'4" ఎత్తు / యం.ఫార్మసీ వధువుకి Hydలో జాబ్ కల్గి, లక్ష రూ. PM ఆపై ఆదాయం కల్గిన యాదవ్ వరుడు మాత్రమే కావలెను. డైరెక్ట్ ఫాదర్ ఫోన్: 9989597799 [H-801686]


కుల, ఆస్తి పట్టింపులేదు/జాబ్, వ్యాపారం, ఫ్లాట్స్ & PM వెల్‌సెటిల్డ్, 5 కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకి 1వ, 2వ వరుడు కావలెను. ఇల్లరికం Ok. ఆంధ్ర, తెలంగాణలో మంచి సంబంధాలు ఉన్నాయి ముఖాముఖి కల్పించబడును. Ph: 9704477206 [H-804836]

రెడ్డి/విడో/54y/ Guntur లో సొంత ఫ్లాట్లు/ Hyd లో సొంత బిజినెస్, రెంట్స్/ మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తిలేని వరుడు కావలెను. (అర్జెంట్) (ఇల్లరికం Ok) (నో బ్రోకర్స్). Ph: 7799083500, 7386660643 [H-804836]

★

కుల పట్టింపు లేదు/33/5'4"/B.టెక్/ MS/ USA/ 140/250K *39/5'4"/B.టెక్/ MS/USA H1B/130K *40/5'5"/MBBS *34/5'6"/B.టెక్/ MS/న్యూజిలాండ్ వధువులకు వరులు కావలెను. సం॥ "శుభమస్తు" DSNR, Hyd. S.రాములు గౌడ్ -8790690309 [H-800463]

వేదికలు



శ్రీ రిజిస్ట్రేషన్. 1 & 2వ, లేట్ మ్యారేజ్, బ్రాహ్మణ, విశ్వబ్రాహ్మణ, పద్మశాలి, రెడ్డి, వెలమ, కాపు, గౌడ్స్, వైశ్యులు, SC, ST ఆల్ క్యాస్ట్ వెరిఫైడ్ ప్రొఫైల్తో సంబంధాలు కలవు. Ph: 81250 33701 [H-800464]

సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర: 8688006130 [H-799826]

వయసు, చిరునామా, ఉద్యోగం ధ్రువీకరించ బడిన అన్ని వర్గాల వధూవరుల సంబంధాలకై www.Trustedmatrimony.in లో Reg. చేసుకోండి. 9966464141 (తక్కువ చార్జీలు). [HA-2382]

పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ,తెనాలి (గుంటూరు జిల్లా) వారి 13వ వివాహ పరిచయ వేదిక కార్యక్రమము 28.04.2024 ఆదివారము ఉ.9 గం.ల నుండి. 9963924665, 9849851322. [T-244]

Kamma, Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7032712544 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-13296]

రజక వివాహవేదిక: (Estd-1994) డాక్టర్స్, ఇంజినీర్స్, Govt Jobs ABROAD సంబంధాలకై సంప్ర॥ కోట్ల శ్రీనివాస్ Ph: 8106303155, 9391265304 [H-800464]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-13296]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7032712544 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-13296]

Brahmin-Padmashali పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7032712544 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-13296]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-13296]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt., Doctors, MNC Matches, Late & 2nd Matchesకై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatsapp) [HA-754]

14/04/2024 బ్రాహ్మణ వధూ–వరుల స్వయంవరం (online) Free Registration bhavanimatrimony, Hyd. 9704656103/ (9533608887-Whatsapp No) [HA-785]

శ్రీచైతన్య బ్రాండ్ అంబాసిడర్‌గా నటి శ్రీలీల



సాక్షి, హైదరాబాద్: విద్యారంగ దిగ్గజం శ్రీచైతన్య విద్యాసంస్థల బ్రాండ్ అంబాసిడర్ గా నటి శ్రీలీల వ్యవహరించనున్నట్లు శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ బొప్పన ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీలీల బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించడంతో తమ విద్యాసంస్థ ప్రజలకు మరింత చేరువవుతుందని చెప్పారు. విద్యారంగంలో విప్లవాత్మక బోధనా పద్ధతులతో ఎంతో మంది విద్యార్థులను డాక్టర్లు, ఇంజనీర్లుగా దేశానికి అందించిన చరిత్ర శ్రీచైతన్య కుందని ఆమె పేర్కొన్నారు. శ్రీలీల మాట్లాడుతూ విద్యార్థులను విజయ తీరాలకు చేర్చే దిక్సూచి శ్రీచైతన్య అని అన్నారు. శ్రీచైతన్య విద్యాసంస్థలను ఎంచుకోవడంతోనే వారి విజయం ఖాయమని విద్యార్థులు, తల్లిదండ్రులు తెలుసుకొని వారి భవిష్యత్‌కు పునాది వేసుకోవాలని ఆమె ఆకాంక్షించారు.

మూసీ కాల్వలకు నీటి విడుదల



మూసీ కుడి కాల్వలో ప్రవహిస్తున్న నీరు

కేతేపల్లి: మూసీ ఆయకట్టులో ఆలస్యంగా సాగు చేసిన వరి పొలాలను కాపాడేందుకు అధికారులు శనివారం మూసీ ప్రాజెక్టు ప్రధాన కాల్వలకు నీటిని విడుదల చేశారు. ఈ ఏడాది యాసంగి సీజన్‌లో మూసీ ఆయకట్టులో పంటల సాగుకు గత డిసెంబర్‌లో మొదటి విడతగా నీటిని విడుదల చేశారు. వాస్తవానికి మొదట నిర్ణయించిన షెడ్యూలు మేరకు చివరిదైన ఐదో విడత నీటి విడుదల గడువు తేదీ ముగియటంతో ఈనెల 25న అధికారులు కాల్వలకు నీటి విడుదల నిలిపి వేశారు. అయితే ఆయకట్టులోని కొన్ని ప్రాంతాల్లో వరి ఆలస్యంగా సాగు చేయడంతో మరో వారం రోజులు అదనంగా నీటిని విడుదల చేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన అధికారులు శనివారం మూసీ ప్రాజెక్టు ప్రధాన కుడి కాల్వకు 111 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 81 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మరో వారం రోజుల పాటు నీటిని విడుదల చేస్తామని మూసీ ప్రాజెక్టు ఏఈ ఉదయ్‌కుమార్ చెప్పారు.

డోర్నకల్–గద్వాల మధ్య కొత్త రైల్వేలైన్!

- విజయవాడ– బెంగుళూరు లైన్‌ల అనుసంధానం
- చకచకా ఫైనల్ లొకేషన్ సర్వే
- గతేడాది చివరలో సర్వేకు అనుమతి

సాక్షి, హైదరాబాద్: ఇప్పటి వరకు రైల్వేలైన్‌తో అనుసంధానంలో లేని కీలక ప్రాంతాలను జత చేస్తూ కొత్త రైల్వే లైన్ ఖరారుకు అడుగులు పడుతున్నాయి. హైదరాబాద్–విజయవాడ, హైదరాబాద్–బెంగుళూరు రైల్వే మార్గాలను కలుపుతూ కొత్త లైన్ నిర్మించేందుకు ఫైనల్ లొకేషన్ సర్వే నిర్వహిస్తున్నారు. హైదరాబాద్–విజయవాడ లైన్‌లో ఉన్న డోర్నకల్ నుంచి హైదారబాద్–బెంగుళూరు మార్గంలోని గద్వాల వరకు ఈ కొత్త లైన్ కొనసాగనుంది. దీనికి సంబంధించి గతేడాది ఫైనల్ లొకేషన్ సర్వేకు రైల్వే బోర్డు అమోదముద్ర వేసింది. దీనికి దాదాపు రూ.ఏడున్నర కోట్లు మంజూరు చేసింది. రాష్ట్రంలో 2647 కి.మీ. మేర సాగే కొత్త లైన్లకు సంబంధించి మంజూరు చేసిన 15 ఫైనల్ లొకేషన్ సర్వేల్లో ఇది ఒకటి. ఈ అన్ని ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు రూ. 50848 కోట్ల వరకు ఖర్చవుతుందని రైల్వేశాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. వీటిల్లో డోర్నకల్–గద్వాల లైన్ చాలా కీలకమైంది. ఈలైన్ నిడివి 296 కిలోమీటర్లు కాగా, ప్రాజెక్టు ప్రాథమిక అంచనా వ్యయం రూ.5330 కోట్లుగా అంచనా. ప్రాధాన్యతా క్రమంలో దీన్నే ముందుగా చేపట్టే అవకాశం ఉంది. ఈ లైన్‌కు సంబంధించి ఫైనల్ లొకేషన్ సర్వే చేపట్టడం ఇప్పుడు ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. సంబంధిత సర్వే సంస్థ వేగంగా సర్వే నిర్వహిస్తూ ప్రతిపాదిత మార్గంలో మార్కింగ్ చేస్తోంది.

అనుసంధానం ఎలా..

వరంగల్ మీదుగా సాగే హైదరాబాద్–విజయవాడ లైన్ రైల్వేలో కీలక మార్గం. అలాగే.. మహబూబ్‌నగర్ మీదుగా సాగే హైదరాబాద్–బెంగుళూరు మార్గం కూడా అలాంటిదే. కానీ ఈ రెండింటిని అనుసంధానించే మరో కీలక మార్గం అవసరమని రైల్వే భావిస్తోంది. ఇందుకోసం డోర్నకల్ నుంచి గద్వాల వరకు లైన్ నిర్మించే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఇది కేవలం ఆ రెండు కీలక మార్గాలను అనుసంధానించేది కావటమే కాకుండా, ఇప్పటి వరకు రైల్వే వసతి లేని కీలక పట్టణాలకు ఆ అవకాశాన్ని కల్పించినట్టవుతుంది. డోర్నకల్‌లో మొదలయ్యే ఆ లైను ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కూసుమంచి, పాలేరు, మోతె, ఉమ్మడి నల్గొండ జిల్లాలోని సూర్యాపేట, భీమారం, నాంపల్లి, ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని కల్వకుర్తి, నాగర్‌కర్నూలు, వనపర్తి,భూత్పూర్ మీదుగా గద్వాల వద్ద ముగుస్తుంది. దీంతో ఈ లైను ఇటు వరంగల్ మీదుగా సాగే హైదరాబాద్–విజయవాడ లైన్ డోర్నకల్ వద్ద, అటు హైదరాబాద్–బెంగుళూరు లైన్‌ను గద్వాల వద్ద, నడికుడి మీదుగా సాగే హైదరాబాద్–గుంటూరు లైన్‌ను నల్గొండ వద్ద అనుసంధానిస్తుంది. దీంతో ఆయా మార్గాల్లో నడిచేరైళ్లను అవసరానికి తగ్గట్టు దారి మళ్లించే విషయంలో, కొత్త రైళ్లను నడిపే విషయంలో, దక్షిణ–ఉత్తరభారత్‌లను వేరువేరు మార్గాల్లో జోడించే విషయంలో మరింత వెసులుబాటు కలిగినట్టవుతుంది. ఇప్పటి వరకు రైల్వే లైన్‌లేని ప్రాంతాలను అనుసంధానించటం వల్ల ఆయా ప్రాంతాల ఆర్థిక ముఖ చిత్రం వేగంగా మారేందుకు వీలు కల్పిస్తుంది. పర్యాటకంగా, పారిశ్రామికంగా ఎదిగేందుకు అవకాశాలు కలుగుతాయి. ఈ ప్రాంతాల్లో బొగ్గు గనులతోపాటు సిమెంటు, విద్యుదుత్పత్తి కేంద్రాలున్నందున బొగ్గు, సిమెంటు తరలింపు తేలికవుతుంది. వ్యవసాయ ఉత్పత్తుల తరలింపు కూడా పెరుగుతుంది.



ఫైనల్ లొకేషన్ సర్వేలో భాగంగా ఇలా మార్క్ చేస్తున్నారు

ఈ ప్రాజెక్టుపై రైల్వే ఆసక్తి!

సాధారణంగా ప్రతి రైల్వే ప్రాజెక్టులో ఫైనల్ లొకేషన్ సర్వే కీలకంగా ఉంటుంది. అలాగని సర్వే జరిగిన అన్ని ప్రాజెక్టులు పట్టాలెక్కాలని కూడా లేదు. సర్వే తర్వాత దాని సాధ్యాసాధ్యాలపై స్పష్టత వస్తుంది. ఇప్పుడు డోర్నకల్–గద్వాల లైను విషయంలో మాత్రం స్వయంగా రైల్వే శాఖనే ఆసక్తిగా ఉండటం విశేషం. ఆయా ప్రాంతాలను రైల్వేతో జోడించాలని చాలా కాలంగా ప్రజల ఆకాంక్షను రాజకీయ నేతలు రైల్వే దృష్టికి తెస్తున్నారు. ఇటు ప్రజల అవసరాలు, అటు రైల్వే శాఖకు ఉన్న ఉపయోగాల రీత్యా దీనికి ప్రాధాన్యం పెరిగింది. వెరసి ఈ ప్రాజెక్టు పట్టాలెక్కే అవకాశమే ఎక్కువగా కనిపిస్తోంది. అయితే, ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వంతో సహా అన్ని పార్టీలు, రాజకీయాలకతీతంగా ప్రజాప్రతినిధులు, నాయకులు రైల్వే బోర్డుపై ఒత్తిడి పెంచాల్సిన అవసరం కనిపిస్తోంది.

ప్రాజెక్టు: డోర్నకల్–గద్వాల కొత్త రైల్వే లైన్
నిడివి: 296 కిలోమీటర్లు
ప్రాథమిక అంచనా వ్యయం: రూ.5330 కోట్లు

రాష్ట్రంతో పాటు దేశంలోనూ వ్యవసాయం అభివృద్ధి

- వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు

శామీర్‌పేట్: రాష్ట్రంతో పాటు దేశంలో వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతోందని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మేడ్చల్ జిల్లా, తుర్కపల్లి జీనోమ్‌వ్యాలీలో శనివారం ఏటీజీసీ బయోటెక్ అగ్రి ఇన్నొవేషన్ సెంటర్ బ్లాక్–సీ నిర్మాణానికి ఆయన భూమి చేశారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ పంట దిగుబడిపై పురుగుల మందులు వాడకుండానే పురుగులను సంహరించే పద్ధతిని చేపట్టిన ఏటీజీసీ బయోటెక్ సంస్థను ఆయన అభినందించారు. కరోనా కష్టకాలంలో అన్ని విభాగాల సంస్థలు ఆగినా.. రైతు పంట, నాగలి ఆగలేదని, రైతులకు మేలు చేసే విధంగా సంస్థలు కృషిచేయాలని తుమ్మల సూచించారు. మన జాతి ఔన్నత్యానికి నిదర్శనం వ్యవసాయ రంగం అని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలకు అన్నం పెట్టే దిశగా భారతదేశం ఎదుగుతుందని చెప్పారు. వ్యవసాయ రంగంలో క్రిమిసంహారక మందుల ద్వారా వచ్చే వాతావరణ మార్పులు, పర్యావరణ విధ్వంసాన్ని ఆపడానికి నూతన ఆవిష్కరణలు ఈ ఫౌండేషన్ ద్వారా ఆవిష్కరించబోతున్నామని ఏటీజీసీ బయోటెక్ సీఈఓ వీబీ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ అర్జుల రాంచంద్రారెడ్డి, పద్మశ్రీ వెంకట్‌రెడ్డి, ఏటీజీసీ బయోటెక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఏటీజీసీ బ్లాక్–సీకు భూమిపూజ చేస్తున్న మంత్రి తుమ్మల, ఏటీజీసీ ప్రతినిధులు


వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తాం: తుమ్మల

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయరంగాన్ని లాభసాటిగా మార్చే ఒక్క అవకాశాన్ని కూడా వదులుకోమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. వ్యవసాయంలో సరికొత్త విధానాలను ప్రవేశపెట్టి, అధిక దిగుబడులు సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. శనివారం మంత్రి తుమ్మల తన నివాసంలో మలేషియా ప్రతినిధులతో సమావేశమయ్యారు. అయిల్‌పామ్ తోటల అభివృద్ధికి ఇరు దేశాల మధ్య సమన్వయంతో చేపట్టే కార్యక్రమాలపై చర్చించారు. అయిల్‌పామ్ సాగుచేస్తున్న రైతుల కు నాణ్యమైన మొక్కలు సరఫరా చేస్తామని, ఇరు దేశాల మధ్య సమన్వయంతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ కేంద్రాన్ని, అయిల్‌పామ్ గార్డెన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. అయిల్‌పామ్ తోటల్లో యాంత్రీకరణ విధానాన్ని విస్తృతం చేయాలని మంత్రి తుమ్మల మలేషియా ప్రతినిధులను కోరారు. దీంతో పాటు ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకూ చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే అయిల్‌పామ్ పంట దిగుబడులపై వాణిజ్యపరంగా ఉన్న అవకాశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

కర్రలతో కొట్టి.. గాయాలపై కారం చల్లి

- పంచాయతీ ఆఫీసు కిటికీకి కట్టి.. చిత్రహింసలు పెట్టి
- డీజే యాంప్లిఫైయర్ చోరీ చేశాడని దళిత యువకుడిపై దాడి
- సంచలనం రేపిన వీడియో

కొత్తగూడ: చోరీకి పాల్పడ్డాడనే అనుమానంతో ఓ దళిత యువకుడిని కర్రలతో చావకొట్టి.. రక్తం కారుతున్న గాయాలపై కారం చల్లి చిత్ర హింసలు పెట్టిన అమానవీయఘటనకు సంబంధించిన వీడియో శనివారం కలకలం రేపింది. బాధితుడి కథనం మేరకు.. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం జంగవానిగూడెం(రాంపూర్) గ్రామానికి చెందిన యువకుడు వంకాయల కార్తీక్‌ను అదే మండలం పొగుళ్లపల్లి గ్రామానికి చెందిన టెంట్‌హౌస్ యజమాని గద్ద అశోక్ పనికి పెట్టుకున్నాడు. ఈ క్రమంలో డీజే(సౌండ్ బాక్స్)లో ఉపయోగించే యాంప్లిఫైయర్ చోరీకి గురైందని, దాన్ని ఖానాపూర్‌లో విక్రయించారని యజమాని అశోక్ గుర్తించాడు. దీంతో అశోక్ కొందరు వ్యక్తులను తీసుకుని ఈ నెల 19వ తేదీన జంగవానిగూడెం వెళ్లి కార్తీక్‌తో పని ఉందని చెప్పి కారులో ఎక్కించుకుని పొగుళ్లపల్లి సమీప అటవీప్రాంతానికి తీసుకెళ్లి కర్రలతో చితకబాదారు. తప్పించుకుని పారిపోయే క్రమంలో మళ్లీ పట్టుకుని పొగుళ్లపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్దకు తీసుకువచ్చారు. ఒంటిపై షర్ట్ విప్పి కార్యాలయ కిటికీకి కట్టి కర్రలతో బాదారు. రక్తం కారుతుండగా గాయాలపై కారం చల్లుతూ చిత్రహింసలకు గురిచేశారు. ఈ ఘటనను మొత్తం వీడియో తీశారు. స్పృహ కోల్పోయిన కార్తీక్‌ను ఇంటి వద్ద వదిలేశారు. గాయాలతో మూలుగుతున్న యువకుడిని బంధువులు నర్సంపేట పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. కార్తీక్‌పై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 20వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు.



యువకుడిని చిత్రహింసలు పెడుతున్న దృశ్యాలు


ఇరువర్గాలపై కేసులు

టెంట్‌హౌస్ యజమాని ఫిర్యాదు మేరకు కార్తీక్‌పై చోరీ కేసు, కార్తీక్‌పై దాడి చేసిన ఘటనలో అశోక్‌తోపాటు మరికొంత మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కానీ విషయాన్ని గోప్యంగా ఉంచారు. సమాచారం తెలుసుకున్న దళిత సంఘాలు మహబూబాబాద్ డీఎస్పీకి ఫిర్యాదు చేయడంతో శుక్రవారం రాత్రి దాడి ఘటన వివరాలు బయటికి వచ్చాయి.

2047 నాటికి 2 లక్షల మంది కంపెనీ సెక్రటరీల అవసరం

ఐసీఎస్ఐ అధ్యక్షుడు సీఎస్‌బీ నరసింహన్

సనత్‌నగర్ (హైదరాబాద్): ప్రధానమంత్రి మోదీ ఆకాంక్ష మేరకు 2047 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ 30 ట్రిలియన్ డాలర్లుగా ఎదిగితే.. దేశానికి రెండు మంది లక్షల కంపెనీ సెక్రటరీలు అవసరం ఉంటుందని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) అధ్యక్షుడు సీఎస్‌బీ నరసింహన్ అన్నారు. బేగంపేటలోని మనోహర్ హోటల్‌లో 'డెమిస్టిఫైయింగ్ ఎన్‌సీఎల్‌టీ ప్రాక్టీసెస్' అనే అంశంపై శనివారం సదస్సు జరిగింది. సదస్సు అనంతరం నరసింహన్ విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో 72000 మంది కంపెనీ సెక్రటరీలు ఉన్నారని, ప్రధాని ఆశించినట్టుగా 2047 నాటికి మూడింతలు ఎక్కువగా అవసరం ఉంటుందన్నారు. ఐసీఎస్ఐ ప్రతి సంవత్సరం 14000 మంది విద్యార్థులను నమోదు చేసుకుంటుందని, ఈ ఏడాది రెట్టింపు చేయనున్నట్టు వెల్లడించారు. కంపెనీ సెక్రటరీస్ కోర్సుల విద్యార్థులకు అత్యుత్తమ నాణ్యత గల విద్యపై దృష్టి పెట్టినట్టు వివరించారు. ఇటీవల ఐసీఎస్ఐ..నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్స్ (ఎన్ఐఎస్ఎం)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని, దీని ద్వారా కాంప్లయన్స్, సెక్యూరిటీస్ మార్కెట్స్, లా అండ్ గవర్నెన్స్ రంగాల్లో పరస్పర సహకారం లభిస్తుందన్నారు. ఎన్ఐఎస్ఎం దేశంలో 141 విశ్వవిద్యాలయాలతో ఎంఓయూ కుదుర్చుకుందని, ఉస్మానియా వర్సిటీతో కూడా ఒప్పందం కుదుర్చుకునే యోచనలో ఉన్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ శ్రీలక్ష్మీనారాయణగుప్తా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసీఎస్ఐ అధ్యక్షుడు నరసింహన్

మీ ఫోన్‌లో వైరస్ ఉందా!?

తగిన జాగ్రత్తలతో డేటాను భద్రపరచుకోవచ్చంటున్న నిపుణులు

సాక్షి, హైదరాబాద్: స్మార్ట్‌ఫోన్లు అందుబాటులోకి వచ్చాక మన పనులు ఎంత సులువయ్యాయో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే దానితో బోలెడు ముప్పులు సైతం పొంచి ఉన్నాయని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా సైబర్ నేరగాళ్లు ఫోన్లలోకి ఏదో ఒక రూపంలో వైరస్‌ను చొప్పించి ఫొటోలు, వీడియోలు సహా కీలక డేటా కొట్టేయడం, మార్ఫింగ్‌కు వాడుకోవడం లేదా ఆ సమాచారంతో బ్లాక్‌మెయిల్ చేయడం వంటి ఆగడాలకు పాల్పడుతున్నారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మన ఫోన్లో వైరస్ చొరబడితే దాని పనితీరు ఎలా ఉంటుందో, హ్యాకింగ్‌కు గురైన ఫోన్‌ను తిరిగి ఎలా బాగుచేసుకోవాలో కీలక సూచనలు చేశారు.

హ్యాకింగ్‌కు గురయ్యే ఫోన్ పనితీరు ఇలా

- ఫోన్ చార్జింగ్ చేసిన కాసేపటికే చార్జింగ్ డౌన్ కావడం లేదా వేగంగా బ్యాటరీ తగ్గిపోవడం ఫోన్ హ్యాకింగ్‌కు అత్యంత ముఖ్యమైన సంకేతం. మన ఫోన్‌లో ఏవైనా అనుమానాస్పద సాఫ్ట్‌వేర్‌లు బ్యాక్‌గ్రౌండ్‌లో రన్ అవుతుంటే.. మన మొబైల్ ఫోన్‌ను తక్కువగా వాడినా, బ్యాటరీ మాత్రం అసాధారణంగా తగ్గిపోతుంది.
- మనకు తెలియని సోర్స్‌ల నుంచి కొత్తకొత్త యాడ్స్ వస్తుండటం, ఫ్లాష్ యాడ్స్ వస్తుండటం సైతం హ్యాకింగ్‌కు గురైనట్లు తెలిపే సూచిక.
- మనకు తెలియకుండానే బ్యాక్‌గ్రౌండ్ యాప్స్ రన్ అవడం, కొన్ని హిడెన్ యాప్స్ పనిచేస్తుండటంతో మొబైల్ ఫోన్ బాగా వేడెక్కుతుంది. ఇలా జరిగితే కూడా ఫోన్ హ్యాక్ అయినట్లు అనుమానించాలి.
- కొత్త నంబర్ల నుంచి తరచూ ఫోన్ కాల్స్ వస్తుండటం, టెక్స్ట్ మెసేజ్‌లలో వింత సింబల్స్, క్యారెక్టర్ల కాంబినేషన్స్‌తో రావడం గమనిస్తే ఫోన్ హ్యాక్ అయినట్లు గుర్తించాలి.
- మొబైల్‌ఫోన్ హ్యాక్ అయితే పనితీరు బాగా నెమ్మదిస్తుంది. ఫోన్‌కాల్ చేయడానికి, మెసేజ్‌లు ఓపెన్ కావడానికి, ఇతర యాప్‌లు పనిచేయడం నెమ్మదిగా జరుగుతుంది.
- ఫోన్‌లోని కెమెరా, మైక్రోఫోన్‌లు మనకు తెలియకుండానే యాక్టివ్ కావడం గమనిస్తే అనుమానించాల్సిందే.
- ఫోన్‌లోని స్క్రీన్‌లాక్, యాంటీ వైరస్ వంటి సెక్యూరిటీ ఫీచర్లన్నీ మనకు తెలియకుండానే డిసేబుల్ కావడం ఫోన్ హ్యాకింగ్ అయ్యిందనడానికి అత్యంత కీలకమైన మార్పుగా గుర్తించాలి.

ఫోన్ హ్యాక్ అయితే ఏం చేయాలి..?

- ఏదైనా ఉత్తమమైన యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేసుకొని ఫోన్‌ను స్కాన్ చేయాలి.
- ఫోన్‌లో అనుమానాస్పద యాప్‌లను గమనిస్తే వాటిని వెంటనే డిలీట్ చేయాలి.
- ఫోన్ హ్యాక్ అయి, ఫోన్ నుంచి డేటా ట్రాన్స్‌ఫర్ అవుతున్నట్లు అనుమానిస్తే వెంటనే ఇంటర్నెట్ డేటా ఆఫ్ చేయాలి. వైఫై కనెక్షన్ తొలగించాలి. ఇలా చేయడం వల్ల హ్యాకర్లకు డేటా ట్రాన్స్‌ఫర్ ఆగిపోతుంది.
- ఫోన్ స్క్రీన్ లాక్, యాప్ లాక్‌లు, ఈ–మెయిల్, సోషల్ మీడియా ఖాతాల పాస్‌వర్డ్‌లను మార్చేయాలి. ఇలా చేయడం వల్ల మన వ్యక్తిగత సమాచారం చోరీ కాకుండా అడ్డుకోవచ్చు.
- పైవన్నీ చేసినా ఫలితం లేనట్లు గుర్తిస్తే వెంటనే ఫోన్‌ను రీసెట్ చేయాలి. దీనివల్ల మాల్‌వేర్ అంతా పోవడంతోపాటు అనుమానాస్పద యాప్‌లు డివైస్ నుంచి తొలగి పోతాయి. అయితే మన వ్యక్తిగత సమాచారం, ఫొటోలు కోల్పోయే ప్రమాదం ఉంటుంది.

ఈ జాగ్రత్తలు పాటిస్తే మేలు..

- మొబైల్ ఫోన్‌లోని ఫొటోలు, వీడియోలు, ఇతర డేటాను, సోషల్ మీడియా ఖాతాల్లోని సమాచారాన్ని ఎప్పటికప్పుడు పెన్‌డ్రైవ్, ఇతర డివైస్‌లలో బ్యాకప్ చేస్తూ ఉండాలి. ఫోన్ హ్యాక్ అయినా వెంటనే దాన్ని రీసెట్ చేయొచ్చు.ముందే బ్యాకప్ ఉంటుంది కాబట్టి డేటా పోయే ప్రమాదం ఉండదు.
- యాపిల్, ఆండ్రాయిడ్ ఫోన్లకు ఆరు అంకెల పాస్‌వర్డ్‌లు తప్పక పెట్టుకోవాలి. వాటిని ఎప్పటికప్పుడు మారుస్తూ ఉండాలి.
- కొత్త యాప్‌లు ఇన్‌స్టాల్ చేసే ముందు పూర్తిగా వాటికి సంబంధించిన సమాచారం తెలుసుకోవాలి.
- పబ్లిక్ వైఫైను వీలైనంత వరకు వాడకపోవడం ఉత్తమం. తప్పనిసరైతే వీపీఎన్ టూల్స్ ద్వారా వాడాలి. ఇలా చేయడం వల్ల మన డేటా ప్రైవేటు ఎన్‌క్రిప్టెడ్ చానల్ ద్వారా వెళ్తుంది.



మూడో చెవి వింటోంది జాగ్రత్త!

ఫోన్ ట్యాపింగ్.. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ట్యాపింగ్ మాటున కొందరు అధికారులు సాగించిన దందా.. రోజురోజుకూ వెలుగుచూస్తున్న సంచలన విషయాలు విస్తుగొలుపుతున్నాయి. దీనిపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధాలు.. ఫిర్యాదుల వంటి విషయాలను పక్కనపెడితే.. అసలు ట్యాపింగ్ కథేంటి? దీనిని ఎలా చేస్తారు? ఇద్దరు వ్యక్తులు ప్రైవేటుగా మాట్లాడుకునే మాటలన్నీ మూడో వ్యక్తి ఎలా వినగలుగుతున్నాడు? ఓసారి చూద్దామా?

- సాక్షి సెంట్రల్ డెస్క్

సులభంగా మారిపోయిన ఫోన్ ట్యాపింగ్ • ఎక్కడ కావాలంటే అక్కడ.. ఎవరి మాటలైనా రికార్డు చేసే టెక్నాలజీ

- ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు టెలిఫోన్ లేదా మొబైల్ ఫోన్ లేదా ఇంటర్నెట్ ద్వారా జరిపే సంభాషణలను వారికి తెలియకుండా రహస్యంగా వినడం, రికార్డు చేయడాన్నే ట్యాపింగ్ అంటారు. వాస్తవానికి ట్యాపింగ్ చేయడం చట్టవిరుద్ధం. దేశ భద్రతకు సంబంధించిన అంశాల్లో ట్యాపింగ్ చేయాల్సి వస్తే.. నిర్దేశిత ప్రభుత్వ ఏజెన్సీలు కేంద్ర హోంశాఖ అనుమతి తీసుకోవాలి. ప్రైవేటు వ్యక్తులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ట్యాపింగ్ చేయడానికి అనుమతి లేదు. అనుమతి పొందిన ప్రభుత్వ సంస్థలు సైతం ట్యాపింగ్ చేయడానికి బోలెడు నిబంధనలు పాటించాలి. ఎవరి ఫోన్ అయినా గరిష్ఠంగా 180 రోజులు మాత్రమే ట్యాపింగ్ చేయాలి. పైగా ప్రతి 60 రోజులకు ఓసారి తాజాగా అనుమతి తెచ్చుకోవాల్సి ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో అనుమతి లేకుండా గరిష్ఠంగా 24గంటలకు మించి ఫోన్ ట్యాపింగ్ చేయడానికి వీల్లేదు. ఒకవేళ సదరు ట్యాపింగ్‌కు కేంద్ర హోంశాఖ అనుమతి నిరాకరిస్తే అప్పటివరకు రికార్డు చేసిన సంభాషణలన్నీ 48 గంటల్లోగా ధ్వంసం చేయాల్సి ఉంటుంది.

ట్యాపింగ్‌లో రకాలు..

సెల్యులర్ ఇంటర్‌సెప్టర్లు..

- వీటిని ఐఎంఎస్ఐ క్యాచర్స్ లేదా స్టింగ్‌రేస్ అని పిలుస్తారు. టవర్ల ద్వారా ప్రసారమయ్యే నిర్దేశిత మొబైల్ సిగ్నల్స్‌ను ఇవి అడ్డుకుంటాయి. అందు లోని డేటాను క్యాప్చర్ చేయడమే కాకుండా.. మొబైల్ లొకేషన్ కూడా ట్రాక్ చేస్తాయి. కాల్స్‌తో పాటు ఎస్సెమ్మెస్‌లను సైతం సంగ్రహిస్తాయి.

వీఓఐపీ ఇంటర్‌సెప్షన్ సాధనాలు..

- వాయిస్ ఓవర్ ఇంటర్నెట్ ప్రొటోకాల్ (వీఓఐపీ) కమ్యూనికేషన్‌లను సంగ్రహించేందుకు రూపొందించిన సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ ఆధారిత సాధనాలివి. వీఓఐపీ ప్రొటోకాల్స్‌లోని బలహీనతలను ఆసరాగా చేసుకుని ఇంటర్నెట్‌లో ప్రయాణించే డేటా ప్యాకెట్‌లను ఇవి అడ్డుకుని అందులోని డేటాను సంగ్రహిస్తాయి.

క్లోన్డ్ సిమ్ కార్డులు..

- ట్యాపింగ్ చేయాలనుకున్న వ్యక్తి సిమ్‌కు క్లోన్డ్ సిమ్ సంపాదిస్తే చాలు.. సదరు వ్యక్తి మొబైల్ ఫోన్‌కు వచ్చే కాల్స్ అన్నీ చక్కగా వినొచ్చు.

రాజకీయపరమైన నిఘా..

- సర్వీస్ ప్రొవైడర్ సహకారంతో రాజకీయ నాయకుల కాల్స్ రికార్డు చేస్తారు. ప్రభుత్వం నుంచి దీనికి అనుమతి ఉండదు. అందువల్ల ఇది అక్రమ ట్యాపింగ్.

మానిటరింగ్ సాఫ్ట్‌వేర్..

హానికరమైన సాఫ్ట్‌వేర్ లేదా స్పైవేర్‌ను నిర్దేశిత వ్యక్తి మొబైల్ ఫోన్‌లో వారికి తెలియకుండా చొప్పిస్తారు. ఇవి ఆ ఫోన్ సంభాషణలను రికార్డు చేసి బయటి వ్యక్తు లకు పంపించడంతోపాటు ఫోన్లో ఉన్న సమస్త సమాచారాన్ని మనకు తెలియకుండా బహిర్గతం చేస్తుంది.

అధికారిక ట్యాపింగ్..

ప్రభుత్వ అనుమతి తీసుకుని సర్వీస్ ప్రొవైడర్ సహకారంతో చేసే ట్యాపింగ్ ఇది. క్లండెస్టైన్ రికార్డర్ ఉపయోగించి సంభాషణలను రికార్డు చేస్తారు. లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థలు డిజిటల్ ఫోరెన్సిక్స్ కోసం ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ సాధనాలను ఉపయోగించి ఈ ట్యాపింగ్ చేస్తాయి.

సెల్యులర్ ఇంటర్‌సెప్టర్ ఎలా పనిచేస్తుందంటే?

ఇది చాలా సులభమైన ట్యాపింగ్ ప్రక్రియ. కాకపోతే ఖరీదు మాత్రం చాలా ఎక్కువ. చిన్న సూట్‌కేసులో ఇమిడిపోయే ఈ పరికరంతో.. నిర్దేశిత వ్యక్తుల ఫోన్లను భౌతికంగా ముట్టుకోకుండా.. ఎలాంటి స్పైవేర్లూ చొప్పించకుండా ట్యాపింగ్ చేయొచ్చు. సాధారణంగా మనం ఎవరికైనా కాల్ చేసినప్పుడు మన సెల్ ఫోన్ నుంచి సిగ్నల్స్ సమీపంలోని టవర్ ద్వారా నిర్దేశిత మార్గంలో అవతలి వ్యక్తికి చేరతాయి. ఈ ప్రక్రియలో సెల్ టవర్ల నుంచి ప్రసారమయ్యే సిగ్నల్స్‌ను నేరుగా ఈ మెషీన్లు సంగ్రహించి ఆ సంభాషణలు వినేలా, రికార్డు చేసేలా పనిచేస్తాయి. ఈ మెషీన్లలో కూడా చాలా రకాలున్నాయి.200 మీటర్ల పరిధి నుంచి దాదాపు 20 కిలోమీ టర్ల పరిధిలోని సెల్‌ఫోన్ సిగ్నల్స్‌ను ఇవి సంగ్రహించగలవు. కొన్ని మెషీన్లు సెల్‌ఫోన్ నుంచి వచ్చే సిగ్నల్స్‌ను టవర్‌కు వెళ్లకుండా ముందుగానే సంగ్రహిస్తాయి. అలాగే సామర్థ్యాన్ని బట్టి పదుల సంఖ్య నుంచి వందల సంఖ్యలో కాల్స్ వరకు ఒకేసారి ఈ మెషీన్లు రికా ర్డు చేయగలవు. కాల్స్, ఎస్సెమ్మెస్‌లే కాకుండా సోషల్ మీడియాతోపాటు మన సెల్ డివైస్‌లోని సమస్త సమాచారాన్ని యాక్సెస్ చేసే ఇంటర్‌సెప్టర్లు ఉన్నాయి. వాస్తవానికి వీటిని కొనాలన్నా చాలా అనుమతుల తతంగం ఉంటుంది. అయితే, ఇజ్రాయెల్, సింగపూర్ తదితర దేశాల నుంచి వీటిని అక్రమ పద్ధతిలో సమకూర్చుకుంటున్నారు.



ల్యాప్‌టాప్ సైజు పరికరంతోనే..

- అక్రమంగా ట్యాపింగ్ చేసేవాళ్లకు పెద్దగా ఎక్విప్‌మెంట్ కూడా అక్కర్లేదు. ఓ ల్యాప్‌టాప్ సైజులో ఉండే సెల్యులర్ ఇంటర్‌సెప్షన్ మెషీన్‌ను కారులో పెట్టుకుంటే చాలు.. ఎవరి ఫోన్ అయినా సులభంగా ట్యాప్ చేసేయొచ్చు. ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన వ్యక్తి ఇల్లు లేదా ఆఫీసు వద్ద కారు పార్క్ చేసుకుంటే చాలు అవతలి వ్యక్తి సంభాషణలన్నీ వినొచ్చు.. రికార్డు చేయొచ్చు. ఇందుకోసం ముందుగా ఆ వ్యక్తి ఫోన్ నంబర్‌ను మెషీన్‌లో ఫీడ్ చేయాలి. అనంతరం ఆ వ్యక్తికి ఫోన్ వస్తే.. ఆటోమేటిగ్గా మెషీన్‌లో రికార్డు అయిపోతుంది. సదరు వ్యక్తి గొంతును రికార్డు చేసి మెషీన్‌లో ఫీడ్ చేసినా సరే.. దాని ఆధారంగా ఆ కాల్‌ను మెషీన్ రికార్డు చేస్తుంది.

ఇజ్రాయెల్ పేరే ఎందుకు?

ఫోన్ ట్యాపింగ్ వంటి అంశాలు తెరపైకి వచ్చిన ప్పుడు ఇజ్రాయెల్ పేరే వినిపిస్తుంది. అధునాతన సాంకేతిక రంగానికి ఇజ్రాయెల్ ప్రసిద్ధి చెందడమే ఇందుకు కారణం. ఫోన్ ట్యాపింగ్ టెక్నాలజీతో సహా నిఘా, గూఢచార సేకరణ పరికరాలను అభివృద్ధి చేసే నైపుణ్యం ఇజ్రాయెల్ సొంతం. ఇటీవల మన దేశంలో సహా పలు దేశాల్లో సంచలనం సృష్టించిన పెగాసస్ స్పైవేర్ రూపొందించింది ఇజ్రాయెలే కావడం గమనార్హం.

ట్యాపింగ్ చేసే అధికారం ఎవరికి ఉంది?

జాతీయ స్థాయిలో ఇంటెలిజెన్స్ బ్యూరో, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్, ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్, నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ, రీసెర్చ్ అనాలసిస్ వింగ్, డైరెక్టరేట్ ఆఫ్ సిగ్నల్ ఇంటెలిజెన్స్, ఢిల్లీ పోలీస్ కమిషనర్‌తో పాటు రాష్ట్ర పోలీసు విభాగాలు నిబంధనలకు అనుగు ణంగా ఎవరి ఫోన్ అయినా ట్యాపింగ్ చేయొచ్చు.



వైభవంగా ఖాద్రీశుడి బ్రహ్మ రథోత్సవం

- హాజరైన 3 లక్షల మంది భక్తులు

కదిరి: శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణంలో ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మ రథోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. పోటెత్తిన భక్తజనం స్వామివారిని దివ్యరథంపై దర్శించుకుని పరవశించిపోయారు. తొలుత స్వామివారి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 8.12 గంటలకు వైఎస్సార్‌సీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బి.ఎస్.మక్బూల్ అహ్మద్, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి తదితరులు రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తుల గోవింద నామస్మరణ మధ్య ఉత్సాహంగా రథం ముందుకు సాగింది. స్వామివారు తిరువీధుల గుండా విహరిస్తూ మధ్యాహ్నం 12.54 గంటలకు యథాస్థానం చేరుకున్నారు. మూర్తిపల్లి, బేరిపల్లి, కుటాగుళ్ల, నాగిరెడ్డిపల్లి, గంగిరెడ్డిపల్లి గ్రామస్తులు రథానికి వెనుకవైపు నుంచి సంద్ర మొద్దులు, తెడ్లు వేస్తూ రథ గమనాన్ని నియంత్రిస్తూ వచ్చారు. సుమారు మూడు లక్షల మందికి పైగా భక్తులు రథోత్సవానికి హాజరైనట్టు అధికారుల అంచనా.

9న తిరుమల శ్రీవారి ఆలయంలో ఉగాది ఆస్థానం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఏప్రిల్ 9వ తేదీన శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది ఆస్థానం శాస్త్రోక్తంగా జరగనుంది. ఉదయం 3 గంటలకు సుప్రభాతం నిర్వహించి, అనంతరం ఆలయాన్ని శుద్ధి చేయనున్నారు. ఉదయం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారికి, విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ చేస్తారు. ఉదయం 7 నుంచి 9 గంటల నడుమ విమాన ప్రాకారం, ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపుగా ఆలయంలోనికి ప్రవేశిస్తారు. అనంతరం పంచాగ శ్రవణం నిర్వహిస్తారు. ఉగాదిని పురస్కరించుకుని ఏప్రిల్ 9వ తేదీన శ్రీవారి ఆలయంలో ఆర్జిత సేవ లైన అష్టదళ పాదపద్మారాధన, కళ్యాణోత్స వం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవాలను టీటీడీ రద్దు చేసింది.

ఇలా 'భాషించారు'!





మీరు ప్రధాని మోదీ, మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ 'చాయ్ పే చర్చ' వీడియో చూశారా? అందులో ఓ విషయం గమనించారా? మోదీ హిందీలో మాట్లాడుతుంటే.. అది అర్థమవుతున్నట్లు బిల్‌గేట్స్ తలాడించడం, తిరిగి బదులివ్వడం చేశారు. బిల్‌గేట్స్‌కు హిందీ రాదుగా.. మరి ఇదెలా సాధ్యమైంది? ఈ చర్చలో వారు ప్రధానంగా మాట్లాడుకున్న ఏఐ (కృత్రిమ మేధ)దే ఈ మాయ అంతా. అంటే ఏఐ సాయంతో అప్పటికప్పుడు రియల్ టైంలో ఆంగ్లంలోకి అనువాదమైపోవడమన్న మాట. ఇంతకు ముందు కూడా.. అంటే.. గతేడాది డిసెంబర్‌లో వారణాసిలో జరిగిన 'కాశీ తమిళ సంగమం'లో పాల్గొన్న ప్రధాని మోదీ... భారతీయ భాషలను రియల్ టైంలో అనువదించగల ఏఐ ఆధారిత టూల్ 'భాషిణి'ని ఆవిష్కరించారు. ఆపై ఆ వేదిక నుంచే దాన్ని ఉపయోగించారు కూడా. అంటే మోదీ హిందీలో మాట్లాడుతుంటే.. అది అక్కడ ఇయర్ బడ్స్ పెట్టుకున్న తమిళులకు వారి భాషలోకి అనువాదమై.. వినిపించింది. అలాగే జీ20 శిఖరాగ్ర సదస్సులోనూ ఈ టూల్‌ను ఉపయోగించే వివిధ దేశాధినేతలను ఉద్దేశించి ప్రసంగించారు. తాజాగా చాయ్ పే చర్చ కూడా ఇలాంటి ఏఐ ఆధారిత భాషానువాద టూల్ ద్వారానే సాధ్యమైందని నిపుణులు చెబుతున్నారు. మీకో విషయం తెలుసా? త్వరలో స్మార్ట్‌ఫోన్ల తయారీ దిగ్గజం యాపిల్.. తమ తదుపరి మోడల్ ఐఫోన్–16లో రియల్ టైం ట్రాన్స్‌లేషన్ టూల్ సహా మరికొన్ని ఏఐ ఆధారిత ఫీచర్లను అందుబాటులోకి తీసుకురానుందట.

భాషిణి ఎలా పనిచేస్తుందంటే..

భాషిణి అనేది ఏఐ ఆధారిత భాషానువాద టూల్. యాండ్రాయిడ్, ఐఓఎస్ యాప్‌ల ద్వారా ఇది సులువుగా పనిచేస్తుంది. దీని సాయంతో ఎవరైనా వ్యక్తులు ఇతర భాషల వారితో మాతృ భాషలో మాట్లాడినా అది ఆయా భాషల్లోకి అప్పటికప్పుడే అనువదించేస్తుంది. దేశంలోని భిన్న భాషలు మాట్లాడే వారి మధ్య భాషా సమస్యను ఇది తొలగిస్తుంది. నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్‌తోపాటు క్రౌడ్ సోర్సింగ్ ద్వారా పొందిన (భాషాదాన్) వివిధ భాషల పదాలతో తయారు చేసుకున్న డేటాతో వివిధ భాషలను అనర్గళంగా అనువదిస్తుంది. దీన్ని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ రూపొందించింది.

- సాక్షి సెంట్రల్ డెస్క్

మద్దిచెట్టు నుంచి నీటి ధార

20 లీటర్ల మేర సేకరణ

పాపికొండలు నేషనల్ పార్క్‌లో సంఘటన



కింటుకూరు అటవీ ప్రాంతంలో నల్లమద్ది చెట్టు నుంచి ధారగా వస్తున్న నీరు

రంపచోడవరం (అల్లూరి సీతారామరాజు జిల్లా): దట్టమైన అటవీ ప్రాంతంలో మద్ది చెట్టు నుంచి ధారగా నీరు రావడం అటవీ అధికారులను ఆశ్చర్యానికి గురి చేసింది. పాపికొండలు నేషనల్ పార్క్‌లోని ఇందుకూరు రేంజ్ పరిధి కింటుకూరు అటవీ ప్రాంతంలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. రంపచోడవరం డీఎఫ్‌వో నరేందిరన్ సిబ్బందితో కలిసి శనివారం కింటుకూరు అటవీ ప్రాంతానికి తనిఖీ నిమిత్తం వెళ్లారు. నల్లమద్ది చెట్టుకు బొడుపులు ఉన్నచోట కత్తితో గాటు పెట్టాలని ఆయన సిబ్బందికి సూచించారు. దీంతో గాటు పెడుతుండగానే నీరు ధారలా బయటకు వచ్చింది. దీనిపై డీఎఫ్‌వో మాట్లాడుతూ నల్లమద్ది చెట్టులో నీరు నిల్వ చేసుకునే వ్యవస్థ ఉందని, అందుకు తగ్గట్టుగా అవసరాలకు నీటిని చెట్టు తనలో దాచుకుందన్నారు. చెట్టు నుంచి సుమారు 20 లీటర్లు నీరు వచ్చినట్లు తెలిపారు. నీటిని రుచి చూసిన ఆయన తాగేందుకు ఉపయోగపడదని తెలిపారు. నల్లమద్ది చెట్టు బెరడు మొసలి చర్మంలా ఉండడంతో దీనిని క్రోకోడైల్ బర్క్ ట్రీ అని కూడా పిలుస్తారని పేర్కొన్నారు. శాస్త్రీయ నామం టెర్మినేలియా టొమెంటోసా అని చెప్పారు. ఆయన వెంట రేంజ్ అధికారి దుర్గా కుమార్‌బాబు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.